

SREEMATHANDHRA VALMIKI

# RAMAYANAMU



ANDHRA VALMIKI
VASUDASA SWAMY

**YUDDHA**
**KANDAMU**
**PART - II**

A LITERAL METRICAL TRANSLATION OF
VALMIKI'S SANSKRIT RAMAYANAM

*by*


VAVILICOLANU SUBBA ROW.

alias VASUDASA SWAMY

*late Telugu Pandit, Presidency College, Madras.*


AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Sree Kausalya Parinayam
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamritamu,
Krishnavatara Thathwamu, Subhadra Vijaya Natakamu,
&c., &c., &c.,

**WITH AUTHOR'S OWN COMMENTARY**

CALLED

## MANDARAM


PUBLISHED BY

Sree Kodanda Rama Sevaka Dharma Samajam,

ANGALAKUDURU - TENALI.



(ALL RIGHTS RESERVED)

# శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము

## విషయసూచిక

### యుద్ధకాండము - రెండవ భాగము


| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 59 | శ్రీరాముఁడు హనుమంతునిపై నెక్కి రావణునిమీఁదికిఁ బోవుట | | 625 |
| 59 | శ్రీరామ రావణుల ప్రథమ యుద్ధము | ... | 627 |
| 59 | రావణుఁడు పరాజితుఁడై లంకకుఁ బోవుట | ... | 631 |
| 60 | రావణుఁడు తన పరాభవంబుఁ దలఁచి దుఃఖించుట | ... | 632 |
| 60 | రావణుఁడు మంత్రులను గుంభకర్ణు నిద్రలేప నియోగించుట | ... | 637 |
| 60 | రాక్షసులు కుంభకర్ణు నిద్ర లేపుట | ... | 651 |
| 60 | కుంభకర్ణుఁడు నిద్ర లేచుట | ... | 654 |
| 60 | యూపాక్షుఁడు కుంభకర్ణునితో నతని నిద్రలేపిన కారణముఁ దెలుపుట | | 657 |
| 60 | మహోదరుఁడు కుంభకర్ణునితో రావణుఁ జూడఁ బొమ్మని చెప్పుట | | 658 |
| 61 | రావణుఁ జూడఁబోవు కుంభకర్ణుఁ జూచి శ్రీరాముఁడు విభీషణుఁ బ్రశ్నించుట | ... | 661 |
| 61 | విభీషణుఁడు శ్రీరామునకుఁ గుంభకర్ణునిగుఱించి తెలుపుట | ... | 662 |
| 61 | శ్రీరాముఁడు నీలునితోఁ గుంభకర్ణునితోడ యుద్ధమునకు సేనల సిద్ధపఱుపుమని బోధించుట | ... | 676 |
| 62 | కుంభకర్ణుఁడు రావణుఁ జూచుట | ... | 663 |
| 62 | రావణుఁడు కుంభకర్ణుతోఁ శ్రీరామునివలన రాక్షసులకైన విపత్తు దెలుపుట | ... | 669 |
| 63 | కుంభకర్ణుఁకు రావణు నిందించుట | ... | 672 |
| 63 | రావణుఁడు కుంభకర్ణుఁ గోపించిపలుకుట | ... | 678 |
| 63 | కుంభకర్ణుఁడు రావణుని సమాధానపఱుచుట | ... | 680 |
| 64 | మహోదరుఁడు కుంభకర్ణమతమును ఖండించుట | ... | 688 |
| 64 | రావణునకు మహోదరుఁ డుపాయము చెప్పుట | ... | 694 |
| 65 | కుంభకర్ణుఁడు మహోదరు నిందించుట | ... | 697 |
| 65 | రావణుఁడు కుంభకర్ణునిఁ బ్రశంసించుట | ... | 699 |
| 65 | రావణుఁడు కుంభకర్ణుతో నొంటిగా యుద్ధమునకుఁ బోవలదనుట | | 700 |
| 65 | కుంభకర్ణుఁడు యుద్ధమునకై వెడలుట | ... | 703 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 66 | కుంభకర్ణునిఁ జూచి పరువిడు క్రోఁతులకు నంగదుఁడు ధైర్యముఁ జెప్పుట | | 707 |
| 66 | వానరులు కుంభకర్ణుతోఁ బోరి యోడి పాఱిపోవుట | ... | 708 |
| 66 | అంగదుఁడు కపులకు భయముఁబాపి క్రమ్మఱించుట | ... | 710 |
| 67 | కుంభకర్ణుఁడు వానరసేన హతముఁ జేయుట | ... | 713 |
| 67 | ద్వివిదుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 714 |
| 67 | హనుమంతుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 715 |
| 67 | శరభాదులు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 717 |
| 67 | కుంభకర్ణుఁడు వానరుల మ్రింగుట | ... | 718 |
| 67 | అంగదుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 719 |
| 67 | సుగ్రీవుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 720 |
| 67 | మూర్ఛిల్లిన సుగ్రీవునిఁ గుంభకర్ణుం డెత్తుకొని లంకలోనికిఁ బోవుట | | 723 |
| 67 | సుగ్రీవుఁడు కుంభకర్ణుని ముక్కు చెవులు కొఱికి శ్రీరామునొద్దకు వచ్చుట | ... | 725 |
| 67 | కుంభకర్ణుఁడు మత్తుఁడై వానరాదుల మ్రింగుట | ... | 727 |
| 67 | శ్రీరాముఁడు కుంభకర్ణుతో యుద్ధము చేయుట | ... | 728 |
| 67 | శ్రీరామ కుంభకర్ణుల సంవాదము | ... | 731 |
| 67 | శ్రీరాముఁడు కుంభకర్ణుని కాలుసేతులు నఱకుట | ... | 733 |
| 67 | శ్రీరాముఁడు కుంభకర్ణు శిరంబుఁ దెగవ్రేయుట | ... | 736 |
| 68 | హతశేషులు రావణునకుఁ గుంభకర్ణు మరణంబుఁ దెలుపుట | ... | 740 |
| 68 | కుంభకర్ణు మరణంబునకు రావణుఁడు దుఃఖించుట | ... | 742 |
| 69 | త్రిశిరుఁడు రావణునకు దుఃఖశాంతివాక్యంబులఁ దెలుపుట | ... | 744 |
| 69 | దేవాంతక నరాంతకాతికాయత్రిశిరోమత్త యుద్ధోన్మత్తుల రావణుఁడు యుద్ధమునకుఁ బనుచుట | ... | 747 |
| 69 | వానర రాక్షససేనల యుద్ధము | ... | 752 |
| 69 | నరాంతకుఁడు కపులఁ దునుమాడుట | ... | 757 |
| 69 | అంగద నరాంతకుల యుద్ధము | ... | 759 |
| 70 | అంగదుఁడు దేవాంతక మహోదర త్రిశిరులతోఁ బోరుట | ... | 763 |
| 70 | హనుమంతునిచే దేవాంతకుఁడు, నీలునిచే మహోదరుఁడు చచ్చుట | | 765 |
| 70 | హనుమంతునిచే ద్రిశిరుండు చచ్చుట | ... | 766 |
| 70 | ఋషభునిచే మత్తుండు చచ్చుట | ... | 768 |
| 71 | అతికాయుఁడు కపులఁ బాఱఁదోలుట | ... | 769 |
| 71 | శ్రీరాముఁడు విభీషణు నతికాయుఁ గూర్చి యడుగుట | ... | 771 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 71 | అతికాయుఁడు లక్ష్మణుఁ దూలనాడుట | ... | 775 |
| 71 | లక్ష్మణుఁ డతికాయు ధిక్కరించి పలుకుట | ... | 777 |
| 71 | లక్ష్మణాతికాయుల యుద్ధము | ... | 779 |
| 71 | లక్ష్మణునిచే నతికాయుఁడు చచ్చుట | ... | 783 |
| 72 | అతికాయాదుల మృతి విని రావణుఁడు దుఃఖించుట | ... | 785 |
| 72 | రావణుఁడు లంకయందంతటఁ గాపుంచుట | ... | 789 |
| 73 | ఇంద్రజిత్తు రావణు నూరార్చుట | ... | 790 |
| 73 | ఇంద్రజిత్తు మొదటిసారి యుద్ధమునకు వెడలుట | ... | 792 |
| 73 | ఇంద్రజిత్తు మాయాబలంబునఁ గపిసేనల నుఱుమాడుట | ... | 796 |
| 73 | శ్రీరాముఁడు లక్ష్మణునకు బ్రహ్మాస్త్రంబు మన్నించి యోర్చుకొనుమని చెప్పుట | ... | 800 |
| 74 | విభీషణాంజనేయులు జాంబవంతుని వెదకుట | ... | 802 |
| 74 | జాంబవంతుఁడు హనుమంతుని కుశలమును విభీషణు నడుగుట | | 805 |
| 74 | జాంబవంతుఁడు హనుమంతుని సంజీవికరణిఁ దేర నియోగించుట | | 807 |
| 74 | హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుటకై పోవుట | ... | 808 |
| 74 | హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుట | ... | 812 |
| 74 | సంజీవనిచే వానరాదులు జీవించుట | ... | 816 |
| 75 | సుగ్రీవుఁడు లంకఁ గాల్పఁ గపుల నాజ్ఞాపించుట | ... | 816 |
| 75 | కపులు లంకఁ గాల్చుట | ... | 817 |
| 75 | కుంభనికుంభులు యుద్ధమునకు వెడలుట | ... | 823 |
| 76 | అంగదుఁడు కంపను వధించుట | ... | 828 |
| 76 | అంగదుఁడు ప్రజంఘుఁ జంపుట | ... | 829 |
| 76 | కుంభుఁడు వానరవీరుల నొప్పించుట | ... | 830 |
| 76 | అంగదుఁడు కుంభుచే నొచ్చిపడుట | ... | 831 |
| 76 | సుగ్రీవుఁడు కుంభుని నుపాలంభించుట | ... | 834 |
| 76 | సుగ్రీవుఁడు కుంభుని వధించుట | ... | 836 |
| 77 | నికుంభుఁడు కపులఁ బాఱఁదోలుట | ... | 839 |
| 77 | హనుమంతుఁడు నికుంభు వధించుట | ... | 841 |
| 78 | మకరాక్షుఁడు యుద్ధమునకు వెడలుట | ... | 842 |
| 79 | మకరాక్షుఁడు శ్రీరాముఁ దూలనాడుట | ... | 844 |
| 79 | శ్రీరాముఁడు మకరాక్షు వధించుట | ... | 848 |

| సర్గసంఖ్య | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 80 | ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధమునకుఁ బోవుట | ... | 850. |
| 80 | ఇంద్రజిత్తదృశ్యుఁడై కపిసేనల శ్రీరామలక్ష్మణుల నొప్పించుట | | 852 |
| 81 | ఇంద్రజిత్తు మాయాసీతతో హనుమంతుఁ డున్న దిక్కునకేగుట | | 857 |
| 81 | ఇంద్రజిత్తు మాయాసీతఁ జంపఁ బూనుట | ... | 859 |
| 81 | ఇంద్రజిత్తు మాయాసీతను వధించుట | ... | 861 |
| 82 | హనుమంతుఁ డింద్రజిత్తుతోఁ బోరుట | ... | 862 |
| 82 | హనుమంతుఁడు రణంబు చాలించి శ్రీరాముఁ జూడఁబోవుట | ... | 865 |
| 83 | హనుమంతుఁడు శ్రీరామునకు నింద్రజిత్తు సీతాదేవిని వధించెనని తెలుపుట | | 866 |
| 83 | లక్ష్మణుఁడు శ్రీరామునితో ధర్మంబు నిరర్థకంబని చెప్పుట | ... | 868 |
| 83 | లక్ష్మణుఁడు శ్రీరామునితో ధనంబు సర్వార్థసాధకంబని చెప్పుట | | 875 |
| 84 | విభీషణుఁ డింద్రజిత్తు మాయోపాయంబు శ్రీరామునకు దెలుపుట | | 880 |
| 84 | ఇంద్రజిత్తు నికుంభిలాయాగముఁ జేయువార్త విభీషణుఁడు శ్రీరామునకుఁ దెలుపుట | ... | 882 |
| 85 | ఇంద్రజిత్తును జంప లక్ష్మణుఁ బంపుమని విభీషణుఁడు శ్రీరాము వేఁడుట | | 883 |
| 85 | ఇంద్రజిత్తును జంప శ్రీరాముఁడు లక్ష్మణుని నికుంభిలకుఁ బంపుట | | 886 |
| 86 | విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తుండు చోటు చూపుట | ... | 888 |
| 86 | కపు లింద్రజిత్సేనలతోఁ బోరుట | ... | 889 |
| 86 | హనుమంతుఁడు రాక్షసుల నాశన మొనర్చుట | ... | 891 |
| 86 | ఇంద్రజిత్తు హనుమంతు నెదుర్చుట | ... | 892 |
| 87 | విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తు యజ్ఞము చేయు న్యగ్రోధముఁ జూపుట | ... | 893 |
| 87 | ఇంద్రజిత్తు విభీషణు నధిక్షేపించుట | | 894 |
| 87 | విభీషణుఁ డింద్రజిత్తునకు సమాధానముఁ జెప్పుట | ... | 896 |
| 88 | ఇంద్రజిల్లక్ష్మణుల సంభాషణము | ... | 900 |
| 88 | ఇంద్రజిల్లక్ష్మణుల యుద్ధప్రారంభము | ... | 902 |
| 89 | ఇంద్రజిత్తు లక్ష్మణబాణంబులచే నొచ్చుట | ... | 905 |
| 89 | ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట | ... | 908 |
| 90 | విభీషణుఁడు కపులఁ బ్రోత్సాహపఱచుట | ... | 912 |
| 90 | ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట | ... | 917 |
| 90 | లక్ష్మణుఁ డింద్రజిత్తు సారథిని జంపుట | ... | 919 |
| 91 | ఇంద్రజిత్తు కపుల వంచించి లంకకుఁ బోయి రథికుఁడై వచ్చుట | | 921 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 91 | లక్ష్మణు డింద్రజిత్తును నొప్పించుట | ... | 923 |
| 91 | ఇంద్రజిల్లక్ష్మణులు దివ్యాస్త్రంబులం బోరుట | ... | 926 |
| 91 | లక్ష్మణుం డింద్రజిత్తును వధించుట | ... | 929 |
| 91 | ఇంద్రజిత్తు మరణంబునకు లోకంబులు సంతోషించుట | ... | 932 |
| 92 | ఇంద్రజిత్తువధ విని శ్రీరాముఁడు లక్ష్మణుం గొండాడుట | ... | 934 |
| 93 | ఇంద్రజిత్తు మరణమునకు రావణుఁడు విలపించుట | ... | 938 |
| 93 | రావణుఁడు రాక్షసులతో దన పరాక్రమంబుం దెలుపుట | ... | 942 |
| 93 | రావణుఁడు సీతను జంపఁబోవుట | ... | 944 |
| 93 | రావణునిఁ జూచి సీతాదేవి దుఃఖించుట | ... | 946 |
| 93 | సుపార్శ్వుఁడు రావణునకు నీతిఁ దెల్పి మరలించుట | ... | 949 |
| 94 | మూలబల యుద్ధము | ... | 952 |
| 94 | శ్రీరాముఁడు మూలబలమును సంహరించుట | ... | 955 |
| 95 | రాక్షసస్త్రీ విలాపము | ... | 964 |
| 96 | రావణుఁడు పౌరుషోక్తులు పలుకుట | ... | 972 |
| 96 | రావణుఁడు యుద్ధంబునకు వెడలుట | ... | 975 |
| 96 | రావణున కపశకునంబు లగుట | ... | 977 |
| 96 | రావణుఁడు కపిసేన నుఱుమాడుట | ... | 978 |
| 97 | సుగ్రీవుఁడు రాక్షసుల వధించుట | ... | 979 |
| 97 | సుగ్రీవుఁడు విరూపాక్షు వధించుట | ... | 918 |
| 98 | సుగ్రీవుఁడు మహోదరుఁ జంపుట | ... | 983 |
| 99 | మహాపార్శ్వుఁ డంగదుచే హతుం డగుట | ... | 987 |
| 100 | రావణుఁడు కపులం బొలియించుట | ... | 991 |
| 100 | శ్రీరామరావణ యుద్ధము | ... | 993 |
| 101 | శ్రీరామరావణులు దివ్యాస్త్రంబులం బోరుట | ... | 998 |
| 101 | రావణ లక్ష్మణ యుద్ధము | ... | 1000 |
| 101 | లక్ష్మణుఁడు రావణశక్తిచే మూర్ఛపోవుట | ... | 1003 |
| 101 | శ్రీరాముఁడు లక్ష్మణుని గపుల కప్పగించుట | ... | 1006 |
| 101 | రావణుఁడు పరాజితుఁడై లంకకుం బరువెత్తుట | ... | 1009 |
| 102 | మూర్ఛిల్లిన లక్ష్మణుం జూచి రాముఁడు దుఃఖించుట | ... | 1010 |
| 102 | సుషేణుఁడు శ్రీరాము నూరార్చుట | ... | 1013 |
| 102 | హనుమంతుఁడు సంజీవని పర్వతంబుఁ దెచ్చుట | ... | 1014 |
| 102 | లక్ష్మణుఁడు మూర్ఛదేఱుట | ... | 1015 |

| సర్గసంఖ్య | | పుటసంఖ్య |
|---|---|---|
| 102 | లక్ష్మణుండు శ్రీరాముని రణంబునకుఁ బ్రోత్సాహపఱుచుట... | 1018 |
| 103 | శ్రీరామరావణుల కడపటి యుద్ధము ప్రారంభము ... | 1019 |
| 103 | మాతలి శ్రీరామునికడకు నింద్రు పనుపున రథంబు దెచ్చుట... | 1021 |
| 104 | శ్రీరాముండు విజృంభించి రావణు శూలంబుఁ దునియలు చేయుట | 1025 |
| 105 | శ్రీరాముండు రావణు నిందించుట ... | 1028 |
| 105 | రావణు రథంబును సారథి మరలించుట ... | 1031 |
| 106 | రావణుండు సారథిని దూషించుట ... | 1033 |
| 106 | సారథి రావణునకు సమాధానము చెప్పుట ... | 1034 |
| 106 | అగస్త్యుండు శ్రీరామున కాదిత్యహృదయం బుపదేశించుట... | 1037 |
| 107 | ఆదిత్యహృదయము ... | 1040 |
| 108 | రావణుండు మరల శ్రీరామునిమీఁదికి యుద్ధమునకు వచ్చుట... | 1058 |
| 108 | శ్రీరాముండు మాతలిని హెచ్చరికగ నుండఁ జెప్పుట ... | 1059 |
| 108 | రావణుమరణంబుఁ దెలుపు చిహ్నంబు లగపడుట ... | 1061 |
| 109 | వానర.రాక్షసులు శ్రీరామరావణ యుద్ధంబు దిగ్భ్రమగొనిచూచుట | 1063 |
| 109 | శ్రీరాముండు రావణు ధ్వజంబు నఱకుట ... | 1065 |
| 110 | రావణుండు భీమంబుగ శ్రీరాముతో బోరుట ... | 1068 |
| 110 | శ్రీరాముండు రావణు శిరంబు నఱకుట ... | 1072 |
| 111 | శ్రీరాముండు బ్రహ్మాస్త్రంబున రావణు వధించుట ... | 1075 |
| 111 | రావణు మృతికి లోకంబులు సంతోషించుట ... | 1080 |
| 112 | విభీషణుండు రావణు కళేబరముఁ జూచి యేడ్చుట ... | 1081 |
| 112 | శ్రీరాముండు విభీషణునకు దుఃఖోపశమనము చేయుట ... | 1085 |
| 113 | రావణు భార్యలు రావణుఁ జూచి విలపించుట ... | 1088 |
| 114 | మండోదరీ విలాపము ... | 1092 |
| 114 | విభీషణుండు శ్రీరామునితో రావణుఁడుసంస్కారార్హుఁడు కాఁడని చెప్పుట | 1113 |
| 114 | విభీషణుండు రావణునకు దహనాదిక్రియలు దీర్చుట ... | 1116 |
| 115 | మాతలి శ్రీరామునిచే ననుజ్ఞాతుండై దివంబునకుఁ బోవుట .. | 1118 |
| 115 | విభీషణ పట్టాభిషేకము ... | 1119 |
| 115 | శ్రీరాముండు హనుమంతుని సీతాదేవి యొద్దకుఁ బంపుట ... | 1121 |
| 116 | హనుమంతుండు సీతాదేవికి విజయవార్తఁ దెలుపుట ... | 1122 |

| సర్గసంఖ్య | | పుటసంఖ్య |
|---|---|---|
| 116 | సీతాదేవి హనుమంతుఁ బ్రశంసించుట ... | 1125 |
| 116 | హనుమంతుఁడు రాక్షసస్త్రీలఁ జంప సీతాదేవి యనుమతి వేఁడుట | 1128 |
| 116 | సీతాదేవి హనుమంతునితో రాక్షసస్త్రీల జంపరాదనుట ... | 1129 |
| 116 | సీతాదేవి శ్రీరాముఁ జూడఁ గోరుట ... | 1134 |
| 117 | సీతాదేవి సందేశమును హనుమ శ్రీరామునితోఁ జెప్పుట ... | 1135 |
| 117 | శ్రీరాముఁడు సీతాదేవిఁ దోడితేర విభీషణు నియోగించుట | 1136 |
| 117 | సీతాదేవిరాక శ్రీరామునకు విభీషణుఁడు దెలుపుట ... | 1138 |
| 117 | శ్రీరాముఁడు విభీషణుఁ గోపించుట ... | 1140 |
| 117 | సీతాదేవి శ్రీరాము సమీపంబునకు వచ్చుట ... | 1143 |
| 118 | శ్రీరాముఁడు సీతాదేవికిఁ దన జయంబుఁ దెలుపుట ... | 1144 |
| 118 | శ్రీరాముఁడు సీతాదేవిని దా నొల్లనని చెప్పుట ... | 1149 |
| 119 | శ్రీరాముని వాక్యంబులకు సీతాదేవి దుఃఖించి ప్రత్యుత్తరమిచ్చుట | 1152 |
| 119 | సీతాదేవి యగ్నిప్రవేశముఁ జేయుట ... | 1157 |
| 120 | దేవతలు శ్రీరామునకుఁ బ్రత్యక్షమై సీతాదేవి నిర్దోషురాలని చెప్పుట | 1162 |
| 120 | బ్రహ్మ శ్రీరాముని నుతించుట ... | 1168 |
| 121 | అగ్నిహోత్రుఁడు సీతాదేవిని శ్రీరామునకు మరల నర్పించుట | 1177 |
| 121 | శ్రీరాముఁడు సీతాదేవిని బరిగ్రహించుట ... | 1180 |
| 122 | సీతా శ్రీరామలక్ష్మణులు దశరథు సందర్శించుట ... | 1183 |
| 122 | దశరథుఁడు శ్రీరామునిఁ బ్రశంసించుట ... | 1186 |
| 122 | దశరథుఁడు లక్ష్మణునకు శ్రీరామసేవ కర్తవ్యమని బోధించుట | 1188 |
| 122 | దశరథుఁడు సీతాదేవి నూరార్చుట ... | 1191 |
| 123 | ఇంద్రుని వరముచే మృతవానరులు పునర్జీవితులగుట ... | 1191 |
| 124 | విభీషణుఁడు శ్రీరాము సంస్కారాదు లంగీకరింపఁ బ్రార్థించుట | 1194 |
| 124 | శ్రీరాముఁడు విభీషణునిఁ బుష్పకంబుఁ దేర నియోగించుట | 1198 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 125 | శ్రీరాముఁడు విభీషణుచే వానరులకు గానుక లిప్పించుట | ... | 1200 |
| 125 | శ్రీరాముఁడు పుష్పకం బెక్కి సుగ్రీవాదుల కనుజ్ఞ యిచ్చుట | | 1202 |
| 125 | శ్రీరాముఁడు సుగ్రీవ విభీషణాదు లయోధ్యకు వచ్చుటకుసమ్మతించుట | | 1204 |
| 126 | శ్రీరాముఁడు సీతాదేవికిఁ బూర్వపరిచితస్థలంబులఁ జూపుట | | 1205 |
| 126 | సీతాదేవి తారాదికాంతల నయోధ్యకుఁ దోడ్కొనిపోవఁ గోరుట | | 1214 |
| 127 | శ్రీరాముఁడు భరద్వాజాశ్రమంబునఁ బుష్పకంబు డిగుట | ... | 1219 |
| 128 | శ్రీరాముఁడు హనుమంతుని భరతుకడ కనుచుట | ... | 1224 |
| 128 | హనుమంతుఁడు భరతు సందర్శించుట | ... | 1230 |
| 129 | హనుమంతుఁడు భరతునకు శ్రీరామవృత్తాంత మంతయు దెలుపుట | | 1233 |
| 130 | శత్రుఘ్నుం డయోధ్యానగరంబు శృంగారింపించుట | ... | 1240 |
| 130 | భరతాదులు శ్రీరాము నెదుర్కొనఁ బోవుట | ... | 1242 |
| 130 | వానరులు రాక జాగగుటకుఁ గారణంబు హనుమంతుఁడు భరతుని కెఱింగించుట | ... | 1245 |
| 130 | విమానముననున్న శ్రీరామాదులను భరతునకు హనుమంతుఁడు కనఁబఱచుట | ... | 1247 |
| 130 | శ్రీరామ భరత సమాగమము | ... | 1249 |
| 130 | శ్రీరాముఁడు భరతునాశ్రమంబునకుఁ బోవుట | ... | 1253 |
| 131 | భరతుండు రాజ్యంబు శ్రీరామునకు నప్పగించుట | ... | 1254 |
| 131 | శ్రీరామాదులు జడలు విడుచుట | ... | 1256 |
| 131 | శ్రీరామాదు లయోధ్యకుఁ బ్రయాణ మగుట | ... | 1258 |
| 131 | శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ ఘట్టము | ... | 1265 |
| 131 | సీతాదేవి హనుమంతు బహూకరించుట | ... | 1265 |
| 131 | ఫలశ్రుతి | ... | 1278 |
| 131 | యుద్ధకాండాంతపద్యములు | ... | 1285 |

—♦ శ్రీరాముఁడు హనుమంతునిపై నెక్కి రావణుమీఁదికిఁ బోవుట ♦—

ఉ. పాతితవీరయోధము ద్ర♦వద్ధరియూథముఁ జూచి రాముఁడున్
జాతరుషారుణాక్షుఁ డయి ♦ సత్వరుఁడై దశకంఠుమీఁదఁ బో
వాతసుతుండు డాసి బల♦వంతు సుపర్ణుని విష్ణు పట్లు నన్
బ్రాతనయేశ! యెక్కి సుర♦శాసను శాసితుఁ జేయు టొప్పగున్. ౧౩౦

అర్థములు. పాతిత వీరయోధము=పడఁగొట్టఁబడిన వీరులగు యోధులు గలది, ద్రవత్+హరి యూథము = పరువెత్తుచున్న వానరసేన గలది, యగు తన సేనను జూచి, జాతరుషా=పుట్టిన కోపముచే, అరుణాక్షుఁడయి = ఎఱ్ఱని కన్నులు గలవాఁడై, సత్వరుఁడై = త్వరతోఁగూడినవాఁడై, వాతసుతుండు = హనుమంతుఁడు, డాసి=సమీపించి, సుపర్ణుని=గరుత్మంతుని, విష్ణునట్లు = విష్ణువెక్కినట్లు, సురశాసను=దేవతల దండించిన రావణుని, శాసితున్=దండించినవానిఁగా.

నేల నిలువఁబడినవాఁడు కదలక యొకచోటనే యుండును. రథమందున్న వాఁడు తిరుగుచుండును. కావున రథమందున్నవాఁడు వేసిన బాణము సులభముగా నిలుచున్నవానికిఁ దప్పక తగులును. నిలువఁబడినవాఁడు వేసినది తిరుగుచుండువానికి గుఱి తగులుట కష్టము.

తాత్పర్యము

తనయోధులు పడిపోవుటయు, రావణుని జూచి తక్కినవానరులు పరువెత్తి పోవుటయు జూచి రామచంద్రమూర్తి కోపించి యిఁక నాలస్యము చేయరాదని త్వరపడి రావణు నీఁదికిఁ బోఁగా హనుమంతుఁడు సమీపించి బలవంతుఁడగు గరుత్మంతుని విష్ణు వెక్కినట్లు నీవు నాపై నెక్కి యీ రాక్షసుని దండింపుము.

సీ. అనవుడు కపి♦వ్యాఘ్రుంబుమూఁపుపై, నారోహణ మొనర్చి♦యమితశౌర్య
ధనుఁడు రాముండు స్యం♦దనగతు వింశతి, బాహునివంకను ♦ బాఱఁజూచి
రోషవశమున వై♦రోచనిపైఁ బాఱు,నుద్యతాయుధవిష్ణు♦నొప్పుమిగుల
వజ్రనిష్పేషని♦స్స్వనము మౌర్వీరావ, మంతకంతకు నిగు♦డారు చుండ

తే. జలధిగంభీరరవమునఁ♦బలుకు నిట్లు, నిలునిలుము విప్రియం బట్లు♦సలిపి నీవు
దనుజవల్లభ యెచటికేన్♦జనెదవేని, విసుతు సంచుఁ దలంతువా♦వీరమాని.

అర్థములు. కపివ్యాఘ్రుంబు=వానరశ్రేష్ఠుని యొక్క, మూఁపుపై=భుజములమీఁద, ఆరోహణ మొనర్చి=ఎక్కి, స్యందన గత వింశతి బాహుని=తేరిపై నున్న యిరువది చేతులు గలవానిని, ఈ యుద్ధమందు రావణుఁడు పది తలలతో నిరువది చేతులతో నుండెను, వైరోచనిపై = బలిచక్రవర్తిపై, అమృతము పంచిన కాలమున ఉద్యతాయుధ విష్ణునొప్పు = ఎత్తఁబడిన యాయుధము గల విష్ణువు విధము, వజ్రనిష్పేషనిస్స్వనము=వజ్రము రాపిడిధ్వని వంటిది, మౌర్వీరావము=అల్లె

ప్రాటి ధ్వని, నిగుడారుచుండన్ = వ్యాపించుచుండఁగా, విప్రియము = ప్రియము కాని కార్యము, సీతాహరణము కాని, లక్ష్మణ మూర్ఛ గాని, వీరమాని=వీరుఁడవు కాకున్నను వీరుఁడనని తలఁచువాఁడా.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా నా వానరశ్రేష్ఠుని భుజములపై రామచంద్రమూర్తి యెక్కి రథముమీఁద నుండు నిరువది చేతుల రావణుని జూచి బలిమీఁద రోషముచే బాలు విష్ణువువలె వజ్రధ్వనివంటి వింటిధ్వని యంతకంతకు నతిశయింపఁగా సముద్రము యొక్క గంభీర ధ్వనివంటి ధ్వనితో నిట్లనెను. ఓరీ నిలునిలుము. నాకు నప్రియకార్యము నీ వావిధముగఁ జేసి యెచ్చటికిఁ బోయినను వీరమానీ! విడుతునని తలఁచితివా ?

కం. వినరా యింద్రునిఁ గాలుని, దిననాథు స్వయంభు శంభు ♦ దిగ్దశకంబున్
జనినను నిను విడువన్ నీ, తనువునకుం బ్రాణమునకుఁ ♦ దగులముఁ జెఱుతున్.

తాత్పర్యము

ఓరీ! విను నీవింద్రుని, యముని, సూర్యుని నీకు వరము లిచ్చిన బ్రహ్మరుద్రులను పది దిక్కులను బోయి దాఁగినను నిన్ను వదలి పెట్టను. నీ ప్రాణమునకు నీ దేహమునకుఁ గల సంబంధము విడఁగొట్టుదును.

చం. తతగురుశక్తి నెవ్వనిని ♦ దాడితుఁ జేయుటఁ బొంగి పోయె దా
యతిబలశాలి లక్ష్మణుఁడె ♦ హానడి నీకొనరింపఁ గోరి నిన్
సుతతరుణీసమేతు రవి ♦ సూనున కప్పన సేయువాఁడునై
మతిగొని యుద్ధభూమి నిను ♦ మార్కొన వచ్చె నటంచు నెంచుమీ. ౧౩౧

అర్థములు. తతగురుశక్తిన్ = విస్తారమైన గొప్పశక్తిచే, హానడి=కీడు సుతతరుణీ సమేతున్-నిన్ = కొడుకులు పెండ్లాము గల నిన్ను, వానితోడి సాంగత్యము నీకు వదలినదని భావము రవిసూనునకున్ = యమునకు, అప్పన=అర్పణ శబ్దభవము. అప్పన సేయువాఁడునై=అప్పగించువాఁడై.

తాత్పర్యము

నీ గొప్పశక్తిచే నెవనిని గొట్టుటచే మహావీరుఁడ నని పొంగిపోవుచున్నావో యా బలశాలి లక్ష్మణుఁడే నీకుఁ గీడు గలిగింపఁగోరి నీ పెండ్లాము బిడ్డల సాంగత్యము నీకుఁ దొలఁగఁజేసి యుద్ధమందు నిన్ను యముని యొద్దకుఁ బంపవచ్చి యున్నాఁడని తలఁపుము. ఇది లక్ష్మణు విషయమని యైన నెంచవచ్చును. లక్ష్మణునకుఁ దనకు నభేదము చెప్పి నేనే లక్ష్మణుఁ డనుకొనుమని చెప్పెనని యైనఁ జెప్పవచ్చును. లక్ష్మణ బాధ తన బాధయే.

కం. ఈ నేను గాదె యసుర వి, తానముఁ బదునాల్గువేలు ♦ దర్పోద్ధతమున్
నానాసాధనము జన, స్థానంబునఁ జంపినాఁడ ♦ సంగరమందున్. ౧౩౨

## తాత్పర్యము

నీ రూపమున లక్ష్మణుఁడు వచ్చినాఁడని చెప్పెదవు. లక్ష్మణుఁడు స్వయముగ వచ్చియే నన్ను గెలువలేక పోయెను. ఇఁక నీరూపమున వచ్చి నన్నేమి చేయఁగలఁ డనుకొంటివా? ఇక్కడ నీకుఁ గానవచ్చు నేనుగదా జనస్థానమందు బల గర్వముగల నానాయుధములుగల రాక్షససమూహమును యుద్ధమందుఁ జంపితిని.

## —• శ్రీరామరావణుల ప్రథమయుద్ధము •—

చం. అనవుడు నాగ్రహం బడర • నా రఘురామునియెక్కిరింతఁ బా
వని లయకాలవహ్నినిభ • బాణములం బ్రహరించి నొంప నా
యనఘు స్వభావతేజ మది • యంతకు నంతకు నెక్కుడయ్యె నా
తని దశకంఠమార్గణకృ • తవ్రణుఁ గాంచి రుషావశాత్ముఁడై. ౧౩౨౧

అర్థములు. ఎక్కిరింత = వాహనము, "చక్కని రాయంచ యెక్కిరింత" యని శ్రీనాథుఁడు. శృం-నై-౧ ఆ-సరస్వతీ స్తుతి. లయకాల వహ్ని నిభ బాణములన్ = ప్రలయకాలాగ్నితో సమానములైన బాణములచే, ప్రహరించి = కొట్టి, నొంపన్ = బాధింపఁగా, మార్గణ = బాణములచే, కృతవ్రణున్ = చేయఁబడిన వ్రణములు గలవానిని, రుషావశాత్ముఁడై = కోపమునకు వశపడిన మనస్సు గలవాఁడై.

## తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా రావణుఁడు కోపించి రాముని వాహనమైన హనుమంతుని ప్రళయ కాలాగ్నితో సమానమైన బాణములచేఁ గొట్టి బాధింపఁగా నతని స్వభావ తేజ మంతకంతకు హెచ్చెను. ఇట్లు రావణుని బాణములచే గాయపడిన హనుమంతుని జూచి రామచంద్రమూర్తి కోపించినవాఁడై.

శా. ఆకర్ణాంతము లాగి చాపమును వే • గాటోప మేపార నా
నాకిద్వేషిరథంబు నొక్కపడిఁ జ • క్రాశ్వధ్వజచ్ఛత్రసూ
తాకుంఠాశనిశూలఖడ్గసుపతా • కాన్వితమై ధాత్రిపై
నాకారం బెఱుఁగంగరాని గతి ను • గ్గై రాల బాణావలిన్. ౧౩౨౨

అర్థములు. ఆకర్ణాంతము = చెవికొనవఱకు, వేగాటోపము = వేగము యొక్క సంభ్రమము, ఏపారన్=అతిశయింపఁగా, నాకిద్వేషిరథంబు = దేవతలకు విరోధియగు రావణుని తేరు, నాకమందుండువాఁడు నాకి. ఒక్కపడి=ఒక్కసారిగ, చక్ర = చక్రములతోను, అశ్వ = గుఱ్ఱములతోను, ధ్వజ = టెక్కెములతోను, ఛత్ర=గొడుగుతోను, సూత = సారథితోను, అకుంఠ = మొక్కవోని, అశని = వజ్రమువంటి యాయుధము, శూల, ఖడ్గ, సుపతాకా = మంచి ధ్వజముతోను అన్వితమై = కూడినదై.

### తాత్పర్యము

వింటి యల్లెత్రాటిని చెవికొనవఱకు నీడ్చి వేగాతిశయమున నా దేవవిరోధి రథ మేకకాలమున చక్రములతోను గుఱ్ఱములతోను టెక్కెముతోను గొడుగుతోను సారథితోను వాఁడిమిగల వజ్రము శూలము కత్తి ధ్వజము వీనితో నిది యీ వస్తువని గుర్తింపరాని విధముగ పొడిపొడిచేసె నేల రాల బాణ సమూహమును.

ఉ. కూలిచి యంతఁ బోక భృశ • ఘోరమహాశనివజ్రసన్నిభం
బైలలిమీఱు బాణమును • నాతని వ్యూఢ భుజాంతరంబు దం
భోళిని మేరుశైలము బు • భుక్షుఁడు వ్రయ్యఁగ మోఁదినట్టు లా
భీలముగాఁగ నాటుటయుఁ • బెల్కురె నాతఁడు వీతచేష్టుఁడై. ౧౩౨౩

అర్థములు. కూలిచి = నేలఁబడఁగొట్టి, భృశఘోర = అధిక భయంకరమైన, మహాశని వజ్ర సన్నిభంబు=గొప్పపిడుగుతోను వజ్రముతోను సమానమై, వ్యూఢ = వెడలుపైన, భుజాంతరంబు = రెండు భుజములకు నడిమి ప్రదేశము, ఱొమ్ము, దంభోళిని = వజ్రముచే, బుభుక్షుఁడు = ఇంద్రుఁడు, వ్రయ్యఁగన్ = చీలునట్లు, ఆభీలము, గాఁగన్=భయంకరముగ, పెల్కురెన్=విలవిలఁ బోయెను, వీతచేష్టుఁడై=చేష్టలుడిగినవాఁడై.

### తాత్పర్యము

నేలఁబడఁగొట్టి యంతటితో విడువక మిగుల భయంకరమై వేగమునఁ బిడుగుతోను, దెబ్బగొట్టుటయందుఁ గఠినత్వమందు వజ్రాయుధముతోను సమానమైన బాణముచే వాని విశాల వక్షమును నింద్రుఁడు మేరు పర్వతము పగులఁగొట్టినట్లు భయంకరముగా నాటుటయు, వాఁడు విలవిలబోయి చేష్టలు మాని.

తే. యోధుఁ డెవ్వాఁ డశనికులి•శోగ్రహతుల, కించుకేనియుఁ గలఁగఁడు•సంచలింప
డట్టి వీరుఁడు రామబా•ణార్తి మిగుల, నడలి వడకుచు ధనువు•విడిచెఁ బుడమి.

అర్థములు. యోధుఁడు = యుద్ధవీరుఁడు, ఇందు మొదటి యక్షరము గాయత్రిలోని పదునెనిమిదవ యక్షరము, అశని = ఉత్పాతవేళ పడు పిడుగు యొక్కయు, కులిశ=వజ్రము యొక్కయు, హతులకు=దెబ్బలకు, ఇంచుకేనియు= కొంచెమైనను, కలఁగఁడు = వ్యాకులపడఁడు, సంచలింపఁడు=కదలఁడు, అడలి = విలపించి.

### తాత్పర్యము

ఏ యుద్ధవీరుఁడు పిడుగులు వజ్రాయుధములు దనమీఁదఁ బడినను కొంచెమైనను వ్యాకులపడఁడో కదలనైనఁ గదలఁడో యట్టి వీరుఁడు రామబాణముల వలన గలిగిన బాధచే మిక్కిలి విలపించి వడఁకుచు చేత నాయుధ మున్నఁ జంపుననియు, ఆయుధములేని వానిని జంపఁడనియుఁ దలఁచి నేలమీఁదఁ దన విల్లును వదలెను.

విల్లు పడిపోయె ననక విల్లు వదలె ననుటచే నిది బుద్ధిపూర్వకముగఁ జేసిన కార్యమే యగుచున్నది. ఏలన నిప్పుడా విల్లు శత్రువును గెలుచుటకుఁ బనికిరాకుం

డుటేగాక పరుగెత్తి పోవనీయక దెబ్బలుకొట్టించుటయందు మాత్రమే యుపయోగ పడుచున్నది. చేత విల్లుండు వఱకు రాముఁడు పోనీయఁడు. కొట్టుచునేయుండును. ఇట్టులే ప్రపన్నుఁడు ఇతర సమస్తోపాయముల వదలినవాఁడై యుండిననే భగవంతుఁడు రక్షించును. ప్రపత్తియే సిద్ధోపాయము. దీనితోడ మఱియొక యుపాయము భక్తిజ్ఞాన కర్మాదులలో దేనినైన నుపాయముగ గ్రహించితిమేని యది తరుణోపాయమును కాఁజాలదు గదా. మీఁదు మిక్కిలి ప్రపత్తిని ఫలింపకుండను జేయును. కావున సిద్ధోపాయనిష్ఠుఁడు మఱి దేనిని నుపాయముగా గ్రహింపరాదు.

ఉ. ఆకులపాటుఁ గూరుచు ని ♦ రాయుధుఁడై ధర నిల్చియున్న యా
నాకులవైరి యర్కరుచి ♦ నందము మీఱుకిరీట మర్ధచం
ద్రాకృతి గల్గుబాణమున ♦ నా మహితాత్ముఁడు డొల్ల నేసి య
ప్రాకృతయుద్ధధర్మకృతి ♦ బాఢ దయారసపూర్ణ చిత్తుఁడై. ౧౩౨౫

అర్థములు. ఆకులపాటు = కలఁత, నిరాయుధుఁడై = ఆయుధము లేనివాఁడై, ధరనిల్చి యున్న = భూమిమీఁద నిలఁబడియున్న, నాకుల = దేవతల, వైరి=విరోధియొక్క, అర్కరుచిన్=సూర్యుని కాంతితో, డొల్లనేసి = పడఁగొట్టి, మహితాత్ముఁడు=గొప్ప మనస్సుగలవాఁడు, కావుననే యప్రాకృత యుద్ధ ధర్మకృతిన్=గొప్పవారియొక్క యుద్ధధర్మమును ననుసరించుటచే, నిరాయుధుని గొట్టరాదను ధర్మము, బాఢ దయారస పూర్ణచిత్తుఁడై=అధిక దయారసముచే నిండిన మనస్సు గలవాఁడై.

## తాత్పర్యము

కలఁత చెంది యాయుధములేనివాఁడై నేలమీఁద యుద్ధకార్య మేదియుఁ జేయక జడుని వలె నిలఁబడియున్న యాదేవవిరోధి రావణునియొక్క సూర్య కాంతిగల కిరీట మర్ధచంద్ర బాణమున గొప్ప మనస్సుగల వాఁడగుటచే నుత్తమ వీరుల యుద్ధధర్మపద్ధతి ననుసరించి రామచంద్రమూర్తి మిక్కిలి దయగలవాఁడై కిరీటమును నేలఁబడఁగొట్టెను. దానినే కంఠమునకు గుఱిపెట్టి యుండినఁ దల యెగిరిపోయి యుండును. నా కిరీటము ఖండించి వాఁడు నాతలఁ దెగవేసిన నేనేమి చేసియుండఁగలను? నాశక్తి యీ మాత్రమే కదా యని జ్ఞానము గలవాఁడై సీతను మరల నిచ్చును గాక, ఇది యాలోచించియైన బుద్ధిగలవాఁడు గాకుండునా? మొకటనే యేల చంపవలెనని దయగలవాఁడై కిరీటమును మాత్రము నేలఁ గొట్టెను. దాని వలన బాధలేదు. వాని యథమస్థితి బయలుపడును. కిరీటము పోయిన ప్రభుత్వము పోయినట్టులేకదా.

కం. కోఱలు దీసిన పామన, నాఱిన వేఁడిమిగలట్టి ♦ యగ్నిరం డనఁగాఁ
దీఱఁగఁ గిరీట మాకృతి, మాఱి గతశ్రీకుఁడై నిశామను జాదు ననున్. ౧౩౨౬

అర్థములు. తీఱఁగన్=నాశము కాఁగా, ఆకృతిమాజి=తల వెండ్రుకలు పోయిన విధవస్త్రీవలె మాఱురూపు పడి, వీఁడు రాక్షసరాజా యని గుర్తింపరాక, గతశ్రీకుఁడు=కాంతిహీనుఁడైన, మనుజాదున్=రాక్షసుని.

తాత్పర్యము

కోఱలుతీసిన పామువలెను, చల్లారిపోయి వేఁడిమి తగ్గిన సూర్యునివలెను నాశము కాఁగా, కిరీటము పోయి తలవెండ్రుకలు పోయిన విధవ స్త్రీవలె మాఱురూపు పడి వీఁడు రాక్షసరాజగునా కాఁడా యనునంతటి కాంతిహీనుఁడైన రావణుని గాంచి రామచంద్రమూర్తి వానితో నిట్లనెను.

చం. అనితర సాధ్యముం బరభ ♦ యావహమైన రణంబుసేసి తిం
దనుక, హతప్రవీరునిఁగఁ ♦ దద్దయుఁ జల్పితి నన్నుఁ గాన నీ
వనిఁ గడు డస్సినాఁడ వని ♦ యాత్మఁ దలంచి నిశాచరేంద్ర ! నిన్
దునుమఁగ నొల్ల రాముఁ డని ♦ ద్రుంపఁడు సుమ్ము నిరాయుధున్ జనున్.

అర్థములు. అనితర సాధ్యమున్=ఇతరులకు సాధ్యముకానిది, పరభయావహము = శత్రువులకు భయము గలిగించునది, హతప్రవీరునిఁగన్=చంపఁబడిన వీరులు గలవానిఁగ, అనిన్=యుద్ధమందు, నిశాచరేంద్ర = రాత్రులందుఁ దిరుగు వారిలో శ్రేష్ఠుఁడా, నీవు మోసయుద్ధము రాత్రులందుఁ జేయువట్లు నేను జేయను అని భావము.

తాత్పర్యము

ఇతరులకు సాధ్యముకానిదియు శత్రువులకు భయము కలిగించునదియు నగు యుద్ధమింతవఱకుఁ జేసి నాపక్షమునున్న వీరులఁ జంపి మిగుల బడలియున్నాఁడవు అని తలఁచి నిశాచరరాజా! నిన్నుఁ జంప సమ్మతింపను. రాముఁడు నిరాయుధుఁడగు వానిని, ఆయుధ మున్నను వలసి కాలుసేతులు చక్కఁగా గదలింపలేని వానిని జంపఁడుసుమా! వేలయున, యుద్ధము చేసిచేసి యలసినవానిని రాముఁడు చంపినాఁడు, అదియొక శౌర్యమా? ఆమాత్రమున రావణునికంటె రాముఁడు శూరుఁడని యెట్లు చెప్పవచ్చును? అని లోకులందురు. ఆ కారణమున నిన్నుఁగొట్టను, అని భావము.

శ్లో॥ నచ హన్యాత్ స్థలారూఢాన్, న, క్లీబం న కృతాంజలిమ్
నాముక్తకేశం నాసీనం నతవాస్మీతి వాదినమ్.

శ్లో॥ నసుప్తం నవిసన్నాహం, న నగ్నం ననిరాయుధమ్
నాయుధ్యమానం పశ్యంతం, నపరేణ సమాగతమ్.

శ్లో॥ నాయుధ వ్యసన ప్రాప్తం, నార్తం నాతి పరిక్షతమ్
నభీతం నపరావృత్తం, సతాం ధర్మ మనుస్మరన్.

మనుస్మృతి-అ. ౭. ౯౧, ౯౨, ౯౩ శ్లో.

తాను రథమున నుండఁగా రథము విడిచి నేలను నిలిచిన శత్రువును జంప రాదు. నపుంసకుని జంపరాదు. శరణు చొచ్చినవానిని జంపరాదు. తల విరియఁ

బోసికొన్న వానిని, కూర్చున్నవానిని, నేను నీవాఁడ నని శరణుచొచ్చిన వానిని జంపరాదు.

నిద్రించు వానిని, యుద్ధప్రయత్నము లేనివానిని, దెస మొలవానిని, ఆయుధములు లేనివానిని, తనతో యుద్ధము చేయనివానిని, యుద్ధమును జూచుచుండు వానిని, ఒరునితో యుద్ధము చేయువానిని జంపరాదు.

ఆయుధములు విఱిగిపోయిన వానిని, నొచ్చినవానిని, దెబ్బలు తిన్న వానిని, భయపడినవానిని, వెనుకకు మఱలిన వానిని శిష్టులగు క్షత్రియుల ధర్మమును దలఁచికొని చంపరాదు.

శా. పొమ్మీ లంకకు నాజ్ఞ యిచ్చితిని బో ♦ పో గాసి దీఱంగ రా
రమ్మీ క్రమ్మఱ ధన్వివై రథివివై ♦ రాజన్మహాశస్త్రసం
గమ్ముం గైకొని యప్డు చూచెదు శతాం ♦ గస్థుండ వై నాదు శౌ
ర్యమ్మున్ రాత్రిచరేంద్ర! యన్న హతద ♦ ర్పానందుఁడై వాఁడునున్.

అర్థములు. గాసి దీఱంగన్=బడలిక తగ్గిపోఁగా, ధన్వివై=విల్లు పట్టినవాఁడవై, రథివివై=రథమునందు గూర్చుండినవాఁడవై, రాజత్ = ప్రకాశించు, మహాశస్త్రసంగమ్మున్ = గొప్ప శస్త్రసమూహమును, శతాంగస్థుండవై = రథమందున్నవాఁడవై, హత = నశించిన, దర్ప = గర్వము, ఆనందుఁడై = సంతోషము గలవాఁడై.

తాత్పర్యము

ఇప్పుడు నన్నేమి చేయుమనెదవా ? నీకనుజ్ఞ యిచ్చితిని. నిశ్చయముగ లంకకుఁబో. ఇఁక నిన్నుఁ గొట్టనుపో. పోయి బడలిక దీర్చుకొని మరల విల్లు దీసికొని రథమునందుఁ గూర్చుండి నీకుఁగల గొప్ప యస్త్రములన్ని తీసుకొని రమ్ము. అప్పుడు నీవు తేరిమీఁదనుండి నా శౌర్యము చూచెదవు. అనఁగా నపుడు నిన్ను విరథునిఁజేయక నిరాయుధునిజేయక చంపెద నని భావము. ఇట్లు చెప్పఁగా వాఁడు గర్వముడిగి సంతోషహీనుఁడై.

—♦ రావణుఁడు పరాజితుఁడై లంకకుఁ బోవుట ♦—

కం. చాపము విఱుగఁగ సూతుఁడు, రూపఱ గుఱ్ఱములు చావఁ ♦ క్రూరశరహతిన్
దీపులు గొను మెయితో నతఁ, డేపఱి విరిశిరముతోడ ♦ నేగెం బురికిన్. ౧౩౬౭

తాత్పర్యము

విల్లు విఱుగఁగా సూతుఁడు చావఁగా గుఱ్ఱములు మరణింపఁగా క్రూరములైన బాణముల దెబ్బలచే నొప్పులు పుట్టిన దేహముతో వెండ్రుకలు విరియఁబోసికొనిన తలతో (ముడివేసికొను నవకాశములేదు.) ప్రతాపము క్షయించి లంకకుఁ బోయెను.

ఉ. దానవదేవశత్రుఁ డతి ♦ దారుణశౌర్యుఁడు రాక్షసేంద్రుఁ డి
ట్లానతమూర్ధుఁ డౌచు నమ ♦ రావనిఁ బాసి పురిం జొరంగ నా

త్మానుజయుక్తుఁడై రఘుకు•లాభరణంబు ప్లవంగవర్యుల
న్మానుగ వీతశల్యుల నొ•నర్చి శ్రమం బఱఁజేసె నయ్యెడన్. ౧౩౩౦

అర్థములు. ఆనతమూర్ధుఁడు = తలవంచుకొన్నవాఁడు, ఆఁడువారు మగవారు చూచి నవ్వుదు రను నవమానముచే నని భావము, సమరావనిన్ = యుద్ధభూమిని, ఆత్మానుజయుక్తుఁడై = తన తమ్మునితోఁగూడిన వాఁడై, ఇట్లనుటచే లక్ష్మణుఁ డపుడే మూర్ఛవిడిచి లేచె నని సూచన, వీతశల్యులన్ = బాణముల ములుకుల నూడఁదీయించిన వాఁడై.

తాత్పర్యము

దానవులకు దేవతలకుఁగూడ శత్రువు, మిగుల భయంకరమైన శౌర్యముగల వాఁడు నగు రాక్షసరాజు- రావణుఁడు, సిగ్గుచేఁ దలవంచుకొని యుద్ధభూమి విడిచి పోఁగా రామచంద్రమూర్తి తన తమ్మునితోఁగూడి బాణముల ములుకులు నాటుటచే బాధపడు వానరుల కా ములుకు లూడఁదీయించి గాసి దొలఁగించెను.

కం. హరిహయరిపు వోటఱ నిర్జరు లసురులు భూతగణము • సాగరధరణీ
చరజలచరఋషిదర్వీ, కరదిక్పాలాన మెల్లఁ • గల మలరారెన్. ౧౩౩౧

అర్థములు. హరిహయ రిపువు=ఇంద్రశత్రువు, రావణుఁడు, ఓటఱ=ఓడి పోఁగా, కరము=మిక్కిలి, అలరారెన్=సంతోషించెను.

తాత్పర్యము

• ఇంద్రశత్రువగు రావణుఁడు యుద్ధమున నోడి పరువెత్తి పోఁగా దేవతలు అసురులు భూతములు సముద్రమునందుఁ జరించునవి, భూమియందుఁ జరించునవి, నీళ్ళయందుఁ జరించునవి, ఋషులు, సర్పములు, దిక్పాలకులు అన్నియు మిగుల సంతోషించెను.

—• ౬౦-వ సర్గము. రావణుఁడు తన పరాభవంబుఁ దలంచి దుఃఖించుట •—

సీ. రావణుఁ డటు లేగి • రామశరంబులఁ, దలపోసి తలపోసి • తలఁకుఁ జెంది
భగ్నదర్పుం డయి • వ్యథితేంద్రియుం డయి, గరుడాభిభూతనా•గంబునాఁగ
హర్యక్షముఖము క్త•హ స్తినా రాముని. శౌరిని బడి కాలు•శౌరి తప్పి
సర్వతోముఖరామ•చంద్రశరంబులు, తనుఁ దాఁకు చున్నట్లు • తలఁచి బెగడి
తే. దీర్ఘముగ నూర్పు పుచ్చుచు•దివ్యమైన, చిత్రకనకాసనమున నా•సీనుఁడగుచు
దోడిరాక్షసవీరుల•తోడ నిట్టు, లార్తుఁ డగుచును బల్కెంచె • నాత్మగతము.

అర్థములు. రామశరంబులన్ = రాముని బాణముల వేగము, వాఁడిమి క్రౌర్యము; తలపోసి=ఆలోచించి యాలోచించి,తలఁకు చెంది=ఇక్కడికిఁగూడవచ్చుచున్న వేమో యని భయపడి, భగ్నదర్పుండయి = గర్వము చెడిన వాఁడయి, వ్యథితేంద్రియుండయి=బాధపడుచున్న యింద్రియములు గలవాఁడు, బాణముల

దెబ్బలచే కాళ్ళుచేతులు లోనైనవి, వానిబాధచే, మనస్సు=బుద్ధి, గరుడ = గరుత్మంతునిచే, అభిభూత = అవమానింపఁబడిన, నాగంబు = సర్పము, నాఁగ = అనఁగా-వలె, హర్యక్షముఖ = సింహము నోటినుండి, ముక్త = విడువఁబడిన, హస్తినాన్ = ఏనుఁగువలె, కాలుబారి = యముని బారి, సర్వతోముఖ = అన్ని ముఖముల వచ్చునట్టి, అందఱు వేయు బాణము లెదుటనుండి మాత్రమే వచ్చును. రామబాణములు అట్లుగాదు. వెనుకనుండితప్పు ఏప్రక్క చూచిన ఆ ప్రక్కనుండి యంతయు వచ్చుచుండును, ఆత్మగతము=తన మనస్సులో నున్నదానిని.

తాత్పర్యము

ఈ ప్రకారము రావణుఁడుపోయి రాముని బాణముల వేగము—వాఁడిమి—క్రౌర్యము తలఁచి తలఁచి యచ్చటికి నవి వచ్చుచున్నవేమో యని భయపడి పలు దిక్కులు చూచుచు గర్వము చెడి యింద్రియములు బాధింపఁగా గరుడుఁడు కొట్టి విడిచిన పామువలె, సింహము నోటినుండి విడువఁబడిన యేనుఁగువలె రాముని బారిబడి చావు దప్పి నానాముఖములుగా వచ్చు రాము బాణములు తన్నుఁ దాఁకుచున్నట్లు తలఁచి బెదరి నిట్టూర్పు విడుచుచు దివ్యమై విచిత్రమైన బంగారు పీఠముపైఁ గూర్చుండి తోడనున్న రాక్షసులతో దుఃఖించుచు తన మనస్సులో నున్నదిట్లు చెప్పెను.

మ. అకటా! నా పరమాద్భుతంపుఁ దప మాహా! వ్యర్థమై పోయెఁగా
వికటాయోధనసీమ వజ్రధరుఁడౌ • వృత్రారినిన్ గెల్చి నేఁ
డొకమర్త్యున్ గెలువంగలేక చెడితిన్ • యుద్ధక్షితిం, గాల మెం
తకు వచ్చెన్ మనుజాదనున్ మనుజుఁడే • దర్పోద్ధతిన్ గెల్చెడిన్. ౧౩౩౩

అర్థములు. వికటాయోధనసీమన్ = భయంకరమైన యుద్ధభూమియందు, ఎంతకున్=ఎంత విపరీతస్థితికి, మనుజాదనున్=మనుష్యులఁ దినువానిని.

తాత్పర్యము

అయ్యో! యద్భుతముగా నేను జేసిన గొప్ప తపస్సంతయు నేఁడు వ్యర్థమై పోయెఁగదా! ఔరా! యేమి యీ చిత్రము! భయంకర యుద్ధమందుఁ వజ్రము ధరించినట్టియు వృత్రుని జంపినట్టియు నింద్రుని నేను జయించియు నేఁడొక మనుష్యుని గెలువలేక యుద్ధభూమియందుఁ జెడితిని. మనుష్యులఁ దినువారిని మనుష్యులు భుజబలగర్వముచే గెలుచుచున్నారు. ఎంతటి విపరీతకాలము వచ్చెనో చూచితిరా!

కం. మానదు భయంబు కలనన్, మానవుచే నీ కటంచు • నాళీకభవుం
డానాఁడు పలికె ఘోరపు, టానుడి ఫలియించె నేఁటి•కవితథ మగుచున్.

అర్థములు. కలనన్=యుద్ధమందు, నాళీకభవుఁడు = బ్రహ్మ, ఆనాఁడుఁ= వరములిచ్చిననాఁడు, ఆ నుడి=ఆ మాట, అవితథము=వ్యర్థముకానిది.

తాత్పర్యము

నాకు వరము లిచ్చినాఁడే బ్రహ్మదేవుఁడు నీకు మనుష్యులచే భయము కలదు అని చెప్పెను. ఆ మాట నేఁడు యథార్థమై ఫలించెను.

ఉ. దానవయక్షరాక్షసభు•జాకుపథశ్చర దేవతాళిచే
నే ననిఁ జావకుండ నళి•నీసుమసంభవుచే వరంబులన్
మానుగఁ గాంచినాఁడఁ దొలి • మానవులన్ గణియింప నైతి దు
ర్మానము పేర్మి నిప్పు డది • ప్రాణమునీఁదికిఁ దెచ్చెఁ గంటిరే. ౧౩౩౫

అర్థములు. అనిన్=యుద్ధమందు, నళినీసుమసంభవుచేన్=తామరయందుఁ బుట్టిన బ్రహ్మచే, తొలి=పూర్వము, దుర్మానము=దురహంకారము.

తాత్పర్యము

దానవులయు యక్షులయు రాక్షసులయు సర్పములయు నాకాశ సంచారులయు దేవతలయు సమూహముచే యుద్ధమునందుఁ జావకుండ వరము, బ్రహ్మదేవునిచేఁ బొందితిని. అప్పుడు దురహంకారముచే మనుష్యు లేమి చేయఁగల రని తలఁచి వారిపేరు చెప్పినవాఁడఁగాను. అది యిప్పుడు నాప్రాణమునకే యపాయము కలిగించునది యాయెను.

సీ. ఇక్ష్వాకుకులభవా•ధీశుం డయోధ్యలో, ననరణ్యుఁ డనియెడి•యవనివిభుఁడు
తొల్లి నాచే ననిఁ•ద్రెళ్ళుచో ననుఁ జూచి, రాక్షసాధమ, నిన్ను•రణమునందు
సుతులతో బలముతో•హితులతో సచివవ,ర్గంబుతోఁ దురగసా•రథులతోడఁ
గులపాంసనా! చంపఁ•గలవారుఁ డుదయించు,నస్మదన్వయమున • నడిచిపడకు
తే. కుమతి ! యంచును వచియించెఁ •గువలయేశు
మాట నేఁటికి సూటి యై • పాటి మీఱెఁ
దత్త్వ మిది యీట రాముని • దశరథాత్మ
జాతు మానుషుఁగా నెంతు • స్వాంతమందు. ౧౩౩౬

అర్థములు. అస్మదన్వయమునన్=నావంశమున, అడిచిపడకు=మిడిసిపడకు.

తాత్పర్యము

కొందఱు నాకు హితము బోధించువారు రాముఁడు విష్ణువు నన్నుఁ జంపుటకై మనుష్యరూపమున వచ్చినాఁడనియు సతనితో సంధి చేసికొనుమనియుఁ జెప్పిరి. నా యభిప్రాయమది కాదు. ఏలన ఇక్ష్వాకువంశరాజగు ననరణ్యుఁడను నయోధ్యానగర రాజును నేను యుద్ధములోఁ గొట్టితిని. అతఁడు నన్నుఁ జూచి యోరీ! నీచరాక్షఁసుఁడా! కులపాంసనా! బుద్ధిలేనివాఁడా! నిన్ను యుద్ధమునందు కొడుకులతో సేనలతో మిత్రులతో మంత్రులతో గుఱ్ఱములతో సారథులతోఁ జంపఁగలవాఁడు నావంశమందుఁ బుట్టును. ఏల మిడిసి పడెదవు అని చెప్పెను. ఆ రాజుమాట నేఁటికి సరిదాఁకెను. ఇది వాస్తవ విషయము కావున రాముఁడు దశరథు కొడుకు మనుష్యుఁ డనియే నేను

దలంచెదను. దశరథుఁడు మనుష్యుఁడగు నేని యతని కొడుకు మనుష్యుఁడు గాక మఱియొకఁ డెట్లగును ?

ప్రాకృత మనుష్యులకు నప్రాకృతవిష్ణు వెట్లు పుట్టఁగలఁడు. ఇచ్చట భగవద్గీత యందలి యీశ్లోకములు స్మరింపఁదగినవి.

శ్లో॥ అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్
పరంభావ మజానంతో మమ భూతమహేశ్వర. అ. ౯-౧౧ శ్లో.

ద్వి. గీ. భూతనియామకమున నమర్చంబు, నాతతమా నా మహాభావ మెదను
దెలియంగఁ జాలని ధీ విరహితులు, వలనుగ మనుజ సంబంధ దేహమును
జేకొన్న న న్నుపేక్షింతురు పార్థ.

శ్లో॥ నమాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః
మాయయాపహృతజ్ఞానా, మాసురంభావ మాశ్రితాః అ.౭-౧౫ శ్లో.

ద్వి.గీ.ధరణి మూఢులు నరాధములును మాయ, హరియింపఁబడినజ్ఞానాత్ములు, నసుర
భావాశ్రితులు నయి పరఁగు దుష్కృతులు, భావించి నాదుప్రపత్తినిగొనరు.

చ అవమతి నొంది మత్కృతిని • నాఁకర మూని శపించె నన్ను వే
దవతి యనంగ నొప్పు నొక•తన్వి తపస్విని పూర్వ మిట్టు, దా
నవ ! నిను నీ కులంబును వి•నాశముఁ జేసెదఁ జూడుమంచు నా
యువిద విదేహనాథునకు • నుద్భవ మయ్యెను సీతనా నిటుల్. ౧౩౬౭

అర్థములు. అవమతి=అవమానము,ఆఁకరము=కోపము.

తాత్పర్యము

నేను జేసిన పనికి నవమానపడి కోపించి వేదవతి యను నొక స్త్రీ తపశ్శాలిని రాక్షసుఁడా ! నిన్ను నీ కులమును నేను నాశము చేసెదనని శపించెను. ఆ వేదవతియే యిప్పుడు విదేహరాజునకు సీతయై పుట్టెను. ఆ వేదవతి ఋషికన్య. మనుష్యస్త్రీ కావున సీతయు మనుష్యస్త్రీయే. కావున సీతారాము లిరువురు మనుష్యజాతివారే. మనుష్యులు కనుకనే యొకరి నొకరు వివాహమాడిరిగాని రాముఁడు విష్ణు వయినచో మనుష్యస్త్రీని వివాహమాడునా? సీత లక్ష్మి యైనచో మనుష్యుని వివాహమాడునా? కావున లక్ష్మీనారాయణులను వాదము నాకు సమ్మతముగాదు. అట్టి మహిమ వారేదియుఁ జూపలేదు. వారు చేసినవి యమానుషములు గావు. మనుష్యసాధ్యములే.

కం. గిరికన్యక యును రంభయు, వరుణునికన్యకయు నంది • పలికిన యట్టుల్
జరుగఁ దొడంగెను రాక్షస, వరులారా! ఋషుల నుడు ల•బద్ధము లగునే.

అర్థములు. గిరికన్యక = పార్వతి, నుడులు = మాటలు, అబద్ధములు = అసత్యములు.

రావణుఁడు కైలాసమెత్తినపుడు భయపడిన పార్వతి స్త్రీ యీతని చావునకుఁ గారణమగును గాక యని శపించె నని యీపద్యముచే గ్రహింపనగు.

రంభ — రంభా నిమిత్తమున నలకూబరుఁ డిచ్చిన శాప ముత్తరకాండమున ౯౯౬-౯౯౭ పద్యములందున్నది. నందికేశ్వరుఁడు రావణున కిచ్చిన శాప ముత్తరకాండమున ౩౨౬-౩౨౭ పద్యము లందున్నది.

వరుణుని కన్యక - ఈమె పుంజికస్థలయై యుండవలెను. ఈమె నిమిత్తమై బ్రహ్మ శపించె నని యీకాండమున ౨౯౬-౨౯౭ పద్యము లందున్నది. ఆమె కాదేని పార్వతీశాపము వలె నిదియు నీ వాక్యముచే సిద్ధము కావలెను.

## తాత్పర్యము

పార్వతియు రంభయు వరుణుని కూఁతురు నందీశ్వరుఁడు నన్ను గుఱించి చెప్పినట్లు జరుగ నారంభించెను. ఋషుల మాట లబద్ధములగునా ?

ఉ. శాపభయంబుచంద మిది • చక్క నెఱుంగుచు నర్హయత్నులై
యాపుగ మూలకోత్తకములందును గోపురమూర్ధసీమలం
దేపున నిల్చి యుండుఁడ, యహీనగభీరుని దేవదైత్యద
ర్పాపహు బ్రహ్మశాపవివశాత్ముని లేపుఁడు కుంభకర్ణునిన్. ౧౩౫

అర్థములు. శాపచయంబు=నాకుఁగల శాపములవిధము, అర్హయత్నులై = చేయఁదగిన యత్నముగలవారై, ఆపుగ = వానరులు పైపడిరాకుండ యూరిలో వారికి రక్షకులుగ, మూలకోత్తకములందు=మూలలనుండెడి బురుజులందు, గోపురమూర్ధసీమలన్=గోపురముల పై భాగములందును, (వచ్చు విరోధుల దూరమున నుండఁగానే చూచుటకు) అహీన గభీరుని = (౧) అహి+ఇన+గభీరుని=సర్పరాజగు నాదిశేషునివలె గాంభీర్యము గలవానిని, (౨) హీనముగాని గాంభీర్యము గల వానిని గంభీరశబ్దము భావప్రధాన నిర్దిష్టము, బ్రహ్మశాప వివశాత్ముని = బ్రహ్మశాపముచే దేహము తెలియని వానిని, లేపుఁడు=నిద్రలేపుఁడు.

## తాత్పర్యము

ఇది నాకుండు శాపముల విధము. ఇది మీరు తెలిసికొని విరోధుల సంహరించు విషయమై చేయఁదగిన ప్రయత్నములు చేయుఁడు. ఈ శాపములు నన్ను బాధించునుగాని మిమ్మెవ్వరిని బాధింపవు. కావున మీకు రాఁగల భయములేదు. మీ రజాగ్రత్తగా నుంటిరా చెడుదురు. కావున నా నిమిత్త మైనను గాకున్నను మీ నిమిత్తమైన మీరు జాగ్రత్తగా నుండుఁడు. మమ్మే నేమిచేయమనెదవందురా? మూలలందుండు బురుజులందుఁ గూడ గోపురములందును కావలసి నందఱు రక్షకులుండవలయును. మఱియొకటి, బ్రహ్మశాపముచే నిద్రపోవుచున్న కుంభకర్ణుని నిద్రలేపవలెను.

తాత్పర్యము

ఇది తిక్క తెలిసినది రోఁకలి తలకుఁజుట్టు మనునట్లున్నది. ఇన్ని శాపములు నాకున్నవి, నాతోడ మీరేల చావవలెను, సంధి పడుద మను మాట విడిచి యుద్ధవిషయమే చెప్పెను. ఇంతకంటె మూర్ఖత్వ మెందుగలదు?

—♦ రావణుఁడు మంత్రులను గుంభకర్ణుని నిద్రలేప నియోగించుట ♦—

ఉ. చచ్చెఁ బ్రహస్తుఁ డుగ్రరణ ♦ శౌండుఁడు, నే నని నిర్జితుండ నై
వచ్చితి, నెవ్వ రింకఁ బగ ♦ వారిని మార్కొని యోర్చువార? లా
పొచ్చెము లేని బం టసుర ♦ పుంగవుఁ డా ఘటకర్ణుఁ డొక్కఁడే
హెచ్చినశక్తి వైరి వధి ♦ యింపఁ గలం డని నిశ్చితాత్ముఁడై. ౧౩౪౦

అర్థములు. ఇప్పుడు కుంభకర్ణుని నిద్రలేపవలసినంత యేమిపనిపడెనందురా? ఉగ్రరణశౌండుఁడు = భయంకర యుద్ధమున దక్షుఁడు, నిర్జితుండను = జయింపఁ బడినవాఁడను, పొచ్చెము=లోపము.

తాత్పర్యము

భయంకర రణమునందు సమర్థుఁ డగు ప్రహస్తుఁడు చచ్చెను. నేను బరా జయమునొంది వచ్చితిని. పగవారి నెదిరించి జయముపొందఁగల వాఁడిఁక నెవ్వఁ డున్నాఁడు. కావున లోపములేని శూరుఁడు కుంభకర్ణుఁడొక్కఁడే తన బలముచే వైరులఁ జంపఁగలవాఁడు అని నిశ్చయించుకొన్నవాఁడై.

సీ. ద్వారంబు లెల్ల య♦త్నంబునఁ గావుఁడు, ప్రాకారముల నెక్కి ♦ పగఱఁ గనుఁడు
ఈ లీల నే నుండఁ ♦ గాలోపహతమతి, హాయిగాఁ జింత లే ♦ కాక మఱచి
నిద్రించుచున్నాఁడు♦నిశిచరవర్యుఁడు, నేఁడు తొమ్మిదియాఱు♦నెనిమిదియును
మాసముల్ నిద్రించు♦మంతనం బుండి యింతకుఁ దొమ్మిదవనాఁడ♦తని కెనిద్ర
తే. యిపుడు మేల్కొల్ప సుకరం బ♦హీనబలుని, గుంభకర్ణుని రాక్షస♦కులవరేణ్యు
నతఁడు మేల్కొనెనేనియు♦హతము సేయు, రాజపుత్త్రాన్వితమ్ముగ కపి♦రాజి నిజము.

అర్థములు. పగఱన్=శత్రువులను, ఈలీల=ఇట్టి కష్టదశయందు, కాలోప హతమతిన్=కాలముచేఁ గొట్టఁబడిన మనస్సుగలవాఁడనై, హాయిగాన్=సుఖముగా, ఆఱుమఱది=ఆన్నుఁ దా మఱచి, రాజపుత్త్రాన్వితము = రాజపుత్త్రు లగు రామ లక్ష్మణులతోడి, కపిరాజిన్ = వానర సమూహమును.

తాత్పర్యము

వానరులు లోపలికి రాకుండ గవనులన్నియు మిగులఁ బ్రయత్నముతోఁ గాపాడుఁడు. వారు దూరమం దుండఁగానే చూచుటకై ప్రాకారము లెక్కి పగ వారిని జూచుచుండుఁడు. ఇట్టి కష్టదశయందు నే నుండఁ గాలవశమున హాయిగా దేహము మఱచి కుంభకర్ణుఁడు నిద్ర పోవుచున్నాఁడు. అతఁ డొక్కొక్కసారి ఆఱో యేడో యెనిమిదో తొమ్మిదో నెలలు నిద్రించును. వాఁడింతకు ముందు తొమ్మిదవనాఁడు నిద్రపోయెను. ఇఁకను గాఢనిద్రలో లేఁడు కావున నిప్పుడే

సుఖముగ నిద్ర లేపవచ్చును. వాఁడు మేలుకొనెనా రామలక్ష్మణులను వానరులను గూడఁ జంపఁగలఁడు.

ద్వారంబులెల్లన్=పురద్వారముకాక తక్కిన వాకిండ్ల నన్నిటిని. ౧౩౭ పద్యమునఁ బురద్వార రక్షణము చెప్పఁబడియున్నది కాననిందుండు ద్వారశబ్దము తక్కిన ద్వారములను దెల్పును. ప్రాకారములనిత్యాది=మన శత్రులైన వానరులు ప్రాకారములపై నెక్కకుండునట్లు మీరు ముందుగా జాగ్రత్తగాఁ బ్రాకారములపై నెక్కియుండుఁడు, నేను, ఈలీలన్ = ఈవిధముగా, ఇట్లు విచార సముద్రములో మునిఁగి దుఃఖించుచు, ఉండఁగా, నిశిచరవర్యుండు=కుంభకర్ణుఁడు, కాల+ఉపహత మతిన్=చెడుకాలముచేఁ జెఱుపఁబడిన మతితో, చింతలేక, ఆదమఱచి, హాయిగా నిద్రించుచున్నాఁడు. కుంభకర్ణుఁ డిట్లు నిద్రించుట యిపుడు మాత్రమేగాదు. ఎల్లప్పుడును నిట్లే యనుచున్నాఁడు. ఏడిత్యాది=ఒకప్పు డేడు మాసములు నిద్రించును. ఒకప్పుడు తొమ్మిది యొకప్పుడాఱు యొకప్పుడెనిమిది మాసములు-ఇట్లుగా నిద్రించుచుండును. కుంభకర్ణుని నిద్రకు నిన్ని మాసములని యొక వ్యవస్థ లేదు. వానికెన్ని నెల లిష్టమో యన్ని నెలలు నిద్రించు చుండును. "ఆవలఁ గుంభకర్ణ నికటావనికిం జతురాస్యుఁ డేఁగి నీ భాగవతంబుఁ జెప్పుమన వాఁడును నిద్దురఁగోరెఁ జెక్కులేండ్లు" అనెడి యుత్తరకాండపద్యమును బట్టి చూచినను గుంభకర్ణుఁడు బ్రహ్మను గూర్చి వరప్రార్థన చేయునపుడు తనకు బహుకాలము నిద్ర కలుగునట్లు ప్రార్థించెఁగాని యింతకాలమని యొక వ్యవస్థగా నడుగలేదు గదా. కాఁబట్టి మాసవ్యవస్థ లేకయే కుంభకర్ణుఁడు నిద్రించుచుండునని యిచ్చటఁ జెప్పినది యుక్తమే "అని వేఁడిన దయ గూడిన మనమున ననెనితఁ డాఱుమాసంబులు గూర్కును నొక్కపగలు మేల్కొని తినుగావుత మగ్నిభగిదిఁ దిరుగుచు జగతిన్" అని యీ కాండముననే యిఁకఁ గొంత పైన రాముని గుఱించి విభీషణుఁడు చెప్పఁగలమాటలోఁ గుంభకర్ణుని నిద్ర యాఱు మాసములని యున్నను దీనికిని దానికిని విరోధము రాకుండునట్లు సమాధానము నెఱుంగుఁడు. అదెద్ది యనఁగా పైపద్యములో నాఱుమాసములు మాత్రమే చెప్పి యున్నవిగాని మిగత మాసములు చెప్పలేదు. ఇందుఁదక్కినవిగూడఁ జెప్పియున్నవి. కాన నచ్చటఁ జెప్పని యంశము నిచ్చటనుండి తీసికొని సరిపుచ్చుకొనునది. ఇటు చేసినచో నీ రెండు పద్యములకును విరోధము రాదు. లేదా యందలి యాఱుమాసము లన్నదానికి ఆఱు మాసములకుఁ దగ్గఱయని యర్థము చెప్పినచో నేడెనిమిది మాసములు నిద్రించినను నాఱుమాసములకుఁ దగ్గఱ నిద్రించి నట్లే యగును గాన నిట్లైనను విరోధపరిహారము చేసికొనునది. లేదా పైన చెప్పఁగల విభీషణుని వాక్యములోని యాఱుమాసము లనుటయే సరి. దాని ననుసరించి విరోధ పరిహారము చేయవలెను. అదెట్లనఁగా ఆ యాఱు మాసములలోని యొక్కొక్క మాసమునకును ముప్పది దినము లని యచ్చట నభిప్రాయము. ఈ పద్యములోని

యేడు తొమ్మిది యాఱు నెనిమిదియును మాసము లని చెప్పఁబడిన మాసములలో నొక్కొక్క మాసమునకును నాఱుదినములని యభిప్రాయము. ఏడు తొమ్మిది యాఱు నెనిమిదిమాసములు కలిసి ముప్పదిమాసము లగును గదా. ఆఱు దినములొక మాసము చొప్పున ముప్పదిమాసములకును నూటయెనుబది దినములైనవి. ఇన్ని దినములును, ముప్పదిదినములు గల మాసము లాఱగును గదా. కాఁబట్టి యీ పద్యములోని కుంభకర్ణుని నిద్రాకాలమునకును పైని విభీషణుని వాక్యములోని కుంభకర్ణుని నిద్రాకాలమునకును విరోధపరిహార మగును. కృష్ణయజుర్వేద సంహిత యం దేడవ కాండములో 'గవామయన' మని యొక యాగము వివరింపఁబడి యున్నది. ఈ యాగ మొక సంవత్సరము చేయఁదగినది. కాఁబట్టి దీనికి సత్రమని పేరు. దీనికి వలసిన సమస్తాంగములును నీ యాగప్రకరణమందే చెప్పియున్నవి. మఱొకచోటినుండి తెలిసికో నక్కఱలేదు. కాన నిది ప్రకృతి యాగ మనఁబడును. దీని తర్వాత 'ఉత్సర్గిణామయన' మ్మని మఱియొక సత్రయాగము చెప్పియున్నది. ఇదియు సాంవత్సరకాలికమే. రెండవ సత్రమునకు వలసిన సమస్తాంగములును నీ ప్రకరణమందుఁ జెప్పలేదు. కొన్ని "గవామయన" ప్రకరణమునుండి తెలిసికొని యిందుఁ జేయవలెను. కాన నీ రెండవసత్రము మొదటి సత్రమునకు వికృతి యనఁబడును. ప్రకృతిసత్రసంవత్సరమున నొక్కొక్క మాసమునను ముప్పది సోమయాగములు తప్పక చేయవలెను. ఒక్కొక్క దినమైన నూఱకుండరాదు. వికృతి యాగమునను ప్రతిమాసమును ప్రతిదినము సోమయాగము చేయవలసినదే. కాని యిందుఁ బ్రతిమాసము నొక దిన ముత్సర్గము తప్పక చేయవలెనని విధించియున్నది. ప్రతిమాసమును నేయే దినమున సోమయాగోత్సర్గము చేయవలసినదని సందేహము రాఁగా నా కాండమునందే యేడవ ప్రపాఠకమున నాఱవపనసలో నాల్గు మాసవికల్పములను జెప్పి యం దొక్కొక్క మాసమున నుత్సర్గదినము చెప్పఁబడియున్నది. ఆ పనస నీ క్రిందివిధముగాఁ జూచుకొనుఁడు.

పనస, షడ్భిర్మాసా న్సంపాద్యాహ రుత్సృజంతి షడ్భిర్హి మాసా న్సంపశ్యంతి ! అర్ధమాసై ర్మాసా న్సంపాద్యాహ రుత్సృజం త్యర్ధమాసైర్హి మాసా న్సం పశ్యంతి. అమావాస్యయా మాసా న్సంపాద్యాహ రుత్సృజం త్యమావాస్యయాహి మాసా న్సంపశ్యంతి, పౌర్ణమాస్యా మాసా న్సంపాద్యాహ రుత్సృజంతి పౌర్ణమాస్యాహి మాసా న్సంపశ్యంతి" యీ రీతిగాఁ గలదు. ఈ శ్రుతి కర్థము, షడ్భిః=ఆఱు దినములచే, మాసాన్ = నెలలను, సంపాద్య = సంపాదించుకొని, పూర్తిచేసికొని, అహః = ఆపై దినమును, ఏడవదినము, ఉత్సృజంతి = విడుచుచున్నారు. షడ్భిః+హి = ఆఱు దినములచేతనే గదా, మాసాన్ = నెలలను సంపశ్యంతి=తెలిసికొనుచున్నారు. వేదమార్గానుసారు లని శేషము, వేదమున, ఆఱు దినము లొక మాసముగాఁ జెప్పుటచే దన్మార్గానుసారు లందఱు నాఱు

దినముల నొకమాసముగా నెన్నుదురు. కాబట్టి యాఱుదినము లొకమాసముగా నెంచి యం దాఱు సోమయాగములుచేసి యా పైది యగు నేడవ దినమున ఉత్సర్గము చేయవలెను అని యొక పక్షము. అర్ధమాసైః=మాసములోని సగపాలచేత, పదునైదుదినములచేత మాసాన్ సంపాద్య = ఒక్కొక్కమాసమును బూర్తి చేసికొని, అహః+ఉత్సృజంతి=ఆపైది యగు పదునాఱవ దినమును విడుచుచున్నారు. అర్ధమాసైః+హి=పదునైదు దినముల చేతనేకదా, మాసాన్ + సంపశ్యంతి = నెలలను దెలిసికొనుచున్నారు. వేదమార్గానుసారు లని శేషము. వేదమునందు "పక్షా వై మాసా" యని పదునైదు దినములను నొక మాసముగాఁ జెప్పియున్నందునఁ దన్మార్గానుసారు లందఱును బదునైదు దినములను నొకమాసముగా నెన్నుదురు. కావునఁ బదునైదు దినముల నొకమాసముగాఁ బెట్టికొని వానియందుఁ బదునైదు సోమయాగములుచేసి యాపైది యగు పదునాఱవ దినమున నుత్సర్గము చేయవలెను అని రెండవ పక్షము. అమావాస్యయా మాసాన్సంపాద్యాహరుత్సృజంతి=అమావాస్యతో మొదటిమాసము పూర్తి చేసికొని యాపైదినమగు శుక్లపక్షము పాడ్యమినాఁడు ఉత్సర్గము చేయుదురు. అమావాస్య యాహిమాసాన్ సంపశ్యంతి, చాంద్రమాన ప్రకారము అమావాస్య కమావాస్యకే గదా మాసపూర్తి యని తలంపఁబడును. చాంద్రమాన ప్రకారము నడచుకొనువారు అమావాస్య కమావాస్య యొక నెలయని యెంతురు. కాన నొక శుక్లపక్ష పాడ్యమి మొదలు పై యమావాస్యదాఁక ముప్పది సోమయాగములుచేసి యంతవఱకు నొక నెలను బూర్తిచేసికొని యాపై శుక్లపక్షమున పాడ్యమినాఁ డుత్సర్గము చేయవలెనని మూఁడవ పక్షము. పౌర్ణమాస్యామాసాన్సంపాద్యాహ రుత్సృజంతి పౌర్ణమాస్యాహి మాసాన్ సంపశ్యంతి, బార్హస్పత్యమాన ప్రకారము నడుచుకొనువారు పున్నమకుఁ బున్నమ యొక నెలగా నెన్నుదురు కాన వారి మత ప్రకార మొక బహుళ ప్రతిపత్తి మొదలు పున్నమ వఱకు ముప్పది సోమయాగములుచేసి యాపైది యగు బహుళ ప్రతిపత్తు నాఁ డుత్సర్గము చేయవలెనని నాల్గవ పక్షము. ఈనాల్గు పక్షములలోఁ జెప్పియున్న నాల్గు విధములైన మాసములును ప్రసిద్ధములే యని తెల్పుటకై యాయా వాక్యమునందును హి శబ్దము ప్రయోగింపఁబడినది. హి శబ్దము ప్రసిద్ధి వాచకము. కాఁబట్టి పౌర్ణమాస్యమావాస్యలవలెనే యర్ధమాస, షడ్దినములును మాసము లనియే ప్రసిద్ధములని యీశ్రుతి భావము. కాఁగా నాఱుదినములును నొక మాసమని యేర్పడినదికదా. ఇట్టి శ్రౌతమగు షడ్దినరూప మాసమును గలదని యెంచి విభీషణ వాక్యములోని యాఱుమాసములనే, "యేడు తొమ్మిది యాఱునెనిమిదియును మాసము" లని యిందుఁ జెప్పియున్నాఁడు. కాఁబట్టి వక్ష్యమాణ విభీషణ వాక్యమునకును దీనికిని విరోధము లేదు. కొందఱీ శ్రుతిలోని "షడహైర్మాసా న్సంపాద్యాహ రుత్సృజంతి షడహైర్హిమాసా న్సంపశ్యంతి" యను భాగమునకు మఱొక

విధముగా నర్థము చెప్పుదురు. అదెట్లన - షడహైః - అయిదింటిచేఁ బెంచఁబడిన యాఱుదినములచేత, ముప్పది దినములచేత, మాసాన్ = నెలలను, సంపాద్య = పూర్తిచేసికొని, అహః-ఆపైది యగు ముప్పది యొకటవ దినమును-ఉత్సృజంతి= విడుచుచున్నారు. షడహైః+హి = అయిదింటిచేఁ బెంచఁబడిన యాఱుదినముల చేతనేగదా-మాసాన్ = నెలలను సంపశ్యంతి = తెలిసికొనుచున్నారు. సావన మాసప్రకారము నడుచుకొనువారని శేషము, ముప్పది సూర్యోదయము లొక సావనమాస మనఁబడును. ఈక్రమప్రకారము ముప్పది దినములు ముప్పది సోమ యాగములు చేసి ముప్పదియొకటవ దిన ముత్సర్గము చేయవలెనని ప్రథమ పక్ష మని భావము. ఈ శ్రుతి కాఱు దినములు మాత్రమే యొకనెల యని యభిప్రాయ మైనచో సమాహారముచేసి షడహేనయనియే గదా చెప్పుట సరసము. అట్లు చెప్పక షడహైః యని బహువచనాంతముగాఁ జెప్పుటచే ననేకషడహము లని యర్థమగును గాన నవి యొక మాసమునకుఁ దగినట్లు ఐదింటిచేఁ బెంచఁబడిన షడహములుగాఁ జెప్పవలె నని వీరి యభిప్రాయము. వీరి మతమంత సరిగాదు. ఏలయనఁగా "షడహైః" యన్నప్పుడు బహువచన స్వారస్యమెంచినచో "అర్ధమాసైః" యన్నప్పుడును బహువచన స్వారస్యము చూడ వలదా? అందును దత్స్వారస్యము చూచినచో మూఁడుపక్షము లొకమాస మని యేర్పడును. అది యెవరికిని సమ్మతముకాదు. కాన నొకచో బహువచన స్వారస్య మంగీకరించుట మఱొకచో లేదనుట యిది యుక్తముకాదు. ప్రసిద్ధములుగా నున్న మాసములను బట్టియే యీ శ్రుతి కర్థము చేయవలెను. "పక్షావై మాసా" యను శ్రుతి ప్రసిద్ధినిబట్టి "యర్ధమాసైః" యన్నప్పుడు బహువచనస్వారస్యము వదలినట్లు 'షడహైః' యన్నప్పుడును మీరు చెప్పినట్టి బహువచన స్వారస్య మక్కఱలేదు. బహుదిన వాచకము గాన బహువచనాంతముగా నున్నదని చెప్పినంతనే చాలును, అర్ధమాసైర్హి, అమావాస్యయాహి, పౌర్ణమాస్యాహి యను స్థలములందుఁ బ్రసిద్ధిద్యోతక హిశబ్ద మున్నట్లు "షడహైర్హి" యను చోటను బ్రసిద్ధి ద్యోతక హిశబ్దముండుటచే షడహమాస మను పక్షమును బ్రసిద్ధమనియే యీ శ్రుతికి భావము. మఱియుఁ జూడుడు. "షడహైర్మాసాన్ సంపాద్య యత్సప్తమ మహ స్తస్మి న్నుత్సృజేయుః" అని యుత్తరానువాకములోని వాక్యము వీరికి విరోధించును. అదెట్లనఁగా షడహైః+మాసాన్+సంపాద్య. ఆఱేసి దినములచే మాసములను బూర్తి చేసికొని, యత్+సప్తమం+అహః-ఆపైదియగు నేడవ దిన మేది కలదో,తస్మిన్=ఆ దినమున, ఉత్సృజేయుః-వదలుదురు. సోమ యాగము నని శేషము. ఆఱుదినము లొక మాసముగాఁ బెట్టుకొని యందాఱు సోమ యాగములు చేసి యాపైదియగు నేడవ దినమున సోమయాగము వదలవలెనని యీ శ్రుతిభావము. ఇందు ముప్పదియొక్కవ దిన ముత్సర్గము చేయవలెనని చెప్పక

యేడవ దినమునఁ జేయవలెనని ప్రత్యేకించి 'యత్స పమమహ' యని చెప్పుటచే మాసముగా నెన్నఁబడిన షడహములు అయిదింటిచేఁ బెంచఁబడిన యాఱుదినములు కావనియు, ఆఱే దినములనియు స్పష్టమగుచున్నది. ఇందలి మాస శబ్దమునకు మాసైకదేశమని యర్థము చెప్పినచో స్వారస్యభంగమగును. కాన నాఱుదినములు మాసమనుటయే యీ యనువాకమున కభిప్రాయము. దీనితో నైకకంఠ్యము చేసినచోఁ బూర్వానువాకములోని షడహములు అయిదింటిచేఁ బెంచఁబడినవి కావనియు, ఆఱు దినములు మాత్రమే యనియు నిర్ధారణ మగును. కాన రెండవ యర్థము సరి కాదు. మొదటియర్థమే సరియని తెలియఁగునది.

గాఢనిద్రలోనున్న యీతని నిపుడు మేలుకొల్పుట యసాధ్యమని యెంచకుఁడు. ఇతఁడిప్పుడే కొన్ని దినములకుఁ బూర్వము నిద్రింప నారంభించెను గాన గాఢనిద్ర నొందియుండఁడని యభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. మంత్రసంబుండి ఇత్యాది= మంత్రసంబుండి మాతోడ నాలోచనాసభలోనుండి. ఇంతిపన్ = ఈదినమునకుముందు తొమ్మిదవనాఁడు, నిద్ర తవిలెను=నిద్రింప నారంభించెను. నిద్రారంభదినమున కీ దినము తొమ్మిదవదినమని భావము. దీనివలన నేర్పడిన దినసంఖ్య యీ క్రిందివిధముగా నెఱుఁగునది." ఈతఁడాఱు మాసంబులు కూర్కొను నొక్క పగలు మేల్కొని తినుఁగావుత"(యు.౧౨౧౫)యని చెప్పియుండుటచేతఁ గుంభకర్ణుఁడు నిద్ర లేచి యొక్క దినమే మేల్కొనియుండునుగాన నాదినమే రావణాలోచన సభలోనుండి మరునటి దినము మొదలు నిద్ర కారంభించెను, "రావణానుజుఁడా వెంటనె వచ్చె" నని (యు.౧౧౨)యుండుటచేత నాలోచన నాఁడే విభీషణుఁడు రామునొద్దకు వచ్చెనని తోఁచును. "సుక్రీ గ్రహించె దశాస్యు భ్రాతనే" (యు.౧౧౪) యనియుండుటచేత రాముఁడును నతనిని వెంటనే గ్రహించినట్లు తోఁచుచున్నది. నాటి మొదలు మూఁడు దినములు సముద్రప్రార్థనకై రాముఁడు దర్భశయ్య బరుండి యుండెను. నాల్గవదినము మొదలెనిమిదవ దినము వఱకు నైదు దినములు సేతుబంధము. సేతువు కట్టిననాఁడే సాయంకాలము రామాదులు సువేలపర్వత మెక్కియుండిరి. నాఁటి రాత్రియే సుగ్రీవ రావణుల ద్వంద్వయుద్ధము. ఆ మఱుసటి దినము తుముల యుద్ధము. నాఁటి రాత్రియే రామలక్ష్మణులకు నాగపాశబంధ విమోచనములు, ధూమ్రాక్షవజ్రదంష్ట్రాకంపనుల వధము కూడ నా రాత్రియే. మరునటి దినము ప్రహస్తవధ, రావణ మకుట భంగములు. నాఁడే రావణుఁడు కుంభకర్ణుని లేపుమనుట, కాఁగా నీ దినమునకుఁ బదవ దినమున విభీషణుఁడు బైలుదేరి పోయెను. కుంభకర్ణుని నిద్రారంభము తొమ్మిదవ దినము. ఈ రీతిగా దినసంఖ్య తెలియఁగునది యని కొంద అభిప్రాయపడిరి. అదంత బాగుగా నుండలేదు. రామాదులు సువేలారోహణము చేసిననాఁటి రాత్రి పూర్ణచంద్రోదయము వర్ణించుటచేత నాఁడు పున్నమయని తోఁచెడిని. రావణవధ మమావాస్య యనుట సర్వసమ్మతమే

కదా! కావున వీరి యభిప్రాయానుసారము విదియనాఁడు రావణుని మకుటభంగమై యుండవలెను. అట్లైనచో నీ బహుళ ద్వితీయ మొదలు అమావాస్య దాఁక నింత యాలస్యములో యుద్ధము జరుగుచుండుటకు హేతువు కానరాదు. కావున వీరు చెప్పిన దిన సంఖ్యను సేతుబంధమువఱకు నొప్పుకొని శేషించినది వారి వారి వధము కడన చెప్పిన దినసంఖ్యగానే చెప్పుట యుక్తము. అదెట్లనఁగా ఈ పద్యములో నింతకుఁ దొమ్మిదవ నాఁ డనుటకు యుద్ధారంభమునకుఁ దొమ్మిదవ నాఁ డని యర్థము. యుద్ధారంభము బహుళ ప్రతిపత్తు. తత్పూర్వము తొమ్మిదవ దినము శుద్ధ సప్తమి. ఈ సప్తమినాఁడే కుంభకర్ణ నిద్రారంభము. రాముని దర్భశయనారంభము కూడ నాఁడే. శుద్ధ షష్టినాఁడు విభీషణుని రాముఁడు స్వీకరించుట. శుద్ధ నవమి దాఁక దర్భశయ్య. దశమ్యాది చతుర్దశ్యంత మైదు దినములు సేతు బంధనము. పున్నమ సువేలారోహణము. బహుళ పాడ్యమి యుద్ధారంభ నాగపాశబంధ మోక్షములు. ద్వితీయనాఁడు ధూమ్రాక్షవధ. తృతీయ వజ్రదంష్ట్రవధము. చతుర్థి నకంపన వధము. పంచమిఁ బ్రహస్త వధ. షష్ఠి రావణ మకుటభంగము. ఆపై కుంభకర్ణ వధాదులు. అమావాస్య రావణవధ. ఇట్లు దిన సంఖ్య చేయుటయే యుక్తము. ఈ ప్రకార మింకను నీ యుద్ధ దిన వర్ణనము ఈ కాండములోని ౨౧౬-౨వ పద్య వ్యాఖ్యానమున స్పష్టమగును. మఱి కొందఱు ముందు చెప్పిన దోషము లను బరిహరించుచు మొదట వారి మతమునే కొంత చక్కఁబఱచి చెప్పు చున్నారు. అదెట్లనగా, సీతాహరణమునకుఁ బూర్వము పదమూఁడేండ్లు గడ చిన వనుట సర్వవిదితముకదా. పదునాల్గవ సంవత్సరారంభము సీతాపహరణ మనుట పంపాతీర వసంతర్తు వర్ణనచేత సుస్పష్టము. వాలి వధానంతరము వర్షాకాల వర్ణనమగుటచే వాలి వధ మాషాఢమాసమని తెలియవచ్చుచున్నది. ఆశ్వయుజ మున సీతను వెదకుటకై ప్రోత్సాహపఱచుటయు స్పష్టమే. ఆపై స్వయంప్రభా గుహలో బహుకాలము గడచిపోయినదిగదా. "కపితండము పూచిన తీఁగెలంగడుం బొలిచిన మాధవావనిజములఁగని డాఁడె వసంత వేళయుం. చళుకు వహించి నేలఁబడె" (కి౧ ౨-౪౯)నని చెప్పియుండుటంబట్టి యాగుహలోనుండి వెలువడుట ఫాల్గునమాసము నని తెలియుచున్నది. లంకా ప్రవేశము నాఁటిరాత్రి "చంద్రుఁడు న్వెలసెనుపూర్ణ శృంగుఁడయి (సుం.౧౮౯) యని చెప్పియుండుటచేతఁ త్రయోదశికిఁ బూర్వము చంద్రుడుపూర్ణశృంగుఁడై కన్పట్టఁడు కావునలంకాప్రవేశము ఫాల్గుణశుద్ధత్రయో దశిగా నుండవలెను. హనుమంతుఁడే రాత్రిలంకలో సీతను వెదకెనో యామఱునాఁడే లంకాదాహముచేసెననుట. "రాత్రివేళను దుర్గకర్మంబు తెలియఁగు. సాధ్యపడదయ్యె నెల్లనుజక్కఁజూడఁ, బగట నంతయుఁజూచు టవశ్యకార్యము" (సు.౧౧౮౯) అని చెప్పుటంబట్టి స్పష్టమగుచున్నది. ఈపూట నిలిచి మఱునాఁగున రేపటఁ బోరాదె" యని సీత ప్రశ్నించినను "అని యిట్టు లూరార్చి యవనిజఁగనుఁగొని, భయనింప

నాయ త్తపడుచు "ననియుండుట చేతహనుమంతుఁడులంకాదహనమునాఁడేయందుండి తిరిగి వచ్చెనని తోఁచుచున్నది. హనుమంతుఁడు తిరిగి వచ్చుటకై యరిష్ట పర్వతము నెక్కినపుడు కవి యప్పటి యాపర్వతమును "మార్తాండ కరబోధ్యమానోన్నమ ద్ధాతు నేత్ర సంజాతమై నెగడు దాని"నని వర్ణించెడి నెపమున సూర్యోదయమును చెప్పియుండుట చేతను, అనంతరము సూర్యాస్తమయము చెప్పమిని లంకాదాహము నాఁడే హనుమ సముద్రముదాఁటి మధ్యాహ్నమునకుఁ బూర్వమే యంగదాదులతో మధువన విధ్వంసక పూర్వకముగా రామ సన్నిధానముఁ బ్రాపించెననుట తెలియనగును. నాఁడే మధ్యాహ్న కాలమున వానరసేన దండయాత్ర యనుట. "అగునిది మంచి మూర్తము ప్రయాణము సేయఁగఁ బద్మమిత్రుఁడున్, గగనము మధ్యముం దతిసెఁగ్రాలు నిదేవిజయావహంబునై, నెగడిననన్మహార్తము" (యు. ౪౭) అని యాప్రకరణమునందలి పద్యముచే స్పష్టమగుచున్నది. నాఁడు చతుర్దశియుఁ గొన్ని గడియలున్నది; పూర్ణిమాతిథి యని "ఉగ్రకిరణ తనయ యుత్తర ఫల్గుని నేఁడను (యు. ౯౦) పద్యముచేఁ దెలియుచున్నది. వానర బలంబు నూఱులు వేలును నూఱువేలును గోట్ల, కొలఁదిగా ధారణిఁ గలయఁ బర్వి రేయుఁ బగలును నడిచె" (యు. ౭౯) ననియు "నిలువక పోయి పోయి" (యు. ౮౦) యనియుఁ జెప్పుటఁబట్టి, యే దినమున నభిజిల్లగ్నమునందు వానరసేన దండయాత్ర చేసెనో యా మఱునాఁడే సముద్రతీరము చేరెనని తెలియుచున్నది. మఱియు నేదినము లంకాదాహము జరిగెనో నాఁడే రావణుఁడు దానినిగూర్చి రాక్షస సభలోఁ గొంచెము సేపాలోచించి పిదప వెడలిపోయెనని "తావారినెల్ల వీడి నిజావాసముఁ జొచ్చెఁ బరిజనావళి తోడన్" (యు.౧౪౩) అను పద్యముచేఁ దెల్పి లంకాదాహదిన వృత్తాంత మంతటితో ముగించి 'విభీషణుండు చొచ్చె మఱునాటి వేకువ శుద్ధమతిని' (యు. ౧౪౬) నని యామఱునాఁటి వేకువ విభీషణుని ద్వితీయోపదేశమును దెల్పి యాపై రావణుఁడు కుంభకర్ణాదులతో నాలోచన సభకు వచ్చినపుడు విభీషణుఁడు మూఁడవతూరి హితోపదేశము చేసె నని చెప్పి "అని పరుషం బగు వాక్యము నని ఖలు రావణుని రావణానుజుఁ డా వెంటనె వచ్చె సలక్ష్మణుఁడౌ, జనకసుతానాథుఁ డున్న స్థలమున కంతన్" (యు. ౩౧౪) అని లంకాదాహదినమునకు మఱునాఁడే విభీషణుఁడు రాముని సన్నిధానమునకు వచ్చెనని చెప్పుట చేతఁ గూడ లంకాదాహ దినమున నే రాముఁడు యుద్ధమునకై బైలుదేరి యా మఱునాఁడే సముద్రతీరము చేరెననుట స్పష్టపడుచున్నది. "ఉగ్రకిరణతనయ యుత్తరఫల్గుని నేఁడ"ని ప్రయాణదినము పూర్ణిమాతిథి యనియు, నామఱునాఁడు సముద్రతీరము చేరినపుడు "క్షణదాది ఘోరంబు కలిత ఫేనకదంబ హసితంబు భృంగనృత్యాంచితంబు, జైవాతృకోదయ సంజృంభితంబును బ్రతికపలయహిత వ్యాకులితమ" నివర్ణించుటచే నాఁడును గొన్ని గడియలు పున్నమ

యున్నదనియుందోఁచు చున్నది. వానరసేన సముద్రతీరము చేరుటయు విభీషణుఁడు రామ సన్నిధానముఁ జేరుటయు నొక్క దినముననే జరిగిన దయ్యు నొకటి చెప్పిన పిదపనే మఱొకటి చెప్పవలెను గావఁ గవి క్రమముగా నా సంగతులను జెప్పెనే గాని వేఱు విధముగాఁ దలఁపరాదు.

రాముని దర్భశయనము ఫాల్గున బహుళ ప్రతిపత్తునాఁ డారంభింపఁబడెను. నాఁడే కుంభకర్ణుని నిద్రారంభమును, తదియ దాఁక దర్భశయనమే. చవితి మొదలు అష్టమివఱకు నైదు దినములు సేతుబంధము. అష్టమిరాత్రి సువేలారోహణము "సంధించెను బూర్ణ శీతకరదీప్త విభావరియున్ మనోజ్ఞమై" (యు.౭౮౭)యని సువేలారోహణము నాటిరాత్రి పూర్ణచంద్రుఁ డున్నట్లు చెప్పఁబడియున్నదే ? అష్టమి నాఁడు పూర్ణచంద్రుఁ డెక్కడిది యని యాక్షేపింపవలదు. పూర్ణ శీతకరునిచేత వలనే దీప్తయని యర్థము చేసికొన్నచో నాఁటిరాత్రి పూర్ణచంద్రుఁ డుండ నక్కఱ లేదుగదా. వానరసేనలో శేర్యాదు లున్నట్టు గొప్పగొప్ప దీపములుకలవు కాన నాఁటిరాత్రియు వెలుతురుచేఁ బూర్ణచంద్రుని చేతవలెఁ బ్రకాశించు చుండినది యని భావముగాన నేవిరోధము లేదు. సువేలారోహణము చేసిన మఱునాఁడే అనఁగా నవమినాఁడు పగలు లంక ముట్టడి జరిగెను. "రాముఁడు............ ................ఋక్షాద్యులు గొల్వ గిరిని రేయి వసించె" (యు ౭౮౯) యని ప్రారంభించి "వేవిన యంత నవ్వీరులు లంకలో" (యు. ౭౮౮) నిత్యాది లంక ముట్టడి ప్రారంభింపఁబడి యున్నదిగదా. ఆపగలే తుముల యుద్ధము. నాఁటిరాత్రియే రామలక్ష్మణుల నాగపాశ బంధమోక్షాదులు. అదెట్లనఁగా, "రాక్షసులు, మేనుల రక్తముల్ గురియ మేకొనఁజాలక చివ్వకెప్పుడో కోఁ నిశ వచ్చునంచు దమయుల్లములం దలపోయుచుండఁగా, భానుఁడు గ్రుంకెఁ గ్రోఁతులకుఁ బ్రాణవినాశిని రాత్రి ధ్వాంత సంతానము పర్వఁజేయుచును దారసిలెం గనుఁగానకుండఁగన్" అనియారంభించి "ఆ పెంజీకఁటి యుద్ధ వ్యాపారము జరుగఁగ" ననియు "వినంబడెన్ రవము లారాత్రిన్ సమిద్ధారిణిన్" అనియు, "పోలిచెఁగాళరాత్రి పోలిక నారాత్రి యట్టి సమయమునను నసురవరులు, పింజుగట్టి నిశితకాండముల్ గురియుచు, రాముఁదాఁకి రుగ్రరభసమునను" అనియు, "ఘోరంబగు నాయామిని. ఘోరతరంబయ్యె వపుడు గుండెలు పగులన్" అనియు "వీఁడు రేకయ్యుమునం దసాధ్యుఁ" డనియు నారాత్రినే యా యుద్ధ ప్రకరణమున నచ్చటచ్చటఁ దెల్పుచు వచ్చి "రోషణ భీషణంబు లిటు క్రూరనిశాటుఁడు వారిఁబల్కి జ్యాభీషణఘోషణం బరుల పెల్కఱఁ జేయుచు శాత్రవస్మయ ప్రేషణ శోషణాహిశరబృందముఁ బైకయిఁ గ్రమ్మి దుష్టవిద్వేషణ భూషణాత్ములను వే శరబద్ధులఁ జేసె నీసునన్" ఇత్యాదిగా వారి శరబంధము చెప్పఁబడి యున్నదిగదా. కాఁబట్టి నాఁటిరాత్రియే నాగపాశ బంధమోక్షములు, రామలక్ష్మణులకు నాగపాశ బంధమోక్షమైన వెంటనే యా

నిశీథమున వానరు లుత్సాహంగు చుండఁగా దానిని విని రావణుఁడోర్వలేక మహాకోప ముతో ధూమ్రాక్షవజ్రదంష్ట్రులను బంపెను. వీరు యుద్ధమునకు వచ్చునపుడుపగలని సూచించెడి గుర్తులేవియు లేవు కావునను, వానర సంతోషము వెంటనే వీరువచ్చిరని చెప్పుటచేతను వీరి యుద్ధ మా రాత్రియే జరిగినది. ఆ రాత్రి శేషముననే వీరి వధము జరుగఁగా రెండవ దినమున ననఁగా దశమినాఁ డకంపనుని యుద్ధ వధములు జరిగెను. అకంపనుఁడు యుద్ధమునకు బయలుదేరునపుడు "దుర్దినముగాఁ దోఁచె సుదినమయ్యు" (యు. ౧౧౪౭) నని పగటి గుర్తు లుండుటచే నకంపన యుద్ధము పగలే యనుట స్పష్టము. నాటి పూర్వాహ్ణముననే రావణుఁడు నగరమంతయుఁజుట్టి సేనను బరీక్షించుట, అకంపన యుద్ధమైన వెంటనే నాఁటి మధ్యాహ్నమే ప్రహస్త యుద్ధము జరిగినది. ప్రహస్తుఁడు యుద్ధమునకు బోవునపుడు "గ్రహోల్కలెల్ల నంబర మునఁ బొరఁగా దొడఁగె"నని చెప్పఁబడి యున్నది. గ్రహోల్కలు రాత్రియందే కనఁబడునవి గాన దీనిం జూడ ప్రహస్త యుద్ధము రాత్రి యనియే తోఁచును గదా యని యాక్షేపింపవలదు. పగటిపూటఁ జూడ వీలుపడని యనేక సంగతులు పగలే జరిగినట్లు ఈయుద్ధ ప్రకరణములం దచ్చటచ్చటఁ జెప్పుట కలదు. "శశికి బ్రియంబు ప్రాజాపత్యమగు రోహిణిని నాక్రమించి నిందునిసుతుఁడు" అని రావణ యుద్ధ ప్రకరణమునఁ జెప్పబడి యున్నది. "సర్వరాత్రంబు కలను నలుప"నని రావణ యుద్ధ ప్రకరణమున నుండుటచే నా యుద్ధము రాత్రికదాయని యెంచవలదు. సర్వరాత్రం బను పాఠము తప్పనియు సప్తరాత్రమనియే సరియైన పాఠమనియు నచ్చట వివరిం చెదము. కావన రావణ యుద్ధము పగలే జరిగినది. ఈ రీతిగా ప్రహస్త యుద్ధమునఁ జెప్పిన గ్రహోల్కల సంగతి మనకుఁ గనఁబడక పగలే యాకాశమున జరిగి యుండ వచ్చునుగదా! కావననది పగటిపూటయనుటకు బాధకము కాదు. ప్రహస్తవధమైననాఁడే ఆ వెంటనే రావణ పరాజయము, కుంభకర్ణ ప్రబోధ యుద్ధములును జరిగినవి. వీని వెంటనే యానాఁడే యింద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రామాదుల బంధించుటయుఁ దద్విమోచనమును జరిగినవి. ఇందు రావణ పరాజయాది కుంభకర్ణవధాంతముకాల మిదియని నిర్ధారణగాఁ జెప్పలేదు గాని బ్రహ్మాస్త్రబంధము మాత్రము" అఱువది యేడు కోటుల వనాటులు భీమతరస్వు లిట్టులు, కృతి దినపంచమాంశమున నబ్జజు ప్రీతికిఁ బాత్రుఁడైన యా, కఱకు సురారిచేఁ దెగిరి" యని చెప్పఁబడి యున్నందున సాయంకాలము జరిగినదని తెలియుచున్నది. దినపంచమాంశమనఁగాఁ బగటి యైదవ భాగమగు సాయంకాలము. ప్రాతః, సంగవ, మధ్యాహ్న, అపరాహ్ణ, సాయంకాలము లని పగ లైదుభాగములుగ భాగింపఁబడి యున్నది. "ప్రాతస్సంగవ మధ్యాహ్నాపరాహ్ణాస్సాయ మిత్యమీ! ఏకస్యాహ్నః పంచభాగా విహితాః కాల చింతకైః" యని ప్రమాణవాక్యము. కాఁబట్టి ప్రహస్తవధము మధ్యాహ్నముకాఁగా నాపై రావణ పరాజయాది కుంభకర్ణ వధాంతము జరిగి నాటి సాయంకాలమున

బ్రహ్మాస్త్ర బంధమోక్షము లైనట్లు తోఁచుచున్నది. ఆ రెండవనాటి రాత్రియే బ్రహ్మాస్త్రమోచనమైనవెంటనే మరల వానరులు లంకను ముట్టడివేసి లోనఁజొచ్చి లంకను దహించిరి. "క్రాదంబైన నిశాముఖంబున దుహారంబుల్ ప్లవంగేంద్రులా! క్రద్మాసంభవు లట్టులూర్చుచును నల్కాహాసులై లంక నత్యుగ్రాటోపము తోడఁ జొచ్చి" (౧౬౯౦ యు.) యని యీప్రకరణము నందలి పద్యము. ఆపైనా రాత్రియే కుంభనికుంభ యూపాక్ష శోణితాక్ష ప్రజంఘాకంపన మకరాక్షులు యుద్ధమునకై వచ్చి మడిసిరి. కాఁగా యుద్ధ మారంభించిన రెండు దినములలో మూలబలము, ఇంద్రజిత్తు రావణుఁడు వీరు తప్ప తక్కిన వీరులందఱు హతులైరి.

మూఁడవ దినము. అనఁగా ఫాల్గుణ బహుళైకాదశి మొదలు ఇంద్రజి ద్యుద్ధము జరిగినది. "మూఁడహోరాత్రముల్ వేఁడిమిమై పోరి చచ్చెఁగా నెట్లెట్లొ శక్రజిత్తుఁ"డను పద్యమును బట్టి యింద్రజిద్యుద్ధము ఏకాదశి ద్వాదశి త్రయోదశి యను మూఁడు దినములు జరిగినదని తెలియుచున్నది. కాఁగా నింద్రజిద్వధము వఱకు నైదుదినములు గడచినవి. ఆఱవ దినమున అనఁగాఁ జతుర్దశినాఁడు మూల బల వధము. నాఁటి సాయంకాలము మొదలు రేయింబవలు రావణ యుద్ధము జరిగి యేడవ దినమున రావణ వధ మాయెనఁనియైనను జెప్పవచ్చును. లేదా, ఏడవదినము మొదలు రేయుం బవలు రావణ యుద్ధము జరిగి యెనిమిదవనాఁటి యుదయమున పుచ్ఛామావాస్యగడియలలో రావణవధమాయెననియైనను జెప్పవచ్చును. ఈరెండు పక్షములందును నమావాస్య గడియలలోనే రావణవధమని యేర్పడుచున్నది. కాన రావణవధము అమావాస్యనాఁ డన్న లోకప్రవాదము కూడ నీరెండు పక్ష ములకును సరిగా నున్నది. "కృష్ణచతుర్దశి నిపుడు లేచి యుభ్యమిత్రుండ వగుచుఁ బ్రయాణ మన్న। హాన మొనర్చి యమావాస్య యగుట లేవ। బలఁగములతోడ నని కేగి గెలువుఁ గొనుము" (యు. ౨౧౬౦) అను పద్యమును గూడ నీ రెండు పక్షముల కును సరిపడుచుకొనవచ్చును. రావణ సైన్యము రావణుఁడును వీరియుద్ధమేడు రాత్రులు జరిగినట్లే క్రింది విధముగా నేర్పడుటచే "నిలుపక యొన స్తరాత్రంబు కలను సలుప" నను పాఠము కూడ సరిపడుచున్నది. ఈప్రకారముగా దినసంఖ్య నేర్పఱుచు కొన్నయెడల "మంతనం బుండి యింతకుఁ దొమ్మిదవనాఁడ తవిలె నిద్ర" యను నీ పద్యభాగమును సరసముగా సమన్వయించుచున్నది. అదెట్లనఁగా, ఇంతకున్ = ఈదినమునకు, నాకిరీట భంగమైన దినమునకు పూర్వము, తొమ్మిదవనాఁడు+అ. ఈ దినము కాక దీనికి ముందు దినము మొదలుకొని ముందటి తొమ్మిదవ దినమునందే, మంతనంబుండి నిద్రతవిలెన్, పూర్ణిమాశేషము గల ఫాల్గున బహుళ ప్రతిప త్తిథియందు రామాదులు సముద్రతీరము చేరుటయు విభీషణ స్వీకారమును కుంభకర్ణ నిద్రారంభమును, దానికిఁ బదవదినమగు దశమినాఁడు రావణ మకుట భంగము కాఁగాఁ గుంభకర్ణుని నిద్రారంభదినము రావణమకుట

భంగదినమునకు ముందు దినమునుండి తొమ్మిదవదిన మనిభావము. "వినవె జానకి యింక రెండు నెలలే విశ్వాస పూర్వంబుగాఁగను నే వేచెద నంతయే గడువు" (సుం. ౫౭౮) అని రావణుఁడు సీతతోఁ జెప్పిన మాటను జూచినను "ఇఁక మాస యుగంబు చిక్కెఁదత్తావధియందుఁ జెల్లెడిఁ జుమా దశమంబగు మాస మియ్యెడన్" (సుం.౭౭౯) అని హనుమంతుని గూర్చి సీత చెప్పిన మాటను జూచినను సీత లంకలో నున్న సంవత్సర కాలములో పదవమాసమే హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించి నప్పుడు చున్నది. అది మాఘమాసమే గదా కావలెను. ఈ క్రిందఁ జెప్పిన దిన సంఖ్యయంతయు ఫాల్గున మాసములోని వని చెప్పియున్నాఁడే. ఈ రెండును బరస్ప రమును విరోధింపవాయని కొందఱాక్షేపింతురు. అదిసరిగాదు. "నాకెకుఁజెప్పవయ్య కపిసత్తమ నేఁడిఁక నొక్కమాసమే, తరువనై నఁ బ్రాణములు దేహమునం ధరియించుదాన నాపై రఘుచంద్రమా నిజము ప్రాణమునిల్వదు" (సుం.౯౭౬) అని సీత హనుమంతునితోఁ జెప్పినమాటనుబట్టి చూడఁగా నాజరుగుచున్న యొకమాసమే లంకలో నున్నప్పుడు చున్నది. ఇదియే నిజము. ముందటి సీతావాక్యమును; రావణవాక్యమును రావణాభిప్రాయము ననుసరించినవి. సీత యూరట చెందుటకై రావణుఁ డింకను రెండుమాసము లున్నట్లు సీతతోఁ జెప్పెను. ఈ రావణాభిప్రాయము ననుసరించియే సీత, రెండుమాసములు మిగిలి యున్నట్లు మొదట హనుమంతునితోఁ జెప్పినది. కాని ఆమెకు వాస్తవము తెలియును గాన నీ జరుగుచున్న మాసము అరణ్యవాసపు పదునాల్గు సంవత్సరములకుఁగడపటిమాసమని యెంచి యీజరుగుచున్న మాసము తప్ప నాపై బ్రదుకలేనని స్వాభిప్రాయముగా హనుమతోఁజెప్పినది. కాన నది కడపటిదగు ఫాల్గునమాస మనుటయే యుక్తము అని మూఁడవ పక్షమువారి సిద్ధాంతము.

కేలొక్కల్ప సుకరంబు-మేలొక్కల్పుట సులభముగాఁ జేయఁదగినది. అతఁడిత్యాది - కుంభకర్ణుఁడు నావలె శాపగ్రస్తుఁడు కాఁడుగదా యని భావము - కీశరాజిన్ = వానర సైన్యమును.

చ. అసురులనెల్ల మేటి పర॰మార్థము భీకరసంగరస్థలిన్
గసిమసి చేయు శాత్రవుల॰కాండములం బనివూన నట్టిఁ డా
నసమబలుండు గ్రామ్యసుఖ॰మందలి ప్రీతిని మూఢుఁడై మహా
లసగతి నుండు నెప్పుడుఁ,దొ॰లంపఁగ లేఁడు మదీయదుఃఖమున్. ౧౯౨

అర్థములు. అసురులనెల్ల మేటి=రాక్షసులందెల్ల శ్రేష్ఠుఁడు, సప్తమ్యర్థమున ద్వితీయ, భీకర=భయంకరమైన,సంగరస్థలిన్=యుద్ధప్రదేశమందు, పరమార్థము=ఉత్తమ ప్రయోజనముగల వస్తువు, "ఆహవభూమిలోనఁ బరమార్థము పార్థుఁ"డని భారతము, ఉద్యో.(౨)ఇదివాస్తవము.ఇది యనఁగా అసురులందు మేటియగునది. .........గసిమసి చేయున్=చంపును. గసి యనఁగా నూనెలో నాముదములో

నడుగువ నిల్చెడి వ్యర్థపదార్థము — ముటీకి — మసిఃబూడిద, పనిపూనన్ = అది తవ పనిగాఁ బూనెనేని ..... మూఢుఁడై = దేహమే తెలియనివాఁడై, గ్రామ్య సుఖమందలి ప్రీతిని = పల్లెటూళ్ళవారికి సోమరితనములోఁ గాలము గడుపుట, నిద్రపోవుటయందుఁ బ్రీతి యెక్కువ, ఇచ్చట గ్రామ్యసుఖ మనఁగా నిద్ర, మహాలసగతిన్ = పెద్ద సోమరివలె.

తాత్పర్యము

నా తమ్ముఁడు కుంభకర్ణుఁడు రాక్షసులందు శ్రేష్ఠుఁడు. ఇది యథార్థము. భయంకర యుద్ధములందు పూనెనేని శత్రువుల సమూహములను నాశము చేయును. అటువంటి యసమాన బలశాలి నిద్రాసక్తుఁడై దేహము తెలియక పెద్ద సోమరి వలె నెప్పుడు నుండును, గాని నా దుఃఖము తెలిసికొనలేఁడు. ఇఁక నాలోచించుట యెక్కడిది ?

కం. ఆతండు లేచినేనియు, సీతాధవువలన నాకు • సిద్ధించిన యీ
యాతతపరిభవమంతయు, వే తీర్చున్ సంతసముఁ • నెలయుదుఁ బిదపన్. ౧౨౮౩

అర్థములు. ఆతతపరిభవము=గొప్ప యవమానము.

తాత్పర్యము స్పష్టము,

తే. శక్రతుల్యబలుఁ డతి • సాహసాంకుఁ; డట్టివా డనిలోన నా • కిట్టిపాటు
సంభవించియుఁ దోడ్పడఁ • జాలఁడేని, యింక వాఁడుండియును నాక • నేమిఫలము.

• అర్థములు. నిద్రపోవువాని లేపరాదు గదా యందువేని, శక్రతుల్య బలుండు = ఇంద్రునితో సమానుఁడగు బలశాలి, అతిసాహసాంకుఁడు = మిగులఁ దెంపే యాభరణముగాఁ గలవాఁడు.

తాత్పర్యము

నిద్రలేపరాదను నీతి ననుసరించితిమేని యిఁక వాఁడాఱు నెలలకుఁ గాని నిద్రలేవఁడు. అంతవఱకు యుద్ధ మటులే జరుగుచుండునా? ఇంద్రునివంటి బలశాలి మహాసాహసి, అటువంటివాఁడు నాకు యుద్ధమం దిటువంటి కష్టమువచ్చిన విమ్మటఁ గూడఁదోడుపడ రాఁడేని వాఁడుండి నాకేమి లాభము? ఉండియు లేనివాఁడే కదా.

సీ. వాని లేపుఁడటన్నఁ • బరమసంభ్రాంతులై, యసురలు గంధమా • ల్యములుభక్ష్య
వర్గముల్ గొనిమహా • ద్వారమై యెటుచూడ, యోజనాయతమయి • యుండుకుంభ
కర్ణునిగుహ సర్వ • గంధప్రవాహినిఁ, జొచ్చుచో నాతని • హెచ్చుటూర్పు
గాలిచే నబ్బుల • శాఖలు గాలికి, వగుడాకులట్టులై • యెగిరిపోవ

తే. వెండియును వారలెంతెంతొ • కండికష్టమునను నిల్ద్రొక్కికొని పాద • ములనులోనఁ
జొచ్చి కాంచనకుట్టిమ • సుందరంపు, గుహను నిద్రించువానిని • గుంభకర్ణు. ౧౨౮౫

అర్థములు. పరమ సంభ్రాంతులై = మిగుల వేగిరపాటు గలవారై. మహాద్వారమై=పెద్ద వాకిలి కలిగి, యోజనాయతమయి=యోజనముపొడవుగలిగి,

సర్వగంధప్రవాహిని = సమస్త పరిమళ ద్రవ్యములు విశేషముగఁ గలదానిని, వగుడాకులు=మిక్కిలి యెండిన యాకులు, సంప్రదొక్కికొని = నిలుచునట్లు కాళ్ళు గట్టిగ నొత్తిపెట్టుచు, కాంచనకుట్టిమ=బంగారు నేలకట్టులచే (౨) బంగారు నీరు పూఁతపూసిననేలచే,సుందరపుగుహాయందు=అందమైగుహావలెనుండుదానియందు,

తాత్పర్యము

వాని నిద్దురలేపుఁడని చెప్పఁగా మిగుల వేగిరపాటు గలవారై రాక్షసులు వాఁడు నిద్దురలేచి పూసికొనుటకుఁగాను గంధము, ధరించుటకు పూలదండలు తినుటకు భక్ష్యములు అన్నము తీసికొని పెద్ద వాకిలిగలదై యేప్రక్క చూచిన నొక యోజనము నిడివి గలిగి సమస్త పరిమళవస్తువులు విస్తారముగఁ గల కుంభకర్ణుఁడు నిద్రించు గుహాలోనికిఁ బోవుచవుడు వాని యూర్పు గాలి విస్తారముగ వచ్చుటచే నా రాక్షసులు బలవంతులయ్యు నోరుగాలికి వగుడాకులవలె నెగిరిపోవసాగి మరల నెంతో కష్టముపై నిబ్బరించుకొని కాళ్ళు నేల నూఁదిపెట్టుచు ప్రవేశించి బంగారు నేలకట్టుచే నందమైన గుహాయందు నిద్రించు కుంభకర్ణుని.

సీ. భీమదర్శను నేల•విఁజెగి యొఱుఁగుగిరి, భంగిని బాన్పుపైఁ•బడినవాని
విసదారి యనఁ జెడఁ•బుసలుకొట్టుచున్నవాని, వికటంపు నిల్ల వెండ్రుకలవాని
భయదనాసాపుటు•పాతాళవిపులాస్యుఁ, గాంచనాంగదబద్ధ•కాయు బలియు
మకుటమండితమూర్ధు•మహితమేదోరక్త, గంధు నరిందముఁ•గాంచి డాసి
తే. మేరుపర్వతసన్నిభా•మిషచయంబు,మహిషమృగసూకరములసం•హతులువమ్ము లంపుటన్నంపుఁబ్రోవు•మద్యములు పెక్కు,రకములును నెత్తుకుండలు•ప్రక్కనుంచి.

అర్థములు. భీమదర్శను=చూచుటకు భయంకరుఁడగువానిని, విసదారి=పాము, భయదనాసాపుట = భయంకరములైన ముక్కు రంధ్రములు గలవానిని, పాతాళ విపులాస్యున్ = పాతాళమువలె వెడల్పగు ముఖము గలవానిని, కాంచనాంగదబద్ధకాయున్=బంగారు భుజకీర్తులచేఁ గట్టఁబడిన దేహము గలవానిని, బలియున్ = బలవంతుని, మకుట = కిరీటముచే, మండిత = అలంకరింపఁబడిన, మూర్ధన్=శిరస్సుగలవానిని, మహితమేదోరక్తగంధున్=విశేషముగ మాంసము రక్తము వాసనగలవానిని, అరిందము = శత్రువుల నణఁచువానిని, మేరుపర్వత సన్నిభ = మేరుపర్వతముతో సమానమైన. ఆమిషచయంబు = మాంససమూహము, మహిష=దున్నపోతులయు, మృగ=పశువులయు, సూకర = పందులయు, సంహతులు=సమూహములు, మద్యములు=సారాయములు.

తాత్పర్యము

నిద్దురపోవుచున్నవ్వాడును జూచుటకు భయంకరుఁడైనవానిని, కొండ విఱిగి నేలపై నొఱిగి పడినట్లు పానుపుమీఁద బండుకొనినవానిని, పామువలెఁ జెడ్డ బుసలు కొట్టుచున్నవానిని, భయంకరముగా నిలబడి యుండు వెండ్రుకల వానిని,

భయంకరములైన ముక్కుబొక్కలు గలవానిని, పాతాళమువలె వెడలుపైన ముఖము గలవానిని, బంగారు భుజకీర్తులు కట్టఁబడిన దేహము గలవానిని, బలవంతుని, కిరీటముచే నలంకరింపఁ బడిన తలగలవానిని, విశేషముగ మాంసము రక్తము యొక్క వాసనగల వానిని, శత్రువుల నణచు వానిని, చూచి సమీపించి, వాఁడు నిద్రలేవఁగానే తినుటకు మేరుపర్వతముతో సమానమైన మాంసరాశిని, దున్నపోతులు, మృగములు, పందులు వీని మాంసముల సమూహమును, ఆశ్చర్యకరమైన యన్నపురాశిని అనేక విధములైన సారాయములు నెత్తురు కడవలు ప్రక్కనుంచి

— ♦ రాక్షసులు కుంభకర్ణుని నిద్రలేపుట ♦ —

కం. అలఁదిరి యుత్తమగంధము, లలిమాల్యంబులును బరిమ♦ళపువస్తువులున్
నిలిపిరి మేవన్ ధూపం, బులవైచిరి స్తోత్రములను ♦ బొగడిరి యసురుల్. ౧౩౮

తాత్పర్యము

ఇట్లు నిద్దుర లేవగానే తినుటకుఁ ద్రాగుటకు కావలసినవి సిద్ధముగా నుంచి నిద్దుర లేపఁ బ్రారంభించిరి. రాక్షసులు మంచి గంధము పూసిరి. పూలదండలు వాసన ద్రవ్యములు దేహమునఁదుంచిరి. పొగలు వైచిరి. స్తోత్రములఁ బొగడిరి.

స్రగ్ధర. పూరింతుర్ చంద్రతుల్యం ♦ బులు బహుళదరం ♦ బుల్ దిశల్ వ్రీలిపోవన్
ఘోరధ్వానంబు లోలిన్ ♦ గుమికొని యసురుల్ ♦ గొల్చి రవ్వార లేకా
కారంబై కుత్తుకల్ వ్ర♦క్కలుగఁ జన నిరా♦ఘాటబాహావిరావం
బారూఢం బయ్యె క్ష్వేళా♦యతరవములు పెన్♦ప్రోవడిం గూర్చె లంకన్.

అర్థములు. చంద్రతుల్యంబులు = చంద్రునివలెఁ దెల్లనైనవి దరంబుల్ = శంఖములు; గుమికొని = గుంపుగూడి, ఏకాకారంబై = ఒక్కవిధముగ, వ్రక్కలుగఁ జనన్ = పగిలిపోఁగా, నిరాఘాట బాహావిరావంబు = అడ్డములేక వాయించు చేతుల చప్పుళ్ళు ఆరూఢంబయ్యెన్ = అతిశయించెను, క్ష్వేళాయతరవములు = సింహనాదముల విస్తారధ్వనులు, ప్రోవడిన్ = ఆపదను.

తాత్పర్యము

దిక్కులు పగిలిపోవునట్లు చంద్రునివలెఁ దెల్లనైన యనేక శంఖములను బూరించిరి. రాక్షసులు గుంపుగూడి భయంకరముగ అందఱు నొక్క విధముగ గొంతులు పగిలిపోవునట్లు ధ్వనులు చేసిరి. అడ్డము లేక చేతులు చప్పుళ్ళు గొట్టిరి. సింహనాదములు చేసిరి. ఈ ధ్వనులు లంకలో నుండువారికి మిగుల నుపద్రవము గలిగించెను.

స్రగ్ధర - మరభనయయయ = ఏనిమిదింట నెనిమిదింట యతులు.

సీ. పణవభేరీశంఖ ♦ పటునినాదంబులు, క్ష్వేళితాస్ఫోటిత ♦ సింహనాద
ములు బహుళములైన♦మున్గి సాధ్వసమునఁ, బక్షులు దెసలందుఁ♦బఱచిపఱచి

దివికిని నెగఁబ్రాఁకి • దిగ్భ్రమ గొని గఱుల్, తడఁబడ సుడివడి • తత్తఱమున
నేలపైఁ బ్రాలె నా • నిశిచరుల్ వేసరి; విసివి గాసిబడి • యసము దూలి
తే. రంతెగాక నసురేంద్రుఁడొ • క్కింతయైన, మేలుకొనకున్న నెండియు • జాలిమాలి
ముద్గరగదాద్రిభూరుహ • ముసలతతులఁ, జేకొలందిని మోఁదిరి • డాకమెఱయని.

అర్థములు. పణవ = ఉడుకలయు, భేరీ = నగారాలయు, శంఖ = శంఖములయు, పటునినాదంబులు=దృఢమైన చప్పుడులు, క్ష్వేళితాస్ఫోటిత సింహనాదములు=గొప్ప సింహనాదములు, చెవులలో చేసిరి, కొట్టిరి—సాధ్వసమున=భయమున, గఱుల్=రెక్కలు. అసము దూలిరి = గర్వహీనులైరి, జాలిమాలి = జాలి లేక, మోఁదిరి—కొట్టిరి.

తాత్పర్యము

ఉడుకలు, నగారాలు, శంఖములు మ్రోగించిరి. పెడబొబ్బలు పెట్టిరి. తట్టిరి. సింహనాదములు చేసిరి. ఈ ధ్వనులకు పక్షులు భయమున మునఁగి దిక్కుల వెంట బరువెత్తి పరువెత్తి యాకాశమున కెగిరి, దిగ్భ్రమగొని రెక్కలు తడఁబడ, సుడివడి తత్తఱపాటున నేలపైఁబడెను. ఆ రాక్షసులు శ్రమపడి బడలి గర్వము విడిచిరి. అంతియకాని కుంభకర్ణుఁడు కొంచెమైన మేలుకొన్నవాఁడు కాఁడు. ప్రక్క పొరలినవాఁడు కాఁడు. దానికి వారు దయవదలి ముద్గరములతోను, గదలతోను, కొండలతోను, చెట్లతోను, చేతుల కొలఁది వారి బలము కొలఁది కొట్టిరి.

తే.-అధిక బలవంతు లయ్యు న • య్యసురవరులు, రావణానుజనాసికా • రంధ్రజాత
మారుతోద్ధతి నిలువంగ • నేరరైరి, మహితవాతూలహతిఁదూలు • మబ్బులనఁగ.

అర్థములు. రావణానుజ=రావణు తమ్ముని, నాసికారంధ్రజాత = ముక్కు బొక్కలందుఁ బుట్టిన, మారుతోద్ధతిన్=గాలిదెబ్బచేత. మహిత వాతూలహతి= పెద్దసుడిగాలి దెబ్బకు, తూలు=కొట్టుకొనిపోవు.

తాత్పర్యము

ఆ రాక్షసులందఱు మిగుల బలవంతులే యైనను కుంభకర్ణుని ముక్కులలో నుండి వచ్చు గాలిదెబ్బచే పెద్దసుడిగాలి దెబ్బకు మేఘములవలె కొట్టుకొనిపోయిరి.

ఉ. భీమబలాఢ్యు లొక్కపది • వేల నిశాచరు లోలి నందఱున్
స్తోమముఁ జేరి యొక్కపరి • తూర్యమృదంగఘటాళినాదము
ద్దామముగాఁగఁ జేసియును • దానవవీరుఁ డొకింతయేనియున్
దా మెయి తెల్వి గానమిని • దారుణయత్నముఁ జేయ బూనుచున్. ౧౩౪౧

తాత్పర్యము

భయంకర బలసంపత్తిగల పదివేల రాక్షసులు గుంపుగా నొక్కచోటఁ జేరి యొక్కసారిగా వాద్యములు మద్దెలలు కుండలు వీనియొక్క ధ్వని యధికముగఁ జేసియును రాక్షసుఁడు కొంచెమైన తెలివివచ్చినవాఁడు కాకుండుటచే ఘోర ప్రయత్నము చేయఁబూని.

ఉ. దండ కశాంకుశంబులను • దద్దయుఁ గొట్టుచు నుష్ట్రివాజి వే
దండఖరాదిజంతువుల • దానవవీరునిఁ ద్రొక్కఁ జేసియున్
దండిగ వల్లజంతులరొ•దల్ పరఁగింపఁగఁజేసి శూరునన్
మెండుగ శంఖభేరుల వ•మేయముగా ధ్వనిచేసి వెండియున్. ౧౩౫౭

అర్థములు. దండ = కట్టెలతోను, కశ = కొఱడాలతోను, అంకుశంబులను=అంకుశంబులతోను, ఉష్ట్రి= ఒంటెలచేత, వాజి = గుఱ్ఱములచేత, వేదండ= ఏనుఁగులచేత, ఖర = గాడిదలచేత, ఆదిజంతువుల = ఈ మొదలయిన జంతువులచే,

తాత్పర్యము

కట్టెలచేత, కొఱడాల చేత, అంకుశంబులచేతను విశేషముగఁ గొట్టిరి. ఒంటెల చేత, గుఱ్ఱములచేత, నేనుఁగులచేత, కంచరగాడిదలచేత, దున్నలు లోనగు నితర జంతువులుచేతఁ ద్రొక్కించిరి. ఆ జంతువు లన్నియు నలవఁ జేసిరి. తాముగూడ, శంఖధ్వనులు భేరీధ్వనులు విశేషముగాఁ జేసిరి. మఱియును.

కం. సుత్తెల దూలంబుల పెనుఁ,గత్తుల గునపముల గుదెల • ఖండపరశులన్
హత్తినశక్తులకోలఁదిని, మొత్తిరి లేకెదను దయయు•మోమోటంబున్. ౧౩౫౮

అర్థములు. గునపములున్ = గడ్డపాఱల చేతను, ఖండపరశులన్ = గండ్ర గొడ్డండ్ల చేతను.

తాత్పర్యము స్పష్టము.

కం. గింగురు మని వీనులు లం,కం గల యసురులకు శైల • కానవయుత మె
ల్లం గలయఁగఁ దన్నాదము,భంగగతిం బూర్ణమగుచు•వ్యాపింపంగన్. ౧౩౫౯

అర్థములు. గింగురుమని = చెవులలో గీయ్యని ధ్వనిపుట్టునట్లు.

తాత్పర్యము స్పష్టము.

కం. అంతకును లేవ కున్నను, బొంతన వెయిభేరు లొక్కఁ • బూఁపున రక్ష
స్సంతతి పసిండికోడుపుల, నెంతయు మ్రోయింపఁ గదలఁ • డించుక యేనిన్.

అర్థములు. ఒక్కఁపూఁపున = ఒక్కఁ ప్రయత్నముతో, కోడుపులన్ = నగారాలు వాయించు కట్టెలచే.

తాత్పర్యము స్పష్టము.

ఉ. శాపవశంబునం బరవ • శత్వమునం బడియున్న రాక్షసుం
గోపవశాత్ములై మఱియు•కొండుపరాక్రమ ముద్యమించి భే
రీపటలంబు నూతనము • ద్రేవలఁ గొట్టుచుఁ గేశసంఘముల్
మోపుగఁ బీఁకుచుం జెవులు • మోఱకులై క్షతజంబు గాఱఁగన్. ౧౩౫౬

అర్థములు. ఉద్యమించి = ప్రయత్నించి, కేశసంఘముల్ = తలవెండ్రుకల గుంపులను, మోఱకులై, మూర్ఖులై మొరటులై, క్షతజంబు = నెత్తురు.

తాత్పర్యము

బ్రహ్మశాపముచే దేహము తెలియక పడియున్న రాక్షసుని కోపవశుడై మఱియొక పరాక్రమము చూప యత్నించి క్రొత్తగారాల సమూహము వాని చెవుల యొద్దనే కొట్టుచు వెంద్రుకలు గుంపుగఁ బట్టి పీఁకుచు నెత్తురు కాఱునట్లు చెవులను.

కం. కోఱుకుచుఁ గరనఖరంబులఁ, బెఱుకుచు నుదకుంభములను ♦ వీనులలోనన్
నెఱపుచుఁ దలయును ఱొమ్మును, జఱచుచు ముద్గరము లెత్తి ♦ సంబాధింపన్.

అర్థములు. కరనఖరంబులన్ = చేతి గోళ్ళచే - ఉదకుంభములను = నీటి కుండలను

తాత్పర్యము

కోఱుకుచు చేతి గోళ్ళఁ బెఱుకుచు కడవలతో నీళ్లు చెవులలోఁ బోయుచు ముద్గరములతోఁ దలమీఁద ఱొమ్ముమీఁదఁ గొట్టుచు బాధింపఁగా.

చ. కదలక యున్న రజ్జుచయ ♦ గాఢనిబద్ధశతఘ్ని కావలిన్
మదమున నెల్ల రొక్కఁ మొగి ♦ మర్దనముం బచరించుచున్ మఱిన్
మదకరు లొక్కవేయి యొక ♦ మాఱుగఁ బాఱఁగ మీఁదఁ ద్రోలఁగా
నెదో తనుసోఁకినట్లయిన ♦ నించుక కన్నులు విచ్చె నంతలోన్. ౧౩౫౭

అర్థములు. రజ్జుచయ=త్రాళ్ళసమూహముచే, గాఢనిబద్ధ = దృఢముగాఁ గట్టఁబడిన, శతఘ్నికావలిన్=శతఘ్నుల వరుసలచే.

తాత్పర్యము

ఇంతచేసినను గదలక యుండుటచే త్రాళ్ళచే గట్టిగాఁ గట్టఁబడిన శతఘ్నుల గుంపులచే అందఱొక్కసారిగ గొట్టుచు మదించిన వేయి యేనుగు లొక్కసారిగా మీఁదఁ ద్రోలఁగా నేదో దోమ దేహమునకుఁ దగిలినట్లు కాఁగాఁ గొంచెము కన్నులు విచ్చెను.

—♦ కుంభకర్ణుఁడు నిద్రలేచుట ♦—

చ. ధరకుజవార పాతములు ♦ దారుణశస్త్రచయప్రహారముల్
సురరిపుఁ డేమియుం దలఁప ♦ జూడఁడు, నిద్దుర లేచినంతనే
దరికొను నాఁకటన్ వెఱచి ♦ దానవవీరుఁడు మే న్విదుర్చుచున్
సరగున లేచి నాగతను ♦ శైలనిభం బగు బాహుయుగ్మమున్. ౧౩౫౮

అర్థములు. ధరకుజవారపాతముల్ = తన మీఁదఁ గొండలు చెట్లు గుంపుగఁ బడుటను, దారుణ శస్త్రచయప్రహారముల్ = తీక్ష్ణములైన శస్త్రముల దెబ్బలుగాని. దరికొను = మండుచున్న, మేన్ = దేహమును, సరగున = శీఘ్రముగ, నాగతను=పాముల దేహముతోను, శైల = పర్వతముతోను, నిభంబు = సమానము.

తాత్పర్యము

కన్నులు తెఱచినను నిద్దురమత్తు విడువకుండుటచే రాక్షసులు కొండలు చెట్లు మీఁద వేసిరి, తీక్ష్ణ శస్త్రములతోఁ గొట్టిరి గాని యిది యేమో వానికిఁ దెలియ లేదు. ఆ విషయమై యాలోచించిన వాఁడును గాఁడు. ఇట్లు నిద్దుర లేచి మండు చున్న యాఁకలిచే భయపడి కుంభకర్ణుఁడు దేహము విదురించుచు శీఘ్రముగ లేచి పొడవున పాము దేహముతోను కఠినత్వమున పర్వతమును బోలిన చేతులు రెండు.

కం. జాడించి నీల్గి వెండియు, బాడబముఖతుల్యమైన • వక్త్రముఁ దెఱవన్
జూడఁగఁ బాతాళమునకు, నీడగు నది మేరుగతది • నేశ్వరుఁ బోలెన్. ౧౩౬౦

అర్థములు. బాడబముఖతుల్యము = బడబానల ముఖముతో సమాన మైన, వక్త్రము=నోరు, మేరుగతదినేశ్వరున్ = మేరుపర్వతమందున్న సూర్యుని.

తాత్పర్యము

జాడించి రొమ్ములు విఱిచి బడబానలముతో సమానమైన నోరు తెఱవఁగా నది పాతాళము వలెను మేరుపర్వత మందలి సూర్యుని బోలెను, సూర్యుఁడు మేరువును ప్రదక్షిణించునే కాని శిఖరమునకు రాఁడు కావున నిచ్చట మేరుశబ్దము సావర్ణి మేరు పర్వతమని తెలియవలెను, ఇందు కుంభకర్ణుని వక్త్రము మేరుశిఖర గత సూర్యుఁడు.

ఆ. ఆవులించి లేచు • నాతనియాకృతి, కొంగచాలుతోడ • రంగు మీఱు
వానగురియు మబ్బు • వసువున రహి మీఱెఁ, గలయఁజూచె నాల్గు • కడల నతఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. జ్వలదగ్నికి సదృశము చం, చలలకుఁ దుల్యంబునైన • చక్షుర్ద్వయమున్
బలముగ మండుమహాగ్రహ, ములతోఁ బురిడించె నంత • నునుకొను క్షుధచేన్.

అర్థములు. జ్వలత్ + అగ్నికి=మండుచున్న అగ్నికి, సదృశము = సమా నము, చంచలలకుఁ దుల్యంబు = మెఱుపులకు సమానము, చక్షుర్ద్వయమున్ = రెండుకన్నులు, పురుడించెన్ = పోలెను, క్షుధచేన్ = ఆకలిచేత.

తాత్పర్యము

మండుచున్న యగ్నికి మెఱుపునకు సమానమైన యతని రెండుకన్నులు బలముగల మహాగ్రహముల వలె నుండెను. అంతట వాఁడాఁకలిచే.

ఉ. అచ్చట నున్న భక్ష్యవివి • ధామిషకాసరసూకరాళిఁ దా
నిచ్చ భుజించి శోణితము • నంతయుఁ గ్రోలియు మద్యమాదిగా
హెచ్చుగఁ ద్రావి తృప్తిగొని • యింద్రవిరోధి చెలంగుచుండ నం
దచ్చపుభీతి డాఁగిన సు • రారులు వెల్వల వచ్చి మ్రొక్కుచున్. ౧౩౬౩

అర్థములు. భక్ష్య = తినఁదగిన, వివిధామిష = పలువిధములైన మాంస ములు, కాసర = దున్నపోతులయు, సూకరాళి = పందులయు గుంపుల మాంస

మును, ఇచ్ఛన్=ఇష్టముదీర, శోణితము = నెత్తురు, క్రోలి = త్రావి, మద్యము = సారాయము.

## తాత్పర్యము

అచ్చట నుంచిన భక్ష్యములు నానా విధములైన మాంసములు, దున్నపోతులయు పందులయు మాంసములు కావలసినంత దిని నెత్తురు సారాయము త్రావి తృప్తిపడి, సంతోషించినవాఁడు కాఁగా వానికి భయపడియెందెందో దాఁగియుండిన రాక్షసులు బయటవచ్చి వానికి నమస్కరించుచు.

సీ. తనచుట్టు నిల్చినఁ ◆ గని కుంభకర్ణుండు, నిద్రావిశదభూరి◆నేత్రయుగుఁడు
కలుషీకృతేక్షణుఁ ◆ డల వారి నందఱ, వీక్షించి బోధన◆విస్మయమున
మీ రంద ఱిటు నన్ను ◆ మేలుకొల్పితి రేల, రాక్షసేశునకు భ◆ద్రంబ కాదె?
భయకారణం బేమి ◆ పాటిల్ల లేదుగా?, యూహింప నాకు సం◆దేహ మొదవెఁ
తే. గడఁగి నన్నుఁ బ్రబోధించు◆కారణమున, సత్యముగ గొప్పయాపద◆సంభవించెఁ
బరులచేజాగ దేటికిఁ◆బలుకుఁ డిపుడు, నన్నుఁ బ్రతిబోధితునిఁ జేయ◆నున్నకతము

అర్థములు. నిద్రా + అవిశద భూరినేత్రయుగుఁడు = నిద్రచే స్పష్టముగాఁ దెఱవఁ బడని పెద్ద కన్నులజంట గలవాఁడు. ఇంకను నిద్దుర మబ్బు పోలేదని భావము. కలుషీకృత + ఈక్షణుఁడు = కొఱ నిద్రలో లేచుటచే నెఱ్ఱగానున్న కన్నులు గలవాఁడు. బోధన విస్మయము=ఏల వీరు నన్ను నిద్దుర లేపి రని యాశ్చర్య పడుచు, ప్రబోధించు = మేలుకొలుపు, పరులచేన్ = శత్రువులచేత, జాగు = ఆలస్యము, ప్రతిబోధితుని=మేలుకొన్న వానిని.

## తాత్పర్యము

తనచుట్టు నిలువఁగాఁ గుంభకర్ణుఁడు నిద్దురమబ్బు వదలని కొఱనిద్రలో లేచుటచే నెఱ్ఱనైన రెండు కన్నులతో వారి నందఱఁజూచి యేల వీరు నన్ను నిద్రలేపిరని యాశ్చర్యపడుచు వారితో నిట్లనియె. ఏల మీ రీవిధముగ నన్ను నిద్రలేపితిరి? రావణుఁడు క్షేమముగానున్నాఁడా? వాఁడు బాగుండిన నన్ను లేపవలసిన కారణముండదే వాఁడును భయపడవలసిన కారణము కలుగ లేదుకదా. నాకేదో సందేహము తోఁచుచున్నది. నన్ను నిద్రలేపిన కారణమున శత్రువులచే నేదో గొప్ప కీడు మూఁడినది. ఏలయాలస్యముచేసెదరు? నన్ను మేలుకొలిపినకారణముచెప్పుఁడు.

ఉ. నెట్టెదఁ బాకశాత్రవుని◆నేని దివంబుననుండి త్రెళ్ళఁగాఁ
గట్టెద నాశ్రయాశుఁ జెను◆గాటపుఁగట్టుల నింక నేరినేన్
గొట్టెద నుగ్గునూచముగఁ ◆ గూర్కుఁడు నన్నొక మాత్ర లేపఁగా
నిట్టుల నాలొకపందు దను◆జేంద్రుఁడు చెప్పుఁడ యేమి మూఁడెనో. ౧౩౫౫

అర్థములు. పాకశాత్రవుని = ఇంద్రుని, ఆశ్రయాశున్ = అగ్నిని

తాత్పర్యము

ఇంద్రుని స్వర్గమునుండి పడ మెడపట్టి నెట్టితిని. అగ్నిహోత్రుని గట్టిగాఁ గట్టి వైచితిని. మఱి యెవరినైనఁ జూర్ణముగాఁ గొట్టితిని. సామాన్యమైన కారణమున నన్ను రాక్షసరాజు నిద్రలేపఁ బ్రయత్నింపఁడు. కావున నేమి విపత్తు సంభవించెనో చెప్పుడు.

—• {యూపాక్షుఁడు కుంభకర్ణునితో నతని నిద్రలేపిన కారణము దెలుపుట} •—

కం. ఈపగిదిఁ గుంభకర్ణుఁడు, కోపరసావేశమునను • గుఱుకొని పలుకన్
యూపాక్షుఁ డనెడి మంత్రి, యాపటుబలు డాసియనెఁ గృ•తాంజలి యగుచున్.

అర్థములు. గుఱుకొని = ప్రయత్న పూర్వకముగా, పటుబలున్ = మహాబలశాలిని, డాసి=సమీపించి.

తాత్పర్యము స్పష్టము.

ఉ. దైవకృతంబు భీతి మన • దైత్యుల కెన్నఁడుఁ గల్గ దిప్పు డో
దేవ మహాభయం బొదవెఁ • దీరుపరాక మనుష్యపాళిచే
నీ వఱ కెన్నఁడేన్ దితిజ • బృందము చేతను దానవాళిచే
దైవతకోటిచేఁ గనని • దాయము గల్గెఁ జుమీ నరాళిచేన్. ౧౩౬౭

అర్థములు. దైవకృతంబుభీతి = దేవతలవలనఁ గలిగిన భయము, దితిజ=దైత్యులచేతను, దితికుమారులు దైత్యులు, దానవాళిచే=దానవుల గుంపుచేతను, దనువను దానికుమారులు దానవులు, వీ రందఱు జాతులు వేఱైనను గుణముల నందఱు నొకటే. అందఱు దేవబ్రాహ్మణ విరోధులే. మనుష్యభక్షకులే, కుటిల వ్యాపారులే, దైవకోటిచే-వీరు అదితి కుమారులు, దాయము=ఉపద్రవము.

తాత్పర్యము

మన రాక్షసులకు దేవతల భయ మెన్నఁడు లేదు. ఇప్పుడు మనకు చక్కఁబఱుప సాధ్యముగాని మహాభయము మనుష్యులచేఁ గలిగెను. ఇంతవఱకు దైత్యులచే దానవులచే దేవతలచేఁ గలుగని యుపద్రవము నేఁడు మనుష్యులచేఁగలిగెను.

కం. భూమీధరకాయులు కా, ఖామృగములు లంకఁ జుట్టి • క్రాలెద రధిపా!
భూమిసుతాహరణార్తుఁడు, రామునిచేఁ గీడు మూఁడె • రక్షస్తతికిన్. ౧౩౬౮

అర్థములు. భూమీధరకాయులు=పర్వతములవంటి దేహము గలవారు. శాఖామృగములు=వానరులు, భూమిసుతాహరణార్తుఁడు = సీతను నపహరించుటచే బాధపడు వాఁడు, రక్షః+తతికిన్=రాక్షససమూహమునకు.

తాత్పర్యము

కొండంత దేహముగల వానరులు లంకను ముట్టడించినారు. సీతాదేవిని హరించుటవలన బాధపడు రామునిచే రాక్షసులకు చావుకాలము వచ్చినది.

ఉ. వచ్చి వనాటుఁ డొక్కరుఁడ ♦ వార్యబలోద్ధతి లంక కంతకున్
చిచ్చిడె నక్షుఁ జంపె మును ♦ సేవలతో నిభపంక్తితోడ ని
ప్పెచ్చినశక్తి రాముఁడు ది ♦ నేశ్వర తేజుఁడు సంగరంబునన్
జిచ్చితి వోరి యంచు సుర ♦ శాత్రవనాథునిఁ దోలె రావణున్. ౧౩౬౯
అర్థములు. వనాటుఁడు=వానరుఁడు, చిచ్చు=అగ్ని, ఇభపంక్తితోడన్=ఏనుఁగుల గుంపుతో.

తాత్పర్యము

మును వానరుఁ డొకఁడు వచ్చి లంక గాల్చెను. అక్షుని జంపెను. ఇప్పుడు సూర్యతేజస్సుగల రాముఁడు బలవంతుఁడై వచ్చి రావణుని జిచ్చితివి పొమ్మని యుద్ధమునందుఁ బరువెత్తునట్లు కొట్టెను.

కం. రాణను దితిదనుభవగీ, ర్వాణులు సమకూర్ప లేని ♦ భంగము సీతా
ప్రాణేశ్వరుఁ డిడి రావణుఁ, బ్రాణంబులు పోయి పోని ♦ వాని గఁ జేసెన్.
అర్థములు. రాణను=ఒప్పిదముతో, దితి దనుభవ గీర్వాణులు=దితిభవ=దైత్యులు, దనుభవ=దానవులు, గీర్వాణులు=దేవతలు, భంగము=అవమానము.

తాత్పర్యము

దైత్యులు, దానవులు, దేవతలైనను కలిగింపఁజాలని యవమానమును సీతావల్లభుఁడు కలిగించి ప్రాణములు పోయి పోనివానిఁగఁ జేసి విడిచెను. అవమానము చేత రాముని బాణముల దెబ్బలచేత నన్నిప్రాణములు పోయినట్లే యున్నను నీ యందలి యాశతో నొక్కప్రాణము బిగఁబట్టుకొని యున్నాఁడు.

కం. అని యూపాక్షుఁడు పలికిన ననిఁ దనయగ్రజునిపాటు ♦ నాలించి యసెన్
గినుక వివృత్తాక్షుండై, యనుపమబల శాలి రావ ♦ ణానుజుఁ డతనిన్. ౧౩౭౧
అర్థములు. వివృత్త + అక్షుఁడు=తిరుగుచున్న కన్నులు గలవాఁడు.

తాత్పర్యము స్పష్టము

—♦ మహోదరుఁడు కుంభకర్ణునితో రావణుఁ జూడఁ బొమ్మని చెప్పుట ♦—

ఉ. ఈక్షణ మేగి రాఘవన ♦ మేతముగా హరిసైన్యమెల్ల యూ
పాక్ష వధించి వెండి యసు ♦ రాధిపుఁ గాంచెదఁ దృప్తిఁ గూర్చెదన్
రాక్షసకోటికిన్ వనచ ♦ రప్రచయక్షతజామిషంబులన్
దక్షత రాఘవాస్రములఁ ♦ ద్రావెదఁ దుష్టిగ నే స్వయంబుగన్. ౧౩౭౨
అర్థములు. యూపాక్షా! యట్లగు నేని నే నీ నిమిషమందే పోయి రామలక్ష్మణులతోడ వానరసేన నంతయుఁ జంపి తరువాత రావణునిఁజూచి రాక్షసులకుఁ దృప్తి కలిగించెదను. వనచర ప్రచయ=వానర సమూహముల యొక్క, క్షతజ=నెత్తుటిని, ఆమిషంబులన్=మాంసములను, రాఘవాస్రములన్ = రామలక్ష్మణుల నెత్తురును, తుష్టిగన్ = తృప్తి కలుగునట్లు, స్వయంబుగన్ = నేనే సొంతముగా,

తాత్పర్యము స్పష్టము.

తే. ఇటులు పలికిన రోషవి♦వృద్ధదోష, మైన యాతనిగరోక్తు ♦ లాలకించి
యుచితగతిదోఁపఁబలెఁ-మ♦హోదరాఖ్యుఁబరఁగు నైఋతయూథప♦పరివృఢుండు.

అర్థములు. రోషవృద్ధదోషము=కోపముచే వృద్ధిపొందిన దోషముగలది, రావణ పరాభవము విని రోషించెనేకాని తాను శేయఁదలఁచిన దాని యందలి దోష మాలోచించినవాఁడుకాఁడు, ఆలకించి = విని, నైఋత యూథప పరివృఢుండు = రాక్షస యూథపతులలో శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. రావణువచనంబుల విని, యావల గుణదోషముల స♦మాలోచనముం
గావించి పదంపడి విజ, యావహగతి రణముఁ జేయ♦నర్హ మటన్నన్. ౧౩౪౪

అర్థములు. విజయావహగతిన్=గెలుపుగలుగు మార్గముగ.

తాత్పర్యము స్పష్టము.

శా. కాని మ్మంచును లేచె లేచుటయు ర♦క్షస్సంఘముల్ వేగ ర
క్షోనాథుం గదియంగఁ బోయి కరముల్ ♦ జోడించి మేల్కాంన్నవాఁ
డైనీ సోదరుఁ డున్నవాఁ డసురలో♦కాధీశ! నీ వేగి స
మ్మానింతో యతఁ డిందు వచ్చినను బ్రే♦మం గారవింతో యనన్. ౧౩౪౫

తాత్పర్యము

అట్లులే చేసెదనని లేచెను. ఇట్లు లేవఁగానే రాక్షసులు ముందుఁబోయి రావణుని జూచి చేతులు జోడించి, రాజా! కుంభకర్ణుఁడు నిద్ర మేల్కాంన్నవాఁడు. నీవు పోయి యతని గౌరవించెదవా? అతఁడిచ్చటికి వచ్చిన గౌరవించెదవా? యని యడుగఁగా.

ఉ. ఆతఁడు వచ్చుఁ గాక యిత♦ కాతని నర్హసమర్చనాదిసం
ప్రీతునిఁ జేయు టొప్పు వన♦ వే చని వారలు మిమ్ముఁ జూడ మా
భ్రాత సురారినేత తమి♦ వర్తిలెడిం జనఁ గోరుడే? యనం
జేత మిగుర్ప వల్లె యని ♦ శిక్షితశాత్రవుఁ డాత్మతల్పమున్. ౧౩౪౬

అర్థములు. అర్హసమర్చన్ = తగిన పూజచేత, ఆదిన్=లోనగుత, సంప్రీతుని = సంతోషించిన వానిని, చేతము = మనస్సు, ఇగుర్పన్ = సంతోషింపగా, ఆత్మతల్పమున్=తన పానుపును.

తాత్పర్యము

ఆతఁడే యిచ్చటికి రానిండు, అతని ముందు గౌరవించి సంతోషింపఁజేసి యావల కార్యవిధము చెప్పవలెను, అని చెప్పఁగా వారుపోయి మా యన్న నిన్నుఁ జూడఁగోరుచున్నాఁడు. పోవుట కిష్టమా యనిన సంతోషించి తన పానుపును,

కం. విడిచి వెలి వచ్చి వదనము, గడిగికొని నిమజ్జనంబుఁ ♦ గావించి నగల్
దొడి బలవర్ధనపానముఁ, గడుపారఁగఁ ద్రావె దప్పి ♦ కడమవడంగన్.

అర్థములు. నిమజ్జనము = స్నానము, నగల్ దొడి = ఆభరణములు ధరించుకొని, బలవర్ధన పానము = బలముగలిగించు పానము, దీనినే వీరపాన మందురు. యుద్ధమునకు ముందు వీరులు దీనిని బానముచేయుదురు. కడమవడం గన్ = కొఱఁత పడునట్లు.

తాత్పర్యము

విడిచి వెలుపల వచ్చి ముఖము కడిగికొని స్నానముచేసి యలంకరించుకొని బలము వచ్చుటకై వీరపానము గావించి దర్పించుచున్నవాఁడై.

తే. రావణాజ్ఞను వెస మది•రా ఘటంబు, లమితవివిధోపహారంబు•లసుర లీయఁ
గుంభములు వేయిద్రావియా•కుంభకర్ణుఁ, డతులతేజో బలోపేతుఁ•డయిమదించి.

అర్థములు. మదిరాఘటంబు = సారాయము కడవలు, వివిధోపహారంబులు=నానావిధములైన కానుకలు, బలోపేతుఁడు = బలముతోఁగూడినవాఁడు, మదించి=మత్తుగొన్నవాఁడై.

తాత్పర్యము స్పష్టము.

చ. ప్రలయకృతాంతతుల్యవిభ•వంబున నన్నఁ గనుంగొనంగ న
బ్బలియుఁడు పోవుచో ధరణి • పాదహతిన్ వడఁకాడెఁ దత్పురిం
గల యుపనిష్కరంబులును • గ్రాలెఁ దదీయపరిష్క్రియాతతిన్
వలనుగ రెండువంకలను • బద్ధకరాంజలిపంక్తి రాజిలెన్. ౧౩౯

అర్థములు. ప్రలయకృతాంతతుల్య విభవంబునన్ = ప్రలయకాలమందలి యమునితో సమానమైన మహిమతో, పాదహతిన్ = కాలి త్రొక్కుడుచే, ఉపనిష్కరంబులును = రాజమార్గములు, గొప్పదుర్గములు గల పట్టనములోని రాజమార్గములకే యుపనిష్కరము లని పేరు. సామాన్య పట్టనములోని రాచబాటలకు ఘంటాపథము లని పేరు. ఉపనిష్కరము = ఇం దంతట సైన్యము పర్యాప్తమై చల్లఁబడును అని వ్యుత్పత్త్యర్థము. 'తత్పురస్యోపనిష్కర' మ్మని యమరము. తదీయపరిష్క్రియా తతిన్ = అతని యాభరణముల సమూహముచే, బద్ధకరాంజలి పంక్తి = అంజలి జోడించిన వారి వరుస.

తాత్పర్యము

ఆ బలశాలి ప్రలయకాల యముని గొప్పతనముతో నన్నను జూడఁబోవు చుండఁగా వాని కాలి త్రొక్కుడులచే భూమి వడఁకెను. ఆ పురమందలి రాజ మార్గములు వాని యాభరణములచేఁ బ్రకాశించెను. మార్గముల నిరువంకల నందఱు చేతులు జోడించి నిలఁబడి యుండిరి.

చ. కమలజువీటి కేగు బల•భున్మరు పోలికఁ బోవువానిఁ దే
జమున ఖరాంశువంటు విల•సత్పరిమాణవిహీనకాయు భ్రా
భ్రమహితశృంగకల్పు నల•రాక్షస సత్తముఁ గుంభకర్ణుఁ బ
ట్నము వెలి ముట్టడించిన వ•నౌకసులుం గని యుబ్రపాటునన్. ౧౪౦

అర్థములు. బలఘస్మరు పోలికన్=ఇంద్రునివలె, ఘస్మరుఁడనఁగా తిండి పోతు, ఇచ్చట సంహారించినవాఁడని యర్థము. ఖరాంశున్ = సూర్యుని, పరిమాణ విహీన = కొలఁత చెప్పరాని, కాయున్ = దేహముగలవానిని, భూధ్ర = పర్వతముయొక్క, మహిత = గొప్పదగు, శృంగకల్పున్ = శిఖరముతో సమానమైన వానిని, పట్నము = పట్టన శబ్దభవము, వనౌకసులున్ = వానరులుకూడ, వాఁడు కోటగోడలకంటె నెత్తుగానున్న కారణమున ప్రాకారములకు వెలుపలనున్న వారికిని వాని శరీరము కానవచ్చెను. అబ్బపాటునన్=ఆశ్చర్యమున.

తాత్పర్యము

బ్రహ్మయింటికేఁబోవు నింద్రునివలె నన్నయింటికేఁ బోవుచున్నవానిని తేజమున సూర్యునిబోలి యతని తాఁకుచున్న పరిమితి చెప్పరాని దేహము గలవానిని కొండశిఖరముతో సమానమైనవానిని, అంత యెత్తుగలవాఁ డగుటచేతనే కుంభకర్ణుని లంకకు వెలుపల నుండు వానరులుకూడఁ జూచి యాశ్చర్యపడిరి.

కం. ఎకవడి పరువిడి పడములు, గుదిపడి నిలఁబడిరి కపులు • కొందఱు రామున్
గదిసి శరణంబుఁజొచ్చిరి, మదమఱి యిలఁబడిరి భీతి•మతు లగు క్రోతుల్.

తాత్పర్యము

కొందఱు క్రోఁతులు భయపడి పరువెత్తి కాళ్ళు తప్పలుగాఁ గూలఁబడిరి. కొందఱు రాముసొద్దకుఁ బోయి నీవేగతి రక్షింపుమనిరి. కొందఱు భయపడి గర్వముడిగి నేలఁబడిరి.

—• { ౬౧-వ సర్గము. రావణుఁ జూడఁబోవు కుంభకర్ణుఁ జూచి శ్రీరాముఁడు విభీషణుఁ బ్రశ్నించుట } •—

సీ. పర్వతాకారుని • భయకరశరీరుని, మున్ను నారాయణు • చెన్ను దోఁప
నాకాశమంటు దే•హంబును గలవాని, సాంబుతోయదనిభుఁ • డైనవానిఁ
గాంచన కేయూర • కమ్రభూషాంచితుఁ గని కిశసైన్యంబు • కాందిశీక
మగుడు రఘూత్తంసుఁ•డతులచాపముఁ గొని, యచ్చెరువున రావ•ణానుజాతు
ఆ. ననియె నెవ్వఁడయ్య • యద్రిసంకాశుండు, మకుటధారి మహిత•మహిత కేతు
వనఁగఁదగినవాఁడు•సైరావతీవారి, వాహమునకు నీడు•వచ్చువాఁడు. ౧౩౭

అర్థములు. మున్ను నారాయణు చెన్నుదోఁప=త్రివిక్రమావతారమందు వలెనని భావము. సాంబు = నీళ్ళతోఁగూడిన, తోయద నిభుఁడు = మేఘముతో సమానుఁడు, కాంచన కేయూర = బంగారు భుజకీర్తులచేతను, కమ్ర=మనోహరమైన, భూషాంచితున్ = ఆభరణములచేతను ప్రకాశించువానిని, కాందిశీకము = భయముచే బరువెత్తినది, కాం+దిశీకము=ఏదిక్కునకుఁబోవునది తెలియనిది, అద్రిసంకాశుండు=పర్వతముతో సమానుఁడు, మకుటధారి=కిరీటము ధరించినవాఁడు, సైరావతీ=స+ఐరావతీ = మెఱుపుతోఁ గూడిన, వారివాహనమునకు = మేఘ

మునకు, "శంపా శతహ్రదా హ్రాదినై రావత్యః క్షణప్రభా" యనియు "అభ్రం మేఘో వారివాహం" యనియు నమరము. బృందారకుండో=దేవతయో.

తా త్ప ర్య ము

పర్వతమువలె నెత్తైన యాకారము గలవానిని, కనుకనే భయంకరమైన శరీరము గలవానిని, పూర్వము త్రివిక్రమావతారమున నారాయణునివలె నాకాశముఁ దాఁకుచున్న దేహము గలవానిని, నీటితోఁ గూడిన మబ్బువలె నల్లని దేహకాంతి గలవానిని, బంగారు భుజకీర్తులు, మనోహరములైన భూషణములు ధరించినవానిని చూచి వానరసేన భయపడి పరువెత్తసాగెను. అప్పుడు రామచంద్రమూర్తి యసమానమైన విల్లుతీసికొని యాశ్చర్యపడి విభీషణుఁజూచి యెవ్వరయ్యా వీఁడు కొండవలె నున్నాఁడు. కిరీటము ధరించినాఁడు. భూమికి ధ్వజమువలె నున్నాఁడు, ధ్వజము తన చుట్టునుండు మనుష్యులకంటె నెత్తై యందఱకుఁ గానవచ్చుచుండును. అట్లులే వీఁడును భూమియందుండు నన్నిటికంటె నెత్తై యున్నాఁడని భావము. మెఱుపులతోడి మేఘమునకు సమానుఁడు.

తే. కపిలనేత్రుండు కోటప్రా♦కారమునకు, మీఁద నొక్కఁడ తెలిసెకి♦మేనితోడ
నరుగుచున్నాఁడులంకలో♦నతఁడు రాక్షసుండో యటుగాక బృందార♦కుండో
చెపుమ.

అర్థములు. కపిలనేత్రుండు=గోరోజనము కన్నులవాఁడు.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. పాఱుచు నున్నవారు మన♦వానరు లెల్లరు వానిఁజూచి దై
వాఱుభయానఁ బూర్వమిటు♦వంటి మహాద్భుత భూత మూర్విపైఁ
దేఱఁగఁ జూడలే దన సుధీ♦వరుఁడైన విభీషణుండు దాఁ
దాఱనిభక్తి నిట్టులను♦ దాశరథి ప్రవరున్ నయంబునన్. ౧౬౭౮

అర్థములు. దైవాఱు = అతిశయించిన, సుధీవరుఁడు = పండితులందు శ్రేష్ఠుఁడు, తాఱని=తగ్గని, భూతము = జంతువు, ప్రాణి; నయంబునన్=అణఁకువతో, సుధీవరుఁడు నయంబుగఁ జెప్పె ననుటచే విభీషణుఁడు కుంభకర్ణుని గుఱించి భయంకర వృత్తాంతము చెప్పినను సౌమ్యముగ మృదువుగఁ జెప్పెనని భావము. తేఱఁగన్ = బాగుగ.

తా త్ప ర్య ము

వానినిజూచి మిగుల భయపడి మన వానరులందఱుఁ బరువెత్తుచున్నారు. ఇంతకుముం దిటువంటి మిగుల నద్భుతమైన ప్రాణిని భూమిమీఁదఁ జూడలేదు. అని యడుగఁగా మిగుల బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడగుటచే నెవరి కెప్పు డెట్లు చెప్పవలయునో తెలిసినవాఁడై నయముతో భక్తితో రామచంద్రునితో నిట్టులనెను.

—♦ విభీషణుఁడు శ్రీరామునకుఁ గుంభకర్ణుగుఱించి తెలుపుట ♦—

సీ. ఖండనంబునఁ గిట్టి దండి వాసవుఁ బట్టి, ఱోటమిఁ గూర్చిన ♦ మేటిబంటు
విశ్రవసోముని♦విఖ్యాతపుత్రుండు, కుంభకర్ణుం డనఁ♦ గొఱలువాఁడు

ఇంతటిపొడవును ♦ నింతటిలావును, బెరరక్కసులకు నె♦వ్వరికి లేదు
వరదానకృతబలుల్ ♦ సురవైరు లందఱు, నతఁడు స్వభావబ♦లాధికుండు
తే. అమరగంధర్వకిన్నర♦యక్షభుజగ,దనుజవిద్యాధరులఁ బ్రవి♦దారణమున
నొడిచి యున్నాఁడు వేనవేల్ ♦తడవ లితఁడు,సురలకీతని పేరుహృ♦చ్ఛూలమధిప!

అర్థములు. భండనంబునన్=యుద్ధమందు, కిట్టి = సమీపించి, ఓటమి = అపజయము, మేటిబంటు=గొప్ప శూరుఁడు, పెరరక్కసులకు=ఇతర రాక్షసులకు, వరదానకృతబలుల్=వరములను సంపాదించు కొనుటచే బలము గలవారు,స్వభావ బలాధికుండు = పుట్టువుచేతనే మిగుల బలము గలవాఁడు, ప్రవిదారణమునన్ = యుద్ధమందు, ఒడిచి=ఓడించి, హృచ్ఛూలము=గుండె గాలము.

తాత్పర్యము

యుద్ధమునందు సమీపించి బలవంతుఁడగు నింద్రుని బట్టుకొని యోడించిన శూరుఁడు విశ్రవసుముని కొడుకు వీని పేరు కుంభకర్ణుఁడు. ఇతర రాక్షసులం దెవ్వరు నింతలావు పొడుగు గలవారు లేరు. రాక్షసులందఱు బ్రహ్మరుద్రుల వరములచే బలవంతులైరి. వీనికి బలము పుట్టువుచేతనే వచ్చినది. అసురులను గంధర్వ కిన్నర యక్షులను సర్పములను దనుజులను విద్యాధరులను యుద్ధమం దెన్నివేల మాఱులో యోడించి యున్నాఁడు. దేవతలకు వీనిపేరు గుండెలలో గాలము వంటిది. ఒక నాఁడు నిద్రమేలుకొనియుండు వాఁడీ కార్యమెట్లు చేసెనని సందేహము బాధించు చున్నది. ఇది బ్రహ్మ వరమునకు ముందటి వార్తయై యుండవలెను.

కం. శూలంబు గేలఁ గ్రాలఁగ, నాలమున విరూపనేత్రుఁ♦డై వీఁ డడరన్
గాలుండో యని నిర్జర,జాలంబులు డాయ లేక ♦ సాధ్వస మందున్. ౧౩౮౬

అర్థములు. ఆలమునన్ = యుద్ధమందు, విరూపనేత్రుఁడై=వికారమైన కన్నులు గలవాఁడై, అడరన్=విజృంభింపఁగా, శూలశబ్దము విరూపనేత్ర శబ్దము, శూలధరుఁడైన విరూపాక్షుఁ డగు రుద్రునివంటి వాఁడని సూచించుచున్నది. కాలుండో=యముఁడో, సాధ్వసమందున్=భయపడును.

తాత్పర్యము

శూలము చేతఁబట్టుకొని యీ విరూపాక్షుఁడు యుద్ధమునందు విజృంభింపఁగా వీఁడు యముఁడో యని దేవతాసమూహములు దగ్గఱ రాలేక భయపడును.

సీ. పుట్టి పుట్టక మున్న ♦ భూరిబుభుక్షార్తి, వేనవేల్ జంతుల ♦ వీఁడు మ్రింగ
గడఁగుడుఁ బ్రజలెల్లఁ ♦ గడుభయంబడి చని, వేలుపుఱేనికి ♦ విన్నవింప
జంభారి దంభోళిఁ ♦ గుంభకర్ణుని వైవ, నత్తాఁకున, జలించి ♦ యార్చటింప
నమ్మహారవమున ♦ కడలు భూవలయంబు, వెండియు దిగులున♦గం డడంగెఁ
తే. గుంభకర్ణుండు హరిహయ♦కుంభిరదముఁ, బీకి దానన మర్దించె ♦ వృత్రవైరి
నేటుపడి వాసవుం డార్తి♦రాటుపడఁగ, వ్యసనసంతప్తులైరి దై♦త్యారిసురలు.

అర్థములు. భూరి = అధికమైన, క్షుధార్తి = ఆఁకటి బాధచే, కడఁగుచున్ = ప్రయత్నించఁగా, వేలుపుఱేనికిన్ = ఇంద్రునకు, జంభారి=ఇంద్రుఁడు, దంభోళి = వజ్రాయుధమును, తాఁకున = దెబ్బచే, ఆర్భటింపన్ = అఱవఁగా, అడలు = చలించు, గండు = బీరము, హరిహయకుంభి=ఇంద్రుని యేనుఁగు-ఐరావతముయొక్క, రదము=దంతము, రాటుపడఁగన్=ఉపద్రవపడునట్లు.

తాత్పర్యము

వీఁడు పుట్టి పుట్టకముందే మిగుల నాఁకలిగొన్నవాఁడై వేలకొలఁది జంతువులను మ్రింగ యత్నింపఁగా ప్రజలందఱు నిటులైన లోకము త్వరలోనే శూన్యమగునని భయపడి యింద్రునకుఁ దెలుపఁగా నాయన వీనిమీఁద వజ్రాయుధము వైచెను. ఆదెబ్బతిని వణఁకి యఱవఁగా వానిధ్వనికిఁ జలించు భూచక్రము మఱింత దిగులుపడెను. అప్పుడు కుంభకర్ణుఁడు ఐరావతము దంతము పెఱికి దానితోనే యింద్రుని గొట్టెను. ఆ దెబ్బకు నింద్రుఁడు మిగుల నుపద్రవపడఁజూచి దైత్యులు ఋషులు మిగుల వ్యసనపడిరి.

ఉ. ఈతఁడు పెట్టు రాయిడి స • హింపఁగ లేక ప్రజాసమేతుఁడై
ధాతను డాయఁగాఁ జని శ • తక్రతుఁ డింతయు విన్నవించె నీ
పాతకు లోకభక్షణము • స్వర్జనధర్షణ మన్యకామినీ
వ్రాతభృశాభిమర్శనముఁ • బా డొనరించుట యాశ్రమస్థలుల్. ౧౩౦౪

అర్థములు. రాయిడి = ఉపద్రవము, ప్రజాసహితుఁడై = లోకులతోడ, శతక్రతుఁడు = ఇంద్రుఁడు, పాతకు = పాపాత్ముని, లోకభక్షణము = ప్రజలను దినుట, స్వర్జన ధర్షణము=దేవతలఁ బీడించుట, అన్యకామినీవ్రాత=ఇతర స్త్రీ సమూహమును, భృశాభిమర్శనము=మిక్కిలి బాధించుట.

తాత్పర్యము

ఇతఁడు పెట్టు నుపద్రవము సహింపలేక యింద్రుఁడు లోకులతోడ బ్రహ్మ యొద్దకుఁబోయి యీ పాపాత్ముఁడు ప్రజలను భక్షించుట, దేవతల బాధించుట, ఇతర స్త్రీలను జెఱుచుట, ఋష్యాశ్రమములు పాడుచేయుట-యివి యన్నియు విన్నవించెను.

కం. ఈకరణి వీఁడు నిత్యము లోకుల భక్షించెనేని • లోకేశ్వర! భూ
లోకము పాడఱు నన్నది, వౌక స్తతి నూఱడించి • యబ్జభవుండున్. ౧౩౦౯

అర్థములు. ఈకరణిన్ = ఈ విధముగ, దివౌకస్ + తతిన్ = దేవతా సమూహమును, అబ్జభవుఁడు = బ్రహ్మ.

తాత్పర్యము స్పష్టము.

తే. కుంభకర్ణునిఁ గనుఁగొని • గుండెలదర, నిబ్బరము దెచ్చుకొని వాని • నెమ్మిఁబిలిచి
సత్యముగ నిన్ను లోకనా • శంబు కొఱకె, విశ్రవసుఁడు వినిర్మించె • విశ్వవైరి.

అర్థములు. నిబ్బరము=ధైర్యము విశ్వవైరి = లోకమునకు నపకారము చేయువాఁడా.

తాత్పర్యము

కుంభకర్ణునిఁజూచి భయపడి గుండె లదరఁగా మరల ధైర్యముఁదెచ్చుకొని వీనిని మంచితనముగాఁ దగ్గఱకుఁ బిలిచి నిన్ను నిజముగ లోకము నాశముఁజేయఁ గోరియే విశ్రవసుఁడు పుట్టఁజేసెను.

సీ. కావున నిది యాది♦గా నీవు పడియుండు, ఘటకర్ణుఁడా ! మృత♦కల్పుఁడ వయి
యని శపియించిన ♦ నాతని మ్రోలన, తత్క్షణంబున వీఁడు ♦ ధరణిఁ ద్రెళ్ళఁ
బరమసంభ్రాంతుఁ డై♦పంక్తికంధరుఁ డను, దాత నీ కిటు సేయఁ♦దగ దటయ్య
నీమనుమండు వీ♦నిని శపింపఁగఁ జన్నె, యుమ్మెత్తనైనఁ దా ♦ నెమ్మిఁ బెంచి
తే. నఱక న్యాయంబె ఫలవేళ♦నలినగర్భ! నీదుసూక్తిని దబ్బుఱ♦నెఱయఁ గలదె
కరుణ దలపోసి శయనజా♦గరములందుఁ,గాలనిర్ణయ మొనరింపఁ♦గ దెమహాత్మ.

అర్థములు. మృతకల్పుఁడవు = చచ్చినవానికంటెఁ గొంచెము తక్కువ చచ్చినవాని కూపిరి యాడదు, వీనికాడును, కల్పప్రత్యయము కొంచెము తక్కువఁగా సమత్వమును జెప్పును. పరమ సంభ్రాంతుఁడై = మిగుల వేగిరపాటు గల వాఁడై, శయన జాగరములందు=ఇన్ని దినాలు నిద్రపోవలె, ఇన్ని దినాలు మేలుకొని యుండవలె నను నేర్పాటు.

తాత్పర్యము

కాఁబట్టి యిది మొదలు కుంభకర్ణా! నీవు చచ్చినవానితో సమముగఁ బడి యుండుము, అని శపింపఁగానే యచ్చటనే యాక్షణమందే వీఁడు నేలఁబడెను. అప్పుడు రావణుఁడు మిగులఁ దత్తఱపడి బ్రహ్మనుజూచి తాతా! నీ విట్లు శపింప వచ్చునా? వీఁడు నీమనుమఁడు గాఁడా? వీనిని సృష్టించిన వాఁడవు నీవుగావా? ఉమ్మెత్త చెట్టునైనను దాను పెంచి ఫలవేళ నఱక వచ్చునా? అయినను ముందు మించి శపించితివి. నీమాట యసత్యము కానేరదు. అయినను నిన్నిదినాలు నిద్రపోవలె నిన్నిదినాలు మేలుకొని యుండవలె నను నియమ మేర్పాటు చేయుము.

కం. అని వేఁడిన దయగూడిన,మనమున వనజాసనుఁడా♦రు మాసంబులు గూ
ర్కూను నొక్కఁ పగలు మేల్కాంచి, తినుఁ గావుత మగ్నిపగిదిఁ♦దిరుగుచు జగతిన్.

తాత్పర్యము

అని ప్రార్థింపఁగా దయ గలవాఁడై వీఁడాఱు నెలలు నిద్రించునుగాక ఆవల నొక పగలు మేల్కొని యగ్నిహోత్రునివలె నాఱు నెలలతిండి యొకనాఁడు తిని విహరించును గాక యని బ్రహ్మచెప్పెను.

బ్రహ్మశాప మనునది కుంభకర్ణుఁడు కోరిన వరమే. కుంభకర్ణుడు తపసు చేయఁగా బ్రహ్మప్రత్యక్షమై నీ కేమి వరము కావలయుననిన నిత్యత్వ మనఁబోయి నిద్రాత్వమనెను. అట్లులే కానిమ్మని బ్రహ్మ చెప్పెను. "కుంభకర్ణుని నిశటావనికిం జతురాస్యుఁ డేగి నీ, భావగతంబు జెప్పుమన వాఁడును నిద్దురఁగోరెఁ జొక్క-

శేం, థ్లావిధియట్టు లౌతమని స్వాలయముం జనె"నని యుత్తరకాండమునఁగలదు. ౨౨౦ పద్యము అంతకుముందే బ్రహ్మ శపించియుండిన వీఁడు తపస్సు చేయుటే సంభవించి యుండదు. ఇందుఁ జెప్పఁబడిన ఆఱునెల లనునది అధమ పక్షము, అంతకుఁ దగ్గదు. అంతకు హెచ్చి ఏడు-ఎనిమిది-తొమ్మిది నెలలైనఁ గావచ్చును. ఈ విషయము ముందే చర్చింపఁబడినది.

ఉ. అట్టిఁడు కుంభకర్ణుఁడు మ • హాత్మక ! యీతని మేలుకొల్ప ని
 ప్పట్టున నార్తిఁ గూరి దశ • వక్త్రుఁడు త్వద్బలభీతుఁ డౌట, స్వా
 రాట్టువిరోధిఁ గర్ణని ద • రంబున బాఱెడిఁ గ్రోఁతులెల్లఁ దా
 మెట్టు పెనంగువారో యని • నీతఁడు మారొకఁనె నేని రాఘవా ! ౧౩౯-౩

అర్థములు. అట్టిఁడు=అట్టివాఁడు, త్వద్బలభీతుఁడు=నీ బలమునకు భయపడినవాఁడు, స్వారాట్టువిరోధి=ఇంద్రవిరోధి, కుంభకర్ణని-దరంబునన్=భయముచే.

తాత్పర్యము

మహాత్మా ! కుంభకర్ణుఁ డిటువంటివాఁడు. నీ బలమునకు భయపడి రావణుఁడు వీని నిప్పుడు నిద్రలేపెను. ఈ రాక్షసునిజూచి వానరులు భయపడి పరువెత్తుచున్నారు. వీఁడు యుద్ధములో నెదిరించినప్పు డెట్లు యుద్ధము చేయుదురో యేమో.

తే. తనదు శిబిరంబు వీడి యీ • దర్పధుర్యుఁ, డరుగుదెంచుచు నున్నవాఁ • డనికి దేవ
 వానరులఁ బట్టి యిరు కేల • వాతవైచి, కొనుచుఁ బరువునఁజనుదెంచు • గుణధురీణ !

అర్థములు. శిబిరము=విడిది, గృహము, వాత=నోర.

తాత్పర్యము స్పష్టము.

చ. ఇదియొక కీలుబొమ్మ యసు • రేశ్వరకల్పిత మాట దీనికై
 యదరకుఁడీ కపిప్రవరు • లంచును జాటుట మేలు దానిచే
 వదలి భయంబు వానరులు • వర్తిలువార లటన్న హేతుమ
 ద్గదితము లాలకించి ప్లవ • గధ్వజినీపతి రాముఁ డిట్లనున్. ౧౩౯-౪

అర్థములు. అసురేశ్వర కల్పిత=రావణునిచేఁ గల్పింపఁబడినది, కపిప్రవరులు = కపిప్రవరులారా, హేతుమత్ + గదితములు = కారణముతోఁ గూడిన మాటలు, ప్లవగధ్వజినీపతిన్=వానరసేనానాయకుని, నీలుని.

తాత్పర్యము

వానరులారా ! దీనినిజూచి మీరు భయపడవలదు. ఇది మిమ్ము బెదరించుటకై రావణాసురుఁడు గల్పించిన కీలుబొమ్మ అని సేనలలో నలువైపులఁజాటించుట మేలు. అటుచేసిన వానరులు భయపడక యుందురు. అని చెప్పఁగా యుక్తియుక్తములైన యతని మాటలు విని రామచంద్రమూర్తి నీలునిఁబిలిచి యిట్లనియె.

విభీషణుఁడు చెప్పిన నీతి సునీతియైనను రామచంద్రమూర్తికి నమ్మకమైనది కాదు. అంకసత్యభాషణము, వంచనము ననురెండు దోషములు గలవు. ఒకసారి

వంచన చేసిన వారిని లోపలు గలకాలము నమ్మరుగదా, కావున రామచంద్రమూర్తి ఋజుమార్గముననే వర్తింపఁదలఁచెను.

—♦{ శ్రీరాముఁడు నీలునితోఁ గుంభకర్ణుతోడ యుద్ధమునకు సేనల సిద్ధపఱుపు మని బోధించుట }♦—

సీ. పావకీ! చని మన♦బలఁగంబు సర్వంబు, వ్యూహము ల్దీర్పుమీ♦యొప్ప మెఱయ
లంక ద్వారంబుల♦ సంక్రమస్థలములఁ, జర్యల నరికట్టు♦ సత్వరముగఁ
గుధరశృంగంబులుఁ♦ గుజ వితానంబులు, శిలలును జతగూర్చి♦సిద్ధపడుము
సాధనహస్తులు♦ శైలపాణులు నయి, వనచరుల్ నిలువంగ♦ వలయు నన్న

ఆ. నీలుఁ డెల్లకపుల♦ కోలి నెఱింగించె, రామునాజ్ఞఁ గీశ♦రాజు లెల్ల
నట్ల సిద్ధపడిరి♦యద్రిశృంగంబులు, వృక్షతతులుఁ గేల♦ వెలయు చుండ. ౧౩౯౬

అర్థములు. పావకీ=పావక కుమారా! అగ్నిహోత్రుని నందనా, సంక్రమస్థలములన్=వంతెనలు కట్టిన చోటులను, చర్యలను = గోపుర పార్శ్వములందలి భట సంచార ప్రదేశములను, అరికట్టుము = అడ్డగింపుము, సాధన హస్తులు = ఆయుధములు ధరించినవారు, శైలపాణులును=చేతియందుఁ గొండలు గలవారు, ఓలి = క్రమముగా.

### తాత్పర్యము

* నీలా! మన వానర సేనల నచ్చటచ్చటఁ దగినట్లు నన్ని యుంచుము. లంక వాకిండ్లను అగడ్తల మీఁది వంతెనలను గోపురముల ప్రక్కల భటు లుండు ప్రదేశములను, నడ్డగింపుము. కొండ శిఖరములు చెట్లు ఱాలు సమకూర్పుము. వానరులు ఆయుధములు కొండలు చేతులందు ధరించి సిద్ధముగ నుండవలెను. అని చెప్పఁగా నీలుఁడా రామాజ్ఞను వానరుల కెల్ల దెలిపెను, వానరులును రామచంద్రమూర్తి చెప్పినట్లు కొండ శిఖరంబులు వృక్షములు చేతులందు ధరించి యుండిరి.

కం. శరభ గవాక్షాంగద కే,సరిసూనులు పెచ్చుపెరిఁగి♦ శైలతలంబుల్
కరములఁ గొని ద్వారంబుల, నరికట్టిరి వైరిభీక♦రార్భటు లెసఁగన్. ౧౩౯౭

అర్థములు. పెచ్చుపెరిఁగి=విశేషముగ విజృంభించి, వైరి భీకరార్భటులు= శత్రువులకు భయంకరమైన సింహనాదములు.

### తాత్పర్యము

శరభుఁడు గవాక్షుఁడు అంగదుఁడు హనుమంతుఁడు మిగుల విజృంభించి కొండశిఖరములను చేతుల ధరించి పగవారు భయపడునట్లు సింహనాదములు చేయుచు నరికట్టిరి.

కం. నగములు శైలం దాలిచి, యగచరసంఘంబు నిలువ♦ నద్రిసమీపా
నుగతమహాంభోధరతతి,పగటుం దలపించెఁ గన్గ♦వకు వ్రేఁగగుచున్. ౧౩౯౮

అర్థములు. నగములు = కొండలు, అద్రిసమీప = కొండదగ్గఱ చేరిన పెద్ద మేఘముల యొక్క, నగటున్=విధమును.

తాత్పర్యము

కొండలు చేతులధరించి వానరులు నిలువఁగా పర్వతసమీపమందు వెంబడించిన పెద్ద మేఘముల సమూహమును స్మృతికి వచ్చునట్లు చేసెను. అది కన్నులకు బాధాకరమై యుండెను.

—♦ ౬౨-వ సర్గము. కుంభకర్ణుఁడు రావణుఁ జూచుట ♦—

కం. కొదనిద్దురమబ్బును నతి, మదిరాపానమున నైన ♦ మత్తును బెరయన్
మది యాకులితంబుగ దశ, వదనుం గన రాక్షసప్ర♦వరుఁ డరిగె నొసన్.

అర్థములు. కొదనిద్దుర = కొదవనిద్దుర, కొఱనిద్దుర — అతిమదిరాపానమున=విస్తరించి సారాయము త్రాగుటచే, బెరయన్ = కలియఁగా, ఆకులితంబుగ=కలఁత చెందినట్లుగ, ప్రవరుఁడు=శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము

కొఱఁత నిద్దురలో లేచిన మబ్బును, విస్తారముగఁ ద్రాగుటచేఁ గలిగిన మత్తును గలియఁగా మనస్సు కలఁతపడఁగా రావణునిజూడ రాక్షసశ్రేష్ఠుఁ డగు కుంభకర్ణుఁడు త్వరగా పోయెను.

సీ. రాక్షసవీరుల ♦ రాజి భజింపఁగఁ, బురజనుల్ చల్లఁగఁ ♦ బువ్వువితతి
రమ్యలక్ష్మీక మా ♦ రాజమార్గంబునఁ, జని హేమజాలక ♦ సమ్మతంబు
తతభానుభాస్వర ♦ దర్శనంబును విశా, లం బగు నన్న గృ ♦ హంబుఁ దరణి
యభ్రజాలముఁ జొచ్చు♦నటుసొచ్చి లోఁ జని, కక్ష్యాంతరంబులు♦గడచి పోయి
తే. దూరమునఁ బాకవిద్వేషి♦తోయజభవుఁ జూచుభంగిని నగ్రజుఁ♦జూచియతఁడు
పుష్పకవిమానమునఁ జింత♦మునిఁగియుండఁ, జేరఁజనఁ గుంభకర్ణుండు శీఘ్రగతిని.

అర్థములు. రమ్యలక్ష్మీకము = మనోహరమైన యందము గలది, హేమజాలక సమ్మతంబు = బంగారు కిటికీలచేత సర్వప్రియమైనది, తత = విస్తారముగ భానుభాస్వరము = సూర్యకాంతిచే, దర్శనంబును = కానవచ్చు నాకారముగలది దృశ్యత ఇతి దర్శన మ్మని వ్యుత్పత్తి, ఆకారము అని యర్థము. తరణి=సూర్యుఁడు, అభ్రజాలము = మేఘసమూహము, కక్ష్యాంతరంబులు = లోపలి తొట్టికట్లు, పాకవిద్వేషి = ఇంద్రుఁడు, తోయజభవున్ = బ్రహ్మను.

తాత్పర్యము

వీరు లగు రాక్షసుల సమూహము వెంబడింపఁగ పురములోనివారు పూలు చల్లఁగా మనోహరమైన యందముగల రాజమార్గంబునఁబోయి బంగారు కిటికీలచే మనస్సునకుఁ బ్రియము కలిగించుచు సూర్యునివలెఁ బ్రకాశించు నాకారము గలిగి

వెడలు పైన యున్న యింటిని సూర్యుఁడు మేఘములందుఁ బ్రవేశించినట్లు ప్రవేశించి తొట్టికట్లు దాఁటిపోయి దూరమున నుండియే యింద్రుఁడు బ్రహ్మను జూచునట్లు చూచి యతఁడు చింతలో మునిఁగియుండుటచేఁ దన రాక తెలిసికొన లేక యుండఁగా దగ్గఱకుఁ బోఁగా.

శా. రమ్మా నాయన! యంచు రావణుఁడు హా॰ర్షం బారఁగా లేచి ప్రే
  మ మ్మైపారఁగఁ గౌఁగిలించుటయు స॰మ్మానంబుతో నన్నపా
  దమ్ముల్ ఫాలము సోఁక మ్రొక్కి నికట॰స్థం బైన పీఠంబునన్
  సమ్మోదంబున నుండి యిట్టు లనె రూ॰క్షప్రేక్షణుం డన్నతోన్. ౧౪౦౧

అర్థములు. నికటస్థము=సమీపమందుండు, రూక్షప్రేక్షణుఁడు = కఱకుఁ జూపులు గలవాఁడు.

తాత్పర్యము

నాయనా వచ్చితివా యని సంతోషముతో లేచి ప్రేమాతిశయమునఁ గౌఁగిలింపఁగా కుంభకర్ణుఁడు అన్న పాదములకు నొసలు దాఁక నమస్కరించి సమీపమందున్న పీటపై గూర్చుండి కోపముచేఁ గఱకులైన చూపులతో నిట్లనెను.

కం. భూవర! నాపైఁ బ్రేముడి, నీ వేళను నన్ను లేప॰ నేలా చెపుమా?
  యేవంక భయము దోఁచెనో, యెవాఁ డాకో ప్రేతభావ॰మిపుడు వహించున్.

అర్థములు, ప్రేముడిన్=ప్రేమచే, ప్రేతభావము—మరణము.

తాత్పర్యము స్పష్టము.

కం. త్వరగ వచింపుము యన సో॰దరకోపస్థితి నెఱింగి॰ దశముఖుఁ డీష
  త్పరివృత్తలోచనుండై, యరమర లేకనిట్లు నమ్మ॰హావీరునితోన్. ౧౪౦౩

అర్థములు. ఈషత్=కొంచెము, పరివృత్తలోచనుండై=తిరిగెడు కన్నులు గలవాఁడై, అరమర=భేదభావము, సందేహము.

తాత్పర్యము

త్వరగా చెప్పుము, అనఁగా తమ్ముఁడు తన స్థితి విని కోపించి యున్నాఁడని తెలిసికొని రావణుఁడు కొంచెము కోపముచేఁ గన్నులు తిరుగుచుండ నితఁడు చేయునో చేయఁడో యను సందేహములేక యా వీరునితో నిట్లనెను.

-॰ రావణుఁడు కుంభకర్ణుతో శ్రీరామునివలన రాక్షసులకైన విపత్తు దెలుపుట ॰-

ఉ. తమ్ముఁడ! నీవెఱుంగవు గ॰దా సుఖసుప్తుఁడ వౌటఁ బెద్దకా
  లమ్మగ నన్ను రాఘవుఁ డ॰లంచెడిరీతి, దినేశసూతి సా
  హాయ్య మ్మొనరింప సైన్యయుతుఁ॰డై వనరాశిఁ దరించి సోఁకుసై
  న్యమ్మును సర్వ మాజిని వి॰నాశము సేసెడి మూలముట్టుగన్. ౧౪౧౪

అర్థములు. సుఖసుప్తుఁడవు=సుఖముగా నిద్రించువాఁడవు, పెద్దకాలముగ= దీర్ఘకాలముగ, యుద్ధము ప్రారంభమై రెండు దినములే యైనను దుఃఖావమాన

ములచే చాలఁగాలము గడచినట్లున్నది, నిమిషమొక యేఁడుగానున్నది, అలంచెడి రీతి=బాధపెట్టుచున్న విధము, దినేశసూతి=సూర్యపుత్రుఁడు, సుగ్రీవుఁడు, వన రాశిన్ = సముద్రమును, తరించి = దాఁటి, పోఁతుసైన్యమ్మును = రాక్షససేనను, ఆజిని=యుద్ధమందు, మూలముట్టుగన్=నిశ్శేషముగ.

తాత్పర్యము

తమ్ముఁడా! నీవు సుఖముగా నిద్రించుచుండుటచేత దీర్ఘకాలముగ రాముఁడు నన్ను బాధపెట్టు విధము నీకుఁ దెలియదుకదా! సుగ్రీవుఁడు తోడుకవడ సేనతో సముద్రము దాఁటివచ్చి రాక్షససేన నంతయు కూఁకటి వ్రేళ్ళతో నాశము చేయు చున్నాఁడు.

తే. కంటివే సేతు వొక్కఁటి • కల్పితంబు, నేసి లంకాపురీప్రాంత• భాసమాన
నిష్కుటోపవనంబుల•నెగడఁ జేసె, వానరై కార్ణవంబు భూ•జాని యయ్యొ.

అర్థములు. లంకాపురీప్రాంత=లంకానగరమునకు చుట్టు, భాసమాన = ప్రకాశించు, నిష్కుటోపవనంబులన్=ఇంటితోఁటలు, ఉద్యానవనములు–నిష్కుటము = ఇంటికి చేరికగానుండి ఆ యింటివారికి మాత్రమే యుపయోగపడునది, ఉద్యానము = పదుగురి కుపయోగపడునది, వానరైకార్ణవంబు=కేవల వానర సముద్రమును, భూజాని = రాముఁడు, భూభర్త.

తాత్పర్యము

చూచినావా! సముద్రమునకు సేతువొకటి కట్టి లంక చుట్టునుండు తోఁటలలో దొడ్డులలో వానరులను సముద్రముచే రామచంద్రుఁడు నించినాఁడు.

ఉ. పోరికి రాక్షసోత్తములు • పోవుటె కాని యొకండునే నిజా
కారముతోడఁ గ్రమ్మఱుట • కానను, వానరులందు నొక్కఁడేన్
జేరుగలట్టివీరుఁ డని • చిద్దుటయున్ వినరాదు, దాన లోఁ
గూరెను భీతి, నీ పురముఁ • గూరిమి కావుము వీరసత్తమా! ౧౮౦౬

అర్థములు. చిద్దుటయున్=చచ్చుటయు.

తాత్పర్యము

యుద్ధమునకుఁ బోయిన రాక్షసవీరు లట్టులే పోవుటె కాని పోయిన స్వరూపములో వచ్చినవాఁడు లేఁడు. వానరులందుఁ బేరుగల వీరు డొక్కఁడైనఁ జచ్చినట్లు తెలియలేదు. ఆ కారణమున భయమగుచున్నది. వీరోత్తమా! ఈనగరమును నీవు దయతో రక్షింపుము.

ఉ. కూలుతు గాక యాప్లవగ•కోటుల నంచును నిద్ర లేపితిన్
జాలఁగ గోశసంచయము • సత్త్వము నాశిలె, నమ్ముమీ, జర
ద్బాలజనావశిష్ట మగు•పట్టన మన్ననిమిత్త మియ్యెడం
బాలన సేయుమా నలువు•మా యతిదుష్కర మైనకార్యమున్. ౧౮౦౭

అర్థములు. కోశసంచయము = ధనము, సత్త్వము=బలము = జరత్ + బాల జనావశిష్టము = ముసలివాండ్రు పిల్లవాండ్రు మాత్రము మిగిలినది. అతి దుష్కరము=మిగుల కష్టమైన పని.

తాత్పర్యము

వానరసమూహమును నీవు చంపుదువుగాక యని నిన్ను నిద్రలేపితిని. ఆర్జించిన ధనములోను బలములోను చాలభాగము నశించినది. ముసలివాండ్రు పిల్లవాండ్రు మిగిలిన యీ నగరమును అన్న నిమిత్తమై రక్షింపుము. మిగులఁ గష్టముతోఁ జేయదగిన కార్యము నీవు చేయుము. పిల్లవాండ్రు ముసలివాండ్రు మాత్రమే మిగిలినదశ యింకను బట్టలేదు. ఇంద్రజిత్తు మొదలగు శూరులున్నారు. మూలబల మున్నది. అది నశించిన తరువాత నీగతి వచ్చును. అయినను కుంభ కర్ణునికి జాలి పుట్టుటకై యీ మాట చెప్పెను.

ఉ. ఎన్నఁడు నీకు మున్ను వచి•యించినవాఁడనె యిట్లు? స్నేహసం
పన్నత యాదరంబు నతి•మాత్రము నీకయి నా కెఱుంగవే?
పన్నగ దేవతాసురుల•ఖండనవేళల వారినెల్ల శౌ
ర్యోన్నతిఁ గెల్వవే? మఱవు•నొందితివా యవి యన్ని యెప్పుడున్? ౧౭౦

తాత్పర్యము

తమ్ముఁడా! మును పెన్నఁడైన నేనిట్లు నీకుఁ జెప్పితినా? నీమీఁద నాకెంత యాదరము స్నేహము విశేషముగ నున్నదో నీ వెఱుఁగవా? దేవతలకు రాక్షసులకు యుద్ధము జరిగిన వేళల దేవతలను నీవు నీ శౌర్యముచే గెలువలేదా? అప్పుడు నీవు చేసినదంతయు నే నెప్పుడైన మఱచితినా?

ఉ. భీమపరాక్రమాఢ్య! భుజ•వీర్యము శౌర్యము ధైర్యమున్ సమి
ద్భూమిని నేఁడు చూపు, మిలఁ • బోటుమగండు భవత్సమానుఁ డే
డీ? మహితప్రియంబు ఘటి•యింపుము నాకిది, బంధులోక సం
గ్రామకళాప్రియా! మనయ•రాతులఁ ద్రుంపు తలంపు నెయ్యమున్. ౧౭౧

అర్థములు. భీమపరాక్రమాఢ్య = భయంకరమైన పరాక్రమ సంపదగలవాఁడా! సమిత్ +భూమిని = యుద్ధభూమియందు, పోటుమగండు = శూరుఁడు, భవత్సమానుఁడు = నీకు సరియగువాఁడు, బంధులోక = చుట్టముల సమూహమునకు, సంగ్రామకళా=యుద్ధవిద్యకు, ప్రియ=ప్రియమైనవాఁడా, అరాతులన్= విరోధులను, నెయ్యము=స్నేహము.

తాత్పర్యము

భయంకర పరాక్రమసంపత్తి గలవాఁడా! నీ భుజబలము, శౌర్యము, ధైర్యము నేఁడు యుద్ధభూమియందుఁ జూపుము నీవంటి శూరుఁడు నీకు సమానుఁ డేడీ? ఎక్కడ లేఁడు, నాకిది మిక్కిలి ప్రియమైనది. నీవును బంధువులందు యుద్ధవిద్యయందుఁ

ప్రియముగలవాఁడవు. కావున మన శత్రువుల చంపుము. మాయందు స్నేహము దలంపుము.

కం. నాకౌకసులం దోలిన, నీకు వనౌకసులు మాఱె ♦ నిరుపమతేజ
 శ్శ్రీక భవద్బలపవనో, ద్రేకవిధూతములఁ జేయు ♦ ద్వేషిఘనములన్.

అర్థములు. నాకౌకసులన్=దేవతలను, తోలిన=తఱిమిన, వనౌకసులు=వానరులు, మాఱె=ఎదురా, భవత్ బల = నీ బలమనెడి, పవనోద్రేక విధూతములన్=గాలి యొక్క యతిశయముచేఁ జెదరఁగొట్టఁబడినవి, ద్వేషిఘనములన్ = విరోధు లనెడి మేఘములను.

తాత్పర్యము

దేవతలఁ బాఱదఱిమిన నీకుఁ గోఁతులా యెదురు? అసమాన తేజస్సంపద గలవాఁడా? నీ బలమనెడి గాలిచే విరోధులను మేఘము లను జెదరఁగొట్టుము.

—♦ ౬౩-వ సర్గము. కుంభకర్ణుఁడు రావణు నిందించుట ♦—

చ. అని యిటు లంగలార్చు దను♦జాధిపుఁ గన్గొని నవ్వి దోఁప ని
 ట్లను మును మేము మంత్రసమ♦యంబున నెట్టి విపత్తు రాఁదు నీ
 కని మది నిశ్చయించితిమొ ♦ యట్టివిపత్తు హితాభిలందు ర
 క్తి ని గొనవట్టి నీకుఁ గలి♦గెన్, విపరీతము లేదు దీనిలోన్. ॥౧॥

అర్థములు. అంగలార్చు=అంగలి యొండనేడ్చు, నవ్వదోఁపన్ = అప్పుడు చెప్పిన వినక పోయితివే, యిప్పుడు నెత్తి తగిలినదా యని నవ్వి.

తాత్పర్యము

అని యీ ప్రకారమేడ్చునట్లు మాటలాడు రావణుని జూచి నవ్వి యిట్లనియె. ఆలోచన సమయంబున నీకెట్టి కీడు రాఁదు నని మేము నిశ్చయించితిమో యట్టి కీడే నీ మేలుకోరువారి యందు ప్రేమలేనట్టి నీకు నేఁడు గలిగినది. ఇందు విపరీతము లేదు. ఏమిరా? యుద్ధమని జరిగిన మనవారిలోఁ గొందఱైన జతురుగాని చావక యుండరుగదా. ఒక యాఁడుదాని నిమిత్తము నా మేలు కోరిన వారిని నేను జంపుకొన వచ్చునా యను నాలోచన నీకు లేదాయె. చెప్పినను దెలిసికొనక పోయితివి. ఆఁడుదానియందు కామమున్నంత మాత్రము నీ బంధువులందు మిత్రులందు ప్రేమ లేదాయె. దాని ఫల మనుభవించు చున్నావు. అనుకొనిన దానికి విరుద్ధముగా నేదియు జరుగలేదు.

కం. దురితములు సేయువారలు, నిరయంబునఁ గూలునట్లు ♦ నీ చేసిన యా
 దురితము తత్ఫలము న్నిను, విరియక చేసేత ననుభ♦వింపఁగఁ జేసెన్.

అర్థములు. దురితములు=పాపములు, నిరయము = నరకము, విరియక = చెడిపోక, చేసేతన్ = వెంటనే.

### తాత్పర్యము

పాపము చేసినవారికి నరకానుభవము దప్పనట్లు నీవు చేసిన పాపకార్యము నకు ఫలము వెంటనే కనఁబడెను. దాని ననుభవించు చున్నావు అత్యుత్కట పుణ్య పాపములు త్వరలోనేకదా ఫలము కనఁబఱుచును. ఈచేతఁ జేసితివి, ఆచేత ననుభ వించుచున్నావు. ఇప్పు డేడ్చి లాభమేమి ?

చం. తొలుతను రాజ! నీ వెవరి • తోడను గర్జముభంగి రోూజనం
జులుపఁగ లేదు, కేవలము • శౌర్యమదంబున భావ్యనర్థముల్
దలఁపగ వైతి, విత్తపుఁడు • దా మును వెన్కఁలఁ జేయ నర్థమా
కెలసము లోలి వెన్క మును • గేరి యొనర్చిన నీతివేత్తయే ?   ౧౮౧౩

అర్థములు. కర్జము భంగిన్=కార్యవిధమును, భావ్యనర్థముల్=రాఁబోవు కీడులు, విత్తపుఁడు = ధనము గలవాఁడు, కెలసము = కార్యము, నీతి వేత్తయే= నీతి తెలిసినవాఁడా.

### తాత్పర్యము

రాజా ? నీవు సీతను దెచ్చుటకు ముందుగ రాముఁ డనువాఁడు మన ఖరా దులఁ జంపినాఁడు, దానికిఁ బ్రతిక్రియగా సీతను దేఁదలచినాను, ఇట్లుచేసిన యుద్ధము చేయుకయే రాముని జంపవచ్చునని నా యభిప్రాయము, మీ యభిప్రాయ మేమి యని యెవ్వరితో నాలోచింపవైతివి. నేను శౌర్యముగలవాఁడనను మదముచే నేమి కీఁడులు రాఁగలవో యాలోచింపక పోయితివి. ఇది రాజనీతియా? నీతివంతుఁ డిట్లు చేయునా ? ధనముగలవాఁ డొక వ్యాపారమునందు దిగుటకు ముందు రాఁగల లాభ నష్టముల నాలోచించి ధననష్టి కష్టము లేని మార్గము చేయవలయునా? కన్నులు మూసికొని ధనముగలవాఁడను నాకేమి లక్ష్య మని కార్యముచేసి నష్టివచ్చినపిమ్మట నేమి చేయవలయునని యాలోచింపవలయునా? ఇది నీతి తెలిసినవాని లక్షణమా ?

సీ. హవిని నపాత్రుల • కర్పించునట్టులు, కాలదేశవిహీన • కార్యతతులు
విపరీతఫలముల • వెలయించు నుత్తమ, మధ్యమాధమ కార్య•మార్గములను
దేవ! ద్రవ్యం బన • దేశకాలములునా, నాత్మప్రయోజనా•ఖ్యలను బరఁగు
పంచసంబంధంబు • లంచితగతిఁ గూర్చి, సచివులతోడ యోూ•జన యొనర్చ

ఆ. ననుభవించుఁ జూమ్మ • యతులనీతిఫలంబు, నీతి విడక కార్య•నిర్ణయంబు
సచివమిత్రయుక్తిఁ•జలిపెడు నాతండు, కార్యజయముఁ గాంచి•గణన కెక్కు.

అర్థములు. హవిని=హోమము చేయఁగా మిగిలినదానిని, అపాత్రులకు= అయోగ్యులకు, కాలదేశ విహీన=కాలము దేశము నాలోచింపక చేసిన, కార్య తతులు = కార్యసమూహములు, విపరీత ఫలములన్ = చెడు ఫలములను, ఉత్త మము, మధ్యమము, అధమము అను కార్యముచేయు త్రోవలను.

తాత్పర్యము

హావిస్సును సహస్రాక్షుల కిచ్చిన దోషము వచ్చునట్టులు ఏకాలమున నేకార్యము నెట్లు చేయవలయును. ఏ ప్రదేశమున నేకార్య మెట్లుచేయవలయును? అనుజ్ఞానము లేక యిష్టము వచ్చినట్లు చేసిన, ననుకొన్న ఫలమునకు విరుద్ధమైన ఫలము నిచ్చును. శత్రువులు బలహీనులుగా నుండి తాను బలవంతుఁడుగా నుండునపుడు యుద్ధమునకుఁ బోవుట యుత్తమమార్గము. శత్రువు తనయంత బలముఁకలవాఁడై సమానుఁడై యుండెనా సంధి చేయవలయును. ఇది మధ్యమమార్గము. శత్రువు బలవంతుఁడై తాను బలహీనుఁడైనపుడు వాని యిష్ట ప్రకారము వానికి నేదైన నిచ్చి వాని నాశ్రయింపవలెను. ఇది యధమమార్గము. రాజా! యిది గాక ద్రవ్యము - దేశము - కాలము - ఆత్మ ప్రయోజన మని యైదు సంబంధములు గలవు. ఈ యైదింటికిఁ దగిన టుత్తమ మధ్యమాధమ కార్యము లెట్లు చేయవలె - ఏది చేయవలె నని మంత్రులతో నాలోచించి చేయవలెను. మంత్రులను వారి నుంచుకొనుటయేల? వారి నాలోచింపక పనిచేయు వానికి మంత్రు లేల? తన యిష్టమువచ్చినట్లు కార్యములు చేసి యవి తప్పివచ్చినపుడు ఏమిచేయవలయు నని యడిగిన మంత్రులేమి చెప్పఁగలరు? ఇట్లు చేయుటకు ఫలము న్యాయ్యమార్గమం దుండుటయే. న్యాయము తప్పక మంత్రులతోను స్నేహితులతోను నాలోచించి వారితోఁ గలిసి కార్యముచేయు విధము నిర్ణయించి చేయువాఁడు కార్యజయము గాంచును. నీతి మంతుఁడని ప్రసిద్ధి కెక్కును.

చ. క్రమముగ ధర్మ మర్థమును • గామము వేఱుగ నైన నన్నిటిన్
గ్రమమఱి రెండు రెండయిన • రాక్షసవల్లభ ! నిత్య మర్హ కా
లముల భజించు పూరుషుఁడు • లక్ష్మికిఁ బట్టగు, నెల్లవేళఁ గా
మము గొనియాడువాఁడు నొక • మానవుఁడే ? సిరి వాని నొల్లునే ? ౧౪౧౫

తాత్పర్యము

ధర్మము అర్థము కామము వీనిని వేఱు వేఱుగ నొక్కొక్క దానినైనను అన్నిటిని గలిపి యైనను క్రమము దప్పించి రెండు రెండుగ నైనను, అనఁగా ధర్మార్థములుగాని, ధర్మకామములుగాని, అర్థకామములుగాని, ప్రతిదినము దాని దానికి విధించిన కాలమందుఁ జేయవలెను. అనఁగా ప్రాతఃకాలమందు ధర్మము, మధ్యాహ్నమందు అర్థము,సాయంకాలమున కామముఁగురించి యాలోచింపవలెను. ఇది వేఱువేఱుగాఁ జేయుపద్ధతి. అటుగాక ప్రాతఃకాలమందు విహితమైన ధర్మము చేసి తరువాత దానికిఁ దోడుగా నర్థము నాలోచింపవచ్చును. మధ్యాహ్నమున విహితమైన అర్థము నాలోచించి యావల దానికి దోడు ధర్మము నాలోచింపవలెను. సాయంకాలమునఁ గామము నాలోచించి యావల దానికిఁ దోడు ధర్మముగాని యధర్మముగాని యాలోచింపవలెను. అంతియె కాని సాయంకాలమందుఁ దప్పఁ

దక్షిణవేళల కామవిచారము నిషిద్ధము. ఇది రెండవ రెండుగాఁ జేయుపద్ధతిఁ సాయంకాలమందు ధర్మార్థ కామములు మూఁడు నాలోచించుట మూఁడవ పద్ధతి. అటుగాక సర్వవేళలఁ గామమునే యాలోచించు వాఁ డొక మనుష్యుఁడా? వాని యొద్ద లక్ష్మి నిలుచునా ?

తే. దానఁ ద త్త్రితయమున నుత్తమ మెఱింగి
నృపుఁడో నృపమాత్రుఁడో దాని • నిష్ఠఁ దవుల
నొల్లఁడేన్ వాఁడు గుండెలు • గ్రుక్క మిగులఁ
జదివి యేటికిఁ గేవల•శ్రమముచేటు. ౧౪౧౬

అర్థములు. దానన్ = ఆ కారణముచేత - తత్ + త్రితయమునన్=ఆ మూఁటి యందు, ధర్మార్థకామములందు, ఉత్తమము=శ్రేష్ఠమైనది, నృపుఁడో = ప్రజలఁ బాలించు రాజో, నృపమాత్రుఁడో = రాజువంటి గొప్పవాఁడో, నిష్ఠన్ = వ్రతముగా, విడువక తవులఁ డేని=అనుష్ఠింపక పోయెనా ?

తాత్పర్యము

ఈ కారణముచేత ధర్మార్థ కామములందు నుత్తమాధమ మధ్యమములందు నేది శ్రేష్ఠమో కేవల ధర్మముగాని, ధర్మముతోడి యర్థకామములఁ గాని తెలిసి కొని రాజయినను గాక యంతటివాఁ డితరుఁడైనను విడువక యనుష్ఠింపఁ డేనివాఁడు చదివిన చదువునకు ఫలము గుండెలు గ్రుక్క చదివి శ్రమపడుట తప్ప వేఱు ఫలము లేదు. వాఁడు చదివిన చదువు వ్యర్థము. నీ చదువు గతి యిట్టిదే యని భావము.

ఉ. సామము దానభేదములు • సంహతి గాఁగనొ యొక్కఁ డొక్కఁడో
నీమము దోఁప నీతియు న•నీతి నెఱుంగుచు ధర్మవిత్తముల్
కామము మంత్రయుక్తుఁ డయి • కార్యకృతీకరణం బొనర్చి ని
ష్ఠామహితాత్ముఁ డౌ నరుఁడు•సత్యము కీడునఁ గుందఁ డెన్నఁడున్. ౧౪౧౭

అర్థములు. సామము=శత్రువుతో మంచి మాటలాడుచు నుండుట, లోపల విరోధభావ మున్నను పైకి దానిని దెలియనీక మంచిమాటలాడుచు స్నేహితునివలె నుండుట, దానము=శత్రువునకు ధనమిచ్చియో వాని కార్యములందు సహాయ పడియో సమరసపడి యుండుట, భేదము=మిత్రునివలె నటించుచు శత్రుపక్షము వారిలో నొకరికి భేదాభిప్రాయములు కలహము పుట్టించుట, సంహతి గాఁగనో= ఇవి యన్నియు నేక కాలమందుఁగాని, నీతి = న్యాయము, వినీతి = అన్యాయము, ధర్మవిత్తముల్=ధర్మము అర్థము, మంత్రయుక్తుఁడయి=ఆలోచనతోఁ గూడిన వాఁడై, కార్యము నిశ్చయము చేసికొని దానిని నియమముగా ననుష్ఠించు గొప్ప మనస్సుగలవాఁ డే నాఁటికిని కీడులపాలు కాఁజాలఁడు. ఇది సత్యము.

తే. అర్థతత్త్వజ్ఞ మగు సచి•వాళితోడఁ, గార్య మిట్టిది యిట్టి ద•కార్య మనుచు
యోజన మొనర్చి హితఫల•మొసఁగు దానిఁ, జలుపునాతఁడు జీవించు•సౌఖ్యముగను.

అర్థములు. అర్థతత్త్వజ్ఞము = నీతి శాస్త్రము ప్రకారము మూఁడు పురుషార్థముల రహస్య మెఱిఁగినది యగు, సచివాళితోడన్=మంత్రుల సమూహముతో, హితఫలము=మేలగు ఫలము.

తాత్పర్యము

నీతిశాస్త్రప్రకారము ధర్మార్థకామములను పురుషార్థముల యనుష్ఠాన రహస్యము తెలిసికొని యిది చేయఁదగినపని, యిది చేయరాని పని యని యాలోచించి యేది హితము నొసఁగునో దానిని జేయువాఁడు సుఖముగ జీవించును.

చ. తెలియక శాస్త్రమర్మములు • దేఁకువమైఁ బశుబుద్ధులైన జా
ల్ములు సురవైరివర్య! భ్రమ•మోహితచిత్తనృపాలుమంత్రులై
వెలయుచు మంత్రముల్ సలుపు•వేళలఁ గేవల మాప్రగల్భతన్
బలుకఁగ ముందు నిల్చెదరు • పాటిలుచేటుఁ దలఁప రేమియున్. ౧౪

అర్థములు. శాస్త్ర మర్మములు=శాస్త్రార్థ రహస్యములు, తేఁకువమై = సాహసముతో, పశుబుద్ధులైన జాల్ములు=పశువులవలె నాలోచించు జ్ఞానము లేని మూఢులు, 'జ్ఞానేన హీనః పశుభిస్సమానః' జ్ఞానము లేనివాఁడు పశువుతో సమానుఁడు భ్రమమోహిత చిత్త నృపాలు మంత్రులై = కార్య మకార్యమని యకార్యము కార్యమని తలఁచి యజ్ఞానవశమైన మనస్సుగల రాజులకు మంత్రులై, మంత్రముల్ సలుపు వేళలన్=ఆలోచనములు చేయునపుడు, కేవలమా ప్రగల్భతన్ = మంచి చెడ్డలు కాఁకు దప్పులు నాలోచించు శక్తి లేక తెలిసినవారివలె వర్తింపవలయు నను డంబముతో.

తాత్పర్యము

యథార్థజ్ఞానము లేమిని సరియైనది తప్పని తప్పొప్పని తలంచు ప్రభువునకు, నీతిశాస్త్ర రహస్యములు తెలియక సాహసముగలవారై పశువులవలె ఆహారనిద్రాభయమైథునంబుల మాత్ర మనుష్ఠించువారు మంత్రులై, కార్యాకార్యము లాలోచించు సమయమునందు నూరకుండిన మూఢులని ప్రభువు దలంచునని యూహాపోహములు లేక, తెలిసిన వారని పించుకొనవలెనను డంబముతో, ఆలోచన చెప్పుటకు ముందు వచ్చెదరు. తాము చెప్పినట్లు చేసిన మేలు గలుగునా కీడు కలుగునా యని యాలోచింపరు. అటువంటి ప్రభువగు నీకు నిటువంటి మంత్రులే దాపరించిరని భావము.

తే. అర్థశాస్త్రానభిజ్ఞులై • యధికలక్ష్మి, నంద నఖిలాషపడెడి శా•స్త్రార్థధీవి
హీనుల హి తేతరోక్తులఁ•నించు కేని, పాటిసేయంగఁ దగదు ని•శాటరాజ!

అర్థములు. అర్థశాస్త్రానభిజ్ఞులై = నీతిశాస్త్రము తెలియనివారై, అధిక లక్ష్మినందన్ = సంపద విశేషముగ రావలయునని, అఖిలాష పడెడి=కోరికగల, శాస్త్రార్థధీ విహీనుల = శాస్త్రార్థ జ్ఞానము లేనివారియొక్క, హితేతరోక్తులను= కీడు కలిగించు మాటలను, ఇంచుకేని=కొంచెమైన, పాటిసేయంగరాదు = ప్రమా

దముగా గ్రహింపరాదు. నిశాటరాజ = రాక్షసరాజ, నిశయందు దిరుగువారు నిశాటులు.

తాత్పర్యము

నీతిశాస్త్రము దెలియనివారై సంపద విశేషముగ రావలయు నని కోరిక మాత్రము గలవారైన శాస్త్రార్థజ్ఞానము లేనివారు చెప్పు కీడు గలిగించు మాటలను రాజగువాఁడు కొంచెమైనఁ బ్రమాణముగ గ్రహింపరాదు.

తే. హితమువలెఁ దోఁచు నహితంబు ♦ ధృష్టుఁ డగుచు
వాఁగు చెఱుపనచేటను ♦ వల నెఱింగి
కార్యములు యోజన నొనర్చు ♦ కాలములను
దవ్వు దవ్వుల నిల్పుటే ♦ తగవు పతికి. ౧౮-౧౯

అర్థములు. ధృష్టుఁడు=దిట్టతనము గలవాఁడు, తెంపరి - వాఁగు=వదరు నట్టి, చెఱుపన చేటను=కార్యనాశము చేయువానిని, వలను=ఉపాయము.

తాత్పర్యము

శాస్త్రజ్ఞానము లేనివాఁడు చెప్పెడు మాటలు వినకుండుటే గాదు, రాజగువాఁడు వానిని మంత్రాలోచన సభకే రానీయరాదనుచున్నాఁడు. పైకి హితము వలెఁ గానవచ్చు నహితమైన దానిని ధీరుఁడై వదరునట్టి కార్యనాశకరుని, ఉపాయ మెఱిఁగి కార్యము లాలోచించుకాలమందు సభకు రానీయక దూరమునందే యుంచవలెను.

కం. కర్మజ్ఞులైన పగఱకు, మర్మంబులు చెప్పి యాత్మ♦మహీపునిచే దు
ష్కర్మంబులు చేయించుచు, దుర్మంత్రి విపత్పయోధిఁ ♦ ద్రోయుఁడె ఱేనిన్.

అర్థములు. కర్మజ్ఞులైన పగఱకున్ = ఏ కార్య మెట్లు చేయవలయునో తెలిసిన పగవారికి, మర్మంబులు=రహస్యములు, దుష్కర్మంబులు = చేయరాని పనులు దుర్మంత్రి = చెడ్డమంత్రి, ఱేనిన్ = ప్రభువును విపత్పయోధి = ఆపత్సముద్రమునందు, ద్రోయఁడె=ద్రోయకుండునా? అవశ్యము ద్రోయును.

తాత్పర్యము

ఏయే కార్య మెట్లెట్లు చేయవలయునో తెలిసిన పగవారికిఁ దన ప్రభువు రహస్యంబులు చెప్పి యతనిచేఁ జెడు కార్యములు చేయించు దుర్మంత్రి తన ప్రభువు నాపదలందు ముంచకుండునా! అవశ్యము ముంచును.

కం. మిత్రులవలె వెలితోఁచు, నమిత్రుల మంత్రంబువేళ ♦ మెలపున శాంతిన్
ధాత్రీపతి మొఱఁగం దగు, శత్రుహరణ! వారి పలుకు♦సరణి యెఱయుచున్.

తాత్పర్యము

మిత్రునివలెఁ బైకి కనఁబడుచు వాస్తవమున మిత్రులుగాని మంత్రులను

రాజగువాఁడు తొందరపడక, మెలఁకువతో వారివారి యాలోచనలు చెప్పనపుడు మాటలాడు విధమును బట్టి తెలియనగును.

కం. త్వరపడి పని చేయుచు దు,శ్చరితు సచివుఁ డనుచు నమ్మ • జనపతి మర్మం
బరయుచు లోఁ జొత్తురు పరు, లరిమర్దన! క్రౌంచనగము • హంసలువోలెన్.

తా త్ప ర్య ము

విమర్శింపక తొందరపడి పనిచేయుచుఁ జెడు నడవడి గలవానిని హితుఁడగు మంత్రియని నమ్మనట్టి ప్రభువు మర్మము తెలిసికొని క్రౌంచనగములోని రంధ్రము తెలిసి హంసలు లోపలఁ దూఱినట్లు పగవారు దూఱుదురు.

కం. ఉక్కఱు నరి నెఱుఁగక తమ, నక్కఱఁ గాచికొనలేని • యధిపతి కీడుల్
తక్కక పొరయఁగ సంపద,లక్కఱలుగాఁ బోలియు నాత్మ•పదవీచ్యుతుఁడై.

అర్థములు. ఉక్కఱున్ = కపట స్వభావము గలవానిని, అరిన్ = వాస్తవమున శత్రువు, పైకి మిత్రుఁడు, అక్కఱన్ = పనిపడినవేళ, ఆత్మపదవీచ్యుతుఁడై =తన పదవిని బోగొట్టుకొన్నవాఁడై.

తా త్ప ర్య ము

మిత్రునివలె నటించుచు కపటము గలవాఁడైన శత్రువును దెలిసికొన లేక వాని మాటలు నమ్మి యక్కఱవేళఁ దన్ను రక్షించుకొనలేని ప్రభువు కీడులు తప్పక పొందినవాఁడై తనపదవి పోఁగొట్టుకొని సంపదకూడ నాశముచేసికొనును.

కం. ఘను నీ కనుజుఁడు చెప్పిన, పని కేయుమ యది నెమ్ నీకుఁ•బరమహితం బౌ
దనుజాధిప! నామత మిది, విను మావలఁ జేయుమీ యభీష్టముపగిదిన్.

అర్థములు. అనుజుఁడు = మన తమ్ముఁడు, విభీషణుఁడు.

తా త్ప ర్య ము స్పష్టము

ప్రహస్తుఁడు కుంభకర్ణుఁడు నేకాభిప్రాయము గలవారు. నీవు క్షుద్రకామమును బ్రధానముగా నెంచి దానికై ధర్మార్థములు నాశము చేసికొనఁ జూచుట నీ మొదటి తప్పు. నీకు వాస్తవము తెలుపక భయముననో దాక్షిణ్యముననో తెలివి తక్కువ తనముచేతనో దుర్బోధములుచేసి నీవు చేసినదే సరియని యిచ్చకములు పలుకు వారలను దూరముగ నెడలఁగొట్టక దగ్గఱ చేర్చుట నీ రెండవతప్పు. నీ మేలుకోరి చెప్పినవానిని విడనాడుకొనుట మూఁడవతప్పు. ఈమూఁడు తప్పులచే నీవు నాశమైపోవుచున్నావు. అనుట కుంభకర్ణుని యుపన్యాసమున సారాంశము.

—• రావణుఁడు కుంభకర్ణుఁ గోపించి పలుకుట •—

తే. ఇట్లు ఘటకర్ణుఁ డెంతయు • హితముఁ బలుక
వింశతిభుజుండు విని రోష • వివశుఁ డగుచుఁ
గనుబొమ లుబ్బడివడఁ గను • గ్గలఁక వాఱఁ
గటము లదరంగ సోదరుఁ • గాంచి పలికె. ౧౮.౨౭

అర్థములు. హితము = మేలైనది, రోషవివశుఁడు=కోపముచే దేహము తెలియనివాఁడు, కటములు=చెక్కిళ్ళు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. శౌర్యధనాఢ్య! నీతిగుణ • శాలియు మాన్యుఁడు నైన దొడ్డయా
చార్యునిపోల్కి శాసనము • సల్పెద వేలర? చాలుఁ జాలు, నీ
కార్యము వేళ యుక్తముగ • కార్యము సల్పినఁ దీరుఁగాక యే
పర్యవసాన ముండెడిని • బల్కుము కేవలవాక్ప్రపంచమునన్. ౧౪-౨౦

తాత్పర్యము

ఓరీ మహాబలశాలీ! నీతిగుణము గలవాఁడును పూజ్యుఁడునైన పెద్ద యాచార్యునివలె 'నీవు చేసినది తప్పు. ఇట్లు చేయుమని' నన్నాజ్ఞాపించెదవేలరా? చాలుఁజాలు. మాటలాడకు. పనిపడిన యప్పుడు పనిచేసినఁ గార్యము చక్క నగును గాని రిక్తమాటలు నోరెండ వదరిన నేమిరా లాభము వచ్చును.

కం. పొరపడియో తెలియమినో, యురుబలవీర్యాశ్రయమున • నో తప్పి చనన్
గరణీయము మఱిమఱి యది, వరమని భాషింప నేమివచ్చుం జెపుమా?

తాత్పర్యము

చేయవలసిన కార్యము ప్రమాదముననో అజ్ఞానముచేతనో బలము, శౌర్యము గలదను నమ్మకము చేతనో చేయక తప్పిపోయినది. దానినే మీఁదమీఁద నీవు చేసినది తప్పు. నీవు చేసినది తప్పని మఱియొకటి యొప్పని మాటలాడిన రాఁగల లాభమేమి?

కం. కడచినదానికి వగతురె?, కడచినదో కడచినదియె • కార్యం బిపుడే
నడుపుచుఁ దీర్పఁగ వలె నది, కడఁగు; గత మువన్యసింప • గార్యము గలదే?

తాత్పర్యము

బుద్ధిమంతులు తమ చేయిమించి దాఁటిపోయిన దానికి పోయెనే పోయెనే యని యేడ్తురా యేమి? పోయినదేమో పోయినది. కార్యము నిప్పు డెట్లు చక్కఁ బెట్టవలయునో దానికిఁ బ్రయత్నింపుము. అంతియకాని కడిచినదాని నుపన్యసింప నేమి కార్యము కాఁగలదు.

ఉ. నాపయి నీకు స్నేహము ఘ • నం బగు నేనియు, నీ వెఱుంగుదేన్
నీ పటుశౌర్య మింతయని • నీ మది, నిప్పటి యెత్తికోల్ నిరా
క్షేపపుఁ గార్యమంచుఁ బరి • కించెద వేనియు, వేగ మామకీ
నాపనయోద్భవం బగు న • నర్థము శౌర్యముచేతఁ దీర్పుమీ. ౧౪౩౧

అర్థములు. ఘనంబు = గొప్పది, ఎత్తికోల్ = ప్రయత్నము, యుద్ధ ప్రయత్నము, మామకీన=నాయొక్క, అపనయ = నీతిమాలినతనముచే, ఉద్భవం బగు=కలిగిన, అనర్థము=కీడు, తీర్పుమీ=చక్కఁజేయుము.

తాత్పర్యము

నామీఁద నీకు విశేషించి ప్రేమ యుండినను నీ బలశౌర్యము లెంత మాత్రమో నీకుఁ దెలిసియుండినను, ఇప్పటి యుద్ధప్రయత్నము నిరాక్షేపకార్య మని నీకుఁ దోఁచినను శీఘ్రముగ నేను నీతిమాలి చేసిన కార్యముచేఁ గలిగిన కీడును నీ శౌర్యముచేతఁ జక్కఁజేయుము.

దీనివలనఁ దాను జేసిన సీతాహరణము నీతిమాలిన పని యని రావణునకుఁ దోఁచిన కాని దురభిమానము అవమానము మౌర్ఖ్యము ఆమెను మరల నిచ్చుటయం దడ్డపడిన వని యేర్పడుచున్నది. ఇప్పుడు సీతను రామచంద్రమూర్తికి సమ ర్పించి సంధి చేసికొనినను, నీ పని యప్పుడే చేయరాదా? ఈమాత్రమున కందఱను జంపవలెనా? పరుల నెందఱినైనఁ జంపనేర్చునుగాని తన ప్రాణముమీఁదికి వచ్చి నపుడు భయపడి సంధిచేసికొనెను అని లోకు లందురే యని విచారము. కావునఁ బ్రతిష్ఠకై చావవలయునని యె వాఁడు నిశ్చయించెను.

కం. ఇడుమగొను టెఱిఁగి దీనత, మిడికెడినరుఁ జేరువాఁడె ♦ మిత్రుఁడు జగతిన్
దొడరి యపనీతి దుఃఖము, పడునాతనిఁ గాచువాఁడె ♦ బంధువు సుమ్మీ.౧౮౩౨

అర్థములు. ఇడుమగొనుట = ఆపదనొందుట, దీనతన్ = దుఃఖముచే, మిడికెడినరు=ఏమిచేయుటకుఁ దోఁపక బాధపడువానిని, చేరువాఁడె = సహాయ పడువాఁడె, అపనీతి=నీతిమాలినకార్యము చేసి.

తాత్పర్యము

ఆపద నొందుట తెలిసి దుఃఖపడువానిని జేరుకొని సహాయపడువాఁడే మిత్రుఁడు. నీతిమాలిన పనిచేసి దుఃఖపడువానిని రక్షించువాఁడే బంధువు. కాని సహాయము చేయక నీ వట్లు చేసితివే, ఇట్లు చేసితివే యని దెప్పెడివాఁడు బంధువు గాఁడు. మిత్రుఁడు కాఁడు.

—♦ కుంభకర్ణుఁడు రావణుని సమాధానపఱచుట ♦—

కం. అనిన క్షుభితేంద్రియుని ధీరుని దారుణవచను నన్న ♦ రోషవశుంగా
మనమున నెఱింగి మెల్లన, వినయంబున మధురసూక్తి ♦ విజ్ఞాపించెన్.౧౮౩౩

క్షుభితేంద్రియుని = కలఁతజెందిన యింద్రియములు గలవానిని ధీరుని = ధైర్యశాలిని, దారుణవచనున్=పరుషముగా మాటలాడువానిని, రోషవశుంగా= కోపించినవానిఁగా, మధురసూక్తి=తియ్యని మంచిమాటలతో.

తాత్పర్యము

ఈ ప్రకారము రావణుఁడు చెప్పఁగా తన యన్న కలఁత చెందిన యింద్రి యములు గలవాఁడు కావున నేను జెప్పినది వీని మనస్సునకు రాలేదు, తన పట్టిన పట్టు వదలనివాఁడు కావున మూర్ఖుఁడు. కోపము గలవాఁడు కావున బుద్ధినాశము గలవాఁడు, పరుషముగా పలుకువాఁడని తెలిసికొని, యిట్టివానికి నీతి చెప్పి ప్రయో

జనములేదు. శ్రోతలకు నీతి చెప్పిన సూచీముఖమువలె నగుదును అని చెల్లెన వణఁకువతో వానికిఁ బియ్యగాఁ దోఁచు మంచి మాటలతో నిట్లు విన్నవించెను.

ఇట్లు చెప్పుటచే కుంభకర్ణుఁడు చెప్పబోవు మాటలు రావణునకు విన నింపుగా నున్నట్టు లొక యర్థము - వాస్తవమున నతని యభిప్రాయము దెలుపు మఱియొక యర్థము గలవై యున్నవని సూచన.

సీ. చాలు రాక్షసరాజ! ♦ సంతసింపకు మింకఁ, దొలఁచుమీ కినుక స్వ ♦ స్థుండ వగుము
ఏ మనియుండఁగ ♦ నిది మది నిడఁబోకు, మెవ్వానివలన నీ ♦ కింత పుట్టె
వానిని బరిమార్తు ♦ బంధుభావంబున, సోదరస్నేహమ ♦ ర్యాదకతన
నన్ని వేళల హిత ♦ మాడు టావశ్యక, మాట నట్లాడితిఁ ♦ బాటితెఱఁగు
తే. ప్రేమగల చుట్ట మక్కఱ ♦ వేళఁ జేయు, నర్థము శత్రునాశంబు ♦ నసురరాజ!
యనఘ మగు మామకీనశౌ ♦ ర్యంబుఁ జేసి, సూడు నేఁ డనిసలిపి ♦ నీ ♦ సూడుదీర్తు.

అర్థములు. స్వస్థుండవు = (౧) కుదుటఁబడిన మనస్సుగలవాఁడవు, ఏన్ = నేను, మనియుండఁగన్ = బ్రదికి యుండఁగా, పాటితెఱఁగు = న్యాయవిధము, శౌర్యంబుఁజేసి=శౌర్యముచేత, సూడు=పగ, అనిసలిపి=యుద్ధముచేసి.

రెండవ యర్థము. చాలు రాక్షసరాజ=నీ రాక్షసరాజత్వము చాలును. అది పోవుకాలము వచ్చినది. ఇంక సంతసింపకుము. అవశ్యంభావి=తప్పక జరుగఁ గలదానికి సంతాప పడి లాభమేమి? తెలివి తక్కువ పనిచేసితినని యిప్పుడేల యేడ్చెదవు? అట్టులే కోపము వదలుము. మరణకాలమం దిది యుండరాదు. నిశ్చింతముగాఁ బ్రాణము విడిచినచో మేలు కావున స్వస్థచిత్తుఁడవు కమ్ము. స్వర్+స్థితుఁడవు=స్వర్గమం దుండువాఁడవు కమ్ము. ఏ మనియుండఁగ నిది మది నిడఁబోకు = నేను బ్రదికి యుండఁగా నే నిట్లుంటినిగదా యని నా మాటలు తలకెక్కనీయకుము, నేను జచ్చిన తరువాత కుంభకర్ణుని మాటలు వినకపోయితిని గదా యని యేడువకుము. ఎవ్వానివలన నీ కింత పుట్టె వానిని బరిమార్తును. బంధుభావంబున= నేను జెప్పిన మాటలవలనఁ గదా నీకింత కష్టము మనస్సునకుఁ దోఁచెను. అట్టి నన్ను బంధు వను నెపమున చంపుదువు, శత్రునాశంబు=శత్రువువలని నాశము, శత్రు వగు రామునివలన నాశము నేను జేయించుకొని, నీ సూడున్=నీయందు నాకుఁ గల కోపమును—తీర్తును, మంచి చెప్పినను నీకింత కోపము వచ్చెనుగదా, నీవు నిష్కారణముగ నామీఁద కోపించినపుడు నీమీఁద నాకుఁ గోపము రాదా? వచ్చినను నిన్ను నేను ప్రత్యక్షముగ నేమియుఁ జేయఁజాలను - నేను జచ్చి రామునిచే నిన్నుఁ జంపించెదను. అప్పటికి నా కోపము చల్లారును, నీసూడు = నేను బ్రదికి యుండు నంతవఱకే కదా నామీఁద నీకుఁ గోపము. నేను జచ్చి నీకోపము చల్లారఁ జేసెదను.

రాక్షసరాజా! చాలును ఇఁక సంతాపపడకుము. కోపమువదలుము. యథా ప్రకారము నీ మనస్సు కలఁతలేక యుండనిమ్ము. నేను బ్రతికి యుండఁగా దీనిని మనస్సులో నుంచకుము. ఎవనివలన నీ కింత కష్టము కలిగెనో వానిని చంపెదను. బంధువను తలంపుతోను అన్నవను స్నేహమువలనను, వాస్తవముగ మేలు కోరు వాఁడే సందర్భమందె నను హితమే చెప్పవలసి యుండుటచేతను ఆ ప్రకారము న్యాయవిధముఁ జెప్పితిని. అది నీకు రుచించినదికాదు. నా యిష్టప్రకారము నీవు రానపుడు నీ యిష్టప్రకారము నేను రావలయును గావునఁ బ్రేమగల బంధువు లక్కఱ వేళలఁ జేయవలసినది శత్రునాశమును అసమానమైన నా శౌర్యముచేత నేను యుద్ధముచేసి నీ పగ దోలఁగించెదను.

ఉ. చూడుము నన్ని దే సమర ♦ శూరుని రాముని వైరిఁ ద్రుంపఁగాఁ
బాడుగఁ బాఱుచుండఁ బర ♦ వాహినులం గనులారఁ జూడుమీ
వేడుక రాము గూల్ప రణ ♦ వీథిని దొర్లు శిరంబుతోడ న
న్నేడుచుచుండ నిమ్మిలమ ♦ హీ సుతయుం గరుణార్త చిత్తయై. ౧౮౩౭

అర్థములు. చూడుము నన్ని దే సమరశూరుని రాముని వైరిఁద్రుంపఁగా= (౧) వైరియగు రాముని నేను ద్రుంపఁగా సమర శూరుఁడనైన నన్ను జూడుము.

(౨) సమరశూరుని నన్ని దే కడసారిచూడుము. ఆవల నీవు నన్నుఁ జూడఁ బోవు. ఏలన, చూడుము రాముని, తన వైరియగు నన్నుఁ ద్రుంపఁగా; రాముని యనునది ప్రథమార్థమున ద్వితీయగానైన గ్రహింపనగు. పాఱుచుండ, బరవాహినులం గనులారఁ జూడుమీ=(౧) నాకు భయపడి పరుగెత్తి పోవుచుండ శత్రు సేనలను గన్నారఁ జూడుము. (౨) నేను జావఁగాఁ బరువెత్తుచుండ నీ శ్రేష్ఠమైన సేనలను అనిగాని, నీ సేనలు పరువెత్తి దూరమున నుండఁగా ననికాని చెప్పనగు 'శ్రేష్ఠాన్యదూర శ్రేష్ఠేషు పరః' అని నానా॥ ర. లేదా; పర=ఓరాక్షసుల పాలికి శత్రువా! అనియైనఁ జెప్పవచ్చును. వేడుకన్ = వినోదముగా, సంతోషముతో, రాము గూల్ప రణవీథిని దొర్లు శిరంబుతోడ. (౧) నేను గూల్పఁగా రణభూమి యందు దొరలు శిరంబుతోడ రాముని గనులారఁ జూడుమీ. (౨) భీష్ముఁగోని పోయిన' యన్నట్లు, రాముఁ గూల్పఁగా ననఁగా రాముఁడు గూల్పఁగా దొర్లు శిరంబుతోడ నన్ను నేడుచుచు గనులారఁ జూడుమీ; ఏడుచుచుండ నిమ్మిల మహీ సుతయున్ గరుణార్తచిత్తయై = (౧) కరుణ + ఆర్త చిత్తయై = శోకమును బొందిన మనస్సుగలదై–జానకి యేడ్చుచుండనిమ్ము–నేను రాముని జంపఁగా నని శేషము. (౨) ఉండనిమ్ము=కరుణా + ఆర్త చిత్తయై=దయగల మనస్సుగలదై జానకి సుఖముగా నుండనిమ్ము–నాకై నీ వేడువకున్నను సీతాదేవి కరుణార్తచిత్త గావున, నా నిమిత్తముగ నిరపరాధి వీఁడు చావవలసి వచ్చెనే యని శోకముతో

గూడిన మనస్సుగలదిగా నుండనిమ్ము. రాముగూర్చి నను చో శ్లేషార్థమున సభంగ నిర్బంధకములకు మేళనము చెప్పఁబడెను.

ఉ. చూతురుగాక యాజిఁ దమ ♦ చుట్టము లీల్గిన సర్వరాక్షసుల్
ప్రీతి రహింగొనంగ నను ♦ బ్రేతత గాంచఁగ రాఘవుం గృతాం
తాతిథులైన బాంధవుల ♦ కై విలపించెడివారి బాష్పముల్
స్ఫీతజవంబునం దుడుతుఁ ♦ జెచ్చెర వైరివినాశనంబునన్. ౧౮౩౬

అర్థములు. (౧) ఆజిన్ = యుద్ధమందు, తమ చుట్టము లీల్గిన సర్వ రాక్షసులు-ప్రేతత గాంచఁగ రాఘవున్=రాముఁడు చావఁగా, ననున్ = నన్ను, ప్రీతిరహింగొనంగఁ జూతురుగాక. (౨) సర్వరాక్షసులు - తమచుట్టము లీల్గఁగా నన్నుఁ బ్రేతతగాంచఁగా-రాఘవునిఁ జూతురుగాక-రహి శబ్దమునకు (౧) ప్రేమ, ఆనందము, రెండవ యర్థమున వ్యర్థము - కాంతిహీనము. 'రతి లేని విభూషణాఃబు రహి నరసింహా' అని నరసభూపాలీయము.

కృతాంతాతిథులైన = చచ్చిన, వైరివినాశనంబునన్ = శత్రువులను నేను జంపి చచ్చిన బాంధవులకై విలపించెడివారి బాష్పములు దుడుతును. (౨) వైరి యగు రామునివలన నాకుఁ గలిగిన నాశనంబున విలపించెడివారి బాష్పముల్ తుడుతువు. తుడుతున్-నేను తుడుతున్-ఉత్తమ పురుషక్రియగా నొక్క యర్థము నను అర్ధ బిందువు లోపించి తుడుతువు. మధ్యమ పురుషముగా నొక యర్థమున గ్రహింపవలెను. శ్లేషే సఖండ నిర్బంధో్వ క్కోశనం క్వచిన్మతమ్. అ॥ కారిక.

తాత్పర్యము

తమ బంధువులు చచ్చిన సర్వరాక్షసులు రాముఁడు చావఁగా నన్ను ప్రీతితోఁ జూతురుగాక. చచ్చినవారి కన్నులనీళ్ళు వైరిని నాశముచేసి నేను త్వరగాఁ దుడుతును.

రెండవయర్థము- తమ చుట్టములు చావఁగా నేను జావఁగా ప్రీతిలేనివారై భయపడుచు సర్వరాక్షసులు రాముని చూతురుగాక. అప్పుడు వైరియగు రాముని వలన నాకు వచ్చిన వినాశమునకై విలపించెడివారి కన్నీళ్ళు నీవు తుడుతువు.

ఉ. ఏగతిఁ బట్టునో కనుమ ♦ యింతలు నింతలు తునకలై ధరం
బ్రోగయి వ్రాలి పర్వతని ♦ భుండు ససూర్యవలాహకాభుఁ డా
రాగమయూఖనందనుఁడు ♦ రామజిఘాంసువు లేను రాక్షసుల్
రాగము పూని కావ రఘు ♦ రాము సువధ్యుఁడ నౌదు నెట్లొకో. ౧౮౩౭

అర్థములు. ఇంతలు నింతలు = చిన్నచిన్నవి, పర్వతనిభుండు = పర్వత ముతో సమానుఁడు, ససూర్యవలాహకాభుఁడు = సూర్యునితోఁ గూడిన మేఘము వంటివాఁడు. రాగమయూఖనందనుఁడు=ఎఱ్ఱని కిరణములు గల సూర్యునికొడుకు

రామ జిఘాంసవులు=రాముని జంపఁ గోరికగలవారు, రాగము = అనురాగము, రఘురామసువధ్యుఁడవు=రామునిచేఁ జంపఁబడువాఁడవు.

## తాత్పర్యము

(౧) పర్వతముతో సమానుఁడై సూర్యునితోఁ గూడిన మేఘము వంటి వాఁడైన సుగ్రీవుఁడు చిన్న చిన్న తునకలై కుప్పయి నేల వ్రాలి యేగతిఁ బట్టునో చూడుము. రాముని జంపఁగోరిన నేను రాక్షసులు నిన్నుఁ గానఁగా రాముఁడెట్లు నిన్నుఁ జంపఁ గలఁడు ?

(౨) రాముని జంపఁగోరిన నేను రాక్షసులు నిన్నెంత కాచినను రామునకు వధ్యుఁడవే యగుదువు. దానికేమి చేయవచ్చును ?

ససూర్యబలాహకాభుఁడన్నచో = సూర్యుఁడు రాముఁడనియు, బలాహకము=మేఘము సుగ్రీవుఁడనియు నెఱుఁగనగు, సూర్యరశ్మి మేఘము మీఁద బడుచుండుటచే కాంతిగలదై యుండును. అట్లే రామానుగ్రహము సుగ్రీవునిపై నుండుటవలన కలిమికే లోపము లేదని భావము. రాగమయూఖ నందనుఁడు కావున నందనుపై ప్రేమ తొలఁగదని భావము.

ఉ. రాముఁడు నన్నుఁ దొల్త రణ♦రంగమునన్ వధియించెనా బల
శ్రీమహితుండు నిన్నిహతుఁ ♦ జేయక మానఁడు సత్య మేను సం
గ్రామములోన నొందెదఁ బ♦రాభవ మన్న విచార మాత్మ నా
కేమియు లేదు గాన నను♦ నేడ్తెఱఁ బంపుము పంప కన్యునిన్. ౧౪౩౭

## తాత్పర్యము

రాముఁడు నన్ను మొదట యుద్ధరంగమునఁ జంపెనా నిన్నావలఁ జంపక మానఁడు. ఏలన నతఁడు బలశ్రీమహితుఁడు కావున బలసంపద గలదు. బలము లక్ష్మి రెంటిచే గొప్పవాఁడు. లక్ష్మీవంతునకుఁ బరాజయ మెచ్చటిది ? ఇది సత్యము. నేను యుద్ధములో నవమాన పడెద నన్న విచారము నాకు లేదు. నేనే గెల్తునని యొక యర్థము. మరణమునకు నెఱవ నని రెండవ యర్థము. కావున నన్నే పంపుము. మఱి యెవనిని బంపవలదు.

రాముఁడు నన్నుఁ దొలుతఁ జంపఁగలిగినఁగదా నిన్నుఁ దరువాతఁ జంపఁ గలఁడు. యుద్ధమునందు నాకుఁ బరాజయము వచ్చునని నేను దలఁచను, కావున నీకును భయము లేదు. ఈ కారణముచే యుద్ధమునకు నన్నే పంపుము.

చ. హరిహయుఁడైన నేమి ప్రళ♦యానలమారుతులైన నేమి కి
న్నరపతియైన నేమి జల♦నాయకుఁడైనను నేమి శూలమున్
గరమునఁ గీలుకొల్పి గిరి♦కాయుఁడనై శితదంష్ట్రి లొప్పఁగా
మరమునఁ దాకినన్ బెదరి ♦ తూలరె వ్రీలరె కూలరే యరుల్. ౧౪౩౮

హరిహయుఁడు = ఇంద్రుఁడు, ప్రళయానల మారుతులు = ప్రళయకాల

మందలి యగ్నియు వాయువు, కిన్నరపతి = కుబేరుఁడు, జలనాయకుఁడు = వరుణుఁడు, గిరికాయుఁడనై = పర్వతమంత దేహముగలవాఁడనై, శితదంష్ట్రిలు = వాఁడికోఱలు, దురమునన్ = యుద్ధమందు, అరుల్ = శత్రువులు.

## తాత్పర్యము

ఇంద్రుఁడైననేమి ? ప్రలయకాలమందలి యగ్ని వాయువులొక్కటై వచ్చిననేమి? కుబేరుఁడైననేమి? వరుణుఁడైననేమి ? నేను జేతఁ ద్రిశూలము తీసికొని పర్వతమంత దేహముగలవాఁడనై వాఁడి కోఱలతో యుద్ధమున నెదిరింపఁగా శత్రువులు తూలి బెదరి చావరా ?

ఉ. కేవల రిక్తహస్తములఁ • గేలి విరోధుల నల్పినైచుచో
జీవముమీఁద నాశగల• జీవి యొవం డెదిరించి నిల్చు? బా
ణావళి యేల ? యేల నిశి•తాసిగదాదులు? నేల శక్తి ? నా
కేవియు నేల? చేతులనె • యింద్రునినైనను ముద్దసేయు నే. ౧౨౨౦

అర్థములు. కేవల రిక్తహస్తములన్ = ఆయుధ మనునది యేదియు లేక, కేరి = విజృంభించి, నిశితాసిగదాదులు = పదునైన కత్తి, గద యీ మొదలైనవేల, శక్తి యేల ?

## తాత్పర్యము

ఏ యాయుధమును గైకొనక యుత్తచేతులతోఁ బోయి విరోధులను నల్పినపుడు ప్రాణముమీఁద నాశగలవాఁడెవఁడు నన్నెదిరించినిలుచును? నాకు బాణము లేల ? కత్తులేల ? గదయేల? శక్తియేల ? ఇవన్ని యెవరికి? దేహబలము చాలనివారికిఁగాని నా కేల, నే నుత్తచేతులతోనే యింద్రునినైనను ముద్దచేసెదను.

ఉ. నా మహితంపుముష్టిపత•నంబు రఘూత్తముఁ డోర్వ గల్గినన్
రాముని బాణజాలములు • రక్తము పానము సేయఁగల్గు నే
లా మనుజాశనేంద్ర! వ్యసనార్తుఁడ వయ్యెద వేను గల్గ? న
ద్దామజనోద్ధతిం జని మ•దం బడఁగింతు నరాతికోటికిన్. ౧౨౨౧

అర్థములు. మహితంపు ముష్టిపతనంబు = గొప్ప పిడికిటిపోటును, ఓర్వఁగల్గినన్ = సహింపఁగలిగినయెడలఁ గదా, ఓర్వఁగల్గి + నన్ = నన్ను.

## తాత్పర్యము

నా పెద్ద పిడికిటిపోటును రాముఁడు సహించి బ్రదికినఁగదా యావల రాముని బాణసమూహములు నా రక్తము పానము సేయఁగలవు. నా గ్రుద్దుతోనే రాముఁడు చచ్చినఁదరువాత నేమిచేయఁగలఁడు? (అ) నాముష్టిపతనంబు రాముఁ డోర్వఁగల్గి, నన్ = నన్ను రాముని బాణజాలములు పానము చేయఁగలుగు. రెండును తప్పవు. నా పిడికిటిపోటు నాయన సహింపఁగలఁడు. ఆయన బాణములు నా రక్తమును పానముచేయఁగలవు. నేను జీవించియుండ రాక్షసరాజా! యేల

దుఃఖించెదవు. (౨) నేను జీవించి యున్నానని యేల యేడ్చెదవు? ఏడువ వలసిన కాలము ముందున్నదని భావము. అణఁపరాని వేగమునఁబోయి శత్రువుల సమూహమునకు గర్వ మణఁగింతును.

సీ. రామలక్ష్మణుల శా♦ఖామృగనేతను, మనలంకఁ గాల్చిన♦హనుమఁ దక్కఁ
గల పెనుప్రమాను మెా♦కంబులఁ గూలు నే, వదలుము రాముని♦వలని భయముఁ
గలిగడు నీకు ని♦స్తులకీర్తి యిందు నే, వల్లన్వయంభువు ♦ నయిన ప్రమంతు
నేఁ గోపగించిన♦నిర్జరయూథంబు, ఛాఁపకట్టుగ నేలఁ ♦ జచ్చి పడదె
తే. శమను శమియింతు సర్వభ ♦ క్షకు గ్రసింతు
నుడుగణంబులతో నర్కుఁ ♦ బడఁగ నడుతు
జన్యసవపశు వొనరింతు ♦ శతమఖునిని
గ్రోలి వైచెద వరుణుని ♦ కొంపఁ గూల్చి. ౧౪౪౨

అర్థములు. పెనుప్రమాను మెకంబులన్ = పెద్దక్రోఁతులను, కూల్తునే = (౧) నేను గూల్తును, (౨) కూల్తునే = కూల్పఁగలనా? వదలుము= (౧) రాముని వలని భయము వదలుము. (౨) నేను వానరాములఁ గూల్తునను నాశ వదలుము. సర్వభక్షకున్ = అగ్నిని, ఉడుగణంబుతో = నక్షత్రములతో, అర్కున్ = సూర్యుని, అడుతున్=కొట్టుదును, జన్యసవపశువు=యుద్ధమనెడి యజ్ఞమునపశువు, శతమఖుని=ఇంద్రుని, వరుణుని కొంప=సముద్రము.

తాత్పర్యము

(౧) రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతులను దక్క నన్య పెద్దక్రోతులను నేను జంపుదును. రామునివలన భయము విడువుము. నీకు ననమానమైన కీర్తి కలుగును. ఇంద్రుని బ్రహ్మను నైనఁ జంపుదును. నేను గోపగించిన దేవతాసమూహము నేలతో పాటు చాఁపవలెఁ బడును. యముని జంపెదను. సర్వభక్షకుని భక్షింతును. నక్షత్రములతో సూర్యుని నేలఁబడఁద్రోయుదును. ఇంద్రుని యుద్ధమను యజ్ఞమున పశువును జేసెదను. వరుణుని కొంప నాశము చేసెదను.

(౨) రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతులను దక్కన క్రోఁతులను నేను గూల్పఁగలనా? ఆ యాస వదలుము. రామునివలన భయము నీకుఁ గలుగును. అసమాన కీర్తిగల యింద్రుని బ్రహ్మను జంపఁగలను. తక్కినది సమానము. ఇవన్ని చేయఁగలను గాని రామలక్ష్మణుల నేను గెల్వలేను.

ఉ. దంచెదఁ బిండి పిండిగ మ ♦ దంబునఁ బట్టి కులాచలంబులన్,
జించెదఁ దున్కదున్కలుగఁ ♦ జేవ వసుంధర, నిన్నినాళ్ళు ని
ద్రించిన కుంభకర్ణు బల ♦ తేజము లివ్యోడఁ జూడఁ గాక భ
క్షించుచు నుండ దామధరి ♦ గీడ్పడి చేడ్పడి భూతజాలముల్. ౧౪౪౩

అర్థములు. కులాచలంబులన్ = కులపర్వతములను, హిమవంతము వింధ్యము లోనైన వానిని, వసుంధరన్ = భూమిని.

తాత్పర్యము

బలగర్వముచేఁ బట్టుకొని కులపర్వతములను బిండిపిండిగ దంచెదను. భూమిని తునకలు తునకలుగ జించెదను, ఇన్నినాళ్ళు నిద్రించిన కుంభకర్ణుని బలము తేజములను వానరులను భక్షించుచుండ భూతసమూహము లదరి బాధపడి, మూర్ఛపోయి లేచి చూచునుగాక.

ఉ. హామిక మూఁడు లోకముల • నట్టె భుజించినఁ దృప్తి లేదు, శ్రీ
రాముని కారణంబునఁ జి•రం బగు సౌఖ్యము నీకుఁ గూర్ప సం
గ్రామ మొనర్తు, రాఘవసు•రక్షిత సర్వకపీశవాహినీ
స్తోమము ద్రుంగి తృప్తిఁ గొను•దున్ దనుజేశ్వర! చింత యేటికిన్. ౧౪౪౪

అర్థములు. హామిక = గర్వముతో, శ్రీరాముని + కారణంబునన్ = (౧) శ్రీరాముఁడు హేతువున (౨) శ్రీరాము + నికారణంబునన్ = శ్రీరాముని మరణముచే, తిరంబగు సౌఖ్యము = (౧) పరలోకమందు - (౨) ఈ లోకమందు, రాఘవ సురక్షిత = రామలక్ష్మణులచే చక్కఁగా గాపాడఁబడు, సర్వ కపీశ వాహినీ స్తోమము = సమస్త వానరసేనా సమూహము.

తాత్పర్యము

గర్వముచే మూఁడులోకములను భుజించినను సంతుష్టి లేదు. శ్రీరాముని జంపుటచేత నీకు స్థిరమైన సౌఖ్యము గూర్చుటకై నేను యుద్ధము సేయఁబోయె దను. రామలక్ష్మణులు రక్షించు సమస్త వానర సేనను ద్రుంగి సంతుష్టి పడెదను. నీవేల విచారపడెదవు?

(౨) నీవు గర్వమెత్తి మూఁడు లోకము లనుభవించినను నీకుఁ దృప్తి లేదు. కావున రాముఁడు కారణంబుగ నీకు స్థిరమైన స్వర్గలోక సుఖము గలిగించుటకై నేను యుద్ధమునకుఁ బోయెదను. అందు నేను చచ్చిన తరువాత నీవు చచ్చి సుఖింతువు. ఏలన రామలక్ష్మణులు రక్షించు వానర సేనను నేను ద్రుంగి తృప్తి పడుదునా? అది యేటి మాట? (కాకుస్వరమున నీ యర్థము.)

తే. కోర్కులు భుజింపు మద్యంబు • గ్రోలు కృత్య
ములను దీర్పు మేఁ బోదు • హతుఁడు గాఁగ
రామవిభుఁ డక్షయంబుగ • రమణి సీతఁ
బొందఁ గలుగును నీ వెడఁ • బొగుల వలదు. ౧౪౪౫

తాత్పర్యము

నేను యుద్ధమునకుఁ బోయెదను. నీవు చింతవిడిచి కోరికల నన్నిటి ననుభ వింపుము, సారాయము ద్రావుము. చేయవలసిన పనులన్నియుఁ జేయుము. రామ

విభుఁడు నాచే హతుఁడు గాఁగా, అక్షయముగ నీకు రమణి సీతను బొందఁగలు గును. ఎదఁ బొగులవలదు. ఏల విచార పడెదవు.

(౨) ఏఁబోదు హతుఁడు గాఁగ = నేను జచ్చుటకై పోయెదను. ఈ లోపల నీవు కోరికదీఱ భుజింపుము, సారాయము ద్రాగుము,పనులు దీర్చికొనుము. ఏలన నేను జచ్చువఱకే నీ కీ భోగములు. అవల నా వెంట నీవు రావలసిన వాఁడవే. రామవిభుఁడు అక్షయంబుగ = శాశ్వతముగ, రమణి సీతను బొందఁగలుగును. దానికై నీవు దుఃఖంపకుము.

—♦ ౬౩-వ సర్గము. మహోదరుఁడు కుంభకర్ణమతమును ఖండించుట ♦—

కం. అని యతికాయుండు బలియుఁడు, ఘనబాహుం డైన కుంభ♦కర్ణుఁడు వలుకన్
విని యాతనిఁ గని యిాగతి, ననియె మహోదరుఁడు వీత ♦ హర్షుం డగుచున్.

అర్థములు. అతికాయుఁడు=పెద్ద దేహము గలవాఁడు, దేహము పెద్దదే కాని దానికిఁ దగిన బుద్ధిలేదని భావము. బలియుఁడు=దేహమునకుఁ దగిన బలము గలవాఁడు, ఘనబాహుఁడు=ఆ బల ముపయోగింపఁదగిన పెద్దచేతులు గలవాఁడు. వీతహర్షుండు=సంతోషము లేనివాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము పెద్ద దేహము గలవాఁడు బలవంతుఁడు గొప్ప భుజములు గల్గవాఁడు నగు కుంభకర్ణుఁడు చెప్పఁగా విని సంతోషింపనివాఁడై మహోదరుఁ డిట్లనియె.

ఉ. పుట్టితి గొప్పవంశమున ♦ బుద్ధి యొకింతయు లేదు, గర్వముం
బట్టయి యున్నవాఁడవును ♦ ప్రాకృతదర్శన! కార్యమెల్ల లో
పట్టు గనంగఁ జాల విసి ♦ బాల్యవశంబున నోటికొర యె
ట్టులు వచ్చె నట్లు వచి ♦ యింపుఁగఁ జూచెదు జ్ఞానహీనతన్. ౧౩౩౭

అర్థములు. ప్రాకృతదర్శన = పామరుల యాలోచన కలవాఁడా! బాల్యవశంబునన్=పిల్లతనముచేత, జ్ఞానహీనతన్=జ్ఞానములేని కారణమున.

తాత్పర్యము

నీవు గొప్పవంశమునఁ బుట్టితివి కాని గొప్పవంశమువారి కుండవలసిన బుద్ధి మాత్రము కొంచెమైనలేదు. గర్వముమాత్ర మున్నది. పామరుల యాలోచనగల వాఁడా! పైపైన జూచితివేకాని కార్యము లోపలఁజొచ్చి చూచినవాఁడవుకావు. కావునఁ బిల్లతనంబున నోటికి వచ్చినట్లు జ్ఞానములేక వదరెదవు. (కుంభకర్ణుఁడు దూషించిన మంత్రులలోఁ జేరిన వాఁడీ మహోదరుఁడు. వీనికి సంధి యనుమాటయే పనికిరాదు.)

ఉ. రాజకు నీత్యనీతులత ♦ రంబు లెఱుంగఁడు? స్వాన్యహాని వృ
ద్ధిజము స్థానముం దెలియు ♦ నొప్పుగ దేశము కాలభంగియున్

యోజనచేసినాఁడు, బల♦యుక్తుఁడు, ప్రాకృత బుద్ధి వృద్ధ సే
వాజడునట్లు సల్పు నొకో ♦ పండితుఁ డెందును గుంభకర్ణుఁడా. ౧౪౪౪

అర్థములు. నీత్యనీతుల తరంబులు=నీతి దుర్నీతి భేదము. స్వాన్యహాని = స్వహాని, అన్యహాని=తనకుఁ గలుగు నష్టి, ఇతరులకుఁ గలుగు నష్టి, నీరోజము = గొప్ప యభివృద్ధివి. స్థానమున్ = సమత్వమును, దెలియును. దేశము = ఎచ్చట నాలోచింపఁదగునో యచ్చటనే యోజించినాఁడు, కాలము భంగి=ఎప్పుడాలోచింప దగునో యప్పుడే యాలోచించినాఁడు.బలయుక్తుఁ డు=తనబలము మాత్రమునాలోచించువాఁడును. ప్రాకృతబుద్ధి=క్షుద్రబుద్ధి కలవాఁడు ఐన, వృద్ధసేవాజడునట్లు= పెద్దలను గొలువనట్టి హీనునివలె,పండితుఁడు=శాస్త్రము చదివినవాఁడు,ఎందును= ఎప్పుడైనను.

## తాత్పర్యము

"కేవలము శౌర్యమదంబున భావ్యనర్థముల్ దలఁపగవైతివి" అనియు "కెలనములోలి వెనక్రమును గేరి యొనర్చిన నీతివేత్తరయే" యని కుంభకర్ణుఁడు రావణు నాక్షేపించెను. మహోదరుఁడు దానికిఁ బ్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు.నీతికి దుర్నీతికి తారతమ్యము రాజు యెఱుఁగడు? నీకు దెలిసినంత మాత్ర మాయన యెఱుఁగఁడా? తనకు రాఁగల నష్టి-పరులకు రాఁగల నష్టి-గొప్ప వృద్ధి-సమత్వము వీని నెల్లఁ జక్కఁగ రాజెఱింగినవాఁడే. తెలియక చేయలేదు. రాజు దేశకాలము లాలోచింపలేదంటివి. ఆలోచన యే దేశమందుఁ జేయవలెను? అడవిలో నెవరు లేని చోట నొంటరిగఁ జేయువలయునా? తన యూరఁ దన యింటఁ దనకు కావలసిన వారున్నచోటఁ జేయువలయునా? తగిన కాలమందు నాలోచింప లేదంటివి. యుద్ధమునకై శత్రువులు పైబడి వచ్చినపుడు యుద్ధవిషయ మాలోచింపవలయునా? ఎన్నఁడో శత్రువులు రాఁబోయెద రని ముందుగానే యుద్ధ ప్రయత్నము చేయవలయునా? శత్రువుల జాడయే తెలియనప్పు డెవరితోనైననేమి యాలోచింపవలె? కుంభకర్ణుఁడా? మనరాజు సర్వశాస్త్రములు చదివిన పండితుఁడు.అటువంటివాఁడు కేవలము తన బలమే నమ్మి క్షుద్రబుద్ధివలెఁ బెద్దల సేవ సేయనివానివలెఁ గార్యము చేయునని నీవెట్లు తలంచితివి ?

చ. కనఁగొన ధర్మ మర్థమును ♦ గామ మొసంగుఁ బృథక్ఫలంబు లం
దమను వచియించి, తీ వెఱుఁగు ♦ చొప్పొక టున్నను జెప్ప వయ్య యే
పని నిజమార నే ఫలము ♦ బాయ కొసంగునో? కర్మమే కదా
ఘనబల! యైహికాది ఫల♦కారణ మారఁ దలపోసి చూచినన్. ౧౪౪౫

ధర్మము సుఖకారణము, అధర్మము దుఃఖకారణమని యెంచి"నీచేసిన యా దురితము తత్ఫలము నిను విడియక చేసేత ననుభవింపఁగఁ జేసెన్"అని రావణుఁడు

సీతాపహార మనెడి పాపము చేయుటచే నిట్టి కష్టము సంభవించెనని యింతకుముందు కుంభకర్ణుఁడు చెప్పినదానిని మహోదరుండు ప్రత్యాఖ్యానము చేయుచున్నాఁడు.

అర్థములు. పృథక్+ఫలంబుల = వేఱు వేఱు ఫలంబులు ఐహికాది= ఐహికము, ఆముష్మికము, కైవల్యము నను, ఫలకారణము=ఫలమునకు హేతువు.

తాత్పర్యము

ధర్మము, అర్థము, కామము వేఱు వేఱు ఫలము లొసఁగునని నీవు చెప్పితివి కదా! ఏది యే ఫలము తప్పక యిచ్చునని నీవు నిశ్చయించి చెప్పెదవో నీకుఁ దెలిసి యుండినఁ దెలుపుము. ధర్మమే ధర్మఫలము నిచ్చునని నియతి కలదా? అర్థమువలన, కామము వలన ధర్మ ఫలము కలుగరాదా? ధర్మము సుఖమునే యిచ్చునుగాని కష్టము నీయదా? స్వర్గాది సుఖములకై యజ్ఞము చేయునపుడు, యజ్ఞము చేయుటకు ముందు ధనార్జనాదులకు, చేయునపుడు శరీరాయాసమునకు, చేసిన తరువాత వహ్నిసంరక్షణాది కార్యములవలనను కష్టఫలము కలుగుటలేదా? అట్లే అధర్మమని నీవు చెప్పు జారత్వ చోరత్వములందు సౌఖ్యము లేదా? తన భార్యవలనఁ గలుగు సౌఖ్యము పరుని భార్యవలనఁ గలుగదా? కష్టపడి సంపాదించిన ధనములోఁ గలుగు సౌఖ్యము దొంగతనముచే సంపాదించిన ధనములోఁ గలుగదా? కావున ధర్మాధర్మములకు ఫలనియతియం దేలాటి ప్రమాణములేదు. ఐహికాది ఫలములు కావలయు ననిన కర్మమే కదా చేయవలయును, కర్మము చేయకున్న ఫలములేదు. కావున సుఖము కోరినవు డేమి కర్మము చేసిన సుఖము వచ్చునని తోఁచునో యా కర్మము చేయవలయును. తరువాత నాకర్మ మేమి ఫలమీయ వలయునో దానినే యది యిచ్చును. కావున నది చేసిన నిది వచ్చు ననుట యేటిమాట.

ఉ. శ్రేయము పాపశీలురను • జెందఁగఁ జూడమె ధర్మ మర్థమున్
శ్రేయము గూర్చునట్లొనరఁ • జేయు నధర్మ మనర్థమున్ శుభం,
బేయెడనో యఘంబు ఘటి • యించు నధర్మ మనర్థ, మింక నే
చాయను ధర్మమే నియత • సత్ఫల మంచు దృఢీకరించెదో? ౧౪౯

ధర్మాధర్మములు నియతఫలములు కావనుటను సమర్థించు చున్నాఁడు.

అర్థములు. శ్రేయము=సుఖము, దృఢీకరించెదో = దృఢముగాఁ జెప్పఁ గలవో.

తాత్పర్యము

పాపాత్ములు సుఖ మనుభవించుచు మంచి స్థితియం దుండుట మనము చూడ లేదా? ధర్మమునకు నర్థమునకుఁ గారణమైన పుణ్యకర్మము శ్రేయస్సు గలిగించు నట్లు అధర్మము అనర్థమును శుభమును రెంటిని గలిగించుచున్నది. అధర్మము అనర్థమగు పాపమునే ఘటింపఁజేయుట కాకతాళీయముగ నెందో సంభవించు చున్నది. అనుభవ మిట్లుండ నీవేమి యాధారము చేసికొని ధర్మమే సత్ఫలమును నియతముగా నిచ్చునని సిద్ధాంతము చేసెదవు.

ఉ. అచ్చపుఁబుణ్యకర్మముల • నైహికసౌఖ్యపరత్రభోగముల్
హెచ్చుగఁ గూరు నంచు ఘటి • యింతురు లోకులు సాధుకార్యముల్
కచ్చులు దీర స్వైరగతిఁ • గార్యములం బొనరించు వానికే
వచ్చును సంపదల్, సుమతి • వర్య! కతం బది యేమి చెప్పుమా? ౧౪౫౧

అర్థములు. ఐహిక = ఈలోక సంబంధమైనవి, పరత్ర=పరలోకసంబంధమైనవి యగు; భోగముల్=సౌఖ్యములు, కూరునంచున్ =కలుగునని, కచ్చులు = గర్వములు, స్వైరగతి=వారివారి యిష్టప్రకారము. నియమములేక, సుమతివర్య= బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! అనఁగా బుద్ధిహీనుఁడా యని యర్థము. ఇది పరిహాస వచనము, కతంబు=కారణము.

### తాత్పర్యము

పాపసంపర్కము లేని పుణ్యకార్యములను ఈలోకసుఖములును బరలోక భోగములును విశేషముగా లభించునని లోకులు కొందఱు పుణ్యకార్యములే చేయుదురు. వారి గర్వము చక్కఁబడునట్లు కొంద ఱే నియమములేక తమ యిష్టప్రకారము కార్యముచేయువానికే సంపదలు వచ్చును. ధర్మాధర్మములకు ఫల నియతి గలదేని, యిట్లు జరుగ నేమికారణము? బుద్ధిమంతుఁడా చెప్పుము.

ఫలమునుబట్టి పుణ్యకర్మమని పాపకర్మమని చెప్పుచున్నాము. ఈకర్మమున కీఫలమను నియతి యెప్పుడు లేదో యది పాపకర్మము, ఇది పుణ్యకర్మ మను పేరచ్పెడే లేదు. కావున సుఖకరమని తోఁచిన పనిచేయవలసినది. దానిఫల మనుభవింపవలసినది. దొంగతనముగాని అంతులేనము గాని సుఖలాభములు గలవేని యదియే పుణ్యకార్యము. అదియే ధర్మము. ఇది వాస్తవ విషయము. ఇట్లు చెప్పుటచే మహోదరుని వాదమునకు శాస్త్రము ప్రమాణముకాదు. బుద్ధియే ప్రమాణము. చార్వాక వాదము.

ఉ. కామ మొకండ కైకొని సు • ఖంపడఁ గోరె విభుండు దోషమా?
మా మది కద్ది సమ్మతము • మాఱురపట్ల సురారి సీత తెం
పేమి యొనర్చెఁ జెప్పఁ గల • వే? యిక నెక్కటి పోరువాఁడ నం
చేము వచించి తద్దియుచి • తేతర మెట్లనదో వచించెదన్. ౧౪౫౨

అర్థములు. మాఱురపట్లన్ = విరోధుల విషయమున, తెంపు = సాహసము, చేయరానిపని, ఎక్కటి=అసహాయుఁడనై, ఉచితేతరము,=అనుచితము.

### తాత్పర్యము

ధర్మము వలననే సుఖము, అధర్మాదులవలన సుఖము లేదను నియతిలేదను మతము అనఁగా కర్మములందు ధర్మము అధర్మము అను భేదము లేదు, అను మతము గలవాఁడు రావణుఁడు కావున సీతవలన సుఖపడఁగోరి యామెను హరించి తెచ్చెను. ఇది దోషమా? మా మతమునఁగాదు. రాజట్లుచేసిన మాకు సమ్మతమే.

కావున రాజు న్యాయాన్యాయములు విచారింపక, తెలియక చేసినాఁడనుట సరి గాదు. తెలిసి సరియైన కార్యమే యని చేసెను. ఇఁక శత్రువుల విషయమై రామేమి సాహసము చేసెను. తన రాష్ట్రములో అడవిలో దిక్కులేక యొంటరిగానున్న స్త్రీని సుఖపెట్టఁగోరి తెచ్చెను గాని యెవరినైన బాధించెనా? కావున రాజు చేయరాని పని యేమిచేసెను? చెప్పఁగలవా? ఇఁక నీవు తోడెవ్వరులేక యుద్ధము నకుఁ బోయెద నంటివి. ఇది నీవు బలగర్వముచేతఁ జెప్పితివి కాని యౌచిత్య మనుసరించికాదు. ఎట్లనెదవా? చెప్పెద వినుము.

ఉ. మానవభోజవీరుల న ♦ మానుష శౌర్యధనాఢ్యులన్ జన
 స్థానమునందుఁ ద్రుంచిన ప్ర ♦ శ స్తపరాక్రముఁ డెవ్వఁ, డేని పే
 రానినభీతి నేఁటికిఁ ద ♦ దాప్తులు లంక స్మరించు చుందు; రా
 మానితశౌర్యు రాము నని ♦ మార్కొన నీ వటు పోయె దొంటిగన్. ౧౪।౧౩

అర్థములు. మానవభోజ వీరులన్=రాక్షస వీరులను, అమానుష శౌర్య ధనాఢ్యులన్=మనుష్యులందుఁ గానరాని శౌర్యమే ధనముగాఁగల వారిని, ఖర దూషణాదులను, ఆనిన భీతిన్=పొందిన భయముచే, తదాప్తులు = ఖరాదులకుఁ గావలసినవారు, దీనివలన ఖరాదులు చచ్చిన పిమ్మట వానివారందఱు లంకఁ జేరి రని సూచితము.

తాత్పర్యము

మనుష్యుల భుజించు వీరులను. మనుష్యులందుఁ గానరాని శౌర్య సంపత్తిగల వారిని, జన స్థానమందు సంహరించిన శ్లాఘ్యమైన పరాక్రమము గలవాఁ డెవ్వఁడో, యెవ్వని పేరును నేఁటికిని ఖరదూషణాదుల యాప్తులు భయపడుచు స్మరింతురో యట్టి రాముని గౌరవింపఁబడు శౌర్యముగలవానిని, నీవా యొంటరిగఁ బోయి యెదిరించెదవు.

ఉ. రామునిఁ గ్రుద్ధకేసరిప ♦ రాక్రమధాముని శౌర్యదర్పని
 స్సీముని సుప్తసర్ప మవ ♦ శీకృతశేముషీ లేకఁ బూను న
 శ్లేముని తేపఁ బోయెద? వ ♦ హీనదురాసదరోషు మృత్యువ
 ద్భీమునిఁ దేఱి చూచుటకు ♦ ధీరగుణుం డెవఁ డోపు నాజిలోన్. ౧౪।౧౪

అర్థములు. క్రుద్ధ కేసరి పరాక్రమ ధాముని = కోపించిన సింహము యొక్క పరాక్రమమువంటి పరాక్రమము గలవానిని, శౌర్య దర్ప నిస్సీముని = శౌర్యము వలనఁ గలిగిన గర్వమునకు మేరలేని వానిని, సుప్త సర్పమును = నిద్ర పోవు పామును, అవశీకృతశేముషిన్ = నీ బుద్ధి నీ స్వాధీన మందు లేనివాఁడై, అహీన = గొప్పదగు, అహి+ఇన=సర్పరాజు వంటి, దురాసద=సమీపింపసాధ్య పడని, రోషున్ = కోపముగలవానిని, మృత్యువద్భీముని = మృత్యుదేవతవలె భయంకరుని, తేఱి చూచుటకు = తేరకొని చూచుటకు, చక్కఁగా నిండు దృష్టి చూచుటకు, ధీరగుణుండు=ధైర్యశాలి, ఆజిలోన్=యుద్ధమందు.

### తాత్పర్యము

కోపముగల సింహముయొక్క పరాక్రమమువంటి పరాక్రమమునకు స్థానమైనవానిని, మేరలేని శౌర్య గర్వము గలవానిని, బుద్ధిలేనివాఁడు నిద్రపోవుపామును లేపఁబోవునట్లు రాము నేమని లేపఁబోయెదవు. పెద్ద పామువలె సమీపించుటకును సాధ్యముకాని రోషముగలవానిని, మృత్యుదేవతవలె భయంకరుని నిందుకంటెలోఁ జూచుటకు యుద్ధమునం దేధైర్యశాలి శక్తుఁడగును.

కం. ఇందఱు సేనలతోడుత, నం దరుగఁగఁ జాల రన్న ♦ నసహాయత భూ
 నందినివిభుఁ దోడరుట నా, కుం దగవుగఁ దోఁప దయ్యెఁ ♦ గుంభశ్రవసా.

అర్థములు. కుంభశ్రవసా = కుంభకర్ణుఁడా! అందు = ఆ యుద్ధభూమికి, భూనందిని విభున్=భూపుత్రియగు సీతాదేవి భర్తను, తోడరన్ = ఎదిరించుటకు, తగవు=సరియైన కార్యము.

### తాత్పర్యము

ఇచ్చట లంకలో నున్న వారందఱు సేనలతో యుద్ధభూమికిఁ బోవఁ జాలరని తోఁచుచుండఁగా రాముని నెదిరించుటకు నీవొకఁడవే పోయెద ననుట తగిన కార్యముగా నాకుఁ దోఁపలేదు.

కం. హీనార్థుం డెవ్వం డొకో, ప్రాణంబులయాశ విడిచి ♦ ప్రాకృతునట్టుల్
 మానితసమృద్ధబలు నరిఁ బూని వశముఁ జేసికొనఁగఁ ♦ బోవుం జెపుమా.

అర్థములు. హీనార్థుండు=క్షీణించిపోవు బలము గలవాఁడు.

### తాత్పర్యము

తన పక్షబలము క్షీణించి పోవుచుండు వాఁడెవ్వఁడు ప్రాణములమీఁద నాశ వదలి పామరునివలె వృద్ధి నొందిన బలముగల శత్రువును దన వశము చేసికొనఁగఁ బోవును.

ఉ. మానవులందు రాముని స ♦ మానులు లే రసురేంద్ర! వజ్రికిన్
 భానుసకున్ సముండు రఘు ♦ నాయకుఁ, డాతనితోడ నేల క
 య్యానకుఁ బోవ నెంచెద? వ ♦ నర్థము చేకుఱ కున్నె? యంచు న
 ద్దానవుఁ డా దశాస్యుఁ గని ♦ దర్పరుషా పరిరబ్ధచిత్తుఁ డై. ౧౭౫౭

అర్థములు. వజ్రికిన్ = ఇంద్రునకు, కయ్యానకున్ = యుద్ధమునకు, అనర్థము=కీడు, దర్పరుషా పరిరబ్ధ చిత్తుఁడై = గర్వముతోను గోపముతోను గూడిన మనస్సు గలవాఁడై.

### తాత్పర్యము

మనుష్యులందు రామునితో సమానులు లేరు. ఇంద్రునకు రాముఁడు సమానుఁడు. అతనితో యుద్ధమున కేల పోయెదవు? పోయితివా కీడు కలుగకుండునా! యని యా మహోదరుఁడా రావణునిఁజూచి గర్వము కోపముగలవాఁడై యిట్లనియె

తే. జానకీపతి నీచేతి • లోని యదియ, నేల పదరఁగ దానికై • యింతసేపు
వలతు చెప్పవ్వుడే నీకు • వనముపడెడి నందువకు నొక్కయుపమ నేఁ • బాండలింతు.

అర్థములు. పదరఁగన్=చలింపఁగ, తొందరపడఁగ, ఉపమ=ఉపాయము.

తాత్పర్యము

జానకి నీ స్వాధీనమందే కదా యున్నది. చేతిలోనుండు దానికై యింతసేపు తొందరపడనేల? నీవెప్పుకోరెదవో యప్పుడే నీకు వశపడు నుపాయము చెప్పెదను.

—• రావణునకు మహోదరుఁ డుపాయముఁ జెప్పుట •—

సీ. విన సమ్మతంబేని • వివరింతుఁ గుంభకర్ణుండును నే ద్విజి • హ్వుండు మఱి వి
తర్దన సంహ్రాది • దైత్యు లీ యేవురు, రాము వధింప దు • రమున కేగు
వారుగాఁ జాటింపఁ • బంపుమీ పురిలోన, జని మే మెటులైన • శక్తికొలఁది
రామునితోఁ బోరెద • మే మె జయించుట, గలిగనే నుపమ యొ • క్కఁటియ లేదు

తే. మేము దెగి యెంతపోరిన • రామవిభుఁడె
ప్రాణములతోడ నున్న న • పాయ మొండు
నవుడ చేయంగఁదగు దాని • నంతె నేను
యోజన మొనర్చి యున్నాఁడ • రాజవర్య! ౧౪౬౯

తాత్పర్యము

వినుటకు నీ కిష్టముండిన వినుము. వివరించెదను కుంభకర్ణుఁడు, నేను, ద్విజిహ్వుఁడు, వితర్దనుండు, సంహ్రాది యీయేవురు రాక్షసులు రాముని జంప యుద్ధమునకుఁ బోయెదరని యూరిలోఁ జాటింప నాజ్ఞ సేయుము. మే మట్లు పోయి మాశక్తి కొలఁది రామునితోఁ బోరెదము. మేమే జయించితిమా వేయుపాయ మక్కఱలేదు. మేము సాహసించి యెంతయుద్ధము చేసినను రాముఁడే బ్రతికియుండుట గలిగెనా యపుడు చేయఁదగిన యుపాయ మొకటి గలదు. ఇదంతయు నేను ముందే యాలోచించి యున్నాను.

ఉ. బింకముతోడ మేము రణ • పీఠిని బోరినయట్లు రామనా
మాంకితశాతబాణముల • నాత్మశరీరము లోలి వ్రచ్చి ఘో
రాంకమునందు రాఘవుని • సానుజుఁ జంపితి మంచుఁ గేరి ని
శ్శంకమహార్భటుల్ చెలఁగ • సన్నిధిఁ జేరి భవత్పదంబులన్. ౧౪౭౦

అర్థములు. రామనామాంకిత = రాముని పేరిచే గుర్తువేయఁబడిన, శాత బాణములన్=పదునైన బాణములచే, ఆత్మశరీరములు=మా దేహములు, వ్రచ్చి= చీల్చుకొని, ఘోరాంకమునందు = ఘోర యుద్ధమునందు, సానుజున్ = తమ్మునితోడఁ గూడినవానిని, కేరి=విజృంభించి, నిశ్శంకమహార్భటుల్ = జంకు లేని సింహనాదములు, సన్నిధిన్=నీ సమీపమున, భవత్పదంబులన్=నీ పాదములందు.

తాత్పర్యము

పౌరుషముతో మేము యుద్ధము చేసినట్లే రామునిపేరు చెక్కఁబడిన బాణములచే మా దేహములు గీచుకొని వచ్చి ఘోరయుద్ధమందు రాముని లక్ష్మణుని జంపితి మని విజృంభించి సింహనాదములు సేయుచు నీయొద్దకు వచ్చి నీపాదములందు

ఉ. వ్రాలెదువార మో యసుర • వర్య! ముదంబున నీవు కానుకల్
చాలఁగ మాకు నిచ్చియు గ • జంబుశిరంబునఁ జాటఁ బంపుమీ
ప్రోలున రామలక్ష్మణులు • భూరిచమూతతితోడ నాజిలోఁ
గూలి రటంచు వెండియును • గోర్కులు దీరఁగ సేవకాళికిన్. ౧౪౬౧

అర్థములు. ప్రోలునన్ = నగరమందు, భూరి చమూతతి తోడన్ = గొప్ప సేనతో, ఆజిలో=యుద్ధమందు.

తాత్పర్యము

పడుదుము. నీవు మాకు సంతోషముతో కానుక లిచ్చి యేనుఁగు శిరస్సు మీఁదనుండి రామలక్ష్మణులు గొప్ప సేనతోఁ జచ్చిరని పురమునఁ జాటింపఁ బంపుము. అంతియగాక, సేవకులకు వారి కోరిక దీర,

చ. వివిధపదార్థసంతతులు • ప్రీతి నొసంగుము యోధకోటికిన్
నవవసనానులేపనక • నన్మణిమండనమాల్యపేయముల్
సవరన నిమ్ము, నీవు నరు•సంబున వారుణిఁ గ్రోలు, మంత రా
ఘవుల వినాశవార్త పురిఁ • గ్రచ్చఱ నల్గడ సుప్రసిద్ధ మౌ. ౧౪౬౨

అర్థములు. వివిధ పదార్థ సంతతులు=అనేక వస్తువుల రాసులను, నవ = క్రొత్తలగు, వసన = వస్త్రములు, అనులేపన = చందనాది పూఁత ద్రవ్యములు, కనత్ =ప్రకాశించు, మణి మండన=రత్నాభరణములు, మాల్య = పూలదండలు, పేయముల్=సారాయములులోనైనవి, సవరనన్=చక్కఁగా, అరుసంబున=సంతోషముతో, వారుణి=సారాయము, క్రోలుము=త్రాగుము, క్రచ్చఱ = శీఘ్రముగా, నల్గడ=నాలుగు దిక్కులందు.

తాత్పర్యము

యుద్ధభటులకు వారువారు కోరిన నానాపదార్థములు సంతోషముతో నిమ్ము. మఱియుఁ గ్రొత్త వస్త్రములు, చందనాదులు, రత్నాభరణములు, పూలదండలు, పానీయములు చక్కఁగా నిమ్ము. నీవును సారాయము ద్రాగుము. ఇట్లు చేసితివేని రామలక్ష్మణులు చచ్చిన వారన్న వార్త యూరిలో నందఱకు నాలుగు ప్రక్కల ప్రసిద్ధముగాఁ దెలియును.

ఉ. మెల్లగ నీవు నీతఁ గని • మేలిమివాక్కుల నిచ్చకంబులన్
గల్లల ధాన్యవిత్తమణి • కాండము లాసలు గూరఁ జూపి రం

జల్లఁగఁ జేసి యూఱడఁగఁ • జెప్పి వశంబడఁ జేసికొమ్ము నీ
యుల్లము తాపమాఱ నిది • యుక్తిసుమీ భయశోకనష్టికిన్. ౧౪౬౩

తాత్పర్యము

అప్పుడు నీవు మెల్లగా సీతయొద్దకుఁ బోయి స్తుతివాక్యములచేతను ఇచ్చకంబులను అబద్ధములచేతను ధనధాన్య రత్నము లిచ్చెదనని యాశ చెప్పియు నామె మనస్సు సంతోషపడఁ జేసి సమాధానపడఁ జెప్పి నీ స్వాధీనము చేసికొమ్ము. నీ హృదయతాపము తీరుటకు భయము శోకము పోవుటకు నిది యుపాయము.

చ. అవనిజ రంజనీయుఁ డగు • నాత్మవిభుండు వినాశ మొందఁగా
నవిరళభోగభాగ్య మహి•మార్హ సుఖేధిత యౌట మున్ను దుః
ఖవికలచిత్త యాశ చెడఁ•గా రమణీచలబుద్ధిఁ జేసి నీ
కు వశపడం దలంచు నెడఁ • గూరిమి లేకయు నీవె దిక్కుగన్. ౧౪౬౪

అర్థములు. అవనిజ=సీత, రంజనీయుఁడు = ఆశపడఁ దగినవాఁడు, ఆత్మవిభుండు=తనమగఁడు, వినాశమొందఁగాన్ = చావఁగా, మున్ను = పూర్వము, అవిరళ=దట్టమైన, విస్తారమైన, భోగభాగ్య మహిమార్హ = గొప్ప భోగ భాగ్యములకుఁ దగిన, అర్హ=యోగ్యమైన, సుఖేధిత=సుఖముతోఁ బెంపబడినది, దుఃఖవికలచిత్త = దుఃఖముచేఁ జెదరిన మనస్సుగలది, ఆశచెడఁగా = రాముని యాశ చెడిపోఁగా, రమణీచల బుద్ధిఁజేసి = స్త్రీలకు స్వభావమైన చపలచిత్తముచేత, వశపడన్=స్వాధీనపడుటకు.

తాత్పర్యము

సీతాదేవి తాను ప్రేమింపఁదగిన తనమగఁడు చావఁగా పూర్వము విస్తారముగా భోగభాగ్యాతిశయముచే యోగ్యరీతి పెరిఁగినది కావునను, దుఃఖముచే మనస్సు వికలమైనది కావునను మగనియాశ చెడినది కావునను స్త్రీలకు స్వభావమైన చపల బుద్ధిచేత నీమీఁద ప్రేమ లేకున్నను నీవు తప్ప వేఱుగతి లేదని నీకు వశంపడఁ దలఁచును.

సీ. ఇది సుమ్ము నా నిర్ణయించినపద్ధతి. యిది నీకు సుఖ మని•యే దలంతుఁ
బంక్తి రథాత్మజు•శౌరిని బడితివా, సత్య మవర్థంబు•చాల నొదవు
నింద సుఖంబుగా•నెలమి నుండుము రణా,వనికిఁ బోవఁగ యత్న•పడఁగ వలదు
భండనం బొనరింప•కుండిన సుఖలాభ, మధిప నా వాక్యంబు•లాదరింపు
ఆ. సూడుబలము జాడ •జూడక ప్రాణసం,శయము లేక తేఁడ•జయము గొనుము
యశముఁ గీర్తిఁ బుణ్య•మైశ్వర్యమును బొంది, చిరయశంబు నీవు•చెందఁగలవు.

అర్థములు. సూడుబలము=శత్రుసేన.

తాత్పర్యము

ఇది నేను నిశ్చయించిన మార్గము. ఇటు చేసితివా నీవు సుఖపడుదు వనియే

తలంచెదను. అటుగాక రాముని జోరఁబడితివా నీకు గొప్ప కీడు తప్పదు. చత్తువు. కావున నిచ్చటనే సుఖముగా సంతోషముతో నుండుము. యుద్ధభూమికిఁ బోవు యత్నము చేయవలదు. యుద్ధము చేయకుండితివా సుఖము లాభము కలదు. నామాట గౌరవింపుము. శత్రుసేన యే ప్రక్కనున్నదో యాప్రక్కనైన నీవు చూడవలదు. అట్లుచేసి ప్రాణభయములేక జయము గొనుము. యశము, కీర్తి, పుణ్యము, సంపద నీవు పొందగలవు

అట్టి యుపదేశము లిట్టి యుపాయములు చెప్పువారు మంత్రులై నపుడు ఆ ప్రభువు స్మశానమునకుఁ బోవుటకు వద్దమేమున్నది? తన యుపాయము సఫలమై యుండునవియు నటుచేయక రావణుఁడు చెడెననియు నీ మూఢుని యభిప్రాయము.

—◆ ౬౫-వ సర్గము. కుంభకర్ణుఁడు మహోదరు నిందించుట ◆—

ఉ. చెప్ప మహోదరుం డిటు లి◆నీ యని యాతని నీసడించి పెం
పొప్పఁగఁ గుంభకర్ణుఁ డసు◆రోత్తముఁ గాంచి దురాత్ము రామునిన్
దెప్పున జంపి నీ భయముఁ ◆ దీర్చెద నిష్పరిపంథి వౌచు నీ
వెప్పటియట్ల లెస్స సుఖ◆యింపుము రాక్షసలోకనాయకా! ౧౪౬౬

అర్థములు. ఇనీ = భీ, ఈసడించి = నిందించి, నిష్పరిపంథివి = శత్రువు లేనివాఁడవు.

తాత్పర్యము

మహోదరుఁ డిటు చెప్పఁగా భీయని యతని నిందించి తన గొప్పతనము తెలియునట్లు కుంభకర్ణుఁడు రావణుఁ జూచి దుర్బుద్ధి యగు రాముని త్వరగాఁ జంపి నీ భయము పోఁగొట్టెదను. శత్రువులు లేనివాఁడవై నీవు మునుపటివలె హాయిగా నుండుము.

కం. నిర్జల మేఘంబులవలె, గర్జింపరు వ్యర్థముగను ◆ గడిమిం గలవా
రూర్జితయశ శాత్రవులను, నిర్జించి యొనర్చు గర్జ◆నెఱిఁ గనవన్నా! ౧౪౬౭

అర్థములు. నిర్జల మేఘము=నీళ్ళులేని మేఘము, జలమే లేకున్న మేఘమే లేదు. కావున నిర్జలమనఁగా వర్షముగాఁ గురియునంత విశేషజల మని యర్థము, కడిమిన్=బలమును, ఊర్జితయశ=వృద్ధినొందు కీర్తిగలవాఁడా!

తాత్పర్యము

నీరులేని మేఘమువలె బలముగలవారు వ్యర్థముగ గర్జింపరు. శత్రువులను జయించి నేను చేసెడు సింహనాదము వచ్చుడు వినుము.

కం. పరధిక్కృతముల సైఁపరు, చోర రాత్మశ్లాఘలకును◆సూరులు వెలికిన్
వెరవీఁడుల ట్లుండియు దుష్కరముల సాధింత్రు రాక్ష◆సప్రాగ్రసరా! ౧౪౬౮

అర్థములు. పరధిక్కృతములను=ఇతరులు చేయు నవమానమును, సైఁపరు= సహింపరు, ఆత్మశ్లాఘలకును=తమ్ముఁదాము పొగడుకొనుటకు, చోరరు=పూనరు

తెరవీడులు = తెఱవు+ఈడి = ఉపాయము తెలియనివారు, దుష్కరములన్ = అసాధ్య కార్యములను, రాక్షసాగ్రసరా=రాక్షసశ్రేష్ఠుఁడా!

### తాత్పర్యము

పరుల యవమానమును సహింపరు, తమ్ముఁదాము పొగడుకొనరు. శూరు లగువారు బయట చూచుటకు నేమియుఁ దెలియనివారివలె నుండియుఁ బనిపడి నపుడు ఇతరులకు సాధ్యముకాని పనులను సాధింతురు.

సీ. ఓరీ మహోదర! ♦ యుద్ధకాపురుషులుఁ, బండితమానులు ♦ బాలిశులును
నిచ్ఛకమారులు ♦ హీనబుద్ధులు నినుఁబోలినవారలు ♦ బోద్ధ లగుట
మీ వాక్యము ల్విని ♦ రావణుం డిటు లయ్యెఁ, గార్యఫలం బిట్టి♦గతికి వచ్చె
మిత్రచిహ్నుండు న♦మిత్రకుం డగురాజు, వెను వెంటఁ దగిలి మీ♦ రనవరతముఁ

ఆ. బురము రాజశేష♦ముగ నొనరించితి, రెల్ల కోశములును, ♦ నెల్ల బలము
నుఱువు మాపి యేటి♦యుక్తులు గిక్తులుఁ, జాలుఁ జాలు మున్ను♦పలికినవియు.

అర్థములు. యుద్ధకాపురుషులు=యుద్ధమునకు భయపడెడువారు, పండిత మానులు=తమ్ముఁదాము పండితుల మని తలఁచువారు, బాలిశులును = మూఢు లును, ఇచ్ఛకమారులు=ముఖప్రీతి మాటలు చెప్పువారు, హీనబుద్ధులు = బుద్ధి లేనివారు, నినుఁబోలినవారు = నీవంటివారు, బోద్ధలు = ఆలోచనలు చెప్పువారు, అగుట, మిత్రచిహ్నుఁడు=మిత్రులకుండ వలసిన చిహ్నములు మాత్రము గల వాఁడు. అమిత్రకుఁడు=వాస్తవమున మిత్రుఁడు గాక శత్రువే యగువాఁడు, అన వరతము = ఎల్లప్పుడు, పురమున్ = లంకానగరమును, రాజశేషముగన్ = రాజు మాత్రము మిగిలినదానిగా, ఎల్లకోశములును = బొక్కసము లన్నియు, ఎల్ల బలము=సేనయంతయు, ఉఱువుమాపి = రూపము లేకుండఁజేసి.

### తాత్పర్యము

ఓరీ మహోదరా! యుద్ధమనిన భయపడు నీవంటి పిఱికివాండ్రును, పండితుల మని తమ్ముఁ దాము తలఁచువారుఁ మూఢులు, ముఖప్రీతిమాటలు చెప్పువారు, ఆలోచన చేయుశక్తి లేనివారు, నీవంటివారు బోధించువా రగుటచే మీ మాటలు విని రావణుఁ డీ గతిపట్టెను. ఆ కార్యఫల మిట్టి దశకు వచ్చెను. మిత్రుని గుఱుతు మాత్రము గలిగి వాస్తవమున శత్రువగు రాజువెంట మీ రెప్పుడు విడువక యుండి నగరమున రాజు మాత్రము మిగులునట్లు చేసితిరి. ధనకోశములు సేన లన్నియు రూపము లేకుండఁ జేసితిరి. ఇంకె నేమియుక్తులు గిక్తులు చెప్పెదరు. ఇది వఱకుఁ జెప్పినవి చేసినవి చాలుఁ జాలును. ఇందు రావణుఁడు మిత్రచిహ్నముగల శత్రువని చెప్పఁబడెను. 'అపకారోరి లక్షణ'మ్మని అపకారము చేయువాఁడే కదా శత్రువు. తన యొక్కని తుచ్ఛకామమునకై యందఱ జంపించువాఁడు శత్రువుగాక మిత్రుఁడగునా? శత్రు వింతకంటె విశేషమేమి చేయఁగలఁడు?

కం. మీ రొనరించిన దుర్ణయ, మా యోధనమునకు నేగి ♦ యనువుపడంగాఁ
జేయుదు నన నవ్వుచు దై, తేయవిభుఁడు కుంభకర్ణు ♦ డెసఁగని పలుకున్.

అర్థములు. దుర్ణయము = కీడు, ఆయోధనమునకు = యుద్ధమునకు, అనువుపడంగాన్ = చక్కఁబడఁగా.

తాత్పర్యము

మీరు దుర్నీతిపరులై చేసిన కీడును యుద్ధమునకుఁబోయి చక్కఁజేసెద ననిన రావణుఁడు నవ్వుచు కుంభకర్ణునితో నిట్లనియె.

—♦ రావణుఁడు కుంభకర్ణుని ప్రశంసించుట ♦—

ఉ. రామునకున్ భయంపడి దు♦రంబు మహోదరుఁ డొల్లఁ జేమియున్
భీమబలంబునన్ మిగులు♦నెయ్యమునందును నాకు నిన్నుఁబో
ల్ధీమహితుండు వే ఱెవఁడు ♦ చెప్పఁగ సంగరకేళి కేగుమీ
ప్రామిడి శత్రులం దునిమి ♦ ప్రాణభయంబును బాపు తమ్ముఁడా! ౧౮౩౧

అర్థములు. దురంబు = యుద్ధము, ధీమహితుండు=బుద్ధిచే గొప్పవాఁడు, ప్రామిడి శత్రులన్ = (౧) క్రూరులైన విరోధులను, (౨) క్రౌర్యముచే విరోధులను.

తాత్పర్యము

రామునకు భయపడి మహోదరుఁడు యుద్ధము చేయ నిచ్ఛగింపఁడు. అది వాస్తవము. భయంకరమైన బలమునందు అతిశయస్నేహమందు నాకు నిన్నుఁ బోలినవాఁడు బుద్ధిమంతుఁడు మఱియెవఁడు గలఁడు? కావున యుద్ధమునకుఁబొమ్ము. క్రూరముగా పగవారిని జంపి తమ్ముఁడా! నా ప్రాణభయమును బాపుము.

ఉ. నే నలభీతిఁ గాదె నిను ♦ నిద్దుర లేపితి, నాకుఁ గూర్చువా
రానికిఁ దోడ్పడంగ సమ♦యం బిదియే. యటుగాన శూలముం
బూనుచుఁ బాశహస్తుఁ డగు♦పూషసుతుంబలె సూర్యతేజులన్
మానవనాథులం గపుల♦మానక యందఱ మ్రింగి వేయుమా! ౧౮౩౨

అర్థములు. అలభీతిన్=ఆ రామునివలన ప్రాణాపాయము వచ్చునను భయముచే, కూర్చువారు = ప్రేమగలవారు, ఆప్తులు—ఆనికన్ = దృఢముగా, పూషసుతుంబలెన్ = యమునివలె.

తాత్పర్యము

ఆ ప్రాణభయము చేత నేకదా నిన్ను నేను నిద్దుర లేపితిని. నాకు నాప్తులగువారు పూనికతో సహాయము చేయవలసిన సమయమిదియే కదా? కావున శూలము తీసికొని పాశమును ధరించిన యమునివలె సూర్యకాంతిగల రాజులను కపులను నెవరిని వదలక యందఱను మ్రింగుము.

కం. నీ యాకారముఁ గనిన య, థాయథలై పాఱిపోవ • తరుచరతతు ల
త్యాయతభీతిని రాఘవుఁ, డా యనుజుఁడు గుండె లగల • హతులై పోరే.

అర్థములు. యథాయథలు=చెల్లాచెదరు, అగలన్=పగులఁగా.

తాత్పర్యము

నీ యాకారము చూడఁగానే వానరు లెక్కడివా రక్కడనే చక్రాతివిగాఁది గ్రచ్ఛకాయులై చెదరిపోరా? మిగుల భయపడి రామలక్ష్మణులు గుండెలు పగిలి చావరా?

ఉ. ఈ తెఱఁ గాడి రాక్షసకు • లేశ్వరుఁడా ఘటకర్ణు, వాని ప్ర
స్ఫీతభుజాబలంబుఁ బటు • వీర్య మెఱుంగుటఁ జేసి తన్ బున
ర్జాతునిఁగాఁ దలంచుచు భృ • శప్రమదంబునఁ దేలియాడుచున్
శీతమరీచిభంగి వెల • సెం గడు నిర్మలుఁడై సభాస్థలిన్. ౧౪౬౪

అర్థములు. ఈ తెఱఁగాడి = ఈవిధముగాఁజెప్పి, ప్రస్ఫీతభుజాబలంబు= ప్రసిద్ధికెక్కిన భుజబలంబు. పటువీర్యము=దృఢశక్తి, పునర్జాతునిఁగా = మరలఁ దల్లి కడుపులో నుండి పుట్టిన వానిఁగా, భృశప్రమదంబునన్=మిక్కిలి సంతోషముతో, శీతమరీచి భంగిన్=చంద్రునివలె.

తాత్పర్యము

కుంభకర్ణునితో రావణుఁ డీప్రకారము చెప్పి వాని ప్రసిద్ధబలము శౌర్యము తెలిసిన వాఁడగుటచే మరల జన్మమెత్తిన వానిఁగాఁ దన్నుఁదలంచుచు మిగుల సంతోషమునఁ దేలాడుచు చంద్రునివలె మిగుల నిర్మలుఁడై సభయందు వెలసెను.

—• రావణుఁడు కుంభకర్ణునితో నొంటిగ యుద్ధమునకుఁ బోవలదనుట •—

సీ. అన్నయానతిమేర • కా కుంభకర్ణుండు, యుద్ధసన్నాహంబు • లొనరఁ జేసి
కాలాయసంబును • గనకభూషితమును, శక్రాశని సమంబు • సాధ్వసదము
దానవదేవగం • ధర్వ సూదనమును, వమదుగ్రపావక • జ్వాల మసమ
తేజంబు దీప్తంబు • ధృతరక్తమాల్యంబు, శాత్రవశోణిత • సంయుతంబు

తే. నగుచు రహిమించు శూలంబు • హస్తమందు
దాల్చి దశకంఠుఁ గనుఁగొని • తరలువాఁడ
నేకతమ యని సేయఁగ • నింద నాదు
బలము లుండెడుఁగాక నా • వచ్చు దాఁక. ౧౪౬౫

అర్థములు. సన్నాహంబులు = ప్రయత్నములు. కాలాయసంబును = ఉక్కుతోఁ జేయఁబడినది, కనకభూషితము=బంగారు నగలచే నలంకరింపఁబడినది. శక్రాశనిసమంబు = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైనది. సాధ్వసదము = భయము కలిగించునది, దానవదేవ గంధర్వ సూదనమును=దానవులను దేవతలను

గంధర్వాలను చంపినది, వమత్ = వాంతిచేసికొనుచున్న, ఉగ్రపావకజ్వాలము = భయంకరమైన యగ్నిజ్వాలలు గలది, అనమ తేజంబు = అనమాన కాంతిగలది, దీప్తంబు=మండుచున్నది. ధృత=ధరింపఁబడిన, రక్తమాల్యంబు = ఎఱ్ఱని పూల దండలు గలది, శాత్రవ శోణిత సంయుతంబు=శత్రువుల నెత్తుటితోఁ గూడినది, రహింపంచు = ప్రకాశించు, ఏకతను = ఒంటరిగా, అనిసేయఁగన్ = యుద్ధము చేయుటకు.

## తాత్పర్యము

అన్న యాజ్ఞ చొప్పున నా కుంభకర్ణుండు యుద్ధప్రయత్నములు చక్కఁగాఁ జేసి, ఉక్కుతోఁ జేయఁబడినదియు, బంగారు నగలచే నలంకరింపఁ బడినదియు. ఇంద్రునివజ్రాయుధముతో సమానమైనదియు, భయముగలిగించునదియు, దేవదానవ గంధర్వులఁ జంపినదియు, అగ్నిజ్వాలలఁ గ్రక్కునదియు, అనమాన తేజస్సు గల దియు, మండుచున్నదియు. ఎఱ్ఱపూలదండలు ధరించినదియు, పగవారి నెత్తుటితోఁ గూడినదియునై ప్రకాశించు శూలంబును జేత ధరించి రావణుని జూచి నే నొంట రిగా యుద్ధమునకుఁ బోయెదను. నేను వచ్చువఱకు నాసేన లిందే యుండనిమ్ము.

చ. తరమిడి గ్రుంగువాఁడ వసు•ధారుహచారుల నన్నఁ బంక్తికం
ధరుఁ డది నీతిగాదు, భయ•దధ్వజినీచయము ల్పకంప ము
ద్గరముసలాయుధు ల్గొలువఁ•గాఁ జనుమీా, శకులన్న శౌర్యని
ర్భరు లతివేగు లాహవధు•రంధరులున్ సముదీర్ణసాహసుల్. ౧౪౭

అర్థములు. తరమిడి = వరుసపెట్టి, వసుధారుహచారులన్ = వానరులను, భయదధ్వజినీచయముల్=భయంకరమైన సేనాసమూహములు, శౌర్యనిర్భరులు= అధిక శౌర్యముగలవారు, అతివేగులు=మిగుల వేగముగలవారు. ఆహవధురంధ రులు=యుద్ధమందు సమర్థులు, సముదీర్ణసాహసుల్=మిక్కిలి తెంపుగలవారు.

## తాత్పర్యము

వానరులను వరుసపెట్టి గ్రుంగెదను, అని చెప్పఁగా రావణుఁ డది నీతిగాదు. భయముగలిగించు సేనలు ముద్గరములు రోఁకండ్లు ఆయుధములుగాఁ గలవారు సేవింపఁగా బొమ్ము. వానరులు సామాన్యులుగారు. అధిక శౌర్యముగలవారు. అతి వేగము గలవారు. యుద్ధనిపుణులు, మిక్కిలి సాహసులు.

కం. ఒంటరిఁ బ్రమత్తు నినుఁ గని, కంటువఁ గోఱలను గొఱ్ఱఁ•గవి కాండంబుల్
దుంటలుగఁ జెఱికి చంపెదు, నొంటిగఁ జనకన్న! చనుము•యుగ్రబలముతోన్.

## తాత్పర్యము

ఒంటరివానిని=దేహము తెలియనివానిని నిన్నుఁజూచి పగచే వానరులు కోఱలచే గొఱ్ఱచేతను కలుగఁబీఁకి చంపెదరు. నాయనా! యొంటరిగఁ బోకుము. గొప్ప సేన తీసికొని పొమ్ము.

చ. మన పగవారినెల్లఁ బరి • మార్పు మటంచును రావణుండు ది
 గ్గన తన పీఠముం డిగి ప్ర • కాశధురం బగు రత్నహార మ
 య్యనుజుని కంఠసీమ ముద•మారఁగ వైచి మణీమయోర్మిక
 ల్గనకవిభూషణంబులు జ్వల • న్మహితాంగద కుండలంబులున్. ౧౪౭౮

 అర్థములు. ప్రకాశధురంబు = అధికప్రకాశము గలది, మణీమయోర్మికల్ = రత్నములుచెక్కిన యుంగరములు, జ్వలత్=ప్రకాశించు, మహితాంగద కుండలంబులున్=గొప్ప భుజకీర్తులు చెవులకుండలములు.

తాత్పర్యము

మన విరోధుల నెల్ల (విభీషణునితోడ నని భావము) చంపుము, అని చెప్పి రావణుఁడు తటాలునఁ దాను కూర్చుండిన పీఠము దిగి ప్రకాశము గలది యగు రత్నహారము తమ్మునికంఠసీమయందు వైచి రత్నాలు చెక్కిన యుంగరములు బంగారు సొమ్ములు ప్రకాశించు భుజకీర్తులు, కుండలములు.

ఆ. తాన తొడిగి దివ్య • మానిత పరిమళ, భరితమాల్యదామ • పటలములను
 మేననుంప నతఁడు•మేలిసొమ్ములు దాల్చి, సుహుతమైన యగ్ని•శోభఁ దనరె.

 అర్థములు. దివ్య=దేవతాసంబంధమై, పరిమళ = సువాసనచే, భరిత = నిండిన, మాల్యదామ = పూలహారములయొక్క పటలములను = సమూహములను, సుహుతము = చక్కఁగా హోమముచేయఁబడినది, అగ్నిశోభన్=అగ్ని కాంతిచే, తనరెన్=ఒప్పెను.

తాత్పర్యము

తానే ధరింపఁజేసి దేవతలచే గౌరవింపఁబడిన సువాసన గల పూలదండల సమూహములను దేహమునం దుంపఁగా మంచి సొమ్ములు ధరించి చక్కఁగా హోమము చేయఁబడిన యగ్ని కాంతివలె యొప్పెను.

కం. మాసరసితేతర శ్రోణీ సూత్రముచేత నతఁడు • నెఱి రాణించెన్
 భాసుర సుధాజననమున, నా సర్పానద్ధమంద • రాద్రి విధమునన్. ౧౪౮౦

 అర్థములు. మాసర = దీర్ఘమైన, సితేతర=నల్లనైన, శ్రోణీ సూత్రముచే = మొలత్రాటిచే, నెఱిన్=అందముచే; భాసుర = కాంతితోఁ గూడిన, సుధాజననమునన్=అమృతము పుట్టెడి కాలమందు, ఆ = ప్రసిద్ధికెక్కిన, సర్పానద్ధ=వాసుకియను పాముచే గట్టఁబడిన, మందరాద్రివిధమునన్=మందరాద్రివలె.

తాత్పర్యము

దీర్ఘమై నల్లనైన మొలత్రాడు ధరించిన యతఁడు అందముచే సముద్ర మథనకాలమున వాసుకిచేఁ జుట్టఁబడిన మందరపర్వతమువలెఁ బ్రకాశించెను.

మానిని. కాంచన భారసహంబు నివాత మ • కాండవిదార్యము వైద్యుత శో
 జొంచిత మహా కవచంబు ధరించి • మహాత్ముఁడు వీరుఁడు సాంధ్యకళ్ళ

త్సంచయ సవృతపర్వత రాజము • చందమునన్ రహిమించె మటిన్
జందన సూనవిభూషణ భూషిత • సర్వతనుం డయి శూలియునై. ౧౮౮౧

అర్థములు. కాంచన భార సహంబు. కాంచన=బంగారుచే జేయఁబడి నదియు, భారసహంబు=పెక్కు భారువల నెత్తుగలది, (౨) ఎంత గొప్ప బరువు నైన నోర్చునది, ఎన్ని పర్వతములచే గొట్టినను విఱుగదు, నివాతము= =(౧) గాలి దూఱునంత సందుగూడ లేనిది, (౨) శస్త్రములచే భేదింపరానిది. "నివాతా వాశ్రయావాతా శస్త్రాభేద్యంచ కర్మయు" త్తని యమరము. అకాండ విదార్యము = బాణములచే జీల్చుటకు సాధ్యపడనిది. వైద్యుత తేజోంచితంబు= మెఱుపువంటి కాంతితో నొప్పునది, సాంధ్య=సంధ్యాకాలము నందలి, కభృత్ = మేఘములయొక్క, సంచయ, సమూహముచే, సంవృత = క్రమ్ముకొనఁ బడిన, పర్వతరాజము చందమునన్, చందన = గంధముచేతను, సూన =పూలచేతను, విభూషణ=సొమ్ములచేతను, భూషిత=అలంకరింపఁ బడిన, సర్వతనుండై = సర్వ దేహము గలవాఁడై.

## తాత్పర్యము

బంగారుతోఁ జేయఁబడి మిగుల బరువై, బరువును సహింపఁగలదియు,నివాతము=గాలిదూఱుసందు లేనిది, బాణములచేఁ జీల్పరానిది, మెఱుపుతీఁగ వంటి కాంతిగలది, పెద్దదేహము గలవాఁడు, వీరుఁడు నగు కుంభకర్ణుఁడు సంధ్యాకాల మేఘ సమూహముచేఁ గట్టఁబడిన పెద్దపర్వతమువలెఁ బ్రకాశించెను. మఱియును గంధము పూలు సొమ్ములు వీనిచే నలంకరింపఁ బడిన దేహమంతయు గలవాఁడై శూలము ధరించిన వాఁడై.

తే. వీరుఁడ త్రివిక్రమోత్సాహ • వేళ యందుఁ
బెరుఁగు నారాయణునిఁ బోలె • వెలిఁగి యాతఁ
డన్నకును దాఁ బ్రదక్షిణ • మాచరించి
కౌఁగిటను గ్రుచ్చి మ్రొక్కిడి • కదలె వనికి. ౧౮౮౨

అర్థములు. త్రివిక్రమోత్సాహవేళయందు = మూఁడడుగులు గొలుచుటకై విష్ణువుత్సహించి నపుడు.

## తాత్పర్యము

పూర్వము మూఁడడుగులచేఁ గొలుచుటకై యుత్సహించిన వేళ నారాయణ మూర్తి పెరిఁగినట్లు వెలిఁగి యన్నకుఁ బ్రదక్షిణ మాచరించి కౌఁగిలించి, నమస్కరించి యుద్ధమునకై వెడలెను.

—• కుంభకర్ణుఁడు యుద్ధమునకై వెడలుట •—

సీ. అన్నచే దీవన • లంది యా బలశాలి, యార్భటుల్ నించుచు • నరుగుచుండ
శంఖదుందుభులని • స్స్వనములు శూరుల, గౌరుల తురుకుల • భేరిగముల

రవములు నిండారె ♦ రథికులు వెన్నంటి, చనిరి సింహద్విప ♦ సర్పతురగ
మృగఖరోష్ట్రింబులు ♦ నేగె నాతనిబడిఁ, బురజనుల్ చల్లిరి ♦ పుష్పములను
ఆ. భటులు చనిరి శస్త్ర♦పాణులై సింహనాదములు దెసల నిండ ♦ దారుణాక్షు
లగుచుఁ గుంభకర్ణుఁ ♦ డతి భీమరూపుఁడై, యుగ్రగంధమత్తుఁ ♦ డగుచుఁజనుచు

అర్థములు. గారుల = ఏనుఁగుల, తురుకుల = గుఱ్ఱములను, ఏక. తురికి (Turkey) దారుణాక్షులు = క్రూరములైన చూపులు గలవారు, ఉగ్రగంధ మత్తుఁడు=నెత్తుటి వాసనచే దేహము తెలియనివాఁడు.

తాత్పర్యము

ఆ బలశాలి యన్నచే నాశీర్వదింపఁబడి సింహనాదములు చేయుచుఁ బోవు చుండఁగా శంఖములయు, నగారాలయు ధ్వనులు, ఏనుఁగుల, గుఱ్ఱముల, రథసమూహ ముల ధ్వనుల వ్యాపించెను. సింహములు, ఏనుఁగులు, సర్పములు, పాములు, జింకలు, కంచరగాడిదలు, ఒంటెలు వాహనములుగాఁ గలవారును, రథికులును, నతని వెంటఁ బోయిరి. పోవునపుడు పురజనులు వానిమీఁదఁ బుష్పములు చల్లిరి. శస్త్రములు ధరిం చినవారై సింహనాదములు చేయుచు భటులు పోయిరి. కుంభకర్ణుఁడు భయంకర రూపము గలవాఁడై నెత్తుటి వాసనచే దేహము తెలియక పోవుచు.

సీ. నూఱువిండ్ల వెడలు♦నాఱునూఱుల యున్న, తియు రథచక్రముల్ ♦ దెగడుకనులు
రౌద్రరూపంబు ప♦ర్వతసన్నిభాంగంబు, దగ్ధశైలోపమ♦తనువుఁ దాల్చి
గహ్వరాస్యుండు ర♦క్కసులఁ గనుంగొని, నగుచు నిట్లను దైత్య♦నాథులార!
మిడుతలపైఁ జిచ్చు♦పడు వడువునఁ గ్రోతి, నెఱసరిమిన్నల♦నిగ్రహింతు
తే. నాకు వా రపరాధ మొ♦నర్ప లేదు, మఱియు మావంటి వారల ♦ మంజులోప
వనుల కెల్ల నలంకృతి♦ప్రాయు లగుదు, రిట్టు లగుటను వారల♦నేల చంప?

అర్థములు. నూఱు విండ్ల వెడల్పు = నూఱు బాణుల వెడల్పు, పర్వత సన్నిభాంగంబు = పర్వతముతో సమానమైన దేహము, దగ్ధశైలోపమ తనువు = కాలిన కొండతో సమానమైన దేహము, గహ్వరాస్యుండు=గుహవంటి నోరుగల వాఁడు, నెఱసరి మిన్నల=శ్రేష్ఠులగు కోఁతుల, మంజులోపవనులకు = అందమైన యుద్యానవనములకు

తాత్పర్యము

నూఱుబారల వెడల్పు, ఆఱునూఱు బారల పొడుగు, రథచక్రములఁబోలు కన్నులు, భయంకరాకారము. కొండనుబోలు దేహము, కాలిన కొండవంటి దేహము ధరించి గుహవంటి నోరు గలవాఁడై రాక్షసులఁజూచి నవ్వుచు నిట్లనియె. రాక్షసులారా! మిడుతలమీఁద కారుచిచ్చు పడునట్లు కోఁతు లగు వానరులను కాల్చి వేసెదను. కాదు కాదు. వారు నాకేమి యపరాధము చేయలేదు. మఱియు వారు మావంటి వారి యుద్యానవనములకు నలంకారమై యుందురు. కావున వారిని జంపనేల ?

చ. మనసగరంబు ముట్టినది • మానవనాథులు రామలక్ష్మణుల్
మును మును వారిఁ జంపిన స•మూలముగా నశియించు సర్వ మం
చన మదిఁ బొంగి వారలు మ•హాంబుధి క్షోభిల సింహనాదముల్
నినిచిరి రామలక్ష్మణులు • నేఁటికిఁ దీఱె రటంచు నెంచుచున్. ౧౪౦౫

అర్థములు. ముట్టినది = ముట్టడించినది, క్షోభిలన్ = కలఁతపడునట్లు, నినిచిరి = నింపించిరి.

తాత్పర్యము

మన పట్టనము ముట్టడించినవారు రామలక్ష్మణులు. మునుముందు వారిని జంపిన సర్వము వేరుతోడ నశించును. కొమ్మలు కొట్టుటకంటె వేరు తెగఁగొట్టుట గదా ముఖ్యము. అని చెప్పఁగా వారు అబ్బా రామలక్ష్మణులు నేఁటితోఁ జచ్చిరని సంతోషించి సముద్రము కలఁతపడునట్లు సింహనాదములు చేసిరి.

సీ. కుంభకర్ణుఁడు రణ•కుతుకంబునను జన, దుశ్శకునంబులు • దోఁచెఁ జాల
నుల్కాశనులతోడ • నొప్పె మేఘంబులు, గర్దభారుణములై •గగనసీమఁ,
గలఁగె సాగరవనుల్ •కంపించె మేదిని, వఱదులు వాపోయె•జ్వాల లుమిసి
యప్రదక్షిణముగ • నరిగె శకుంతముల్, మాలికనా మీఁద • వ్రాలె గ్రద్ద
తే. యదరెడాకన్నుఁ గేలు, తే•జారె రవికిఁ బరుసముగ వీవఁ దొడఁగెఁ బ్ర•భంజనుండు
వాని నేమియుఁ గైకోక • వాసవారి కాలబలచోదితుం డయి•కదలె ననికి.

అర్థములు. రణకుతుకంబునను = యుద్ధమందలి యాశచే, ఉల్కాశనుల తోడన్ = కొఱవులతోను పిడుగులతోను, గర్దభారుణములై = గాడిదలవలె నెఱ్ఱనై, సాగరవనుల్ = సముద్రము, అడవులు, వఱదులు = నక్కలు, శకుంతముల్ = పక్షులు, మాలిక = సరము, గ్రద్ద = గ్రద్దలు, జాత్యేకవచనము, డాకన్ను = ఎడమ కన్ను, తేజు + ఆరెన్ + రవికిన్ = సూర్యునకు కాంతి క్షీణించెను. ఇట్లు చెప్పుటచే నిది పగటి యుద్ధమని యేర్పడుచున్నది. ప్రభంజనుండు = వాయువు, కైకోక = లక్ష్యపెట్టక, కాలబలచోదితుండయి = కాలబలముచే ప్రేరితుండై.

తాత్పర్యము

యుద్ధమందలి యాశచే కుంభకర్ణుఁడు పోవుచుండ పెక్కు చెడ్డ శకునము లయ్యెను. ఆకాశము కొఱవులతోను (కొఱవులవంటి మంటలు) పిడుగులతోను గాడిదలవలె నస్పష్టమైన యెఱ్ఱనికాంతి గలదై మేఘము లొప్పెను. సముద్రము, అడవి మృగములు వ్యాకులపడెను. భూమి వణఁకెను. మంటలు గ్రక్కుచు నక్కలు కూసెను. పక్షు లప్రదక్షిణముగాఁ దిరిగెను. గ్రద్దలు పంక్తిగావచ్చి మీఁద వ్రాలెను. ఎడమకన్ను, ఎడమచేయి యదరెను. సూర్యుని కాంతి క్షీణించెను. వాయువు కఠినముగ వీచెను. వానిని గొంచెమైన లక్ష్యపెట్టక రాక్షసుఁడు కాల బలముచేఁ బ్రేరేపింపఁబడి యుద్ధమునకుఁ బోయెను.

కం. చంగునఁ బ్రాకారంబును, లంగించి యతండు పదము•లన్ శంబరభృ
ద్భంగి వెలుంగుచు నుండు ప్లవంగమ సైన్యంబుఁ గాంచె • వాలిన కినుకన్.

అర్థములు. లంగించి=దాఁటి, లంఘించి-ప్రకృతి-శంబరభృత్ భంగిన్=మేఘమువలె, వాలినకినుకన్=అతిశయించిన కోపముచే.

తాత్పర్యము

ఏ ద్వారమును దూఱిపోక కాళ్ళచేతనే చంగునఁ బ్రాకారము నెగిరి దూఁకి, మేఘమువలె వెలుంగుచునుండు వానరసేనను నతిశయించిన కోపముచేఁ జూచెను.

ఉ. వచ్చిన కుంభకర్ణుఁ గని • వానరవాహిని విచ్చు మొగ్గ లై
పచ్చముపాడుగాఁ బఱచె • వాతహతాంబుదజాలరీతి ని
ట్లిచ్చనభీతిఁ బాఱెడి క•పీంద్రులఁ గాంచి ప్రహర్ష వార్ధిలో
ముచ్చమునింగి భూరిజల•ముగ్గతి బొబ్బలు నించె నించినన్. ౧౪౭౭

అర్థములు. విచ్చుమొగ్గలై = చెల్లాచెదరై, పచ్చముపాడుగా=మిక్కిలి శూన్యముగా, పఱచెన్=పరువెత్తెను, వాతహత = గాలిచేఁ జెదరఁ గొట్టఁబడిన, అంబుదజాలరీతిన్=మేఘసమూహమువలె, ముచ్చమునింగి = మునింగి + మునింగి= ముచ్చమునింగి = పూర్ణముగా మునింగి, భూరిజలమున్ + గతిన్ = పెద్దమేఘము వలె, బొబ్బలు = సింహనాదములు.

తాత్పర్యము

• కోటగోడ దూకి వచ్చిన కుంభకర్ణునిఁజూచి వానరసేన చెల్లాచెదరై గాలిచే చెదరగొట్టఁబడిన మబ్బువలె సర్వశూన్యముగా నొకఁడైన నిలువక పరువెత్తెను. ఇట్లధికభీతిచేఁ బరువెత్తుచున్న వానరశ్రేష్ఠులఁ జూచి యధిక సంతోష మను సముద్రములోఁ దీరమునింగి గొప్పమేఘ ముఱిమినట్లు సింహనాదములు చేసెను.

కం. బెడిదపుటులివున నడఁబడి దడఁబడి యొదవడి సుడివడి • తరుచరవీరుల్
తోడఁబడి తోడితోడి బడి బడిఁ, బుడమిఁ బడిరి వేళ్ళు తెగిన•భూజములనఁగన్.

అర్థములు. బెడిదము + ఉలివున = భయంకర ధ్వనిచే, నడఁబడి=శ్రమపడి, తడఁబడి=తడఁబాటు జెంది, సుడివడి=దిగ్భ్రమగొని, తోడఁబడి = తొట్రుపాటు పడి, తోడితోడి=వరుసలై, బడిబడి = వెంట వెంటఁ ఒకరి వెంట నొకరు, సముచ్చయాలంకారము, భూజములు=చెట్లు.

తాత్పర్యము స్పష్టము.

కం. వారిఁ గని కుంభకర్ణుఁడు, వారక చెలరేఁగి కేలఁ • బరిఘముగొని తాఁ
దోరపుజవమునఁ గవిసెన్, వారిపయిన్ శత్రుభయద•వర్తనుఁ డగుచున్.

అర్థములు. పరిఘము = ఇనుపకట్ల గుదియ, తోరపు జవమునన్=అధిక వేగమున, శత్రు భయదవర్తనుఁడు = విరోధులకు భయము కలిగించు వ్యాపారము గలవారై. తాత్పర్యము స్పష్టము.

## ౬౬వ సర్గము. కుంభకర్ణునిఁ జూచి పరువిడు క్రోఁతులకు సంగదుఁడు ధైర్యముఁ జెప్పుట.

కం. వరుణయమవాసవులకున్, దురమునఁ బోరిగొనఁగరాని • దోర్బలధుర్యున్
బరభీకరాక్షు గళరవ, పరిదారితశైలు నశని • వర్షాపాదిన్. ౧౪౯౧

అర్థములు. వాసవునకున్ = ఇంద్రునకు, దురమునన్ = యుద్ధమునందు, పోరిఁగొనఁగరాని = చంపసాధ్యపడని, దోర్బల ధుర్యున్ = భుజబలాతిశయము గలవానిని, పరభీకరాక్షు = శత్రువులకు భయంకరమైన కన్నులు గలవానిని, గళరవ = కంఠధ్వనిచే పరిదారిత = పూర్ణముగాఁ జీల్పఁబడిన, శైలున్ = కొండలు గల వానిని, అశనివర్షాపాదిన్ = పిడుగులవాన గురియించు వానిని.

### తాత్పర్యము

వరుణుఁడు యముఁడు ఇంద్రుఁడు ముగ్గురు గలిసియును యుద్ధమునందుఁ జంప సాధ్యపడని యధికమైన భుజబలము గలవానిని, శత్రువులకు భయంకరమైన కన్నులు గలవానిని, కంఠనాదముచేఁ గొండలు పగులఁజీల్చు వానిని పిడుగులవాన గురియించు వానిని.

చ. కనుఁగొని క్రోఁతిమూఁకలు వి • కావికలై పరిభిన్న దారదం
బనఁ జనె, నంత నీలుని గ • వాక్షు నలుం గుముదున్ సహస్రనే
త్రుని మనుమండు డాసి నుత • దోర్బలధుర్యు లరీరు, మీరలే
చని యెద రెందు? నాత్మకుల • శౌర్యములున్ మఱ పాయెనే మదిన్. ౧౪౯౨

అర్థములు. వికావికలై = చెల్లాచెదరై, పరిభిన్నదారదంబు = చెదిరిన పాదరసము, "దారదా విషపారదా" నానా॥ ర॥ నుతదోర్బల ధుర్యులరు = పొగడఁబడిన భుజబలముయొక్క యాధిక్యము గలవారలు, ఈరు = మీరు.

### తాత్పర్యము

చూచి క్రోఁతిగుంపులు చెల్లాచెదరై చెదరిన పాదరసమువలె పోయెను. ఇట్లు పోవుచున్న నీలుని, గవాక్షుని, నలుని, కుముదుని యంగదుఁడు సమీపించి మీరు మహాబలవంతు లని ప్రసిద్ధికెక్కినవారే. మీరే యెక్కడికి బరువెత్తి పోవుచున్నారు? మీ బలము, మీ శౌర్యముస్వరము మఱచిపోయితిరా?

చ. వెఱ పెపు డభ్యసించితిరి • వీరులు? ప్రాకృతవానరాళి య
ట్లెఱఁగున మీరు పాఱుదు రె • లేఁకువఁ బ్రాణభయార్తిఁ బాఱినన్
బఱచినచోట మిత్తి కనుఁ • బ్రామఁగ శక్యమె? మేలె దానఁ గో
యఱగొఱలేని కీర్తి హతు • లౌటయొ యాఱడిచావుఁ జచ్చుటో? ౧౪౯౩

అర్థములు. అభ్యసించితిరి = అలవాటు పఱచికొంటిరి, కనుప్రామఁగ = కన్నులు కప్పఁగ, అఱగొఱలేని = కొంచెమైనను దక్కువగాని, ఆఱడిచావు = వ్యర్థపుఁజావు.

తాత్పర్యము

వీరులారా ! భయపడుటకు నెప్పుడు నేర్చుకొని యలవాటు చేసికొంటిరి. ముక్కిడి క్రోఁతులవలె మీరును పరువెత్తుదురా? ప్రాణము పోవునను భయము వలనఁ గలిగిన దుఃఖముచేఁ బరువెత్తిపోయితిరేని మీరు పోయినచోట మృత్యు దేవత లేదా? మృత్యువును కన్నులుమూసి మోసపుచ్చి పోవ మీకు సాధ్యమా? కీర్తికి నేలోపము లేకుండ వీరులవలెఁ జచ్చుటమేలా? అపకీర్తిపాలై యిండ్లలో రోగాదులచే వ్యర్థపుఁజావు చచ్చుట మేలా? ఆలోచించితిరా?

చ. కటకట ప్రాణవాయువులు • కాచుకొనంగను లేర? రాక్షసుల్
పాటముఁగఁ జేయ భీతి వెఱ•బొమ్మను దెచ్చిరి. పోటు చాల దీ
కుటిలత మీ రెఱింగి పడఁ • గూల్చినఁ దీజడిఁ గ్రోఁతులార! రం
డిటు తిరుగుండు దీని పని•యింతము నింతము నిత్యకీర్తులన్. ౧౦౯౮

తాత్పర్యము

అయ్యయ్యో వీరులారా! ప్రాణములను కాపాడుకొనుటకై పరుగెత్తి పోవలయునా? ఇందుండియే గాపాడుకొనలేరా ? మనకు భయము కలిగింపఁగోరి రాక్షసులు వెఱబొమ్మను దెచ్చిరి. (పక్షులు మృగములు బెదరుటకై చేలలోఁ గట్టెడి బొమ్మకు వెఱబొమ్మయని పేరు) ఇది చంపునది కాదు. ఈ కిటుకు మీరు తెలిసికొని పడగొట్టితిరా దీని పని ముగియును. వానరులారా! రండు వెనక కిక్కడికి తిరుగుఁడు. మనమందరము కలిసి దీని జంపుదము. శాశ్వతకీర్తి సంపాదింతము.

—• వానరులు కుంభకర్ణుతోఁ బోరి రొమ్మోడి పాఱిపోవుట •—

కం. అనవుడు వారును ధైర్యం,బును గొని సంక్రుద్ధు లగుచు • భూరుహముల న
ద్దనుజవరేణ్యుని మోఁదిరి, ఘనమదలసితంబులైన•గజములమాడ్కిన్.

అర్థములు. సంక్రుద్ధులు = కోపించినవారు, ఘనమదలసితంబులైన = గొప్ప మదముచేఁ బ్రకాశించు.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా వారు ధైర్యముఁ దెచ్చుకొని యీ రాక్షసుఁడు మనల నిష్కారణముగ బెదరించెఁగదా యని కోపించి మదించిన యేనుఁగును గొట్టినట్లు చెట్లతోఁ గుంభకర్ణుని గొట్టిరి.

ఉ. అద్రిచరేంద్రు లొక్క మొగిఁ • బ్రాంశుధరాధరశృంగపాళి భూ
రిద్రుమచక్రవాళముల • రేయుచుఁ దాఁచినఁ గంపమొందఁ డు
న్నిద్రమదాతిరేకమున • నిర్జరవైరి, సహస్రధాభిదన్
రౌద్రముగా ధరం దొరఁగె • రాక్షసు సోఁకిన చెట్లు గుట్టలున్. ౧౮౯౬

అర్థములు. ఒక్కమొగిన్ = ఏకముఖముగ, ప్రాంశు = ఎత్తైన, ధరా

ధరశృంగపాళిన్ = పర్వత శిఖరముల వరుసలను, భూరిద్రుమచక్రవాళములన్ = పెద్దచెట్ల సమూహములను, రేయుచున్=విజృంభించుచు, తాఁచినన్ = కొట్టఁగా, ఉన్నిద్ర=హెచ్చరికగల, మదాతిరేకమునన్ = మదముయొక్క యతిశయముతో, సహస్రధాభిదన్=వేయి తునుకలుగా.

### తాత్పర్యము

వానరు లందరును నొక్కమొగమై యెత్తైన పర్వత శిఖరంబులను పెద్ద వృక్షముల సమూహములను వైచి విజృంభించి కొట్టఁగా రాక్షసుఁడు హెచ్చిన మదాతిశయమునఁ జలింపఁడు. వానికిఁ దాకినచెట్లు, గుట్టలు వెయ్యి తునకలయి నేలఁబడెను.

కం. ఇద్ధబలుఁ డాతఁడు సం, క్రుద్ధుం డై వనిని జిచ్చు • కొమరున భుజ శౌ
ర్యోద్ధతి శోభిల నరిమద, వృద్ధిం బోకార్చి కూల్చె • విటతాటముగన్. ౧౮౯౭

అర్థములు. ఇద్ధబలుండు = ప్రసిద్ధమైన బలము గలవాఁడు, శోభిలన్= ప్రకాశింపఁగా, అరి = శత్రువుల, మదవృద్ధిన్ = గర్వాతిశయమును, విటతాటముగన్ = తాఱుమాఱుగ.

### తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన బలముగల వాఁడు కోపించినవాఁడై అడవిని జిచ్చువలె శౌర్యాతిశయము ప్రకాశింపఁగా శత్రువుల గర్వాధిక్యమును బోగొట్టెను. వారిని తాఱుమాఱుగఁ గూల్చెను.

ఉ. నెత్తురు గాఱుమేనుల వ • నేచరయూథము కృత్తరక్తపు
ష్పాత్తకుజంబులట్లు సమ • రావని వ్రాలెను గొంత, యాత్మలో
హత్తినభీతిఁ గొందఱు వ • నాటులు పోయినదే పథంబుగాఁ
దత్తఱ వెన్కఁ గన్గొనక • దాఁటులు వైచుచుఁ బాఱి రల్లడన్. ౧౮౯౮

అర్థములు. కృత్త = నఱకఁబడిన, రక్తపుష్పాత్త = ఎఱ్ఱనిపూలు గల; కుజంబులట్లు = చెట్లవలె, సమరావనిన్ = యుద్ధభూమియందు, పథంబుగా = త్రోవగా, తత్తఱన్=భీతిచే.

### తాత్పర్యము

వానరసమూహము దేహములనుండి నెత్తురు కాఱుచుండఁగా నఱకఁబడిన యెఱ్ఱని పూలచెట్లవలెఁ గొంత నేల వ్రాలెను. కొందఱు వానరులు మనస్సులోఁ గలిగిన భయముచే పోయినదే త్రోవఁగా భయముచే వెనుకఁదిరిగి చూడక దాఁటులు వైచుచు నలుప్రక్కలఁ బరుగెత్తిరి.

సీ. కొందఱు వానరు • ల్గొండలపాటున, జలధిలోఁ జొచ్చిరి • సరభసముగ
సేతువు దాఁటి వ • చ్చినవారు వడిత్రోవ, లోన వేఁగిరి భీత • మానసముల

వెలవెల్లనైన మోములతోడఁ గొందఱు, లాఁగల మిట్టల ♦ డాఁగికొనిరి
తెలుఁగుబంటులు కొన్ని ♦ యెక్కె వృక్షంబులు, కొండలపైఁ బ్రాఁకెఁ ♦ గొన్ని వెఱను
ఆ. గుహాలలోనఁ దూఱెఁ ♦ గొన్ని జలంబుల, మునిఁగి యుండె దిక్కు ♦ మొగములయ్యె
దిక్కు తెలియలేక ♦ తికమకపడె నేలఁ, గూలఁబడియె నెలుఁగు ♦ గ్రోఁతిగములు.

అర్థములు. కొండలపాటున = కలఁతచే, వీఁగిరి = వెనుకఁ బోయిరి, లాఁగలన్ = పల్లములందు, దిక్కుమొగములు = దిక్కులప్రక్క ముఖము ద్రిప్పి పరువెత్తినవారు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఈరీతిఁ బఱచు వానర,వీరులకున్ వాలిసుతుఁడు ♦ వెసనడ్డంబై
వారించి నూలుకొల్పి మ,హారవమున నెల్లవారి ♦ కను నిబ్భంగిన్. ౧౯౦౦

అర్థములు. వారించి = నిలిపి, నూలుకొల్పి = పురికొల్పి.

తాత్పర్యము

ఈప్రకారము పరువెత్తిపోవు వానరవీరులకు నంగదుఁ డడ్డమై నిలిపి పురికొల్పి పెద్దధ్వనితో నందఱు విన నిట్లనియె.

—♦ అంగదుఁడు కపులకు భయముఁ బాపి క్రమ్మఱించుట ♦—

ఉ. పోకుఁడు పోకుఁడీ ప్లవగ ♦ పుంగవులార ! నిలుండు పోరికిన్
వీఁకువఁ గ్రమ్మఱుండు పర ♦ వీరులు నవ్వఁగఁ బాఱిపోవ న
స్తోకపుభీతి నీ జగతి ♦ సంతతము లేదు సుఖంబుఁ గీర్తియున్
బోకడఁబెట్టి మాన మిటు ♦ పోవఁగఁ బ్రాణము లంత యెక్కుడే. ౧౯౦౧

అర్థములు. పరవీరులు=శత్రువీరులు, వీఁకువ=పరాక్రమముతో.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులారా! పోకుఁడు-పోకుఁడు-నిలుఁడు - యుద్ధముచేయ మరలి రండు. వీరులగు శత్రువులు పరుగెత్తిపోవు మిమ్ముఁ జూచి నవ్వరా? ఇట్లు మీరు పరువెత్తిపోయితి రేని మీకుఁ గొంచెమైనను లోకమునందు సుఖముగాని కీర్తిగాని లేదు. మానము పోఁగొట్టుకొని యిట్లు పోవుటకు మానముకంటెఁ బ్రాణ మంత గొప్పదాయెనా ?

కం. దిగవిడిచి కైదువుల నని, మగతనములు దూలఁ బఱచి ♦ మనికికిఁ జన మీ
మగువలె మిముఁ గని నగరే?, మగవారల కున్న వేఱు ♦ మరణం బకటా. ౧౯౦౨

అర్థములు. కైదువులన్ =ఆయుధములను, మనికిన్ = ఇంటికి, మీమగువలె = మీ యాఁడువారే.

తాత్పర్యము

ఆయుధములు వదలి పౌరుషములు చెడిపోవఁ బరుగెత్తి యిండ్లకుఁ బోయితి

లేని మీ రేఁడువారే యిమ్మఁజూచి నవ్వరా? మగవారి కింతకంటె వేఱు చావున్నదా?

చ. అసమకులంబునన్ జనన • మందితి రందఱు, బక్కక్రోఁతుల
ట్లసమటి పాఱిపోదురె భ • యంబునఁ? గీర్తియుఁ బౌరుషంబు మీ
రసదుగఁ జేసి పాఱుట న • నార్యుల రీరలు గారె? మున్ను నిం
డుసభ వచించు ప్రగ్గెలు మ • ఱుపల్ దలపోయుఁడి భీతిఁ బాయుఁడీ. ౧౫౦౩

అర్థములు. అసమకులంబు= అసమానమైన వంశము, అసము + అటి = కీర్తిచెడి, అసదుగన్=అల్పముగ, ప్రగ్గెలు=ప్రతిజ్ఞలు, గర్వోక్తులు.

తాత్పర్యము

అసమానమైన గొప్పవంశములందు మీ రందఱుఁ బుట్టినవారే, అట్టి మీరు బక్కక్రోఁతులవలె కీర్తి పోఁగొట్టుకొని భయపడి పరుగెత్తుదురా? కీర్తి పౌరుషము నలక్ష్యముచేసి పరువెత్తుటచే మీ రనార్యులుగారా? ముందు నిండు సభలో మీరు పల్కిన వీరాలాపములు, మాటలు మనసునకుఁ దెచ్చుకొని భయము వదలుఁడు.

ఆ. మానమెడల వెనుక • మని యుండఁ గల్గినఁ, బిఱికిపంద యనుచుఁ • బిలుచుజనము
హేయమైన బ్రదుక • దేటికి? ధీరులా, సాధుజనులు చనెడి • సరణిఁ బొందు. ౧౫౦౪

అర్థములు. మనియుండఁగల్గినన్=బ్రదికి యుండుట కేర్పడినచో, హేయమైన=నింద్యమైన ధీరులు=ధైర్యముగలవారు, సరణిన్=మార్గమున.

తాత్పర్యము స్పష్టము.

సీ. కొట్టినా యీతఁడు • కొఱప్రాణముల తోడఁ, బడియుంద మవనిపైఁ • బ్లవగులార!
చంపెనా యితరదు • ష్ప్రాపంబు బ్రహ్మలోకంబున సౌఖ్యంబుఁ • గనఁగవచ్చుఁ
జంపితిమా వీని • సాహసంబున నసామాన్య శాశ్వతకీర్తి • మనఁగఁ గలుగుఁ
గాదేని క్రయ్యంబు • గాఁ జేసి యసువుల, వీరలోకముఁ గొని • వెలయ రాదె

ఆ. మనుజవిభుఁడు గనిన • దనుక వీనిజవంబు, రాముఁబొరి బడిన • రాక్షసుండు
వహ్ని నుఱుకు మిడుత • వడువున మాఁడెఁడే, ధీరతను గొనుండు • తిరిగి రండు.

అర్థములు. ఇతరదుష్ప్రాపంబు = ఇతర విధముల మనకు లభింపని, ఇతరులకుఁ బొందరాని, అసామాన్య = సాధారణముగాని, మిక్కిలి హెచ్చైన, క్రయ్యంబు=అమ్మదగిన వస్తువుగా, అసువులన్=ప్రాణములను.

తాత్పర్యము

వానరులారా! యేల పరుగెత్తి పోయెదరు? వీఁడు మనలను గొట్టినా కొఱప్రాణముతో నేలమీఁదఁ బడియుందము. వీఁడు చంపెనా యితర మార్గముల లభింపని బ్రహ్మలోకమున సౌఖ్యముఁ గందము. అటుగాక మనము వీనిని జంపితిమా యెవరికిని లభింపని శాశ్వత కీర్తితో బ్రదుకవచ్చును, అది గాదనెదరా? మన ప్రాణములను విక్రయించి వీరులు లోకమునకుఁ బోరాదా! వీని వేగ మంతయు రామునకు

వీఁడు కనఁబడు వఱకే గదా· రాముని బాణికి వచ్చెనా వీఁడు నిప్పులలోఁ బడిన మిడుతవలె మాడిపోఁడా, కావున నంతవఱకు ధైర్యముతో నుండుఁడు. మరలరండు.

చ. ఒకనిని మించి యింకొకరుఁ • దూరక పిక్కబలంబు జూపినన్
దికమికఁ బ్రాణరక్షకయి • దేబెలుబోలె యశంబు గల్గునే?
రొకనికి నోడి పాఱెఁ గపి • యోధులయూథ మటన్న నింద తా
రకలును జంద్రసూర్యులు ధ • రాస్థలి యుండెడిదాఁక నుండదే. ౧౫౦౬

అర్థములు. పిక్కబలంబు = పరుగెత్తుటకు, వేగముగ నడచుటకు, పిక్కలందు బలముండవలెను. దానియం దెంత బలముండిన నంతవేగము పోఁగలఁడు. దేబెలు = దీనులు.

తాత్పర్యము

దిక్కుమగొని ప్రాణములు రక్షించుకొనుటకై దీనులవలె ఒకరికంటె మఱి యొకరు మీశక్తిని పరువెత్తుటయందుఁ జూపుచున్నారే. దీనివలన వానరులు బాగుగ పరువెత్తగలవారను కీర్తి వచ్చునా? వానర వీరులసేన యంతయు నొకనికి భయపడి పరువెత్తెనను నపకీర్తి నక్షత్రములు సూర్యచంద్రులు భూమి యుండువఱకుండదా?

కం. అనవుడు భీమాక్షుండై, చనుదెంచెడి కుంభకర్ణు•చాయం గనుచున్
వనచరులు చెదరి పఱచుచు, వని తా తారేయుతో భ•యాకులమతులై.

అర్థములు. భీమాక్షుండై = భయంకరమైన చూపులు గలవాఁడై, తారేయుతోన్ = అంగదునితో. భయాకులమతులై = భయముచేఁ గలఁత చెందిన మనస్సు గలవారై.

తాత్పర్యము స్పష్టము.

ఉ. క్రూరుఁడు రాక్షసుండు బల•కుంఠితగాత్రులఁ జేసె వానితోఁ
బోరఁగ నెవ్వఁ డోపుఁ బర•పుణ్యజనాళిల యట్టివాఁడు కాఁ
డూరక చచ్చినంతఁ జల•మో ఫలమో మఱి పేరొ సెంపొ. చాల్
ధీరత లింకఁ, బ్రాణములు • తీపనఁగా విన లేదె యింగదా! ౧౫౦౭

అర్థములు. బలకుంఠిత గాత్రులన్ = మొక్కబోయిన బలముగల దేహము గలవారిని, పరపుణ్య జనాళుల=ఇతర రాక్షసుల 'యాతుధానః పుణ్యజన' యని యమరము.

తాత్పర్యము

క్రూరుఁడైన రాక్షసుఁడు బలము చెడిన దేహములు గలవారినిఁగా జేసెను. వీనితో యుద్ధము చేయ నెవ్వనికి సాధ్యము? ఇతర రాక్షసుల వంటివాఁడు వీఁడు కాఁడు. నిష్ప్రయోజనముగఁ జావఁగానే చలము సాధించి నట్లా? ఫలము పొందినట్లా? లేక పేరుగాని గొప్పతనముగానిఁ గలదా? ధైర్యములు చాలును. ఏది తీపనినఁ బ్రాణము తీపను సామెత నీవు వినలేదా?

కం. అని పరువిడ నడ్డంబుగఁ జని కారణములు వచించి ♦ సాంత్వనఫక్కిన్
మనములు దేర్చిన వారలు, జనితామోదమున మరలి ♦ సత్వరు లగుచున్.

అర్థములు. సాంత్వనఫక్కిన్=మంచివిధముగా నూఱడింపుమాటలుచెప్పి, జనిత=పుట్టిన, ఆమోదమునన్=సంతోషముతో, సత్వరులు=త్వరతో గూడినవారు.

తాత్పర్యము

అని వారు పరువెత్తఁగా నడ్డము పోయి వారికి మంచిగా సమాధాన వాక్యములు చెప్పి వారి మనస్సుల కలఁత దీర్పఁగా వారు సంతోషించి త్వరతోఁ గూడినవారై.

ఆ. మైంద ధూమ్ర కుముద ♦ మారుతి రంభ గ,వాక్ష పనస శరభు ♦ లమిత బలులు
ఋషభ నీల తారు ♦ లెసఁగి ద్వివిద సుషే,ణులును నెదురు చనిరి కలహవాంఛ

అర్థములు. కలహవాంఛ = యుద్ధమందలి కోరిక.

తాత్పర్యము స్పష్టము

—♦ ౬౭-వ సర్గము. కుంభకర్ణుఁడు వానరసేన హతముఁ జేయుట ♦—

సీ. అంగదు వాక్యంబు ♦ లాలించి యందఱుఁ, బ్రాణంబులందలి ♦ యాస మాని
పేర్వాడి తమతమ ♦ బిరుదులు పలుకుచుఁ, గపివీరు లని సల్పఁ ♦ గడఁగి రేఁగి
కొండలు గుండులుఁ ♦ గుజములుఁ గైకొని, కుంభకర్ణునిఁ దాఁక ♦ ఘోరభంగి
నాతండుఁ గినిసి యు ♦ ద్యద్గదాహస్తుఁడై, వారల నెల్లర ♦ బారి సమరె

ఆ. వ్రేటునకును నూఱు ♦ వే లేడు నెనిమిది, వేలు క్రోఁతిగములు ♦ నేలఁ గూలెఁ
బదియు నాలుగురను ♦ బదిమంది నిరువది, మందిఁ బట్టి నొక్కి ♦ మాఱుమ్రింగు.

అర్థములు. పేరు + పాడి = పేర్వాడి = తమపేరు చెప్పుకొనుచు, కుజములు = చెట్లు, ఉద్యత్ = ఎత్తఁబడిన, గదాహస్తుఁడై = గదగల చేయుగల వాఁడై, బారిసమరె=హింసించెను.

తాత్పర్యము స్పష్టము.

కం. గరుటామంతుఁడు పాముల, పరణిని విదలించి మ్రింగ ♦ శాఖామృగముల్
పురి గొనుచు నెట్ట కేలకు, దుర మొనరించెను సమీక ♦ దోహల మగుచున్.

అర్థములు. గరుటామంతుఁడు=గరుత్మంతుఁడు, పురిగొనుచున్ = బలము తెచ్చుకొనుచు, ఎట్టకేలకున్ = అతికష్టము మీఁద, సమీకదోహలము = యుద్ధమునందు కాంక్ష.

తాత్పర్యము

గరుడుఁడు పాములను విదలించి మ్రింగునట్లు వాఁడు వానరులను మ్రింగఁగా నతికష్టముపై నుత్సాహము దెచ్చుకొని వానరసేన యుద్ధాభిలాషచే యుద్ధము చేసెను.

—॥ ద్వివిదుఁడు కుంభకర్ణుతోఁ బోరుట ॥—

చ. ద్వివిదుఁడు కోపఘూర్ణి తమ॥తిన్ శిఖరంబు నొకండుఁ బూని పె
న్జవమున గాలికిం జనుఘ॥నంబువలెం జని దానిపైవ దా
నవవిభుఁ డాఁక కయ్యరియు ॥ నద్ది బలంగములోనఁ గూలి సైం
ధవరథదంతి సైన్యముల ॥ నాశము సేసె నిమేష మాత్రలోన్. ౧౫౧౩

అర్థములు. కోపఘూర్ణిత మతిన్=కోపముచేఁ గలఁతపడిన మనస్సుతో, ఘనంబువలెన్=మేఘమువలె.

తాత్పర్యము

ద్వివిదుఁడు కోపముచే కలఁత నొందిన మనస్సుతో నొక శిఖరము పూని మిక్కిలి వేగముతో గాలికి మేఘము పోయినట్లు వేగముగఁ బోయి దానిని వైచెను. అది వానిఁ దాఁకక నసుమ సేనలోఁబడి గుఱ్ఱములను రథములను నేనుఁగులను నిమిషమాత్రములో నాశము చేసెను.

సమీపమునకుఁ బోవ భయపడి దూరమునుండి వేసిన కారణమున నది యంతదూరము పోయినది కాదు.

ఉ. వెండియు వానరుండు పృథి॥వీధర మొండు గ్రహించి దోర్బలో
ద్దండతఁ జిమ్మఁగా నదియు ॥ దానవసైన్యము పీతసాది వే
తండహయంబుఁ జేయఁగ మృ॥ధంబు భయంకర మయ్యె భూమియున్
నిండె సురారిరక్తమున ॥ నిర్జరవైరు లుదగ్రమూర్తులై. ౧౫౧౪

అర్థములు. పృథివీధరము = పర్వతము. దోర్బలోద్ధతిన్ = భుజబలము యొక్క యతిశయముచే, పీతసాది వేతండహయంబు = సారథులు, ఏనుఁగులు, గుఱ్ఱములు లేనిదిగా - మృధంబు = యుద్ధము.

తాత్పర్యము

అంతతోఁబోక వానరుఁడు మఱియొక కొండదీసికొని రెండు చేతుల బలము కొలఁది వేయఁగా నదియును సేనలోనేపడి, సారథులను గుఱ్ఱములను ఏనుఁగులను జంపెను. యుద్ధము భయంకర మయ్యెను. రాక్షసరక్తముచే నేల నిండెను. అప్పుడు రాక్షసులు భయంకరాకారులై.

శా. చండాంశుప్రతిమానబాణపటలీ ॥ సంభిన్న గాత్రంబుగా
ఖండీభూతశిరంబుగా దళితవ ॥ క్షఃఫాలదేశంబుగా
భిండీభూతపలంబుగాఁ ద్రుటితనా ॥ భీశ్రోణిపాదంబుగాఁ
జెండం జొచ్చిరి కీశసైన్యము బల ॥ శ్రీయుక్తదోశ్శక్తులన్. ౧౫౧౫

అర్థములు. చండాంశుప్రతిమాన=సూర్యునితో సమానమైన, బాణపటలి=బాణసమూహముచే, సంభిన్న గాత్రంబుగాన్=నఱకఁబడిన దేహములు గలదిగా, ఖండీభూత శిరంబుగా =నఱకఁబడిన తలలుగలదిగా, దళిత=చీల్పఁబడిన, వక్షః +

ఫాలదేశంబుగాన్ = బొమ్మలు, నొసళ్ళు గలవిగా, పిండీభూత = ముద్దగాఁ జేయఁబడిన, పలంబుగా = మాంసము గలదిగా, త్రుటిత = త్రెంపఁబడిన, నాడీ శ్రోణిపాదంబుగా = బొడ్డులు, పిఱుఁదులు, కాళ్ళు గలదిగా, బలశ్రీయుక్త=బల సంపదతోఁ గూడిన, దోశ్శక్తులన్=భుజబలముచే.

తాత్పర్యము

బలసంపత్తితోఁ గూడిన భుజశక్తులచే వానరసేనలను సూర్యసమాన బాణములచే దేహములు చీలినవిగా, నఱకఁబడిన తలలు గలవిగా, చీల్పఁబడిన బొమ్మ, నొసలు గలవిగా, మాంసము ముద్ద యగునట్లుగా తెగిన బొడ్డులు, పిరుదులు, కాళ్ళు గలవిగా నఱకఁ బ్రారంభించిరి.

కం. ధీరులు భుజబలసారులు, క్ష్మారుహచారులు కుజాళి • శాత్రవసేనన్
దేరుల గారుల మావుల, వారక వధియించి బడలు • పడఁ జేయు నెడన్. ౧౫౧౬

అర్థములు. క్ష్మారుహచారులు = వానరులు, కుజాళిన్ = చెట్లు సమూహముచే, గారుల=ఏనుఁగులను, మావులన్=గుఱ్ఱంబులను, శ్రమపడునట్లు.

తాత్పర్యము

ధైర్యవంతులు భుజబలవంతులు నగు వానరులు చెట్లచే శత్రువుల సేనయందుఁ దేరులను ఏనుఁగులను గుఱ్ఱములను అడ్డములేక బాధించు సమయంబున.

—• హనుమంతుఁడు కుంభకర్ణుతోఁ బోరుట •—

ఉ. మారుతి భీమరూపమున • క్ష్మాధరశృంగధరారుహాళి దు
ర్వారజవంబునన్ దనుజ • వల్లభమూర్ధతలంబుపై మహా
సారముపోలె నభ్రపథ • సంచరణంబునఁ గ్రాలి వైవఁగా
శూరుఁడు కుంభకర్ణుఁ డది • శూలమునన్ శకలాయితంబుగన్. ౧౫౧౭

అర్థములు. భీమరూపమునన్ = భయంకరాకారమున, క్ష్మాధరశృంగ= పర్వత శిఖరములయు, ధరారుహా = చెట్లయు, ఆళిన్ = వరుసలచే, దుర్వార జవంబునన్=అడ్డగింపరాని వేగముతో, మూర్ధతలంబుపై=తలమీఁద, మహా + ఆసారము = పెద్దజడివానవలె, అభ్రపథసంచరణంబున = ఆకాశమునందుఁ దిరుగుచు, శకలాయితంబుగన్=తునుక లగునట్లు.

తాత్పర్యము

ఆంజనేయుఁడు భయంకరమూర్తియై కొండశిఖరంబులను చెట్లను మిగుల వేగముగా కుంభకర్ణుని తలపై పెద్ద జడివాన కురిసినట్లు ఆకాశమునఁ దిరుగుచు వేయఁగా శూరుఁడు కుంభకర్ణుఁ డది శూలముచేఁ దునుక లగునట్లుగా.

ఉ. చేసియు నంతఁ బోక కపి • సేనల నుగ్రతఁ దోలి తోలి శూ
లాసమధారఁ ద్రుంపఁ బవ • నాత్మజుఁడున్ గురుశృంగహస్తుఁడై
యా సురవైరి కట్టెదుట • నడ్డి నిలంబడి పీచి వైవఁ వాఁ
డాసిగరంబు తాఁకున మ • హావ్యథఁ జెంది భృశాగ్రసితుండై. ౧౫౧౮

అర్థములు. తోలి = తఱిమి, శూల + అసమధారన్=శూలము యొక్క

యుపమానమైన యంచుతో, గురుశృంగహస్తుఁడై =పెద్దశిఖరమును చేతఁదీసికొనిన వాఁడై, సిగరంబు=శిఖరము, భృశాస్రసిక్తుఁడై = విశేషముగ నెత్తుటఁ దడిసిన వాఁడై.

తాత్పర్యము

చేసియు. యంతతో తృప్తిలేక వానర సైన్యమును శూలధారచే సంహరింప, ఆంజనేయస్వామి పెద్ద కొండశిఖరమును చేతఁదాల్చి దేవతావిరోధి యగు కుంభకర్ణు నెదుట నిలువంబడి యాతనిపై విసరివైవ, గిరిశిఖరము తాకుఁడుకు యాతఁడు మహావ్యథజెంది రక్తముతో తడిసినవాఁడై.

చ. తలఁకి కలంగి శాత్రవ వి॰దారణశీలము శూలమున్ మెఱుం
గుల గొనబారుదాని గురు॰గోత్రముఁ బోలినదాని వైచి య
గ్గలికను గొంచగట్టసిత॰కంఠతురంగుఁడు శక్తిఁబోలె నా
వలిముఖ వీరు వక్షమును ॰ వ్రచ్చె నరాతులు విచ్చలింపఁగన్. ౧౯।౧౯

అర్థములు. తలఁకి = చలించి, కలఁగి = కలఁతచెంది, శాత్రవ విదారణ శీలము = విరోధులఁ జీల్చు స్వభావము గలది, గురుగోత్రమున్=పెద్ద కొండను, అగ్గలికను = ఉత్సాహముతో, కొంచగట్టు = క్రౌంచపర్వతము, అసిత కంఠతురంగుఁడు = నల్లని మెడగల నెమలి వాహనముగాఁ గలవాఁడు, కుమారస్వామి - వ్రచ్చెన్=చీల్చెను, అరాతులు=విరోధులు, విచ్చలింపఁగన్=భయపడునట్లు.

తాత్పర్యము

చలించి కలఁతబడి శత్రువులఁజీల్చు స్వభావము గలిగి మెఱుఁగులచే నందమై పెద్ద కొండవలెనుండు శూలమును త్సాహముతో కుమారస్వామి క్రౌంచపర్వతమును శక్తిచేఁ జీల్చినట్లు వానరవీరుని వక్షస్థలమును విరోధులు భయపడునట్లు చీల్చెను.

ఉ. శూలవిభిన్న వక్షుఁ డయి ॰ శోణితపూరము లారఁ గ్రక్కుచున్
వ్రాలి యుగాంత నీరద ర॰వంబును బోనిరవంబు నింప న
గ్గాలితనూజుపాటుఁ గని ॰ గాఢముదంబున రాక్షసావళుల్
క్ష్వేళల నించె డీలుపడి ॰ బెగ్గిలి పాఱెఁ గపీంద్ర సంఘముల్. ౧౯।౨౦

అర్థములు. శూల విభిన్నవక్షుఁడై = శూలము భేదింపఁబడిన ఱొమ్ము గలవాఁడై, శోణితపూరము = రక్తప్రవాహము, యుగాంత నీరదరవంబున్ = ప్రలయకాలమందలి మేఘధ్వనికి, పోని = సమానమైన, రవంబు=ధ్వని, క్ష్వేళలన్=సింహనాదముల, డీలుపడి=సత్తువచెడి, బెగ్గిలి=భయపడి.

తాత్పర్యము

శూలముచేఁ జీల్పఁబడిన ఱొమ్ము గలవాఁడై విస్తారముగ నెత్తురు ప్రవాహమువలెఁ గ్రక్కుచు ప్రళయకాల మేఘ ముఱిమినట్లు ధ్వనించి నేలఁ బడెను. హనుమంతుఁడు పడుట చూచి రాక్షసులు సింహనాదములు చేసిరి. వానరులు భయపడి సత్తువచెడి పరుగెత్తిరి.

చ. పరువిడువారి నిల్పి కపి♦పర్యుఁడు నీలుఁడు శృంగ మొండు దా
నురవడిఁ గుంభకర్ణుని మ♦దోద్ధతి నైచిన సోఁకు దాని ను
ద్ధురగతి ముష్టిఘాతమునఁ ♦ దూల నడంపఁగ మంటలున్ మిడుం
గురు లురలన్ ధరాస్థలిని ♦ గూటము గూలెను తాలు గుండ్లునై. ౧౯౨౧

అర్థములు. ఉరవడిన్ = వేగమున, ముష్టిఘాతమునన్=పిడికిటిపోటుచే, కూటము=శిఖరము.

తాత్పర్యము

పరువెత్తుచున్న వారినినిల్పి నీలుఁడు శిఖరము నెత్తికొని త్వరగాఁబోయి కుంభకర్ణుని మీఁద వేయఁగా రాక్షసుఁడు దానిని పిడికిటి పోటుచే నేలఁబడ గొట్టఁగా మంటలు మిణుఁగురులు రాల నా శిఖరము తాలు గుండ్లునై నేలఁబడెను.

—♦ శరభాదులు కుంభకర్ణుతోఁ బోరుట ♦—

సీ. సాహసికాగ్రణుల్ ♦ శరభనీలగవాక్ష, గంధమాదనులు వి♦క్రమధనుండు
ఋషభుఁ డీ యేవురు ♦ వృక్షశైలంబులఁ, గాళ్ళను బిడికిళ్ళఁ ♦ గరతలముల
నలుదెసలం దుంకి ♦ చలమున నొప్పింప, నెసఁగు నయ్యేటుల ♦ నీఁగ వ్రాలి
నట్టుల యైన రక్షో♦ధీశుఁ డది లెక్క, యిడక యా ఋషభుని ♦ నొడిసి పట్టి
తే. రెండు చేతుల నదుమఁ గీ♦లుండు నల్లఁ, గ్రక్కపడె గంధమాదనుఁ♦గాలముష్టి
శరభు మోఁకాల నీలుని♦గరతలమున, నాగ్రహంబునఁ దాఁచె గ♦వాక్షునసుర.

అర్థములు. సాహసికాగ్రణుల్=సాహసము గలవారిలో శ్రేష్ఠులు, నల్ల= నెత్తురు.

తాత్పర్యము

సాహసము గలవారిలో శ్రేష్ఠు లయిన శరభుఁడు, నీలుఁడు, గవాక్షుఁడు, గంధమాదనుఁడు, ఋషభుఁడు అను వా రేవురు చెట్లచేతను గొండలచేతను కాళ్ళ చేతను పిడికిళ్ళ చేతను చేతులతోను నాలుగు ప్రక్కలనుండి చలమున బాధింపఁగా నా దెబ్బలు వానికి నీఁగమీఁద వ్రాలినట్లుండెను. దానిని వాఁడు లక్ష్యము సేయక యా ఋషభుని నొడిసి పట్టుకొని రెండుచేతుల నదుమ నొత్తఁగా వాని నోఁట నెత్తురు గ్రక్కపడెను. గంధమాదనుని గాలిచేతను, శరభుని ముష్టిచేతను నీలుని మోఁకాలను, గవాక్షుని చేతితోను గొట్టెను.

కం. దత్తప్రహారులై యిటు, నెత్తురు ముక్కులను నోట ♦ నెఱ గ్రక్కుచు సం
కృత్తపలాశము లట్టులు, హత్తిన వెతఁ బడిరి వనచ♦రాగ్రణు లవనిన్. ౧౯౨౩

అర్థములు. దత్తప్రహారులై=దెబ్బకొట్టఁబడినవారై, సంకృత్తపలాశము= నఱకఁబడిన మోదుగులవలె.

తాత్పర్యము

ఈ ప్రకారము కుంభకర్ణుఁడు కొట్టఁగా ముక్కున నోట నెత్తురు గ్రక్కుచు నఱకఁబడిన మోదుగులవలె వానరులు నేలఁబడిరి.

చ. మేటులు ప్రమానిద్రిమ్మరులు • మేదినిఁ గూలినఁ గుంభకర్ణునిన్
గోటి వనేచరుల్ గవిసి • కొండను ప్రాఁకినయట్లు ప్రాఁకి పై
న్గాటులఁ బోటులన్ శితన•ఖంబుల దంష్ట్రిలఁ గేల్ప్రేటులన్
గాటపువీఁక నొవ్వ గొనఁ•గా బ్రహరింపఁగ గుంభకర్ణుఁడున్. ౧౯-౨౪

అర్థములు. ప్రమానిద్రిమ్మరులు = క్రోఁతులు.

తా త్ప ర్య ము

వానరులందు శ్రేష్ఠులగువారు నేలపై బడఁగా నొక కోటి వానరులు కుంభకర్ణునిమీఁదికిఁ గొండను బ్రాఁకినట్లు ప్రాఁకి కాటులను, పోటులను, వాఁడి గోళ్ళను, కోఱలను, చేతిదెబ్బలను నొప్పికొనున ట్లధిక పరాక్రమముతో కొట్టఁగా కుంభకర్ణుఁడును.

—• కుంభకర్ణుఁడు వానరుల మ్రింగుట •—

కం. ధరణీరుహాపరిశోభిత, ధరణీధర మనఁగ బొల్చి • తరుచరతతులన్
గరములను వారి నెల్లర, గరుడుం డహితతులఁబోలె• గ్రసియింపంగన్.

అర్థములు. ధరణీరుహా = చెట్లచేత, పరిశోభిత = మిగులఁ బ్రకాశించు, ధరణీధరము=పర్వతము, తరుచరతతులన్=వానరసమూహములను = కరములను చేతులచే, గ్రసియింపఁగన్=భక్షింపఁగా.

తా త్ప ర్య ము

• వృక్షములచేఁ బ్రకాశించు పర్వతమువలెఁ నొప్పి యతఁడు వానర సమూహములను గరుడుఁడు సర్పములనువలె భక్షింపఁగా.

ఉ. మ్రింగుడుపడ్డ యా ప్లవగ•బృంద మధో భువనోపమానకు
క్షిం గడువేగ చొచ్చియును • కెచ్చెర ముక్కులనుండి వీనులన్
భంగములేక వెల్వడిరొ • వాఁడును హా యని నోరువిచ్చి పే
రంగదఁ జాలుగా మెసవె • నచ్చటి కీశుల నెల్ల ప్రేల్మిడిన్. ౧౯-౨౬

అర్థములు. అధోభువనోపమాన=పాతాళముతో సమానమైన, కుక్షిన్=కడుపునందు, పేరంగదన్ = పేరాఁకలిచే, చాలుగాన్=వరుసగా, ప్రేల్మిడిన్ = చిటికవేయునంతలో.

తా త్ప ర్య ము

నమలుటకు వానరులు పంటిసందునకును జాలినవారుకారు. కావున వారిని మ్రింగఁగా నా మ్రింగుడు పడినవారు పాతాళలోకమువలె నున్న కడుపులోనికిఁ బోయి ముక్కులలోనుండి చెవులలోనుండి యే కొఱఁతలేక యథాపూర్వముగా వెలువడిరి. వాఁడును హా యని నోరు తెఱచి మిక్కిలి యాఁకలిచే వరుసగా వానరులను చిటికవేయునంతలో మ్రింగెను.

సీ. వజ్రహస్తుండైన ♦ వాసవుఁ బాశహస్తుం డయి కెరలెడి ♦ దండధరునిఁ
బోలుచు నసురుండు ♦ శూలహస్తుం డయి, తరుచరతతులలోఁ ♦ దిరిగి తిరిగి
కాలాగ్నిభంగిని ♦ గ్రాలుచు వధియింప, క్షితి మాంసశోణిత ♦ క్లేద మయ్యె
వేసంగి నెండిన♦విపినంబు దహనుండు, కాల్చుమాడ్కి దహించెఁ ♦గపిబలంబు
తే. వాని ధాటికి సైఁపక ♦ వనచరాళి, విస్వరంబుగ విలపించె ♦ విగతనాథు
లగుచుఁ దక్కిన వారెల్ల♦నరిగి రాము,శరణుఁజొచ్చిరి దుఃఖంబు♦గరిమఁ గలఁగి.

అర్థములు. వాసవున్=ఇంద్రుని, దండధరుని=యముని, కాలాగ్నిభంగిని= ప్రళయకాలము నందలి యగ్నివలె, మాంసశోణితక్లేదము=మాంసముతోను నెత్తుటితోను దడిసిన బురద యయ్యెను, విపినంబున్=అడవిని, విస్వరంబుగన్=వికార ధ్వనులతో, విలపించెన్=ఏడ్చెను, విగతనాథులు=రక్షకులు లేనివారు.

తాత్పర్యము

వజ్రము ధరించిన ఇంద్రుని, పాశము ధరించిన యమునిఁ బోలి కుంభకర్ణుఁడు శూలము ధరించి వానరసమూహములతోఁ దిరిగి తిరిగి ప్రళయకాలాగ్నివలె మండుచుఁ జంపఁగా నేల నెత్తురుమాంసములతోఁ దడిసి బురద యయ్యెను. వాఁడును నెండకాలమందు నెండిన యడవిని కారుచిచ్చు కాల్చునట్లు వానరసేనను దహించెను. వాని ధాటికి సహింపలేక కొందరు రక్షకులు లేక వికారధ్వనులు చేసిరి. తక్కిన వా రందఱు రాము నొద్దకుఁ బోయి శరణు జొచ్చిరి.

—♦ అంగదుఁడు కుంభకర్ణునితోఁ బోరుట ♦—

ఉ. భగ్నుల వానరావళుల ♦ వాసవపుత్ర సుతుండు గాంచి యు
ద్విగ్నుఁడు గాక యొప్పుచును ♦ దీవ్రజవంబున శృంగ మొండు భీ
మగ్నముగాఁ బలాశుల స♦మాజము రాక్షసభర్తృమూర్ధసం
లగ్నము గాఁగ వైచిన బ♦లంబుగ నొచ్చి యభగ్నకోపుఁడై. ౧౬౭౪

అర్థములు. భగ్నులన్=భంగము నొందిన వారిని, వాసవపుత్రసుతుండు= అంగదుఁడు, ఉద్విగ్నుఁడు కాక = భయపడక, భీమగ్నముగా = భయమున మునుఁగునట్లు, పలాశుల=రాక్షసుల యొక్క రాక్షసభర్తృ=కుంభకర్ణుని యొక్క, మూర్ధసంలగ్నము = తలకుఁ దగులునట్లుగ, అభగ్నకోపుఁడై=తీవ్రకోపము గల వాఁడై.

తాత్పర్యము

విఱిఁగిపోయిన వానరులఁజూచి యంగదుఁడు భయపడక యొప్పుచు నతివేగమున శిఖర మొకటి తీసికొని రాక్షసులు భయమున మునుఁగుచుండఁ గుంభకర్ణుని తలపైఁ దగులునట్లు వేయఁగా వాఁడు మిక్కిలి నొచ్చి యధికకోపము గలవాఁడై

ఉ. ఇంద్రజసూనుదర్పము స ♦ హింపక రావణుసోదరుండు ని
స్తంద్రజవంబునన్ ప్లవగ ♦ జాలము బెగ్గిల గర్జ నించుచున్
సంద్రతరప్రభాకలిత ♦ రూక్షము శూలము బిట్టు వైచె నా
యైంద్రజుమీఁద, సంగరర ♦ హస్యవిదుం డతి లాఘవంబునన్. ౧౫౨౯

అర్థములు. ఇంద్రజసూను దర్పము = అంగదు బలగర్వము, నిస్తంద్ర= హెచ్చరికతోఁ గూడిన, జవంబునన్=వేగముతో, సంద్రతర=మిగుల దట్టమైన, ప్రభాకలిత=కాంతితోఁ గూడినదియు, రూక్షము = కఠినమైనదియు నగు అంగదు మీఁద, సంగరరహస్య విదుఁడు=యుద్ధమర్మము తెలిసినవాఁడు.

తాత్పర్యము

అంగదుని గర్వము సహింపలేక కుంభకర్ణుఁడు మిగుల వేగముతో వానరులు భయపడునట్లు సింహనాదము చేయుచు విశేష కాంతితోఁ గూడి కఠినమైన శూలమును నంగదు మీఁద గట్టిగా వేసెను. యుద్ధరహస్యము తెలిసిన యంగదుఁడు మిగుల లాఘవముతో.

ఉ. శూలముఁ దప్పదాఁటి చని ♦ శూరవరేణ్యుఁడు తారకట్టి యా
ఖీలతలప్రహారమున ♦ బిట్టుగ నొంచిన నాగ్రహంబునన్
సోలియు లబ్ధసంజ్ఞుఁ డయి ♦ సోఁకుఁడు దాఁ బెడకేలిముష్టిచే
వాలితనూజునిం బొడువ ♦ వ్రాలె నతండు విసంజ్ఞుఁడై ధరన్. ౧౫౩౦

అర్థములు. తప్పదాఁటి = తప్పునట్లు దాఁటి, ఆఖీలతలప్రహారమునన్= భయంకరమైన యఱచేతి దెబ్బచే, బిట్టుగ=గట్టిగ, సోలియు=మూర్ఛనొందియు, లబ్ధసంజ్ఞుఁడయి=స్మృతినొందిన వాఁడై, పెడకేలి=ఎడమచేతి, ముష్టిచేన్=పిడికిట, విసంజ్ఞుఁడై=తెలివి తప్పినవాఁడై.

తాత్పర్యము

శూలము తన్ను దగులకుండునట్లు నావలికి లంఘించి పోయి యంగదుఁడు కోపించి భయంకరమైన చేతి దెబ్బచే గట్టిగ కుంభకర్ణును గొట్టగాఁ వాఁడు మూర్ఛ పోయి స్మృతి తెచ్చుకొని యెడమ చేతి ముష్టిచే నంగదుని గట్టిగాఁ బొడువఁగా నతఁడు స్మృతి తప్పి పడెను.

—♦ సుగ్రీవుఁడు కుంభకర్ణుతోఁ బోరుట ♦—

ఉ. అంగదుఁ డిట్లు సోలఁ దన ♦ యాయుధముం గొని సూర్యపుత్రుమీఁ
దం గవియంగ నాతఁడును ♦ దానవనాయకుసమ్ముఖంబుగా
శృంగ మొకండు నెత్తికొని ♦ చేరి ప్లవంగమలోకరక్తసి
క్తాంగు వనాటఘస్మరు భ ♦ యంకరరూపునిఁ గాంచి యిట్లనున్. ౧౫౩౧

అర్థములు. ప్లవంగమలోక = వానరసమూహముయొక్క, రక్త = నెత్తురుచే, సిక్త = తడిసిన, అంగున్ = దేహముగలవానిని, వనాటభుస్మరున్ = వానరులను దినువానిని.

తాత్పర్యము

అంగదుఁ డిట్లు పడిపోఁగాఁ దనశూలము తాను దీసికొని కుంభకర్ణుఁడు సుగ్రీవుని మీఁదఁ గవియఁగా నాతఁడును వానరుల రక్తముచేఁ దడిసిన దేహము గల వానిని, వానరుల భక్షించువానిని, భయంకరమైన యాకారము గలవానిని యెదురుగా పర్వత శిఖర మెత్తుకొని పోయి యిట్లనెను.

ఉ. త్రుంచితి కీశవీరులను ♦ దుష్కరకర్మము నాచరించి భ
క్షించితి క్రోఁతి గుంపులనుఁ ♦ జేపడె నీకు యశంబు దీనఁ జా
లించుట మేలు ప్రాకృత వలీ ముఖ మారణకర్మ మిట్టు లే
తెంచి మదీయ పర్వత హా ♦ తిన్ సయిరింపుము రాక్షసోత్తమా! ౧౫౩౨

అర్థములు. దుష్కరకర్మము = అసాధ్యకార్యము, ప్రాకృత వలీముఖ = సామాన్య వానరుల, మారణకర్మము = చంపునట్టి కార్యము, మదీయపర్వతహతిన్ = నాకొండ దెబ్బను.

తాత్పర్యము

వానరవీరులను జంపి యసాధ్యకార్యము చేసితివి. క్రోఁతి గుంపులను భక్షించితివి. దీనిచే నీకు లోకమున దొడ్డకీర్తి లభించెను. ఇఁక సామాన్యపు క్రోఁతులఁ జంపు కార్యము చాలించుట నీకు శ్రేయస్కరము. ఇట్లు వచ్చి నాకొండదెబ్బను సైరింపుము.

చ. అనవుడు సత్త్వధైర్య విభ ♦ వాన్వితమైన హరీంద్రు వాక్యముల్
విని మనుమండ వయ్యు నల ♦ వేధకు, ఋక్షరజస్సుతుండ వై
వినుతబలుండ వయ్యు నిటు ♦ ప్రేలెద వేల ప్లవంగమా! యనన్
ఘనతర పర్వతాగ్రమునఁ ♦ గంజహితాత్మభవుండు రాక్షసున్. ౧౫౩౩

అర్థములు. సత్త్వధైర్య విభవ + అన్వితము = బలధైర్య సంపదతో గూడినది, వేధకు = బ్రహ్మకు-వేధశ్శబ్దమునకుఁ దత్సమ రూపము వేధ. వేధసుఁడను రూపము లేదు. వినుతబలుండవు = పొగడఁబడిన బలము గలవాఁడవు. ప్రేలెదవు = పదరెదవు, ఘనతర = మిగుల గొప్పదగు, పర్వతాగ్రమున = శిఖరమున.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా బలము ధైర్యము విని యతిశయముచేఁ గూడిన సుగ్రీవుని వాక్యములు విని సుగ్రీవా! నీవు బ్రహ్మకు మనుమఁడవు. ఋక్షరజస్సునకుఁ బుత్రుఁడవు. బలమునందుఁ బొగడ్త గన్నాఁడవు. ఇంతటి గొప్పవాఁడవయ్యు క్రోఁతీ! యేల పదరెదవు? అనఁగా మిగుల గొప్పదగు కొండ శిఖరంబున సుగ్రీవుఁడు రాక్షసుని,

ఉ. అక్కఁ దరంగ నై చటయు • నాతని వక్షము దాఁకి నంతనే
ముక్కలు ముక్కలైన నగ • ముం గని దైత్యులు సింహనాదముల్
దిక్కుల ముంపఁ జల్ప మల • ద్రిమ్మరు లెల్ల విషణ్ణచిత్తులై
పోక్కిరి, కుంభకర్ణుఁడును • భూధరశృంగనిపీడ్యమానుఁ డై. ౧౯౩౪

అర్థములు. అక్కు+అదరంగన్=రొమ్ము అదరునట్లు, మల ద్రిమ్మరులు = వానరులు, విషణ్ణచిత్తులై = విషాదముతోడి మనస్సుగలవారై భూధరశృంగ = పర్వత శిఖరముచే, నిపీడ్యమానుఁడై=మిగుల పీడింపఁబడుచున్నవాఁడై.

తాత్పర్యము

రొమ్మదరంగ వేయఁగా నది యతని రొమ్ము దాఁకినంతనే ముక్కలై పడిపోయెను. రాక్షసులు సింహనాదములు చేసిరి. వానరులు దుఃఖపడసాగిరి. కుంభకర్ణుఁడును పర్వత శిఖరముచే బాధింపఁబడినవాఁడై.

తే. వివృతవక్త్రుండునున్ రోష • వివశుఁ డగుచు, మెఱుఁగులు తుఱంగలించెడి మేటిమూఁడు
మొనలవాలును వానర • ముఖ్యుఁ జంప, నెంచి పరఁగించె వానరు • లెల్ల బెగడ.

అర్థములు. వివృతవక్త్రుండునున్=నోరు తెఱచికొనినవాఁడు, రోష వివశుఁడు=కోపముచే దేహము తెలియనివాఁడు, తుఱంగలించు = ప్రకాశించు, మూఁడు మొనలవాలును=త్రిశూలమును, బెగడన్=భయపడునట్లు.

తాత్పర్యము

నోరు తెఱచికొని కోపముచే దేహము తెలియనివాఁడై మెఱుఁగులు ప్రకాశించు త్రిశూలమును సుగ్రీవుని జంపుటకై వానరులు భయపడుచుండఁ బ్రయోగించెను

ఉ. కాంచనధాతుజుష్ట మయి • క్రక్కుచు నిప్పులు వచ్చుదాని వీ
క్షించి మరుత్తనూభవుఁడు • చివ్వన నడ్డము దూఁకి పట్టి వే
త్రుంచె ఫెళుక్కునన్ విఱుగఁ • దోరపుహర్షమునన్ వనౌకసుల్
గాంచి మదించి కేకలిడి • గాడుపుపట్టి నుతించి రంతయున్. ౧౯౩౬

అర్థములు. కాంచన ధాతు జుష్టము = బంగార మనెడి లోహముతోఁ గూడినదై, తోరపుహర్షమునన్ = మిగుల సంతోషముతో, వనౌకసుల్=వానరులు, గాడుపుపట్టిన్=ఆంజనేయుని.

తాత్పర్యము

బంగారుతోఁ గూడి నిప్పులు గ్రక్కుచు వచ్చుదానిని జూచి యాంజనేయుఁడు తటాలున నడ్డము దూఁకి పట్టుకొని ఫెళుక్కున విఱిచెను. వానరు లది చూచి మిగుల హర్షించి, మదించి సింహనాదములు చేసి హనుమంతునిఁ బొగడిరి.

కం. తోరపురూపంబై వెయి, బారువ్రేఁ గైన యుక్కు • పటుశూలంబున్
వీరుఁడు మోఁకాలను రెం, డై రాలఁగ విఱిచి మిగుల • హర్షం బందెన్. ౧౯౩౭

అర్థములు. తోరపు రూపంబై = పెద్ద యాకారము గలదై, వెయిబారువ వ్రేఁగైన = వెయ్యిబారువల బరువుగల.

తాత్పర్యము

పెద్ద యాకారము గలదై వెయిబారువల బరువుగలదైన యుక్కుశూలమును వీరుఁడగు నాంజనేయుఁడు మోఁకాటికిఁ బూన్చి యీకొన ఆకొన రెండు చేతులఁ బట్టుకొని వంచి విఱిచి మిగుల సంతోషించెను.

కం. శూలము భగ్నంబై చన, వైశమ లంకాస్థమలయ♦పర్వతతటమున్
దా లాగి దాన నసురుఁడు, హేళిసుతున్ డాసి యడిచెఁ♦బృథుదోశ్శక్తిన్.

అర్థములు. భగ్నంబై = విఱిగినదై, వైశమ = శీఘ్రమ, లంకాస్థ = లంక సమీప మందున్న, మలయ పర్వత తటమున్ = మలయపర్వత శిఖరమును, హేళిసుతునిన్ = సూర్యపుత్రుని, సుగ్రీవుని, పృథు = గొప్పదగు, దోశ్శక్తిన్ = భుజబలముచే, ఈమలయము త్రికూట పర్వతములో నొకభాగము. అది కొంచెము దూరమందున్నను వంగి యందుకొన నని భావము.

తాత్పర్యము

తనశూలము విఱిగిపోఁగా వెంటనే లంకసమీపమందున్న మలయపర్వతము యొక్క శిఖరము నూడఁబెఱికి దానిచేఁ గుంభకర్ణుఁడు సుగ్రీవుని తన భుజబలము కొలఁది కొట్టెను.

**—♦ మూర్ఛిల్లిన సుగ్రీవునిఁ గుంభకర్ణుం డెత్తికొని లంకలోనికిఁ బోవుట ♦—**

సీ. కుధరాగ్రహతిఁ జేసి ♦ కూలె సుగ్రీవుండు, నష్టసంజ్ఞుం డయి ♦ కష్టదశను
నాశ్చర్యఘోరప♦రాక్రముం డినసుతుం,డిటుచేష్టలను మాని ♦ యిలను బడినఁ
గని రాక్షసులు ఘోర♦గర్జల నింపఁగఁ, గుంభకర్ణుఁడు వానిఁ♦గూడ నరిగి
పట్టి యెత్తికొని య♦భ్రంబును వాయువు, గొనిపోవునట్టులు ♦ కొని యరుగుచు
ఆ. రాత్రిచరుల స్తోత్ర♦రావముల్ విస్మిత,దివిజనాదములను♦దివిజవైరి
వినుచు ఘోరశృంగ♦విలసితమేరువు,భంగి లంకఁ జొచ్చె♦భయదరీతి. ౧౭౩౯

అర్థములు. కుధరాగ్రహతిఁ జేసి = కొండశిఖరము దెబ్బచేత, నష్ట సంజ్ఞుం డయి = స్మృతి దప్పినవాఁడై, అభ్రంబును = మేఘమును, రాత్రి చరుల = రాక్షసుల, విస్మిత = ఆశ్చర్యపడిన, దివిజనాదములను = దేవతల ధ్వనులను, ఘోరశృంగ విలసిత మేరువు = గొప్ప శిఖరముతోఁ గూడిన మేరు పర్వతము.

తాత్పర్యము

పర్వతశిఖరము దెబ్బచే సుగ్రీవుఁడు కష్టస్థితిని స్మృతి దప్పిపడెను. ఆశ్చర్యకరమై భయంకరమైన పరాక్రమముగల సుగ్రీవుఁడు కదలక మెదలక నేలఁబడినఁ జూచి రాక్షసులు సింహనాదములఁ జేసిరి. కుంభకర్ణుఁడు పడియున్న సుగ్రీవునొద్దకు

బోయి వాని నెత్తుకొని వాయువు మేఘమును దీసికొని పోవునట్లు తీసికొని పోవుచు రాక్షసుల స్తోత్రములు. ఆశ్చర్యపడిన దేవతల ధ్వనులు వినుచు శిఖరముతోఁ గూడిన మేరువు వలె లంకఁ జొచ్చెను.

కం. ఇక్కరణిఁ జనుచుఁ దనలోఁ, జిక్కెను బ్లవగప్రభుండు ♦ చిక్కిన యట్లే
తక్కిన రాముబలం బని, పెక్కులు తలపోసికొనుచు ♦ బిలబిల చనఁగన్.

తాత్పర్యము

ఇట్లు పోవుచుఁ దనలో సుగ్రీవుఁడు చిక్కెను. ఎప్పుడు సుగ్రీవుఁడు చిక్కెనో రాముని సేన యంతయుఁ జిక్కినట్లే యని నానావిధముల నాలోచించుచు విసవిస పోయెను.

సీ. చిక్కిన సుగ్రీవుఁ ♦ జెకరి పాఱెడిసేనఁ, గనుఁగొని మారుతి ♦ మనములోన
నేమి చేయఁగ వచ్చు ♦ నిప్పుడు దీనికిఁ, బ్రతివిధానము న్యాయ♦పథము విడక,
చలిపెక నెదియైన ♦ శైలనిభుండనై, మర్దింతునా త్రియా♦మాచరేంద్రు ?
వీనిని జంపిన ♦ విడివడు హరిరాజు, ప్లవగు లెల్లను హర్ష ♦ పడెదువారు
తే. విక్రమం బేను జూప ను♦పక్రమింప, నేల? సామాన్యుఁడే వాన♦రేంద్రు డులక
విబుధముఖ్యులు పట్టిన♦వీఁక మెఱసి, తాన విడిపించుకొని వచ్చు♦ద్రఢిమఁ గలఁడు.

అర్థములు. ప్రతివిధానము=బదులుపని, ఏమిచేసినయెడల కుంభకర్ణుఁడు సుగ్రీవుని విడుచునో ఆయది, న్యాయ్యపథము = ధర్మమార్గము, త్రియామాచరేంద్రున్=రాక్షసశ్రేష్ఠుని, ఉపక్రమింప నేల=ఏల ప్రారంభింకవలెను, ఉలక=లక్ష్యము సేయక, ద్రఢిమ=దార్ఢ్యము=సామర్థ్యము.

తాత్పర్యము

కుంభకర్ణుని చేతఁ జిక్కిన సుగ్రీవుని వది చూచి పాఱిపోవుచున్న వానర సేనను జూచి యాంజనేయుఁడు తన మనస్సులో నిట్టు లాలోచించెను. కుంభ కర్ణుఁడు చేసినదానికిఁ బ్రతిక్రియ ధర్మము తప్పక యేమి చేయవచ్చును. ఏదియైనఁ జేయవలయును. ఊరకుండ రాదు. ఏమి చేయుదును కొండంత దేహము పెంచి యా రాక్షసుని దన్నుదునా? అటుచేసిన విడుచును. వీనిని జంపినను, సుగ్రీవుని విడిపించి నను వానరులందఱు సంతోషింతురు. నిజమే. నేనేల పరాక్రమము చూపవలెను. సుగ్రీవుఁడు తానై విడిపించుకొనలేకుండినఁ గదా నేను విడిపింప యత్నము చేయవలెను. సుగ్రీవుఁడేమి సామాన్యుఁడా వీనికి వశపడియుండుటకు? దేవతాశ్రేష్ఠులు పట్టుకొనినను లక్ష్యముసేయక పరాక్రమించి తానే విడిపించుకొని వచ్చు దార్ఢ్యము గలవాఁడు. అట్లైన నిప్పుడిట్లేలయున్నాఁ డందునా ?

కం. ఈరీతిఁ జిక్కియుండుటకుఁ, గారణ మీతండు శైల♦ఘాతంబునఁ బ్ర
జ్ఞారహితుఁడు గానోపును, మారుతమునఁ దేఱి తనకు♦మూఁకకు హితమున్.

అర్థములు. శైలఘాతంబున = కొండదెబ్బచే, ప్రజ్ఞారహితుఁడు=స్మృతి

లేనివాఁడు, మూర్తమునన్=అల్పకాలములో, తేఱి=తెప్పతెల్లుకొని, మూఁకకు=వానరసేనకు.

తాత్పర్యము

కొండదెబ్బచే స్మృతితప్పి యుండుటయే యిట్లుచిక్కియుండుటకుఁ గారణమై యుండవలెను. అల్పకాలములో స్మృతివచ్చినా తనకు వానరసేన కేదిమేలో యది యతఁడే.

చ. వానరుచుఁ గాక నే బలిమిఁ • బూని మహాత్ముని ముక్తిఁ జేసినన్
ఘనతరకీర్తినాశమును • గష్టము సమ్మదహాని గల్గు నీ
యన కిల శాశ్వతం బగుచు • వట్టులు గాన ముహూర్త మోర్చి యీ
వనచరసేన నివ్వెఱను • బాచుచుఁ దేర్చెదఁ బ్రోవు గూర్చెదన్. ౧౬౮౩

తాత్పర్యము

చేయుచుగాక; నేను నా బలముఁజూపి గొప్పమనస్సుగల యితని విడిపించితినా యీయనకు గొప్పకీర్తి నాశమగును. నీచత్వము కలుగును ఈయనకు సంతోష హానియు నగును. ఇవి యీయనకు శాశ్వతముగఁ గలుగఁజేయుట నాకు దగినదిగాదు. అల్పకాల మోర్చికొనియుండి భయపడిన యీవానరసేనకు భయము పోఁగొట్టి సమాధాన పఱిచి చెదరినవారినెల్ల గుంపుగూర్చెదను.

కం. అని చింతించుచుఁ జెదరిన, వనచరులం గూర్చుచుండ • వడి ఘటకర్ణుం
డును సుగ్రీవుం గొని వడిఁ జనుచుండెను, లంక రాజ•సరణిని నంతన్. ౧౬౮౪

తాత్పర్యము స్పష్టము.

**-• సుగ్రీవుఁడు కుంభకర్ణుని ముక్కు చెవులు కొఱికి శ్రీరాముని యొద్దకు వచ్చుట •-**

సీ. ఇరువంక రాణించు • గృహగోపురవిమాన, చర్యాగ్రవర్తులు • చల్లుచున్న
లాజగంధోదక • రాజుల మెల మెల్లఁ, దడియుట ఘంటాప • థంబు శైత్య
మున నెట్టకేలకు • మూర్ఛదేఱి ససంజ్ఞుఁ డయి రాజమార్గంబు•నందుఁ జనుట
రొఱిఁగి ప్రతిక్రియ•యేమి చేయుదునిప్డు, సలుపుదుఁ గాక కీ • శులకుహితము

ఆ. నిష్టమైనకార్య • మిపు డని యోజించి, చంక నుండి దిగువ • జాఱి పరగ
నింతలోన మీఁది• కెగసి చివాలునఁ, గొఱికె ముక్కు గోళ్ళఁ• జెఱికెఁ జెవులు

అర్థములు. ఇరువంక = రెండు ప్రక్కల, గృహ = ఇండ్లయందు, గోపుర = ద్వారములందు, విమాన = మేడలయందు, చర్యా=గోపురముల కిరు ప్రక్కల భటులు నిల్వఁగట్టిన కట్టడములందు, అగ్రవర్తులు=పైనుండువారు, లాజ=పేలాలయొక్కయు, గంధోదక=వాసనగల నీళ్ళయొక్కయు, రాజుల = వరుసలచే ఎట్టకేలకు = అతికష్టముమీఁదన, ససంజ్ఞుఁడయి = స్మృతిగూడినవాఁడై, మెలమెల్ల మూర్ఛదేఱి యనుటచే సుగ్రీవుండు మూర్ఛనుండి తేఱుట కుంభకర్ణునకుఁ దెలియ

దని భావము. లంకాపురము రాచబాటలందు నిరుప్రక్కలనున్న యిండ్లమీఁదను గోపురముల మీఁదను మేడల మీఁదను చర్యలమీఁదను నున్నవారు పేలాలు పన్నీరు మొదలగు వాసనగల నీళ్ళు చల్లగా దడియుటచే రాజబాట శైత్యమునకు మెల్లమెల్లగా నెట్టెట్టోమూర్ఛ దేఱి స్మృతిగలవాఁడయి లంకలో రాజమార్గమందు తాను బోవుచుండుట తెలిసికొని, వానరులకు మేలైనది దీనికి బదులేమి సేయుదునా యని యోజించి, చంకనుండి తటాలున దిగువకుజాఱి యంతలోఁ జివాలునఁ బైకెగసి యేకకాలమున నోటితో ముక్కుగొఱికి గోళ్ళతోఁ జెవులు పెఱికెను.

చ. చెవులును ముక్కుఁ బోవ మెయి ♦ సిక్తముగా క్షతజంబునన్ రుషా
వివశత ప్రమాన్సకంపుఁబతి ♦ బిట్టుగఁ బట్టి నలంచి నేలపై
జవమునఁ గొట్టె, నీ గతిని ♦ సంపరిపిష్టుఁడు నయ్యు మాంసభు
గ్నివహాసుమర్దితుండు నయి ♦ గీశవిభుండు లఘుత్వ మేర్పడన్. ౮౫౮

అర్థములు. మెయి = దేహము, సిక్తముగా = తడియఁగా క్షతజంబునన్ = నెత్తుటిచే, రుషావివశత=కోపముచే దేహము తెలియక, ప్రమాన్సకంపుఁబతి = వానరరాజును, నలంచి = నలిపి, సంపరిపిష్టుఁడు = బాగుగ నలుపఁబడినవాఁడు, మాంసభుగ్నివహా = రాక్షస సమూహముచే, సుమర్దితుండు=బాగుగఁ గొట్టఁబడినవాఁడు, ఇట్లు చెప్పుటచే కుంభకర్ణుని వెంటవచ్చిన రాక్షసులుకూడ సుగ్రీవుని గొట్టిరని యేర్పడుచున్నది.

తాత్పర్యము

చెవులు ముక్కుపోఁగా దేహము నెత్తుటిచేఁ దడియఁగా కుంభకర్ణుఁడు సహనము లేనివాఁడై దేహము తెలియక సుగ్రీవుని గట్టిగఁ బట్టుకొని నలిపి నేలపై విసరికొట్టెను. వానితోడ నుండిన రాక్షసులును గొట్టిరి. ఇట్లు కుంభకర్ణునిచే నలుపఁబడినవాఁడు నయ్యు రాక్షసులచేఁ గొట్టఁబడినవాఁడు నయ్యు సుగ్రీవుఁడు తన లాఘవము తెలియునట్లు.

కం. నింగికిని దాఁటి రాముకు.అంగట నిలఁబడిరొ నచట ♦ అంపిలు నస్రం
బంగముఁ దడుపఁగ సెలయేఁర్లం గొఱలెడి కొండవోలెఁ♦రక్తప్రభుఁడై.

అర్థములు. నింగికిని = ఆకాశమునకు – రాముకుఅంగటన్=రామచంద్రమూర్తి సమీపమున, అంపిలు + అస్రంబు=విశేషముగాఁ గాఱుచున్న నెత్తురు.

తాత్పర్యము

ఆకాశమున కెగసి రామచంద్రు సమీపమున నిలిచెను. అచట లంకలో కుంభకర్ణుఁడు విశేషముగఁ గాఱు నెత్తుటిచేఁ దడిసి, కొండవంకలచేతఁ గొండవోలె నెఱ్ఱని కాంతి గలవాఁడై.

—• కుంభకర్ణుఁడు మత్తుఁడై వానరాదుల మ్రింగుట •—

మ. అమితామర్షమునన్ నిశాచరుఁడు సం•ధ్యాయుక్తమౌ నీల మే
ఘమునాఁ బొల్చుచు యుద్ధభూమి కెదురై • కాంతాళపుంబెర్మి య
స్రములం గ్రక్కుచుఁ బోవుచుం గరమునన్ • శస్త్రంబు లేకుంట రౌ
ద్రము క్రూరంబగు ముద్గరంబుఁ గొని ప్ర•ధ్వంసించెఁ బ్రత్యర్థులన్. ౧౫౭౦

అర్థములు. అమితామర్షమునన్=అధికమైన యసహనముతో, మర్షము=సహనము, ఓర్పు, అదికానిది అమర్షము, అమర్ష శ్శూన్యేన జనస్య జంతునా నజాత హార్దేన. అని కిరా. 33. నిశాచరుఁడు = రాక్షసుఁడు, కుంభకర్ణుఁడు, సంధ్యాయుక్తము = సాయంసంధ్యాకాలముతోఁ గూడిన, కాంతాళపుంబెర్మి = కోపాతిశయముచే, అస్రములన్ = నెత్తురులను, ప్రధ్వంసించెన్ = నాశముచేసెను, ప్రత్యర్థులన్ = శత్రువులను.

తాత్పర్యము

కుంభకర్ణుఁడు నెత్తుటఁ దడియుటచే సంధ్యాకాల మేఘముబోలి మరల వెనుకకుఁ దిరిగి యుద్ధభూమికిఁబోయి కోపాతిశయమున నెత్తురు గ్రక్కుచుఁ బోవుచుఁ జేత నాయుధము లేకుండుటచే భయంకరమై కఠినమైన రోఁకలివంటిదగు ముద్గరమును దీసికొని శత్రువులను నాశము చేసెను.

ఉ. మత్తమనస్కుఁడున్ క్షతజ•మాంససుగృధ్నుఁ డెఱుంగలేక తా
వ త్తతి వీరు వారనక • యాశరకీశపిశాచముఖ్యులన్
మిత్తి లయంబునందువలె • మ్రింగ గడంగెను నొక్క కేలఁ జే
హత్తిన యుద్ధఱన్ ముసర • నాఁగఁ జెక్కుర వాతఁగూరుచున్. ౧౫౭౧

అర్థములు. మత్తమనస్కుఁడున్ = మదించిన మనస్సుగలవాఁడు, క్షతజ నెత్తుటియందు, మాంస=మాంసమునందు, సుగృధ్నుఁడు=విశేష మాశగలవాఁడు, ఆశర, కీశ, పిశాచముఖ్యులన్ = రాక్షసులందు వానరులందు పిశాచములందు ముఖ్యులగువారిని, రావణునొద్ద పిశాచములు విశేషముగ నుండునట్లు పుష్పక వర్ణనమునందు రావణ యుద్ధమునందు నీ ఘట్టమునందుఁ జెప్పఁబడిన వాక్యములచే నేర్పడుచున్నది. కావుననే రావణుఁడు రుద్రునకుఁ బోల్పఁబడెను. మిత్తి=మృత్యు దేవత, ఒక్క కేలన్=రెండవచేత ముద్గర ముండుటచే నని భావము.

తాత్పర్యము

మదముచే మనస్సు తన స్వాధీనమందు లేనివాఁడు నెత్తురు మాంసములందు విశేషాశ గలవాఁడు తనవారెవరో పరులెవ్వరో తెలిసికోలేక రాక్షసులను వానరులను పిశాచములను ప్రలయకాలమందు మృత్యుదేవతవలె నొక్కచేత నెత్తి నోర వేసికొని యొక్కొక్కసారి యిద్దఱను ముగ్గురను పెక్కుమందిని దొరకినవారిని దొరకినట్లు మ్రింగ నారంభించెను.

## —♦ శ్రీరాముఁడు కుంభకర్ణుతో యుద్ధము చేయుట ♦—

సీ. చుట్టును గ్రోఁతులు ♦ బిట్టుచెట్టులఁ గొట్టి, సంపీడితునిఁ జేయ ♦ నరకు గొనక
నెలవుల నెత్తురు ♦ పలలంబు స్రవియింప, నేడ్వుర నూర్వుర ♦ నెనిమిదిగుర
దిగమ్రింగుచును నిచ్చఁ♦దిరుగులాడఁగ గపుల్, శరణుఁజొచ్చిరి రామచంద్రుఁ జేరి
యది గని లక్ష్మణుం ♦ డధిక కోపంబునఁ, గుంభకర్ణుని మేను ♦ క్రూర బాణ
తే. ములను గొట్టిన నాతని♦వలను గనక, రాముఁ డున్నెడకును బాఱ♦రౌద్రశరము
వింటసంధించి రాముఁడు♦ వెడఁదయురము, దాఁకవిడుచుటయును వాఁడు♦దరలియదరి.

అర్థములు. నెలవులన్ = పెదవికొనల, పలలంబు=మాంసము, వలను = ప్రక్క, తెరలి=చలించి, అదరి=భయపడి.

తాత్పర్యము

క్రోఁతులు తన్నుఁ జుట్టుకొని చెట్లచే గట్టిగాఁ గొట్టినను వాఁడు లక్ష్యము సేయఁడయ్యె! పెదవుల కొనల నెత్తురు మాంసము కాఱఁగ నేడుగుర నెనిమిదిగుర నూర్వుర దిగమ్రింగుచును తన యిష్టము కొలఁది తిరుగఁగా వానరు లేమియుఁ జేయఁజాలక రామచంద్రు శరణుచొచ్చిరి. అది చూచి లక్ష్మణుఁడు మిగులఁ గోపించి కుంభకర్ణుని మేను క్రూరబాణములచేఁ గొట్టెను గాని వాఁడు దానిని లక్ష్యము సేయక రామచంద్రమూర్తి యున్న చోటికిఁ బరువెత్తెను. అప్పుడు రామచంద్రమూర్తి రౌద్రాస్త్రము సంధించి వాని విశాలమైన ఱొమ్ము దాఁకు నట్లు వేయఁగా దానిచే వాఁడు చలించి బెదరి.

కం. అంగారమిశ్రితకీల ల,భంగురగతి నోరు వెడల ♦ భయదరవంబున్
నింగి పగులంగ నించి ప్ల,వంగుల దెస మరలి వీఁక♦వారిం దఱిమెన్. ౧౫౫౧

అర్థములు. అంగారమిశ్రితకీలలన్ = నిప్పుతో సమానమైన జ్వాలలు, అభంగురగతిన్ = విస్తారముగా, భయదరవంబున్ = భయంకరధ్వని, నింగి = ఆకాశము.

తాత్పర్యము

నోటినుండి నిప్పు మంటవంటి మంటలు విస్తారముగ వెడలఁగా భయంకర ధ్వని యాకాశము నిండ నార్చి ముందు రాముని మీఁదికిఁ బోక వెనుకకు మరలి వానరులఁ దఱిమెను.

తే. నెమ్మిఁగఱు లగు రాఘవ♦నిష్ఠురాశు,గంబు లురమున నాటఁగ♦గాటముగను
జేతికైదువు లెల్లను♦క్షితితలమున, జాఱ తమయంతఁ బడిన ని♦శాచరుండు.

అర్థములు. నెమ్మిఁగఱులు = నెమిలి యీఁకలు తెక్కలుగాఁగల, నిష్ఠురాశుగంబులు=కఠిన బాణములు, కైదువులు=ఆయుధములు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి వేసిన నెమిలి యీఁకలు తెక్కలుగాఁగల కఠిన బాణ

ములు దేహమున దృఢముగ నాటుటచే నా బాధవలన వానిచేతనున్న యాయుధ ములు తమంతటఁ దామే జాఱిపడిపోయెను.

కం. కాలను గేలను యుద్ధం, బోలి నొనర్చుచును నెత్రు • టోడలున రక్షః
పాళులఁ గ్రోఁతుల గ్రుంగుచు, హాళిమెయిం దిరిగి యంత • కాకారుం డై.

అర్థములు. నెత్రుటోడలున = నెత్తురు + ఒడలు = నెత్తుటితో నిండిన దేహము, రక్షః పాళుల = రాక్షససమూహముల, అంతకాకారుఁడై = యముని వంటి రూపము గలవాఁడై, హాళిమెయిన్=సంతోషముతో.

తాత్పర్యము

ఆయుధములు పడుటచే చేతఁగాల యుద్ధముచేయ నారంభించి నెత్తుటి దేహముతో రాక్షసులను వానరులను గ్రుంగుచు సంతోషముతోఁ దిరుగుచుయముని వలె;

మ. ధరకూటంబు నొకండుఁ దెచ్చి వడి సీ • తానాథుపై వైవ నం
తరమం దేసుశరంబులం దునిమి య • ద్దానిన్ మఱిన్ శైలము
ర్వరఁ గూలన్ ద్విశతంబు మర్కటులు చా • వం గల్గువం చాశుగో
త్కరవర్షంబునఁ జూర్ణముం జలిపె వే • గస్ఫీతుఁడై రాముఁడున్. ౧౧౫ర

అర్థములు. ధరకూటంబు=పర్వత శిఖరము, వడిన్ = వేగముగా, అంతరమందు=నడుమ, ద్విశతంబు = రెండునూర్లు, ఆశుగోత్కర వర్షంబునన్ = బాణ సమూహవర్షముచే, చూర్ణము=పొడి, వేగస్ఫీతుఁడై = వేగముతోఁ గూడినవాఁడై.

తాత్పర్యము

కొండశిఖరము నొకదానిని దెచ్చి వడిగా రాముని మీఁద వైవఁగా నాయన దాని నేసుబాణములచే నడుమనే ఖండించి, యది క్రిందఁ బడెనేని రెండునూర్ల క్రోఁతులు చత్తురని తలఁచి బాణముల వానచే నా తునుకలను పొడియై రాలునట్లు కొట్టెను.

కం. ఈలో నాతనిఁ జంపఁగ, నాలోచననేయు రాఘు • వానుజుఁ డను స
న్నా! లాఁతులఁ దమవారిని, వాలాయము గ్రుంగు చున్న • వాఁ డడె కంటే.

అర్థములు. లాఁతులన్=పరులను, వానరులను, వాలాయము=అడ్డములేక.

తాత్పర్యము స్పష్టము.

కం. వనచరుఁ డని నిశిచరుఁ డని, మనమునఁ దెలియంగ లేఁడు • మత్తత రక్తం
బున వాసనచేఁ! గ్రోఁతులు, గొనకొని పై నెక్కి • లేని • కోటులకొలఁదుల్.

అర్థములు. వనచరుఁడని=వీఁడు కోఁతియని, నిశిచరుఁడు = వీఁడు రాక్షసుఁడని, మత్తతన్ = మదముచే, రక్తంబునవాసనచే=రక్తముయొక్క వాసనచే, సమాసంబున షష్ఠ్యర్థమున నకారాగమము, గొనకొని=ప్రయత్నించి.

తాత్పర్యము స్పష్టము.

కం. గురుభారపీడితుం డై దురితాత్ముఁడు నలఁగి క్రోఁతి♦తుటుముల నిట్టుల్
పొరిగొన నోపం డన విని, తరుచరసంఘంబు లెక్కె ♦ దానవుమీఁదన్.

అర్థములు. గురుభార పీడితుండై=మిగుల బరువుచే బీడింపఁబడినవాఁడై, దురితాత్ముఁడు = పాపస్వభావము గలవాఁడు, తుటుములన్ = సమూహములను, పొరిగొనన్ = చంపుటకు, ఓపండు=సమర్థుఁడు కాఁడు, తరుచర సంఘంబులు = వానర సమూహములు.

తాత్పర్యము

బరువధిక మగుటచే బాధపడి యీ పాపాత్ముఁడు వానరుల నిట్లు చంపఁ జాలఁడనగా క్రోఁతి గుంపులు రాక్షసునిమీఁద నెక్కెను.

ఉ. మావటిఁ గ్రిందఁ ద్రోయఁ జెడు ♦ మత్తగజేంద్ర మొకల్ విదుర్చున
ట్లా వరసత్త్వశాలి తన ♦ యంగము లోలి విదిర్చి యెల్లకీ
శావళిఁ గ్రిందఁ ద్రోయ మను ♦ జాధిపుఁ డయ్యది గాంచి వీఁ డహో
శావలుఁ డంచుఁ దీవ్రశర ♦ కార్ముకహస్తుఁడు తోడుతోడుగన్. ౧౧౮

అర్థములు. వరసత్త్వశాలి=అధిక బలముగలవాఁడు, శావలుఁడు=దుర్మార్గుఁడు, తీవ్రశరకార్ముకహస్తుఁడు=తీక్ష్ణములైన బాణములు విల్లు చేతఁగలవాఁడు, తోడుతోడుగన్=వెంట వెంటనే.

తాత్పర్యము

మావటివానిని గ్రిందఁ ద్రోయుటకై మదవుటేనుఁగు దేహమును విదుర్చునట్లు మిగుల బలశాలియగు రాక్షసుఁడు తన యవయవముల విదలించి వానరుల నందఱి నొక్కసారిగఁ గ్రిందఁ ద్రోయఁగా రామచంద్రమూర్తి యదిచూచి వీఁడు దుర్మార్గుఁడు, సులభముగ బోవువాఁడు కాఁడని తీక్ష్ణబాణములను వింటిని చేతఁ దీసికొని వెంట వెంటనే.

ఉ. వానిభయంబునన్ సురఁగు ♦ వానరు లెల్లరు మోద మంద రో
షానలతామ్రచక్షుఁ డయి ♦ యాతనిఁ జూపులనే దహించుచం
దానను రాక్షసుం దఱిమి ♦ తాన యుదల్చుచు నడ్డగించె ర
క్షోనిచయంబు బెగ్గిలఁగఁ ♦ గ్రూరగుణారవపూరితాశుఁ డై. ౧౧౯

అర్థములు. సురఁగు=భయపడి చాటునకుఁబోవు, రోషానల తామ్రచక్షుఁడయి = కోపాగ్నిచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడయి, తఱిమి=పాఱద్రోలి, బెగ్గిలఁగన్=భయపడ, క్రూర=కఠోరమైన, గుణారవ=అల్లెత్రాటి మోఁతచే, పూరిత= నిండిన, ఆశుఁడై=దిక్కులు గలవాఁడై.

తాత్పర్యము

వానికి భయపడి దాఁగుకొను నట్టియు పాఱిపోవునట్టియు వానరులు సంతోషింపఁ గోపముచేఁ గన్నులెఱ్ఱచేసి చూపులచేతనే దహించు విధముగ రాక్షసుని

దఱుముకొనిపోయి వాఁడు పోవుత్రోవకడ్డమై తానే యదలించి రాక్షసులు భయమంద నల్లెత్రాటి ప్రమాణచే దిక్కులు నిండఁజేయుచు.

ఉ. నల్లను గ్రక్కుచున్ మరల • నాలుక నాకుచు రోసి క్రోఁతులన్
గొల్లగ మ్రింగి వైచుచును • ఘోరపుహాపువఁ గల్పకాలుఁ డా
నుల్లసమాడువానిని స•ముజ్జ్వలితాంగదు స్వర్ణరత్నభూ
షోల్లసితాంగుఁ జేరఁ జన • నుగ్రత వాఁడును రోషదీప్తుఁడై. ౧౯౦

అర్థములు. నల్లను = నెత్తుటిని, రోసి = వెదకి, కల్పకాలు = ప్రలయకాల యముని, ఉల్లసమాడువానిని = పరిహసించు వానిని, పోలిన వానిని, సముజ్జ్వలిత=మిగులఁ బ్రకాశించు, అంగదున్=బాహుపురులు గలవానిని స్వర్ణ రత్న భూషిత = బంగారు రత్నముల భూషణములచే, ఉల్లసితాంగున్=మిగులఁ బ్రకాశించు నవయవములు గలవానిని.

తాత్పర్యము

నెత్తురు గ్రక్కుచు మరల దానినే నాకుచు వెదకి వెదకి క్రోఁతుల మ్రింగుచు భయంకరాకారముతో ప్రలయకాల యమునివలె నుండువానిని, ప్రకాశించు బాహుపురులు గలవానిని, బంగారుతోను రత్నములతోను చేయఁబడిన యాభరణములచే ప్రకాశించు దేహము గలవానిని సమీపింపఁగా వాఁడును రోషముచే మండుచున్న వాఁడై.

— • శ్రీరామ కుంభకర్ణుల సంవాదము • —

ఉ. సమ్ముఖ మేగుదేర రఘు•చంద్రముఁ డిట్లను రాక్షసేంద్ర! రా
రమ్ము విషాద మందకుము • రాముఁడ నే నిదె చాప మూని సి
ద్ధమ్ముగ నున్న వాఁడ నెటఁ • దారెద వింక ముహూర్తమాత్రలో
నమ్మము కాలువిందుగ నొ•నర్చెద నార్చెద నీ ప్రతాపమున్. ౧౯౧

అర్థములు. సమ్ముఖము = ఎదురుగా, తారెదవు = పోయెదవు, కాలు విందుగన్ = యమునికి నతిథిగ.

తాత్పర్యము

ఎదురుగా రాఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. రాక్షసశ్రేష్ఠుఁడా! రారమ్ము. దుఃఖపడకుము. నేనే రాముఁడను. ఇదిగో విల్లుదీసికొని సిద్ధముగ నున్నాఁడను. ఇంకెక్కడఁ బోఁగలవు? ఇఁక నల్పకాలములో నిన్ను యముని యొద్దకు నతిథిగఁ బంపెదను. నీ ప్రతాపము నాశము చేసెదను.

కం. అనవుడు నాతఁడె రాఘవుఁ, డని యెఱిఁగి సురారి వికృత•హాసరవుండై
వనచరుల గుండె లగలఁగ, స్తనితార్భటి ననియె రామ•చంద్రునితోడన్.

అర్థములు. వికృతహాసరవుఁడై = వికారపు నవ్వుధ్వనిగలవాఁడై, అగలఁగన్=పగులునట్లు స్తనితార్భటిన్=పిడుగువంటి ధ్వనితో.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా వీఁడే రాముఁడని యెఱిఁగి రాక్షసుఁడు వికారముగా నవ్వి వానరుల గుండెలు పగులునట్లు పిడుగు పడునపుడు కలుగు ధ్వనివంటి ధ్వనితో — రామచంద్రమూర్తితో నిట్లనియె.

ఉ. కాను జుమీ విరాధుఁడను ♦ గాను గబంధుఁడఁ, గాను వాలి, నేఁ
గాను ఖరుండ, రామ! విను ♦ కానల తాటక పట్టి, వచ్చితిన్
దానవ దేవతానికర ♦ దారణకారణభీమ ఏతదు
గ్రానలతుల్యముద్గరక ♦ రార్జితవర్ణుఁడఁ గుంభకర్ణుఁడన్. ౧౩౬

అర్థములు. తాటకపట్టి = మారీచుండు, దానవదేవతానికర = దానవుల యొక్కయు దేవతలయొక్కయు సమూహములయొక్క, దారణకారణ=చీల్చుట యందుఁ గారణమైన, భీమ = భయంకరమైన, ఏతత్ = ఈ, ఉగ్రానలతుల్య= తీక్ష్ణమైన యగ్నితో సమానమైన, ముద్గరకర=ముద్గరమునుగల చేతితో, ఆర్జిత= సంపాదింపఁబడిన, వర్ణుఁడన్=కీర్తిగలవాఁడను, "వర్ణ స్వర్ణ కథా కుథ నుతి గణ శోభా యశో విశేషేషు" నానా. ర.

తాత్పర్యము

రామచంద్రా! నేను విరాధుఁడను గాను జుమీ. కబంధుఁడను గాను, వాలినిగాను, ఖరుండనుగాను, మారీచుఁడను గాను. దానవ దేవతాసమూహము లను జీల్చుటయందుఁ గారణమై భయంకరమైన యీ తీక్ష్ణమైన యగ్నితో సమానమైన ముద్గరమును గల చేతితో సంపాదించిన కీర్తిగలవాఁడను కుంభకర్ణుఁ డను వచ్చితిని.

* ప్రతిషేధాలంకారము=ప్రసిద్ధమైన ప్రతిషేధమును మరల నిషేధించుట ప్రతిషేధాలంకారము.

వీఁడు విరాధుఁడు కబంధుఁడు కాఁడనుట ప్రసిద్ధవిషయమే. దానిని మరల నిషేధించుటచేఁ ప్రతిషేధాలంకారము.

చ. చెవులును ముక్కు లేవని హ♦సింపకు మన్నని రామచంద్ర! య
య్యవి తెగిపోకఁ బీడ లవ♦మైనను లేదు, భవద్బలంబు శౌ
ర్యవిభవ మేను గాంచి మఱి ♦ యస్మదనూనపరాక్రమంబు నీ
కవితథభంగిఁ జూపి జవ♦మారఁగఁ ద్రుంగెదఁ జెంప పెసంగెదన్. ౧౩౭

అర్థములు. హసింపకు = నవ్వకుము, అస్మత్ = నాయొక్క, అనూన = కొఱఁతలేని, పరాక్రమంబు=శౌర్యము, అవితథభంగిన్ = వ్యర్థముకానిరీతిగ.

తాత్పర్యము

ఎవఁడు వీఁడు ముక్కు సెవులు లేనివాఁడు శూర్పణఖ యన్నగా నున్నాఁడే యని నవ్వకుము. రామచంద్రా! యవి పోవుటచే బాధ కొంచెమైన లేదు. నీ

బలంబు శౌర్య సంపత్తి యేమాత్రమో చూచి తఁనవాత నా పూర్ణ పరాక్రమము సార్థకముగాఁ గనఁబఱిది నా గొప్పతనము వృద్ధి యగునట్లు విన్ను భ్రమింగెదను.

మ. ఘటకర్ణుం డిటు పల్క రాముఁడు సుపుం•ఖస్ఫారవజ్రద్రుతో
త్కటబాణంబులఁ జిమ్మెఁ దద్ధతిని నా•తం డేమి కంపింపమిన్
బటుసాలంబుల వాలినిం దునుము న•బ్బాణంబులన్ వైచె న
చ్చటులాస్త్రంబులు నించు కే నతని నేఁ•చన్ లేవ, యద్దైత్యుఁడున్. ౧౫౬౫

అర్థములు. సుపుంఖ = మంచి పింజలచే, స్ఫార = ప్రకాశించు నవియు, వజ్రద్రుతి=వజ్రము యొక్క వేగము గలవియు నగు, ఉత్కటబాణంబులు=తీవ్రములైన బాణములను, తత్ + హతిని = ఆ దెబ్బచే, ఏమి =ఏమియున్ = కొంచెమైనను, కంపింపమిన్ = చలింపక పోవుటచే, పటు = దృఢములైన, సాలంబులను వాలిని, తునుము=పడఁ గొట్టిన బాణంబులన్ = చెట్లద్రుంచిన బాణ మొకటి, వాలిని ద్రుంచిన బాణ మొకటి రెండగుటచే బహువచన ప్రయోగము. ఈ విష యము కిష్కింధా కాండమునఁ జర్చింపఁబడెను, చటులాస్త్రంబులు=తళతళ లాడు టచే చలించు నాయస్త్రంబులు, ఏఁచన్ = బాధపెట్టఁగా, లేవ = సమర్థమైనవి కావు. 'ఏఁచు' నను రెండు రూపంబులు గలవు. ఏఁచన్, ఏఁపన్.

తాత్పర్యము

కుంభకర్ణుఁ డిట్లు చెప్పఁగా రామచంద్రమూర్తి మంచి పింజలు గలిగి వజ్ర ముతో సమానమైన వేగముగల విశేష బాణములను చిమ్మెను గాని వాని దెబ్బకు వాఁడు కొంచెమైన చలింప లేదు. ఆవల సాలములను వాలిని ద్రేసిన బాణములు వేసెను. అవియును వానిని బాధించినవి కావు. ఆ రాక్షసుఁడును.

కం. కురిసెడిశరవర్షంబును, శరవర్షమునా గ్రహించి • శరవేగము ము
ద్గరవేగంబున నుడుపుచుఁ, దరుచరతతి నెల్లఁ దఱిమెఁ•దద్వాతమునన్.

తాత్పర్యము

కురియుచున్న బాణవర్షమును జలవర్షముగా గ్రహించి యా బాణవేగమును ముద్గరవేగంబున నిలుపుచు, ఆ ముద్గరము త్రిప్పుటవలనఁ గలిగిన వాయువుచే వానరులను దఱిమెను.

## —• శ్రీరాముఁడు కుంభకర్ణుని కాలుసేతులు నఱకుట •—

మ. అలఁతిం బోయెడువాఁడు గాఁ డనుచు వా•యవ్యాస్త్రముం బూని శ్రీ
జలజాక్షుం డను సముద్గరం బయిన హ•స్తం బుర్విఁ గూల్పంగ, నా
పలలాశిప్రవరేణ్యుఁడుం దుముల రా•వం బార నించెన్, శరో
ద్దళితం బైనకరంబు వృక్షచరసం•తానాంత మై భూమిపై. ౧౫౬౬

అర్థములు. అలఁతిన్ = అల్పముతో, సముద్గరంబు = ముద్గరముతోఁ గూడినది, పలలాశి ప్రవరేణ్యుఁడున్ = రాక్షస శ్రేష్ఠుఁడు, తుముల రావంబు =

సంకులధ్వని, శరోద్ధళితంబైన కరంబు=బాణముచే ఛేదింపఁబడిన చేయి, వృక్షచర సంతానాంతమై=వానర సమూహములను నాశముచేయునదియై.

### తాత్పర్యము

తన బాణములు వానిని గొట్ట సమర్థములు గామిఁ జూచి వీఁడల్ప ప్రయత్నముచేఁ జోయెడివాఁడు గాఁడని వాయవ్యాస్త్రము ప్రయోగించి రామచంద్రమూర్తి ముద్గరముతోడి హస్తమును నేలఁ బడఁగొట్టెను. బాణముచే ఛేదింపఁబడిన హస్తము వాని చుట్టియున్న వానరులపై పడి వారిని నాశము చేసెను.

మ. పడినన్ భగ్నహతావశేషనికురుం ♦ బం బెల్ల దవ్వుగా
 గడలం బాఱి విషణ్ణచిత్తమగుచుం ♦ గంపించు దేహంబులన్
 గడుఘోరం బగు రామరాక్షసుల సం ♦ గ్రామంబు వీక్షించె న
 య్యెడ గుండెల్ దిగు దిగ్గు దిగ్గుమన నెం ♦ తే వీతహర్షంబునన్. ౧౮౬-౮

అర్థములు. భగ్న = విఱిగిన వారును, హత = చంపఁబడిన వారును పోఁగా, అవశేష=మిగిలిన, నికురుంబంబు = వానర సమూహము, దవ్వుగా= దూరము దూరముగా, కడలన్ బాఱి=దిక్కులవెంటఁ బరువెత్తి, విషణ్ణచిత్తము = విషాదముతోఁ గూడిన మనస్సు గలది, కంపించు = వణఁకు, వీతహర్షంబునన్ = పోయిన సంతోషముతో.

### తాత్పర్యము

ఆ హస్త మట్లు భూమిపైఁ బడఁగా దానిచే విఱిగినవారు చచ్చినవారు గాక మిగిలిన వానరుల గుంపు దిక్కులవెంట దూరముగాఁ బరువెత్తి పోయి వణఁకు దేహంబులతో మిగుల భయంకరమైన రామకుంభకర్ణుల యుద్ధము సంతోషము లేని వారై గుండెలు దిగుదిగ్గు మనఁజూచిరి.

ఉ. అంత నికృత్తబాహుఁ డను ♦ రాంతికుఁ డొండొక కేలఁ బీకి త
 త్ప్రాంతగతంబు భూరుహము ♦ రామునిఁ గొట్టఁగ వచ్చు చుండ దు
 ర్దాంతమహైంద్రబాణమున ♦ రాముఁడు వృక్షముతోడి హస్తమ
 భ్రాంతిని ద్రుంచి వైచెఁ గధ ♦ రంబడి కేలు ద్రుమాన్వితంబుగన్. ౧౮౯-౯౧

అర్థములు. నికృత్తబాహుఁడు=నఱకఁబడిన చేయి గలవాఁడు, తత్ప్రాంతగతంబు = ఆ సమీపమందున్న, భూరుహమున్ = చెట్టును, దుర్దాంత=అణఁపరాని, మహా + ఐంద్రబాణమున=గొప్ప ఐంద్రాస్త్రమున, అభ్రాంతిని=భ్రాంతిలేక, ద్రుమాన్వితంబుగన్= చెట్టుతోడ.

### తాత్పర్యము

చేయి నఱకఁబడిన రాక్షసుఁడు వేఱొకచేత నాసమీపమందున్న చెట్టును బీఁకి దానితో రామునిఁ గొట్ట రాఁగా భ్రాంతిపడక రామచంద్రమూర్తి యైంద్రాస్త్రము ప్రయోగించి యా హస్తమును నఱకఁగా చెట్టుతోడ నా హస్తము నేలఁబడి

కం. పొరలుచుఁ బొరలుచు శిలలం, దరుచరులన్ భూరుహములఁ♦దద్దయు మోఁదెన్
ధర దొరఁగఁ జావ విఱుగన్, గిరినిభుఁడగు రక్కసుండు♦కెరలుచుఁ గినుకన్.

అర్థములు. గిరినిభుఁడు = పర్వతముతో సమానుఁడు, కెరలుచున్ = విజృంభించుచు.

తాత్పర్యము

పొరలుచు పొరలుచు శిలలు క్రిందఁబడునట్లు వానరులు చచ్చునట్లు చెట్లు విఱుగునట్లు కొట్టెను. అంత పర్వతముతో సమానుఁడైన రాక్షసుఁడు కోపముచే విజృంభించి.

కం. కరములు రెండును లేకయు, కరము భయంకరములైన♦గర్జలతోడ
న్నురవడి రాఁ గని యాతని, చరణంబుల వడికె నర్థ♦చంద్రద్వయిచేన్.

అర్థములు. ఉరవడిన్ = వేగముగ, అర్ధచంద్రద్వయిచేన్ = రెండు అర్ధచంద్రబాణములచే.

తాత్పర్యము స్పష్టము.

కం. దిక్కుల విదిక్కులం బెను, రక్కసగుమి గిరుల సాగ♦రంబున గుహలం
దొక్క మొగి రవము పుట్టఁగ, నక్కాళులు రెండు దునిసి♦యవనిం బడియెన్.

అర్థములు. దిక్కులందు = తూర్పు దక్షిణము పడమర ఉత్తరము అను దిక్కులందు, ఆగ్నేయము నైఋతిమూల వాయవ్యమూల ఈశాన్యమూల లనెడి విదిక్కులందు, రక్కసగుమిన్ = రాక్షసుల గుంపునందు, సాగరంబున=సముద్రమందు, ఒక్క మొగిన్ =ఒక్కసారిగ.

తాత్పర్యము

దిక్కులందు విదిక్కులందు రాక్షసుల పెద్ద గుంపులందు కొండలందు సముద్రమందు గుహలందు నొక్క విధముగ ధ్వనిపుట్టునట్లు కాళ్లు రెండును దునిఁగి నేలఁబడెను.

రామచంద్రమూర్తి నిరాయుధుఁడని రావణుని క్షమించెఁగదా, కుంభకర్ణు నేల క్షమింపలేదు? నిరాయుధుఁడనఁగా యుద్ధప్రయత్నము లేనివాఁడని యర్థము. ఆయుధము లేనివానిని గొట్టరాదని వాఁడు గొంతుపిసికిన నూరకుండ వలయు నని యర్థముకాదు. కబంధుఁడు నిరాయుధుఁడు గాఁడా? కుంభకర్ణుఁడు కాలుసేతులు తెగినను యుద్ధప్రయత్నము మానినవాఁడు గాఁడు.

తే. కృత్తబాహుండు మఱి విని♦కృత్తచరణుఁ
డయ్యు నాతఁడు హా యని♦యాస్యగహ్వ
రంబుఁ దెఱచి ఘోషించుచు♦రాముఁ జేర
వచ్చె శశి గ్రసింగ రాహువు♦వచ్చుకరణి. ౧౫౭౩

అర్థములు. కృత్తబాహుఁడు=నఱకఁబడిన చేతులు గలవాఁడు, వికృత్త చరణుఁడు=నఱకఁబడిన కాళ్ళుగలవాఁడు, ఆస్యగహ్వరంబు=గుహవంటి నోరు.

తాత్పర్యము

కాళ్ళుచేతులు నఱకఁబడినను వాఁడు నోరు గుహవలెఁ దెఱచికొని హాహా యని ధ్వనించుచు చంద్రుని మ్రింగవచ్చు రాహువువలె రాముని మ్రింగవచ్చెను.

ఉ. విచ్చిననోట రామనృపుఁ • డీధనవర్యుఁడు హేమపుంఖభా
స్వచ్చటులాంబకాళి రభ • సంబుగ నిండఁగ నేసె, నోటిలోఁ
గ్రుచ్చుకొనంగ బాణములు • క్రూరచరిత్రుఁడు మాటలాడలే
కెచ్చుగఁ గూఁత వేసి స్మృతి • హీనత బమ్మెర వోవ నెంతయున్. ౧౫౬౮

అర్థములు. విచ్చిన నోటన్=తెఱచికొనిన నోటియందు, హేమపుంఖ = బంగారు పింజలచే, భాస్వత్=ప్రకాశించు, చటుల=మెఱుఁగులచే చలించుచున్న, అంబకాళిన్ = బాణముల వరుసను, రభసంబుగన్ = త్వరగా, బమ్మెరపోవన్ = భ్రమగొని కదలఁగా.

తాత్పర్యము

తెఱచి కొనిన నోటిలో రామచంద్రమూర్తి బంగారు పింజలచేఁ బ్రకాశించు బాణములను నిండఁగ వేయఁగా నవి నోర గ్రుచ్చుకొనుటచే క్రూరపు నడవడిగల వాఁడు మాటలాడలేక పెద్ద కూఁక వేసి స్మృతి చెడి తిరుగఁగా.

—• శ్రీరాముఁడు కుంభకర్ణు శిరంబుఁ దెగవ్రేయుట •—

మ. జ్వలదర్క ప్రతిమానమై నిశితమై • సంవర్తకాలాభమై
ఖలభీదంబయి బ్రహ్మదండనిభమై • గాంగేయపుంఖంబునై
బలవిద్విట్పవిమారుతస్యదమునై • భాస్వత్ప్రదీప్తానల
జ్వలనంబై విలసించు నైంద్రశరమున్ • సంధించి శ్రీరాముఁడున్. ౧౫౬౯

అర్థములు. జ్వలదర్క ప్రతిమానమై = ప్రకాశించు సూర్యునితో సమానమై, నిశితమై = వాఁడియై, సంవర్త కాలాభమై = ప్రలయకాల యమునితో సమానమై ఖలభీదంబు=దుష్టులకు భయంకరమై, బ్రహ్మదండనిభమై=బ్రాహ్మణ శాపముతో సమానమై. (లే) బ్రహ్మాస్త్రమువంటిదై, గాంగేయ పుంఖంబునై = బంగారు పింజగలదై, బలవిద్విట్ = ఇంద్రునియొక్క, పవి=వజ్రము యొక్కయు, మారుత = వాయువు యొక్కయు, స్యదమునై = వేగముగలదై, భాస్వత్ + ప్రదీప్త + అనల జ్వలనంబై=ప్రకాశించుచున్న, మండుచున్న, అగ్నియొక్క జ్వాలవంటిదై, విలసించు = ప్రకాశించు.

తాత్పర్యము

ప్రకాశించు సూర్యునితో సమానమై, వాఁడియై ప్రలయకాల యముని వంటిదై, దుష్టులకు భయము కలిగించునదియై, బ్రహ్మాస్త్రముతో సమానమై

బంగారు పింజగలదై ఇంద్రుని వజ్రాయుధము వాయువు వేగమువంటి వేగము గలదై ప్రకాశించుచు మండుచున్న యగ్నిజ్వాల వంటిదై ప్రకాశించు నైంద్రాస్త్రము రామచంద్రమూర్తి వింట సంధించి.

శా. ద్రాగాకృష్టగుణంబుగా దశదిశా • క్రాంతైక ఘోషంబుగా
వేగంబార నిశాటుపై విడువఁ ద • ద్దివ్యాస్త్రమున్ ధూమరా
జీగర్భీకృత రోహితాశ్వసమ మై • శ్రీశోచిరుద్దీపితా
శాగోత్రాధరజాలమై పిడుగునో • జం బాతి యాభీలమై. ౧౫౬

అర్థములు. ద్రాక్ = శీఘ్రముగా, స్రాగ్ఝడిత్యంజసాహ్నాయద్రాజ్ఞంక్షు సపది ద్రుతే, అనియమరము, ఆకృష్ట = లాగఁబడిన, గుణంబుగా = అల్లెత్రాడు గలదిగా, దశదిశాక్రాంతైక ఘోషంబుగా=పది దిక్కులనాక్రమింపఁబడిన ధ్వని గలదిగా, ధూమరాజీ = పొగ సమూహముచే, గర్భీకృత = గర్భము కలదిగాఁ జేయఁబడిన, రోహితాశ్వ=అగ్నిహోత్రునితో, సమమై=సమానమై, శ్రీశోచిస్+ఉద్దీపిత+ఆశాగోత్రాధరజాలమై=కాంత్యతిశయముచేత, ఉద్దీపిత = ప్రకాశింపఁజేయఁబడిన, ఆశా=దిక్కులయు, గోత్రాధరజాలము=పర్వత సమూహముగలదై, పిడుగునోజన్=పిడుగువలె, ఆభీలమై=భయంకరమై.

తా త్ప ర్య ము

• శీఘ్రముగా లాగఁబడిన యల్లెత్రాడు గలదిగాఁ బది దిక్కులందు వ్యాపించిన ధ్వని గలదిగా రాక్షసుపై నా భయంకరాస్త్రమును విడువఁగా పొగచేతఁ జుట్టుకొనఁబడిన యగ్నిజ్వాలతో సమానమై కాంత్యతిశయముచేఁ బ్రకాశింపఁ జేయఁబడిన దిక్కులు కొండలు గలదై పిడుగువలెఁ బోయి భయంకరమై.

ఉ. భూరిమహీధరాగ్ర నిభ • ముం జలచారు సువర్ణ కుండలం
బార వివృత్త దంష్ట్రిమును • నా నసురాధిప మూర్ధమున్ మహా
ఘోరతఁ ద్రుంప బిట్టగసి • కుండల రాజిత తచ్ఛిరంబు పొ
ల్పారెఁ బునర్వసూడుయుగ • శాంతర చంద్రునిఁ బోలుచు న్నిశన్. ౧౫౭

అర్థములు. భూరి మహీధరాగ్రనిభమై = పెద్ద పర్వతశిఖరమునకు సమానమై, చల=చలించుచున్న, చారు=మనోహరమైన, సువర్ణకుండలంబు = బంగారు చెవుల పోగులు గలది, ఆరన్ = పూర్ణముగా, వివృత్త దంష్ట్రిమును= గుండ్రమైన కోరలు గలది, మూర్ధమున్=శిరస్సును, మహాఘోరతన్ = మిగుల భయంకరముగా, త్రుంపన్=ఖండింపఁగా, బిట్టగసి = తటాలున నెగసి, కుండల రాజిత తచ్ఛిరంబు=కుండలములతోఁ బ్రకాశించు ఆతల సుగ్రీవుఁడు తనకు తటాలున నబ్బిన చెవుల పైభాగములు పెఱికెనే కాని మొదలంటఁ బెఱుకలేదు. కావున కుండలము లున్నవని చెప్పఁబడెను, పునర్వసూడుయుగళ=పునర్వసు రెండు నక్షత్రముల, అంతర చంద్రుని=నడుమనున్న చంద్రుని, నిశన్=రాత్రియందు, యథా

వాచా దిశా నిశా' యని యుండుటచే నిశన్ అని చెప్పఁబడెను. 'నిశా నిశీథినీ రాత్రి' యని యమరము.

తాత్పర్యము

పెద్ద కొండ శిఖరములతో సమానముగ కదలుచున్న మనోహరమైన కుండలములు గలది గుండ్రని కోఱలు గలది యగు రాక్షసుని తలను మిగుల భయంకరముగాఁ ద్రుంపఁగా నది తటాలున పైకెగసి రాత్రివేళ నాకాశమందుఁ బునర్వసు రెండు నక్షత్రముల నడుమనున్న చంద్రునివలెనై.

రెండు నక్షత్రములు కుండలములు, నడుమ ముఖము చంద్రుఁడని యుపమానము.

ఉ. దబ్బున నేలపైఁ బడుచుఁ ♦ దత్పురిఁ గల్గిన గోపురంబులున్
బ్రబ్బినయిండ్లు నున్నతపు ♦ వప్రముఁ జా డొవరించె నాద మా
గుబ్బతిలం గళేబరము ♦ గూల్చుచుఁ గోటివనాటులన్ జలం
బుబ్బఁగఁ గంధిఁ ద్రెళ్ళి భుజ ♦ గోత్కరనక్రఝషాంతకారియై. ౧౫౭

అర్థములు. ఉన్నతపువప్రము=ఎత్తైన ప్రాకారము, నాదము = ధ్వని, ఆగుబ్బతిలన్=అతిశయింపఁగా, కళేబరము=మొండెము, వబలకభేదము = కళే+అవరము = కళేవరము, కళేబరము "శరీరే జర్ఝరీభూతే వ్యాధిగ్రస్తే కళేవరే, ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః" కోటివనాటులన్=కోటి వానరులను కంధిన్ = సముద్రమందు భుజగోత్కర = పాముల సమూహము యొక్కయు, నక్ర=మొసళ్ళయొక్కయు, ఝష = చేఁపలయు, అంతకారియై = నాశము చేయునదియై.

తాత్పర్యము

దభాలున నేలపై బడుచు నాపట్టనమందలి గోపురములను, ఇండ్లను ఎత్తైన కోటగోడను నాశముచేసెను, అది పడినచోటనున్న యిండ్లు మొదలైనవినాశమైన వని భావము. మొండె మెగసిపోవుచు కోటి వానరులను చంపుచుఁబోయి నీళ్ళుబ్బ నట్లు సముద్రములో బడఁగా నందలి పాములు మొసళ్ళు చేపలు నాశమయ్యెను. సముద్రము నీళ్ళుపొంగి పొరలివచ్చి యొడ్డుననున్న వానరులఁ జంపెనని భావము.

కం. దేవబ్రాహ్మణశాత్రవుఁ, డీ విధమున జన్యసీమ ♦ నీలుఁగ వణఁకెన్
భూవలయము దివి తుములం, బై వెలసెను దేవతాప్ర♦హర్షారభటిన్. ౧౫౮

అర్థములు. జన్యసీమన్=యుద్ధమందు, ఈలుగన్ = చావఁగా, తుములంబై=సంకులమై, దేవతా ప్రహర్షారభటిన్=దేవతల సంతోషధ్వనులచే.

తాత్పర్యము

దేవతలకు బ్రాహ్మణులకు పగవాఁడగు కుంభకర్ణుఁడు ఈవిధమున యుద్ధమందు జావఁగా భూచక్రము వణఁకెను. ఆకాశము దేవతల సంతోష ధ్వనులచే సంకులమయ్యెను.

ఉ. రామపరాక్రమంబునకు • రంజిలె దేవమహర్షి పన్నగ
స్తోమసురర్షి యక్షతతి • ద్యోచరభూతచయంబు లెల్ల, సం
గ్రామమునన్ సురాహితులు • రాక్షసు లా హరిఁ జూచినట్లు శ్రీ
రామునిఁ జూచి యేడిచిరి • రావణుచుట్టలు పేరెలుంగునన్. ౧౬౫

అర్థములు. సురాహితులు=దేవవిరోధులు, హరిన్=విష్ణువును.

తాత్పర్యము

రామచంద్రుని పరాక్రమముచూచి దేవతలు మహర్షులు పన్నగులు దేవర్షులు యక్షులు ఆకాశమునఁ దిరుగు ప్రాణిసమూహము లన్నియు సంతోషించెను. యుద్ధమందు దేవతావిరోధులు శ్రీవిష్ణువునుజూచి యేడ్చినట్లు రావణుని బంధువులు పెద్ద గొంతుతో శ్రీరామునిఁజూచి యేడ్చిరి. చుట్టములు చుట్టలని రెండు రూపములు గలవు.

తే. సైంహికేయవిముక్తభాస్కరుఁడు దేవ,లోకతిమిరంబు జోపి వెలుంగుమాడ్కి
సంగరంబున ఘటకర్ణుసంహరించి, రామచంద్రుఁడు వెలిఁగె మర్కటులనడుమ.

అర్థములు. సైంహికేయ=సింహికాపుత్రుఁడైన రాహువుచే, విముక్త=విడువఁబడిన, భాస్కరుఁడు=సూర్యుఁడు, దేవలోకతిమిరంబు=స్వర్గమండలిచీఁకటి, జోపి=నాశముచేసి.

తాత్పర్యము

రాహువుచే విడువఁబడిన సూర్యుఁడు స్వర్గలోకమునఁ జీఁకటి పోఁగొట్టునట్లు యుద్ధమున కుంభకర్ణుని సంహరించి వానరుల నడుమ రామచంద్రమూర్తి వెలిఁగెను.

ఉ. భీమబలున్ దురాసదుని • భీమకాయునిఁ గుంభకర్ణు దు
ర్ధామబలంబునం దునుమ • దాశరథిం గపిసంఘ ముల్లస
త్తామరసాభవక్త్రమయి • తద్దయు హర్షమునన్ నుతింపఁగా
రాముఁడు వృత్రుఁ జంపిన సురప్రవరుం డన మోదముం గనెన్. ౧౬౬

అర్థములు. దురాసదుని = సమీపింపరాని వానిని, ఉల్లసత్ = సంతోషముచే ప్రకాశించు, తామరసాభవక్త్రము=కమలముతో సమానమైన ముఖము.

తాత్పర్యము

భయంకర బలము గలవానిని, దగ్గఱకైనను బోవ సాధ్యపడనివానిని భయంకర దేహము గలవానిని గుంభకర్ణుని విస్తారబలముచే చంపిన రామచంద్రమూర్తిని జూచి సంతోషముచే ప్రకాశించు ముఖకమలములు గలవారై కపులు మిగుల సంతోషముతో స్తోత్రము చేసిరి. రామచంద్రమూర్తియు వృత్రునిజంపిన యింద్రుని వలె సంతోషించెను.

—♦ ౬౮-వ సర్గము. హతశేషులు రావణునకుఁ గుంభకర్ణు మరణంబు దెలుపుట ♦—

కం. యోధాగ్రేసరుఁ డగు నీ, తాధవుచేఁ గుంభకర్ణుఁ ♦ డనుజేంద్రుం డా
యోధనమునఁ జెల్లుట రక్షోధీశున కిట్లు చెప్పి ♦ రసువ రేణ్యుల్. ౧౫౮౩

అర్థములు. యోధాగ్రేసరుఁడు = యుద్ధశూరులందు శ్రేష్ఠుఁడు, ఆయోధనమునన్ = యుద్ధమందు, చెల్లుట = చచ్చుట.

తాత్పర్యము స్పష్టము.

శా. దేవా! తావకసోదరుండు నిజవి ♦ ద్విట్పూగముం బోరిలో
భీవిద్రావిత మాచరించి శుచికిం ♦ బెన్నుద్దియై మూర్త మెం
తే విఖ్యాతగతిం జెనంగి కపులన్ ♦ హింసించి యా జానకీ
దేవీవల్లభుచేత సంగరములోఁ ♦ దీతెం బ్రశాంతార్చియై. ౧౫౮౪

అర్థములు. తావక సోదరుండు=నీతమ్ముఁడు, నిజ=తనయొక్క, విద్విట్ = విరోధుల, పూగమున్ = సమూహమును, భీవిద్రావిత = భయముచే పరువెత్తిదానిఁగా, శుచికిన్ = అగ్నిహోత్రమునకు, పెన్నుద్దియై = మిక్కిలి సమానమై మూర్తము = అల్పకాలము, ఎంతే = ఎంతేని = మిక్కిలి, విఖ్యాతగతిన్ = కీర్తికరముగ, ప్రశాంతార్చియై=చల్లఁబడిన జ్వాలలు కలవాఁడై,

తాత్పర్యము

దేవా! నీ తమ్ముఁడు కుంభకర్ణుఁడు తన విరోధుల గుంపులను యుద్ధములో పరువెత్తునట్లుచేసి యగ్నిహోత్రమువలె నల్పకాలము కీర్తికరముగ యుద్ధము చేసి వానరులఁ జంపి రామచంద్రమూర్తిచే యుద్ధమందు చల్లఁబడిన తేజస్సు గలవాఁడయ్యెను.

ఉ. కృత్త గళోరుబాహుఁ డయి ♦ కీర్తిత శౌర్యుఁడు నేల నిండఁగా
నెత్తురు గాఱఁ గూలె రణ ♦ నీచరనాథ! తదర్ధదేహ మీ
వ త్తెప మడ్డగించెఁ బురి ♦ ద్వారమునం బడి, మొండె మంబుధిన్
హత్తిన జీవజంతువుల ♦ కంతముఁ గూర్చుచుఁ గూలె భీమమై. ౧౫౮౫

అర్థములు. కృత్త=నఱకఁబడిన, గళ, ఊరు, బాహుఁడు=కంఠము కాళ్లు చేతులు గలవాఁడై, తదర్ధ దేహము=వాని సగము దేహము, శిరస్సు.

తాత్పర్యము

నఱకఁబడిన చేతులు కాళ్లు తల గలవాఁడై కీర్తింపఁబడిన శౌర్యము గల కుంభకర్ణుఁడు భూమినిండ నెత్తురు గాఱుచుండఁగాఁ జచ్చెను. వానితలగవని వాకిట నడ్డముగాఁ బడియున్నది. మొండెము సముద్రములోని జీవజంతువుల నాశము చేయుచుఁ బడెను.

కం. నీ తమ్ముఁడు సీతావిభు, శాతాశుగపీడితుఁ డయి ♦ చేటులావల ద
గ్ధాతతవసుంధరారుహ, భూతుండై మఱి లగండ ♦ భూతుం డయ్యెన్. ౧౫౮౬

అర్థములు  శాతాశుగ=వాఁడి బాణములచే, పీడితుఁడయి=బాధింపఁబడిన వాఁడై, చటుల=జ్వాలలచే కదలుచున్న, అనల=అగ్నిచే, దగ్ధ = కాల్పఁబడిన, అతతి=విస్తారమైన, వసుంధరారుహ భూతుండై = వృక్షమువంటివాఁడై, భూత మనఁగా సమానము, "భూతం న్యాయ్యే సమే ప్రాప్తే" యని నానా ॥౪॥ లగండ భూతుఁడు=ముద్దవలెనైనవాఁడు (౨) కొండ చిలువవలె నైనవాఁడు, అగండ భూతుఁడని పాఠాంతరము. అప్పుడు గుర్తింపరాని వాఁడని యర్థము.

తాత్పర్యము

నీ తమ్ముఁడు రామచంద్రుని వాఁడి బాణములచేఁ బీడితుఁడై యెగురుచున్న జ్వాలలుగల యగ్నిచేఁ గాలిన చెట్టువలెనై ముద్దగా నయ్యెను.

తే. అనుచు హతశేషు లాడిన • నసురభర్త, కుంభకర్ణుండు కలనిలోఁ • గూలుటవిని
తాళరానిభృశార్తిసం • తప్తుఁడగుచు, మూర్ఛయగ్గలముగఁ దన్ను • ముంపఁ ద్రెళ్లె.

అర్థములు. హతశేషులు=చావఁగామిగిలినవారు, అగ్గలముగన్=అధికముగ.

తాత్పర్యము

అని చావఁగా మిగిలిన రాక్షసులు చెప్పినమాటలు యుద్ధమందుఁ గుంభకర్ణుఁడు చచ్చెనని విని రావణుఁడు సహింపరాని యధికదుఃఖముచే సంతప్తుఁడై గాఢముగ మూర్ఛపోయి నేలఁబడెను.

ఉ. అంతకసన్నిభుండు హతుఁ • డయ్యెఁ బితృవ్యుఁ డటన్న దుఃఖవృ
త్తాంతము నాలకించి పరి • తాపమునం ద్రిశిరోతికాయదే
వాంతకులున్ నరాంతకుఁడు • హా యని యేడ్చిరి విహ్వలాత్ములై
యెంతటి ధైర్యశాలి మఱి • యెంత బలాఢ్యుఁ డటంచు నెన్నుచున్. ౧౫౦౪

అర్థములు. అంతకసన్నిభుండు=యమునితో సమానుఁడు, పితృవ్యుఁడు= పినతండ్రి, విహ్వలాత్ములై = విరవిరఁబోవు మనస్సు గలవారై.

తాత్పర్యము

యమునితో సమఁడైన తమపినతండ్రి చచ్చెనని దుఃఖవార్తవిని త్రిశిరుఁడు, అతికాయుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు వికలమైన మనస్సులతో హాయని యెంతటి ధైర్యశాలి యెంత బలవంతుఁడు అని గుణములు వర్ణించుచు నేడ్చిరి.

తే. రామవిభుచేత ఘోరసం • గ్రామమునను, దమ సహోదరుఁ డీల్గిన • దారుణంపు
వార్త వినుకలిచే మహా • పార్శ్వుఁడడలె, హాయటంచును నేడ్చె మ • హోదరుఁడు.

అర్థములు. వినుకలిచే = వినుటచే.

తాత్పర్యము స్పష్టము.

తే. ఎట్టకేలకు నయ్యసు • రేశ్వరుండు, జాతచైతన్యుఁ డై, యను • జాతుఁ దలఁచి
తలఁచి యాతనిశౌర్యంబు • ధైర్యగరిమ, పరిపరివిధాల నేడిచెఁ • బనవి పనవి.

అర్థములు. జాతచైతన్యుఁడై =స్మృతిగలవాఁడై, అనుజాతున్ =తమ్ముని.

తాత్పర్యము స్పష్టము.

**—• కుంభకర్ణు మరణంబునకు రావణుఁడు దుఃఖించుట •—**

సీ. హా! రిపుదర్పఘ్న! • హా వీరరత్నమా! హా, కుంభకర్ణ! మ•హాబలాఢ్య!
దైవచోదితుఁడవై • తరలితే తమ్ముఁడా!, యగ్రజు ననుఁబాసి•యమునిపురికి
బంధువులయు నాదు•బాధలఁ బాపక,చనుచునె నీ వొంటిగఁ • జనఁగ దండ్రి!
యెవ్వని ప్రాపున•నింద్రాదులకు నైన, వెఱవక యుందునో • విపులశౌర్య!
తే. యట్టి నాదక్షిణభుజంబు•హతముగాఁగ, నింక నే నేమి సేయుదు•హీనబలుఁడ
నైతిఁ బూర్వాపకారి న•న్నమరవరులు, చూచి నవ్వరె నేనెందుఁ•జొత్తునయ్య!

అర్థములు. దైవచోదితుఁడవై=విధిప్రేరితుఁడవై, తరలితే=పోయితివా?, దక్షిణభుజంబు = కుడిచేయి, పూర్వాపకారి = ముందు కీడుచేసిన నన్ను.

తాత్పర్యము స్పష్టము.

కం. హేలాగతి సురదానవ, జాలస్మయ మణఁచినట్టి • చతురుండవు హా
కాలానలరుద్రాభుఁడ, వాలంబున నీవుఁ దెగితి•వా రామునిచేన్. ౧౪౯-౨

అర్థములు. హేలాగతిన్=ఆటవలె, సుర = దేవతలయు, దానవ = దానవులయు, జాల=సమూహముయొక్క, స్మయము = గర్వము, కాలానల రుద్రాభుఁడవు=ప్రలయకాలమందలి యగ్నితోను రుద్రునితోను సముఁడవు, ఆలంబునన్ = యుద్ధమందు, నాలుగవ పాదంబున ప్లుతయతి, కాకుస్వరయతి.

తాత్పర్యము

అనాయాసముగా దేవదానవసమూహముల గర్వ మణఁచిన సమర్థుఁడవు. ప్రలయకాలమందలి యగ్నితోను, రుద్రునితోను సమానుఁడవు. అట్టి నీవు యుద్ధంబున నొక్క రామునిచేఁ జచ్చితివా?

ఉ. ఏమిది శంబసాధను న•హీనమహాశని నిన్నుఁ దాఁకగా
నేమియు డయ్య వట్టి మహి•మేడ్యుఁడ వౌర! మనుష్యమాత్రుఁడౌ
రామవిభుండు వైచిన శ•రంబుల కోర్వఁగ లేక యార్తిచే
భూమిని బెద్దనిద్దురను • బొందితి వే యిటు లున్నె చిత్రముల్. ౧౪౯-౩

అర్థములు. ఏమిది = ఆశ్చర్యము, శంబసాధను = ఇంద్రుని, అహీనమహాశని=వేగాధిక్యముగల గొప్ప వజ్రాయుధము, డయ్యవు = గాసిపడవు, మహిమ+ఈడ్యుఁడవు = గొప్పతనముచే స్తోత్రము చేయఁబడఁదగినవాఁడవు.

తాత్పర్యము

ఏమిది యాశ్చర్యము! ఇంద్రుఁడు మహావేగముగా వైచిన వజ్రాయుధము నకుఁ గొంచెమైన బాధపడని నీవు సామాన్య మనుష్యుఁడైన రాముఁడు వేసిన బాణంబుల కోర్వలేక చచ్చితివా. ఔరా చిత్రము?

కం. మునితతి వేల్పులగుంపులు, వనిలో నీ తెగుట గాంచి • యడలు విడిచిఁ లో
బెనఁగొనుముదమునఁ గలకల, మని నవ్వుచుఁ బ్రముల్లిచున్న • యవి గగనమునన్

అర్థములు. అడలు = భయము.

తాత్పర్యము స్పష్టము.

కం. ధ్రువముగ నిదియే యదన నని, ప్లవగులు నిస్తులితహర్ష • పరవశు లగుచున్
జవమున నెక్కెదు రీపురి,గవఁకుల వాకిండ్ల గోట • కడ నల్గడలన్. ౧౫౫

అర్థములు. అదను = సమయము, నిస్తులిత = సమానము లేని, హర్ష = సంతోషముచే, పరవశులగుచున్ = స్వాధీనము తప్పినవారై.

తాత్పర్యము

ఇది సత్యము. నీవు చచ్చుట మే మేడ్చుట విని యిదియే సమయ మని వానరులు సంతోషముచే దేహములు తెలియక శీఘ్రముగ నగరి గవఁకు వాకిండ్లను కోటల నల్గడలను ఎక్కెదరు.

ఉ. ఏటికి నాకు రాజ్య? మిఁక • నేటికి నీపురి? యేల సీత? నా
కేటికి జీవితంబు? రుచి • యించునె నా యనుజుండు లేనిచో?
నాటికి భ్రాతృహంత రఘు • చంద్రము నే వధియింప నేని ము
మ్మాటికిఁ జావె మేలు, కొఱ • మాలిన యీ బ్రతు కేల భూమిపై! ౧౫౬

అర్థములు. భ్రాతృహంతన్ = తమ్ముని జంపిన వానిని, కొఱమాలిన = ప్రయోజనము లేని.

తాత్పర్యము స్పష్టము.

కం. నాయనుజుఁ డుండుచోటికి, నే యరిగెద వాని విడిచి • యే నొక క్షణమేన్
గాయంబు నిలుప నోపను, నేయెడ నే నట్టివాని • నిలపైఁ గందున్. ౧౫౭

తాత్పర్యము స్పష్టము.

చ. హరిహయుఁ డెత్తిరాఁగ నిఁక • నాతని నెట్లు జయింప నేర్తు? నా
పరమతి యా విభీషణుని • వాక్య మహో ఫలియించి వచ్చెఁగా,
యరయక బుద్ధిమాలి మహి • తాత్ముని యాతనివాక్యమం దనా
దరమతి చేసితిన్, ఫలము • తప్పక తారొకెను నేమి సేయుదున్. ౧౫౮

అర్థములు. ఎత్తిరాఁగన్ = దండెత్తిరాఁగా, మహితాత్ముని = గొప్ప మనస్సు గలవానియొక్క, తారొకెనెన్ = ప్రాప్తించెను.

తాత్పర్యము

ఇంద్రుఁడు నాపై దండెత్తివచ్చెనేని నేనిఁక నతని నెట్లు జయింపఁగలను. గొప్ప మనస్సుగల విభీషణుని వాక్యము ఫలియించి వచ్చెఁగదా. ఆలోచింపక బుద్ధి లేని వాఁడనై గొప్ప మనస్సుగల యతఁడు చెప్పినమాట నలక్ష్యపఱిచితిని. దాని ఫల మిపుడు ప్రాప్తించెను. ఏమి చేయఁగలను?

చ. అని మొనఁ గుంభకర్ణుఁడు ప్ర॥హస్తుఁడు గూలినవార్తలన్ వినన్
మనమున నవ్విభీషణుని॥ మాట లహో సరివాఁకి వచ్చెగా
యని కడులజ్జ యయ్యెడు. మ॥హాత్ముని ధర్మరతున్ నిరస్తుఁ జే
సినఘనపాపమే యిటులు॥ చేసెడు, శోకముపేరఁ గోసెడున్. ౧౫౯౯

అర్థములు. అని మొనన్ = యుద్ధభూమి మొదట, నిరస్త = వెడలఁ గొట్టఁబడినవానిని.

తాత్పర్యము

యుద్ధముఖమున బ్రహస్తుఁడు కుంభకర్ణుఁడు చచ్చిన వార్త వినఁగా విభీషణుఁడు చెప్పినట్టులే జరిగెనుగదా యని సిగ్గగుచున్నది. ధర్మయుక్తమైన గొప్ప మనస్సుగల విభీషణుని వెడలఁగొట్టితిని. ఆ పాపమే యిట్లు చేయుచున్నది. శోకము పేరఁ గోయుచున్నది.

కం. అని యేడ్చును బలవించును, ననుజా! యనుఁ గుంభకర్ణ॥డా! యను నయమో
చనితా యను నీక నాగతి, ననుమా యను పోలు ప్రా॥లునలదురుఁ జెడితిన్.

తాత్పర్యము స్పష్టము.

**—॥ ౬౯-వ సర్గము. త్రిశిరుండు రావణునకు దుఃఖశాంతి వాక్యంబులఁ దెలుపుట ॥—**

చ. అని యిటు లేడ్చుచున్న యసు॥ రాధిపతిం ద్రిశిరుండు పల్కె నీ
యనుజుఁడు నీవు పల్కుగతి॥ నట్టిఁడ, వైరులచేత నీల్గె, నీ
యనువు పరాక్రమాఢ్యులకు॥ నందఱకున్ సహజంబ కాని న
జ్ఞానులు భవద్విధంబుగ భృ॥శంబుగ నేడ్వరు తండ్రి యెయ్యెడన్. ౧౬౦౧

ఈ ప్రకార మేడ్చుచున్న రావణునిఁజూచి త్రిశిరుఁడనువాఁడిట్లనియె. తండ్రీ! నీవు చెప్పినట్లు నీ తమ్ముఁడంతటివాఁడే. నిజమే. అయినను దైవవశమున శత్రువులచేతఁ జచ్చెను. ఈ ప్రకారము పరాక్రమవంతులకు యుద్ధమందు మృతి స్వభావసిద్ధమే కావున దానికై బుద్ధిమంతులగువారు నీవలె గోలుగోలున నెవ్వరు నేడువరు.

ఉ. పేలవుపోలె నేడ్వఁ దగ॥నే? భువనంబులు మూఁటినైన నీ
వాలమునన్ జయింపఁగ స॥మర్థుఁడ వాదువు, నీకు లేవె స
త్యాలయ దత్తసాయక శ॥రాసనశక్తి తనుత్రముల్ పయో
దాళినినాద సన్నిభ స॥హస్రఖరోద్ధరథం బమోఘమై. ౧౬౦౨

అర్థములు. పేలవుపోలెన్ = మూఢునివలె, ఆలమునన్ = యుద్ధమందు, సత్యాలయ = బ్రహ్మచేత, దత్త = ఈయఁబడిన, సాయక = బాణములు, శరాసన = విల్లు, శక్తి=శక్తియను నాయుధము, తనుత్రముల్ = అభేద్య కవచము, పయోదాళి నినాద సన్నిభ=మేఘ సమూహము ధ్వనివంటి ధ్వనిగల, సహస్రఖరోద్ధ=వేయి కంచరగాడిదలు గట్టు రథము, అమోఘమై = వ్యర్థము గానిదై,

తాత్పర్యము

నీమునివలె నిట్టు లేడ్వవచ్చునా! మూఁడులోకములనైనను నీవు యుద్ధమందు జయింపగల శక్తిగలవాఁడవు. నీకు బ్రహ్మదేవుఁడిచ్చిన బాణములు, విల్లు, శక్తి కవచము, మేఘధ్వని గలిగి వేయి కంచర గాడిదలు కట్టు రథము ఇవియన్నియు నమోఘములై యున్నవి గదా.

ఉ. కేవల రిక్తహస్తముల • గీటణఁగింపవె యెన్నిమార్లొ దే
వావళి దానవాళులఁ? స•మస్తవరాయుధయుక్తి నేఁడి సీ
తావిభు బాహుశౌర్యమున • దండితుఁ జేయుము, యంతయేల యి
చ్ఛావిధి నుండ నీవు నిలు • సౌఖ్యముగాఁ బగ నేన తీర్చెదన్. ౧౬౦౩

అర్థములు. కేవల రిక్తహస్తములు = బొత్తిగ నే యాయుధము లేని చేతులచే, గీటణఁగింపవె=చంపవే, సమస్త వరాయుధయుక్తిన్=అన్ని యాయుధములతోడ, ఇచ్ఛావిధిన్ = ఇష్టము వచ్చిన చొప్పున.

ఏయాయుధములతోడ నీకు నేమిపని, నీవు చేతియం దాయుధ మనునది లేకయే యెన్నిమార్లో దేవదానవుల జయింపలేదా. అట్టివాఁడ విప్పుడు సమస్తాయుధములతో నేగి భుజబలముచే రామచంద్రుని దండింపుము. ఇంతయేల? దీనికి నీవు పోవలయునా? నీవు సుఖముగా నీయిష్టప్రకారమిందే యుండుము. నేను బగ దీర్చెదను.

మ. మహితవ్యాలకదంబకంబు గరుటా • మంతుండు వారించున
వ్వహి నీశత్రులఁ జించి చెండెద బల • ప్రత్యర్థి యా శంబరున్
విహగాధీశ్వరసైంధవుండు నరకున్ • భేదించిన ట్లేను దు
స్సహశాతాశుగపంక్తి రామవిభునిన్ • సంహారముం జేసెదన్. ౧౬౦౪

అర్థములు. మహితవ్యాలకదంబకంబున్=గొప్ప పాములసమూహమును అవ్వహిన్=ఆవిధముగ, బలప్రత్యర్థి=ఇంద్రుఁడు, విహగాధీశ్వర సైంధవుండు = పక్షిరాజగు గరుత్మంతుని వాహనముగాఁ గలవాఁడు, విష్ణువు దుస్సహ=సహింపరాని, శాతాశుగపంక్తిన్=వాఁడి బాణముల వరుసలచే.

తాత్పర్యము

గొప్ప పాముల సమూహమును గరుత్మంతుండు నివారించునట్లు నీ శత్రులను జించి చెండాడెదను. శంబరుని నింద్రుఁడు నరకుని విష్ణువు భేదించినట్లు నేను సహింపరాని వాఁడి బాణముల వరుసచే రామచంద్రుని సంహరించెదను.

ఇందు శంబరుఁడు ఇంద్రునిచేఁ జంపఁబడిన వాఁడని చెప్పుటచే వీఁడు ప్రద్యుమ్నునిచేఁ జచ్చినవాఁడు కాఁడు. నరకుఁడను వాఁడు కృష్ణునిచేఁ జచ్చినవాఁడు

కాఁడు. విప్రచిత్తికి సింహికకుఁ బుట్టినవారిలో నొకఁడు 'వాతాపి ర్నముచి శ్చైవ ఇల్వల స్సృమర స్తథా, అంధకో నరక శ్చైవ కాలనాథ స్తథైవ చ'. వి.పు.

క౦, అను త్రిశిరునివచనంబుల, విని కాలప్రేరితుండు • వింశతిభుజుఁ డా
త్మను దన్ను ధరఁ బునర్జాతునిఁగా దలపోసి యలరి • దుఃఖము మానెన్.

అర్థములు. కాలప్రేరితుండు = మృత్యువుచేఁ బ్రేరేపింపఁ బడినవాఁడు, పునర్జాతునిఁగా=మరలఁ బుట్టినవానినిగా, అలరి=సంతోషించి.

తాత్పర్యము

ఈ ప్రకారము త్రిశిరుఁడు చెప్పిన మాటలు విని మృత్యువుచేఁ బ్రేరింపఁబడిన వాఁడై రావణుఁడు తన్ను భూమిమీఁద మరలఁ బుట్టినవానిఁగా దలఁచుచు సంతోషపడి దుఃఖము మానెను.

తే. త్రిశిరువాక్యంబులను విని • తేఱికొని నరాంతకుం డతికాయు దే•వాంతకులును
రణసముత్సుకు లగుచు గ•ర్జలను నించి, రహమహమికాప్రకారము•లతిశయిల్ల.

అర్థములు. అహమహమికా = నేను ముందు నేను ముందు అను విధము.

తాత్పర్యము స్పష్టము.

ఉ. అందఱు నింగిద్రిమ్మరులు • నందఱు మాయలఁ బండితేంద్రు ల
య్యందఱు దేవదర్పవిని • హంతలు నందఱు జన్యదుర్జయుల్
అందఱు శౌర్యధైర్యయుతు • లందఱు విశ్రుతకీర్తిశాలు ల
య్యందఱు యుద్ధకేళి నప • రాజితు లా దశకంఠనందనుల్. ౧౬౦౭

అర్థములు. నింగిద్రిమ్మరులు = ఆకాశమున సంచరించువారు, జన్యదుర్జయుల్ = యుద్ధమునందు జయింపరానివారు, అపరాజితులు = ఓడిపోనివారు, వీరందఱు రావణు కుమారులు.

తాత్పర్యము

ఆ రావణుని కుమారు లందఱు నాకాశమునఁ దిరుగఁగలవారు. అందఱు మాయలయందుఁ బండితులు. అందఱు దేవతలగర్వ మణంచినవారు. అందఱు యుద్ధమున జయింపరానివారు. అందఱు శౌర్యము ధైర్యము గలవారు. అందఱు ప్రసిద్ధికెక్కిన కీర్తిగలవారు. అందఱు యుద్ధమునందు పరాజయ మెఱుఁగనివారు.

చ. మాటికి మాటికిన్ భుజగ • మండలిఁ దోలెడిచోట దేవతా
ర్ఘూటము నేఁచుచోట నొక•సారియు వారలు నోడి రన్న య
మ్మాటయు లేని వీరు లతి•మానితబుద్ధులు యుద్ధదుర్మదుల్
సాటులు లేనిపండితులు • లబ్ధవరుల్ దిననాథతేజులున్. ౧౬౦౮

అర్థములు. భుజగమండలిన్ = సర్పసమూహమును, దేవతార్ఘూటము = దేవతాసమూహము, ఏఁచు=బాధించు, లబ్ధవరుల్ = వరములు సంపాదించినవారు,

తాత్పర్యము

పలుమాఱు సర్పములను దేవతాసమూహములను తెలియు వేళ బాధించెడి వేళ నొకసారియైనను నోడితిమని మాటలేని వీరులు, మిగుల గౌరవింపఁబడిన బుద్ధులు గలవారు, యుద్ధమునందు పెద్ద గర్వము గలవారు, పాండిత్యమునం దసమానులు, వరములు సంపాదించినవారు, సూర్యప్రకాశము గలవారు.

—• { దేవాంతక నరాంతకాతికాయత్రిశిరోమత్త యుద్ధోన్మత్తుల రావణుఁడు యుద్ధమునకుఁ బనుచుట. } •—

ఉ. వారలు గొల్వ దేవవృత • వాసవున ట్లయి తేఁజ పుత్రులన్
గారవ మారఁ గ్రుచ్చి బిగి • కౌఁగిట భూషణభూషితాంగులం
బేరిమిఁ జేసి యందఱకుఁ • మేలిమి దీవన లిచ్చి పుచ్చె సీ
తారమణప్లవంగమవి • తానముతో సమరం బొనర్పఁగన్. ౬౯-౯

అర్థములు. దేవవృత వాసవునట్లు = దేవతలచేఁ జుట్టఁబడిన యింద్రుని వలెఁ భూషణ భూషితాంగులన్ = ఆభరణములచే నలంకరింపబడినవారిని, సీతా రమణ = రామునితోను, ప్లవంగమ వితానముతోన్ = వానరసమూహముతోను, సమరంబు = యుద్ధము.

తాత్పర్యము

• వారలు గొల్చుచుండఁగా దేవతలు చుట్టుకొన్న యింద్రునివలెనై రావణుఁడు కొడుకులను ప్రేమతోఁ గౌఁగిలించుకొని సొమ్ములచే నలంకరించి అందఱను దీవించి రామునితోను వానరులతోను యుద్ధముచేయఁ బంపెను.

కం. తనయులకుం బాసటయై, యొనరఁ జనించె నిక మత్తు • యుద్ధోన్మత్తున్
మనుజాశివరుల ఖ్యాతుల, వినయంబున వారు ప్రముఖ • విబుధద్వేషిన్. ౬౯-౧౦

అర్థములు. బాసట = సహాయులుగా, మనుజాశివర్యులన్ = రాక్షస శ్రేష్ఠులను.

తాత్పర్యము స్పష్టము.

మత్తుఁడు యుద్ధోన్మత్తుఁ డనునవి మహోదర మహాపార్శ్వులకు పర్యాయ నామములు.

కం. సర్వౌషధులన్ గంధము, నార్వురు వేత్వేఱ పూసి • యంగంబుల దో
ర్గర్వాంధులు రణకాంక్షను, నిర్వక్రజవంబునన్ వ • నేచరతతిపై. ౬౯-౧౧

అర్థములు. సర్వౌషధులన్ = ఆయుధముల వలన దెబ్బ దగులకుండు నట్లు చేసెడి మూలికలతోఁ జేయఁబడినవి. అవి దేహమునకుఁ బూసికొనిన కత్తితో నఱికినను గాయము గాదు. ఆర్వురు, త్రిశిరుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు, అతికాయుఁడు మహోదర మహాపార్శ్వులు, దోర్గర్వాంధులు = భుజబల గర్వముచే

కన్నులు గాననివారు, వనేచర తతిపై = వానరసేన మీఁద, నిర్వక్రజవంబునన్ = పూర్ణ వేగంబున.

తాత్పర్యము

సర్వౌషధులనైన గంధమును ఆర్వురు వేఱువేఱుగాఁ బూసికొని భుజబల గర్వముచేఁ గన్నులు గానక వానరుల మీఁదికి నతి వేగముగా.

"కోష్ఠం మాంసీహరిద్రే ద్వే, మురా శైలేయ చందనం, త్వచా ముస్తకముస్తాశ్చ సర్వౌషధ్యో దశస్మృతాః" యని దీనికిఁ బ్రమాణము. మయూరశిఖ యందు నీ గుణము గలదని గ్రంథములం దున్నది.

సీ. వెడలి రా రాక్షసుల్ ♦ విధివశంబునఁ జేసి, దేవాంతకుండును ♦ ద్రిశిరసుండు
నతికాయుఁ డోలిన ♦ రాంతకుండును మహో, దరమహాపార్శ్వులు ♦ దరము లేక
నీలజీమూతస ♦ న్నిభము నైరావత, వంశజం బైనట్టి ♦ వారణంబు
కలిత సుదర్శనా ♦ ఖ్యము సమస్తాయుధో, పేతం బుపాసంగ ♦ జాతయుతము
తే. నస్తగిరి భానుక్రియ నుండెఁ ♦ గనుపడో, డననెక్కెను మహోదరుండు పే ♦ రుక్కు మెఱయ
నైలబిలు మాడ్కి గద కేల ♦ గ్రాలభీమ, కాయుఁడై నమహాపార్శ్వ ♦ ఖలుఁడు వెలిఁగె

అర్థములు. దరము = భయము, నీలజీమూతసన్నిభము = నల్లని మేఘముతోఁ సమానము, ఐరావత వంశజంబు = ఐరావత వంశమునఁ బుట్టినది, వారణంబు = ఏనుఁగు, ఉపాసంగజాత = అమ్ముల పొదుల సమూహముతో, యుతము = కూడినది, ఐలబిలు మాడ్కి = కుబేరునివలె.

తాత్పర్యము

దేవాంతకుఁడు త్రిశిరుఁడు అతికాయుఁడు నరాంతకుఁడు మహోదరుఁడు మహాపార్శ్వుఁడు, అను వారు భయము లేక విధివశంబునఁ జేసి బయలుదేఱిరి. నల్ల మబ్బుతో సమానమై ఐరావత వంశమునఁ బుట్టి సుదర్శనమను పేరుగల సమస్తాయుధములతోఁ గూడినది, అమ్ములపొదులు గలది యగు నేనుఁగును మహోదరుఁడు సూర్యుఁ డస్తాద్రి నెక్కిన ట్టెక్కెను.

ఈ యుపమానము వీని వినాశమును సూచించుచున్నది. మహాపార్శ్వుఁ డనువాఁడు చేత గదఁ దీసికొని కుబేరునివలెఁ బ్రకాశించెను.

శా. ఆజానేయ చయాంచితంబు వరశ ♦ స్త్రాస్యూత మా తేరిపైఁ
దేజం బార నవిద్యుదుల్కము సధా ♦ త్రీభృత్సరేఫ్వాపనం
బౌ జీమూతముతోడి కూట మనఁగా ♦ నాఖీలకోదండుఁడై
రాజం ద త్త్రిశిరుండు వెల్వడె రణో ♦ ద్యోగానురక్తాత్ముఁడై. ౨౨-౨౩

అర్థములు. ఆజానేయ = ఉత్తమజాతి గుఱ్ఱముల, చయ = సమూహముచే, అంచితము = ఒప్పునది, ఆజానేయః కులీనాస్స్యు, అని యమరము, వర = శ్రేష్ఠములైన, శస్త్రాస్యూతము = శస్త్రములతోఁ గూడినది, సవిద్యుత్ + ఉల్కము = మెఱుపుతోడి

మేఘములోనుండి వెలువడు కొఱవివంటి కాంతిగలది, ఇది యపశకున సూచకము. ధాత్రీధృత్పర+ఇష్వాసము=కొండలకు విరోధి యగు నింద్ర ధనుస్సుతోఁ గూడిన జీమూతములోడ=మేఘములతోఁ గూడిన, కూటము = శిఖరము, 'రణోద్యోగానురక్తాత్ముఁడై=రణకార్యమునం దనురాగము గల మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

ఉత్తమజాతి గుఱ్ఱములు గట్టినదియు నన్నివిధములైన యాయుధములతోఁ గూడినదియు నగు శిరిమీఁద మెఱుముతోఁ గూడిన మేఘముగల పర్వత శిఖరము వలె భయంకరమైన విల్లుగలవాఁడై రణమండలి యానసక్తిచేఁ బ్రసిద్ధుండు వెల్వడెను.

తే. మూఁడు బంగరు సిగరముల్ మొనసి వెలుగు మంచుఁగొండ వనా త్రియామాచరుండు
మకుటముల మూఁట రాణించు మస్తకముల, వెలిఁగె స్యందనమున లోకభీకరుండు.

అర్థములు. త్రియామాచరుండు=రాక్షసుఁడు.

తాత్పర్యము

మూఁడు బంగారు శిఖరములు గల మంచుఁగొండవలె మూఁడు కిరీటములు ధరించిన మూఁడుతలలతో నా రాక్షసుఁడు రథమునఁ బ్రకాశించెను.

సీ. సర్వధానుష్క ప్రశస్త చారిత్రుండు, కాంచనమకుట సమంచితుండు
కిరణభాసితమేరు ధరణీధరం బనఁ, బురురుక్మభూషణ భూషితుండు
దృఢరథాంగాక్షంబు దృఢశ్లేషసంయుక్తంబు, స్వనుకర్షము,సకూబ రాన్వితంబు
శరధి బాణాసన సంప్రదీప్తంబును, ప్రాసాసిపరిఘాది భాసితంబు

తే. నైన రథసత్తమంబున నసురభర్తృ, సూనుఁ డతికాయుఁ డెక్కి తన్ సూ[illegible]ందుఁ
బలభిద్భోజుల తేజములు బలసి కొలువ,నమరవృతవజ్రపాణియట్లతిశయిల్లె.

అర్థములు. ధానుష్క=విల్లుపట్టెడి వారిలో, కాంచనమకుట = బంగారు కిరీటముచే, సమంచితుఁడు = ప్రకాశించువాఁడు, కిరణభాసిత = కిరణములచే ప్రకాశించు, మేరుధరణీధరంబు = మేరుపర్వతమువలె, పురురుక్మభూషణ భూషితుండు=గొప్ప బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినవాఁడు. దృఢరథాంగాక్షంబు=గట్టి చక్రములు బండికన్నులు గలది. దృఢశ్లేషసంయుక్తంబు = మిక్కిలి చక్కఁగా సంధింపఁ బడినది, స్వనుకర్షము=సు + అనుకర్షము = చక్కనికోడిపీట గలదియు, నొగచివర భాగము భూమిమీఁద నానకయుండునట్లు ఎత్తుగా నొక కొనయందు వంతెన కట్టిచియుండు ప్రమాణితుండు కోడిపీటయనఁబడును, 'అనుకర్షో దార్వధస్థ' యని యమరము. సకూబరాన్వితంబు=మంచి నొగలు గలది, శరధి= అంబుల పొదిచేతను, బాణాసన+విండ్లచేతను, సంప్రదీప్తంబును =మిగులఁ బ్రకాశించునదియు, ప్రాస+అసి+పరిఘ+ఆది భాసితంబు = ఈఁటెలచేతను, కత్తుల చేతను, గుదియలచేతను ఈ మొదలయిన వానిచేతఁ బ్రకాశింపజేయఁ బడినది, రథ

సత్తమము=శ్రేష్ఠమైనవేఁడు, సూరెలందు = ప్రక్కల, పలల భోజుల తుటుములు= రాక్షసుల గుంపులు, బలసి = చుట్టుకొని, అమరవృత = దేవతలచేఁ జుట్టుకొనఁ బడిన, వజ్రపాణి=ఇంద్రుఁడు.

తాత్పర్యము

అందఱు విలుకాండ్రచేతఁ బొగడఁబడిన నడవడి గలవాఁడును బంగారు కిరీటము ధరించినవాఁడును,కిరణములచే బ్రకాశించు మేరుపర్వతమువలె విశేషముగ బంగారునగలచే నలంకరింపబడినవాఁడును, దృఢమైన చక్రములు బండికన్నులు గలిగి గట్టిగా జోడింపఁబడి చక్కని కోడి కీఁట నొగగలదై అమ్ముల పొదులు విండ్లు ఈఁటెలు కత్తులు ఇనుపగుదియలు లోనగు నాయుధములచేఁ బ్రకాశించు చుండు మేలి రథమెక్కిన రావణుకొడుకు అతికాయుఁడు రాక్షసులు తన ప్రక్కల సేవింప దేవతలతోఁగూడిన యింద్రునివలె నతిశయించెను.

కం. శ్వేతము కనకాభరణో, పేతం బుచ్చైశ్శ్రవంబు • పెన్నద్ది జవ
స్ఫీతం బురుకాయం బగు, వీతిపయి నరాంతకుండు• వెలుఁగుచునుండెన్. ౬౯-౨౯

అర్థములు. శ్వేతము = తెల్లనిది, కనకాభరణోపేతము = బంగారు సొమ్ములతోఁగూడినది. ఉచ్చైశ్శ్రవంబు పెన్నద్ది = ఉచ్చైశ్శ్రవముతో సమానమైనది. జవస్ఫీతంబు=వేగముచేఁ బ్రకాశించునది, ఉరుకాయంబు=పెద్ద దేహము గలది, వీతిపయి=గుఱ్ఱముమీఁద.

తాత్పర్యము

తెల్లనిదై బంగారాభరణములుగలదై ఉచ్చైశ్శ్రవముతో సమానమైన మిగుల వేగము పెద్ద దేహము గలదైన గుఱ్ఱముపై నరాంతకుఁడు ప్రకాశించెను.

కం. మాసర మగుశక్తి కరయిన్, భాసిల రహించు కేకి•వాహనుమాడ్కిన్
మీసరమగు నుల్కాభ• ప్రాసంబును దాల్చి పొల్చె•రావణసుతుడున్. ౬౯-౩౦

అర్థములు. మాసరము=నిడుపాటిది, కేకివాహనుమాడ్కిన్ = కుమారస్వామివలె, మీసరము = శ్రేష్ఠమైన, ఉల్కాభప్రాసంబును=ఉల్కతో సమానమైన యీఁటెను.

తాత్పర్యము

కుమారస్వామి నిడుపాటి శక్తియను నాయుధమును ధరించినట్లు నరాంతకుఁడు శ్రేష్ఠమైన యుల్కవంటి యీఁటెను ధరించెను.

తే. వజ్రచయభూషితంబై న•పరిఘ మొండు,హస్తమునఁబూనిమెప్పె దే•వాంతకుండు
భూధరంబును నిరుగేలఁ•బూనిపట్టి, యబ్ధిశయనుని నల్లసం•బాధుభంగి. ౬౯-౩౧

అర్థములు. వజ్రచయ భూషితము = వజ్రసమూహముచే నలంకరింపఁబడినది, పరిఘము=ఇనుపకట్ల గుదియను, భూధరంబును = పర్వతంబును, ఇరుకేలన్ = రెండు చేతుల, అబ్ధిశయనుని = సముద్ర మథనకాలమున విష్ణువును, ఉల్ల

సంబాహుభంగిన్ = పరిహసించు వానివలె, పరిఘ నొకచేతితో నెత్తి కత్తివలెఁ గొట్ట సాధ్యపడునది కాదు. రెండు చేతుల నెత్తి కొట్టవలసి యుండును. కావున నీ యుపమానము, కాదేని విష్ణువు రెండు చేతుల నెత్తినంత దాని నేనొక చేతనే యెత్తితి నని పరిహసించె ననియైనఁ జెప్పవచ్చును.

తా త్ప ర్య ము

వజ్రసమూహములచే నలంకరింపఁబడిన యినుప గుదియఁ దీసికొని దేవాంతకుఁడు సముద్రమథనకాలమున రెండుచేతుల మందర మెత్తిన విష్ణువును బరిహసించు వానివలె నుండెను.

తే. అమరు లమరావతిని వీడి • సమరమునకుఁ, జనెడిభంగిని వెడలిరి • సైన్యనిచయ
సంయుతంబుగ రథదంతి • సైంధవములు నాయుధోపేతు లగు భటు • లనుగమింప.

అర్థములు. అమరావతిని = ఇంద్రనగరమును.

తా త్ప ర్య ము

దేవత లమరావతిని విడిచి యుద్ధమునకుఁ బోవునట్లు సైన్య సమూహముతో తేర్లు ఏనుఁగులు, గుఱ్ఱములు, ఆయుధములు ధరించిన కాలిబంట్లు తమవెంట రాఁగా లంక విడిచిపోయిరి.

చ. మకుటమణీప్రభాళు లల • మన్ దిశలన్ గ్రహరాజిఁ బోలుచున్
జకచకపర్వ కాంతులను • సాంద్రము లౌ వరశస్త్రముల్ దివిన్
బ్రకటితశారదాంబుదని • భం బగు నంచలపిండు సాటిగా
మకురునఁ జావొ గెల్పొ యొక • మాటయ నిశ్చయ మంచు నెంచుచున్. ౧౬.౨౦

అర్థములు. మకుటమణీ ప్రభాళులు = కిరీటరత్న కాంతులు, అలమన్ = ఆక్రమింపఁగా, ప్రకటిత = స్పష్టమైన, శారదాంబుద నిభంబు = శరత్కాల మేఘముతో సమానము. అంచలపిండు = హంసల సమూహము, మకురున = మూర్ఖతచే, చావొ గెల్పొ = చావనైనఁ జావవలె, గెలువనైన గెలువవలె నని — గెలువనైన గెలువవలెఁ జావనైనఁ జావవలె నని వారి నోరరాక చావే ముందు వచ్చెను.

తా త్ప ర్య ము

కిరీటరత్న కాంతులు దిక్కులందు వ్యాపింపఁగా గ్రహసమూహములఁ బోలి కాంతులు దట్టముగా వ్యాపించిన యాయుధములు శరత్కాల మేఘముతో సమానమైన హంసల సమూహముతో సమానమై చావనైనఁ జావవలె గెలువనైన గెలువవలె నిది నిశ్చయమని మూర్ఖతచేఁ దలంచుచు.

కం. తొప్పుచు వైరులబలమును, దెప్పుచు నార్భటు లెసంగఁ • దీవ్రాయుధముల్
ద్రిప్పుచు గర్వము కన్నుల, గప్పఁగ వెల్వడిరి యుద్ధ • కాంక్ష దలిర్పన్. ౧౬.౩౧

అర్థములు. తొప్పుచున్ = హుంకరించుచు, దెప్పుచున్ = ఆక్షేపించుచు.

తా త్ప ర్య ము స్పష్టము

కం. వారల క్ష్వేళారవముల, వారి భుజాస్ఫాలనముల • వారిపదదథ
ళ్కారంబుల గడ గడ మని, ధారిణి వడఁకాడెఁబగిలెఁ • దారాపథమున్. ౧౭౨

అర్థములు. క్ష్వేళారవములన్ = సింహనాదములచే, భుజాస్ఫాలనములన్ = రెట్టలు తట్టుకొనుటచే, పదదథళ్కారంబులన్ = కాళ్ళుదథదథ యని పెట్టుటచే, తారాపథమున్ = ఆకాశమును.

తాత్పర్యము

వారి సింహనాదములు వారిరెట్టలు తట్టుకొనుటలు వారిపాద ఘట్టనలు ఆకాశమును పగులఁజేసెను. భూమిని వణఁకఁజేసెను.

ఉ. ఈగతి నిష్క్రమించి యసు • రేంద్రు లతంద్రత నుద్యతోరువృ
క్షాగము యుద్ధకాంక్షము మ • హాప్లవగేంద్ర బలంబుఁ గన్గొనన్
నాగరథాశ్వసంకుల ఘ • ణంఘణనాదితచారుకింకిణీ
పూగము యాతుధానబల • ముం దిలకించిరి వానరేంద్రులున్. ౧౭౩

అర్థములు. నిష్క్రమించి = వెడలి, అతంద్రతన్ = హెచ్చరికతో, ఉద్యతోరువృక్షాగము = ఎత్తఁబడిన చెట్లు, కొండలుగలది; యుద్ధకాంక్షము = యుద్ధమున కెదురు చూచునది యగు, మహాప్లవగేంద్రబలంబు = గొప్ప సుగ్రీవుని సేనను, నాగరథ అశ్వసంకుల = ఏనుఁగులతో తేర్లతో గుఱ్ఱములతో కలిసినది, కింకిణీ = చిఱుగజ్జెల, పూగము = సమూహము గలది, యాతుధానబలమున్ = రాక్షససేనను, తిలకించిరి = చూచిరి.

తాత్పర్యము

ఇట్లు వెలువడి యా రాక్షసులు హెచ్చరిక గలవారై యుద్ధమున కెదురు చూచుచు నానిమిత్తమై కొండలు చెట్లు చేతఁదీసికొని యున్న వానరసేనను జూచిరి. వానరులును ఏనుగులు రథములు గుఱ్ఱములుగలదియు గణగణ ధ్వనిగల గజ్జెల సమూహముగలదియు నగు రాక్షస సైన్యముఁ జూచిరి.

—• వానర రాక్షసనేనల యుద్ధము •—

తే. అసితజీమూతనిభము దీ • ప్తానలార్క, తుల్యము సముద్యతాయుధ • స్తోమ మగుచు
నైఋతర్షభ వృతము సై • న్యంబుఁజూచి, యార్భటులు నించిరగచరు • లగము లెత్తి.

అర్థములు. అసిత జీమూత నిభము = నల్లని మేఘములతో సమానము, దీప్తానలార్క తుల్యము = ప్రకాశించు నగ్ని సూర్యులతో సమానమైనది, సముద్యతాయుధస్తోమము = ఎత్తఁబడిన యుద్ధసాధనముల సమూహము గలది, నైఋతర్షభ వృతము = రాక్షసశ్రేష్ఠులచే వ్యాపింపఁబడినది. అర్భటులు = సింహనాదములు, అగములు = పర్వతములు.

తాత్పర్యము

నల్లని మబ్బుతో వెలుఁగుచున్న యగ్ని• యగ్ని సూర్యులతో సమానమై

మెత్తఁబడిన యాయుధము గల రాక్షససేనను జూచి వానరులు కొండలు చెట్లెత్తు కొని కేకలు వేసిరి.

ఉ. ఈసున శత్రుసేనల య•హీనసముద్ధతి సైఁప లేక పెన్
రోసముతోడ రాక్షసులు • రోదసి వ్రీలఁ బ్రతిధ్వనుల్ మదో
ద్భాసితచిత్తులై కొలుప • వానరులున్ నగశృంగహస్తులై
త్రాసవిహీనులై తెగి ప•రధ్వజినిం జొరఁబాఱి యుగ్రులై. ౧౬ ౭౫

అర్థములు. ఈసునన్ = కోపముచే, అహీనసముద్ధతిన్ = అధికగర్వమును, రోదసి=అంతరాళము, భూమికి నాకాశమునకు నడిమి ప్రదేశము. మదోద్భాసితచిత్తులై = గర్వముచే నొప్పు మనస్సు గలవారై, త్రాసవిహీనులై = భయము లేనివారై, తెగి=తెగించి, పరధ్వజినిన్=శత్రుసేనను.

తాత్పర్యము

కోపముతో వైరుల యధికగర్వమును సహింపలేనివారై రోషముతో రాక్షసులు అంతరాళము పగిలిపోవునట్లు గర్వముచే బ్రతిధ్వనులు చేయఁగా వానరులును పర్వతశృంగము లెత్తికొనిన వారై కుంభకర్ణసముద్రమునే రామానుగ్రహమున దాఁటితిమఁట, ఈ చిఱుకాల్వ లేమి లెక్కయని భయము విడిచిన వారై తెగించి శత్రుసేనలో దూఱిరి.

ఉ. కొండలు మింట నేల మఱి•కొండలు కొండలు వృక్షహస్తులై
కొండలు శైలపాణు లయి • కో యని యార్చుచు భూమిభృచ్ఛిలా
బృందము వర్షముం గురిసి • పెంపు రహింపఁగ నంటఁ దాఁకె నా
స్కందన మంతయుం బోలిచె • సర్వదిదృక్షుభయప్రదాయియై. ౧౬ ౭౬

అర్థములు. భూమిభృత్ + శిలాబృందము = కొండఱాల సమూహము, ఆస్కందనము=యుద్ధము. సర్వదిదృక్షుభయప్రదాయియై=చూచువారికందఱకు భయము గలిగించునదియై.

తాత్పర్యము

కొండ లాకాశమందుఁ గొండలు నేలమీఁద గొండలు చెట్లను గొండలు గుట్టలను చేతియందుఁ గలవారై కోయని యఱచుచు కొండల ఱాలవాన గురిపించి తమ మహత్త్వమేర్పడునట్లు నెదుర్కొనఁగా చూచువారి కందఱకు భయము గలిగించు నదియై యుద్ధ మొప్పెను.

ఉ. దానికి నోహటింపక బు•ధప్రతిపక్షులు శాతబాణసం
తాన మవారిగాఁ గురిసి • తాఁకెడివారల నిల్వరింపఁగా
వానరు లీడఁబోక జల•వాహరవోపమగర్జులై జయా
ధీనమనస్కులై పరులఁ • దీర్చిరి పేర్చిరి బాహుసంపదన్. ౨౯ ౭౭

అర్థములు. ఓహటింపక = వెనుదీయక, బుధప్రతిపక్షులు = రాక్షసులు 'బుధ స్సూరా సురే సౌమ్యే' యని నానా ॥ర. శాతబాణ సంతానము=పదునైన బాణముల సమూహము, అవారిగా = దండిగా, ఉడుగక = వెనుకదీయక, జలవాహ = మేఘములయొక్క, రవోపమ గర్జులై = ధ్వనితో సమానమైన ధ్వని గలవారై, జయాధీనమనస్కులై =గెలుపునకు స్వాధీనపడిన మనస్కులై, చావో గెలుపో యనునది రాక్షసుల భావవిధము, గెలుపే యనునది వానరుల భావవిధము పరులన్=శత్రువులను, తీర్చిరి=చంపిరి.

తాత్పర్యము

దానికి రాక్షసులు వెనుదీయక పదునైన బాణముల సమూహములను దండిగాఁ గురియించి తమపై వచ్చు వానరుల నిలుపఁగా వానరులును వెనుకంజ పెట్టక మేఘము లుఱిమినట్లు గర్జించుచు జయము పొందఁ గల మనస్సు గలవారై శత్రువుల వధించి భుజపరాక్రమముచే విజృంభించిరి

ఉ. నిర్భయవృత్తిఁ గేరి ధ్వజి॰నీయుగళంబు పరాక్రమించి కం
 ఠార్భటు లుల్లసిల్లఁ దెగి ॰ యాహవకేళుల నోల లాడుచో
 నిర్భరదోర్బలంబున వ॰నేచరులున్ నిజబాహునీరదా
 విర్భవశైలశృంగకుజ॰వృష్టిని ముంచుచుఁ దెంపు పెంపునన్. ౧౬-౨౦

అర్థములు. నిర్భయవృత్తిన్=భయములేని వ్యాపారముచే. కేరి=విజృంభించి, ధ్వజినీయుగళంబు = రెండు సేనలు, కంఠార్భటులు=కంఠధ్వనులు, ఆహవకేళులన్ = యుద్ధక్రీడల, నిర్భర = అధికమైన, దోర్బలంబునన్ = భుజబలముచే, నిజబాహునీరద = తమ చేతులనెడి మేఘములనుండి, ఆవిర్భవ = పుట్టిన, శైలశృంగ=పర్వతశిఖరములు, కుజ=చెట్లనెడి, వృష్టిని=వర్షముచే.

తాత్పర్యము

దిగులు లేక విజృంభించి రెండుసేనలు పరాక్రమించి కంఠధ్వను లధికముగాఁగా తెగఁబడి యుద్ధక్రీడలఁ దేలాడునప్పుడు అధికమైన భుజబలముచే వానరులు తమచేతులనెడి మేఘములనుండి కొండశిఖరములు, చెట్లనెడి వర్షము గురియించి ముంచుచు నధిక సాహసమున.

మ. ద్విరదస్యందనసైంధవంబులపయిం ॰ దేదీప్యమానాంగు లా
 భరణాళీలసితాంగు లా దనుజులం ॰ బైపూఁకివే గ్రుద్దినన్
 గిరులన్ మొత్తిన గ్రుడ్లు పెల్లగిలఁగా ॰ గీయంచుఁ గూపెట్టుచున్
 ధరణిం ద్రాఁకుచు నేల దొర్లుచును దై॰త్యవ్యూహముల్ నీల్గినన్. ౧౬-౨౧

అర్థములు. ద్విరద=రెండు దంతములు గలవి ద్విరదములు, ఏనుఁగుల మీఁదను, స్యందన=తేర్లమీఁదను, సైంధవంబులపయిన్ = గుఱ్ఱముల మీఁదను, దేదీప్యమానాంగులు = ప్రకాశించు దేహములు గలవారలు, ఆభరణాళీలసితాం

గులు = భూషణములచేఁ బ్రకాశించు నవయవములు గలవారు, నీల్గఁగన్ = చావఁగా.

తాత్పర్యము

ఏనుఁగుల మీఁదను తేరుల మీఁదను గుఱ్ఱముల మీఁదను ఆభరణముల ధరించిన దేహములతోఁ బ్రకాశించు రాక్షసుల మీఁద దూఁకి గ్రుద్దఁగా కొండలచే మొత్తఁగా గ్రుడ్లు వెల్లగించుకొని రాఁగా గీయని కూతలు పెట్టుచు నేల మీఁదఁ బ్రాకులాఁడుచు దొర్లుచు రాక్షసులు చావఁగా.

ఉ. చేయఁగలట్టి రాక్షసులు • శీఘ్రము ముద్గరశూలఖడ్గకౌ
క్షేయకశక్తి సంఘములఁ • జిమ్ముచు నెమ్ములు వ్రీల గ్రుచ్చుచున్
గాయములందు నెత్తురులు • గ్రమ్మఁగఁ గ్రుమ్ముచు గెల్పుఁ గోరి నా
నాయససాధనంబుల వ • నాటులపో టణఁగించి రుగ్రులై. ౧౬౩౦

అర్థములు. ఎమ్ములు=ఎముకలు, వ్రీలన్=విఱుగునట్లు, నానా = అనేక విధములైన, ఆయససాధనంబులన్ = ఉక్కు ఆయుధములచే, వనాటుల పోటు= వానరుల దెబ్బ.

తాత్పర్యము

సామర్థ్యముగల రాక్షసులు త్వరగా రోకండ్ల వంటి యినుప గుదియలను, శూలములను, బాకులను, పెద్దకత్తులను, శక్తిసంఘములను విసరుచు ఎముకలు విఱుగఁ గ్రుచ్చుచు దేహములందు నెత్తురు గ్రమ్మునట్లు పొడుచుచు జయము గోరిన వారై నానావిధములైన యుక్కుటాయుధములచే వానరులవిజృంభణ మణఁగించిరి.

కం. ఇరువాఁగీగతి బెడిదపు,టురవడిఁ బోరఁగ నొకముహూర్తములో నె
త్తురు వఱదలుగాఁ బాఱఁగ, ధర కుంకుమ పఱచినట్టిదశ వహియించెన్.

అర్థములు. ఇరువాఁగు = రెండుపక్షములవారు, బెడిదపు+ఉరవడిన్= భయంకరమైన వేగమున.

తాత్పర్యము

రెండుపక్షములవా రీ విధముగ నతివేగముగ యుద్ధము చేయఁగ నొక ముహూర్తములో నెత్తురు వఱదలుగాఁ బాఱగా భూమికుంకుమము పఱచినట్లయ్యెను

ఉ. వానరు లాక్రమించి పడ • వైచి ధరిత్రిని వెన్ను సోఁక న
త్యూనబలంబు లూఁది కర • సాధనముల్ వడి లాగి వైచినన్
దానవులుం గరాంఘ్రులను • దా రొగి నొప్పినయంతఁ బోరుచున్
మానముమీఁద దృష్టి నిడి • మర్కటులన్ సొలయించి రుద్ధతిన్. ౧౬౩౧

తాత్పర్యము

వానరులు పైఁ బడి వీఁపులు నేల దగులునట్లు పడవైచి ఱొమ్మును గోళ్ళతో ద్రొక్కి చేతి యాయుధములను నీడ్చి పాఱవైవఁగా రాక్షసులును మానముమీఁద

దృష్టి యుంచినవారై కాళ్ళఁ జేతుల సాధ్యమైనంతవఱకు వానరులను గొట్టి మూర్ఛపోవఁ జేసిరి.

చ. ఫలపలభోజనుల్ సమర ♦ పాటవముల్ ప్రచరించి పోరుచోఁ
జలమునఁ జెంతఁ బోరు సుర ♦ శాత్రవుకాళ్ళ గ్రహించి త్రిప్పుచున్
మలికిత మింత లేక తన ♦ మాఱుతుఁ గీశుఁడు కొట్టఁబోవ నా
ఖలుఁడును నొండుక్రోఁతిఁ గడ ♦ కాళ్ళను బట్టి విరోధి వైచెడిన్. ౬౩

అర్థములు. ఫల = పండ్లను, పల = మాంసమును, భోజనుల్ = తిను వారు, ఫలభోజనులు = వానరులు, పలభోజనులు = రాక్షసులు, సమరపాటవముల్ = యుద్ధము నందలి నేర్పులు, ప్రచరించి = ప్రచురించి, మలికితము = సందేహము, మాఱుతున్ = పగవాని, కొట్టఁబోవన్ = కొట్టఁబోఁగా.

తాత్పర్యము

వానరులు రాక్షసులు యుద్ధమునందలి తమ తమ నేర్పులు ప్రకాశము లగునట్లు యుద్ధము చేయు సమయంబున చలమునఁ దన సమీపమున నున్న రాక్షసుని కాళ్ళుపట్టుకొని గిరగిర త్రిప్పి వానితోఁ దనతో యుద్ధము చేయు రాక్షసుని కొట్టఁబోఁగా నా దుష్టరాక్షసుఁడును వేఱొక క్రోఁతి కాళ్ళుపట్టుకొని వానరునిపై వైచెను.

కం. వానరులు వేయుశిలలన్, దానవులును నసురు లేయు ♦ దారుణశరసం
తానంబుల వానరులును, మానక వారించు చాజి♦మలసిరి కడిమిన్. ౬౪

అర్థములు. దారుణ = భయంకరములైన, శరసంతానంబులన్ = బాణసమూహములచే, ఆజిన్ = యుద్ధమందు, మలసిరి = సంచరించిరి.

తాత్పర్యము స్పష్టము.

తే. కొండమనుకుల దెబ్బలఁ గూలిపుడమిఁ, బడినసోఁకుల మూఁకలు♦దొడిగియున్న
బొందళంబుల పగిలిన♦సందులందు, రక్తము స్రవించె ద్రుమముల♦రసమునట్లు.

అర్థములు. కొండ మనుకులు = వానరులు, బొందళంబులన్ = కవచముల యొక్క, ద్రుమముల రసము నట్లు = చెట్లనుండి నీరుగాఱునట్లు.

తాత్పర్యము

వానరుల దెబ్బలకు నేలఁబడిన రాక్షసుల మూఁకలు దొడిగికొని యుండిన కవచములు పగులఁగా వాని సందుల నుండి చెట్లలో నుండి కాఱు నీరువలె రక్తముగాఱెను.

కం. సింధురముల దంతులచే, సైంధవముల హరులచేత ♦ క్ష్మాధరపాళీ
బాంధవరథముల రథములు, బంధురబలులైన ప్లవగ ♦ పతు లణఁగింపన్.

అర్థములు. సింధురములన్ = ఏనుఁగులను, సైంధవములన్ = గుఱ్ఱములను హరులచే = గుఱ్ఱములచేత, క్ష్మాధరపాళీ బాంధవరథములన్ = కొండలకు చుట్టములైన రథములచే.

తాత్పర్యము

ఏనుఁగులచేఁ గొట్టి యేనుఁగులను, గుఱ్ఱములచేఁ గొట్టి గుఱ్ఱములను, కొండల వంటి రథములచే రథములను గొట్టి విస్తార బలము గల వానరులు రాక్షసుల బింక మణఁచగా.

చ. తతబహుశాఖ మైన వసు♦ధారుహసంతతిఁ బూని రాక్షస
ప్రతతుల నొంప వానరులు ♦ రాక్షసులున్ విశిఖక్షురప్రభ
ల్లతతులఁ జెట్టులం బ్లవగు♦లన్ వధియింప సముత్సుకాత్ములై
క్షితిధరచారు లుగ్రగతిఁ ♦ జెండిరి తద్వివిధాస్త్రధారులన్. ౧౬-౩౭

అర్థములు. తతబహుశాఖము=వ్యాపించిన పెక్కు కొమ్మలుగల, వసుధారుహసంతతిన్ = చెట్ల సమూహమును, ప్రతతులన్=సమూహమును, విశిఖ=నేజాలయు, క్షురప్ర = అర్ధచంద్రబాణము, 'అర్ధచంద్రః క్షురప్రస్స్యాత్' అని హలాయుధుఁడు, భల్ల = బల్లెములయు, తతులన్ = సమూహములచే, క్షితిధరచారులు=వానరులు, తత్ + వివిధాస్త్రధారులన్ = ఆ నానావిధములైన యాయుధముల ధరించిన వారిని.

తాత్పర్యము

పెక్కు కొమ్మలు గల చెట్లను బూని వానరులు రాక్షసులను బాధింపఁగా రాక్షసులు నేజాలచేతను అర్ధచంద్రబాణములచేతను బల్లెములచేతను చెట్లను పటికి వానరులఁజంపఁగా నుత్సాహము గలవారై వానరులు ఆనానాశస్త్రములు ధరించిన వారిని చీల్చివైచిరి.

కం. చెండియు శాఖామృగవే,తండంబులు సమరభూమిఁ ♦ దలఁగఁగ నెటు రా
కుండఁగ జేసిరి దివిజులు, కొండాడఁగఁ బూర్వదేవ♦కుణపంబులచేన్.

అర్థములు. శాఖామృగవేతండంబులు=వానరశ్రేష్ఠులు, కొండాడఁగన్=స్తోత్రము చేయఁగా, పూర్వదేవకుణపంబులచేన్=రాక్షసశవములచే, దేవతలకు బూర్వులు కావున రాక్షసులు పూర్వదేవతలు.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులు యుద్ధభూమియం దిటునటు తిరుగ సాధ్యపడనట్లు దేవతలు స్తోత్రము చేయునట్లు రాక్షస శవములచే నేల నిండించిరి.

—♦ నరాంతకుఁడు కపులఁ దునుమాడుట ♦—

సీ. అంత నరాంతకుం ♦ డంతకాకారుఁడై, బంధురజవనాఢ్య♦గంధవాహ
బాంధవసైంధవం ♦ బారోహణము సేసి, శక్తిధరుం డయి ♦ క్ష్మాధరాట
సైన్యంబు వీానంబు ♦ జలనిధి జొచ్చిన వడువునఁ జొచ్చి పె♦ద్రాఘసమునను
శాఖామృగంబుల ♦ సప్తశతంబుల, నొక్కక్షణంబున ♦ నుక్కడంచె

తే. నెందుఁజూచిన దానరై• యేపు మీఱి,యిచ్చవిహరించునయ్యసు•రేంద్రసుతుని
మార్గమంతయు శోణిత•మాంసకర్దమితము వానరశవచయా•వృతము నయ్యె.

అర్థములు. అంతకాకారుఁడై = యమునివంటి యాకారము గలవాఁడై బంధురజవనాఢ్య=అధిక వేగసంపత్తి గలదియు, గంధవాహ బాంధవము=గాలికిఁ జుట్టమైనదియు, వేగమునందు వాయువుతో సమానమైనదియు, సైంధవమును= గుఱ్ఱమును, ఆరోహణముచేసి = ఎక్కి, శక్తిధరుఁడయి = శక్తియను నాయుధము ధరించినవాఁ డయి, శాఖామృగరాట = వానరుల, పెన్ ప్రాసమునను = పెద్ద యీఁటెచే, మీఁద శక్తిధరుఁ డని చెప్పి, యిప్పటఁ బ్రాసముతో యుద్ధము చేసినట్లు చెప్పుటచే, శక్తిప్రాసములు సమానాకారము లగుట పర్యాయముగ ప్రయోగింపఁబడెను. సప్తశతంబులన్ =ఏడునూర్లు, ఉక్కడంచెన్ = బలహీనులఁ జేసెను. చంపెను, శోణిత మాంసకర్దమితము = నెత్తురు మాంసముచే బురదగాఁ జేయఁబడినది, కర్దమితము=తారకాదిగణములోఁ జేరినది.

తాత్పర్యము

అప్పుడు నరాంతకుఁడు యముని యాకారమువంటి యాకారము గలవాఁడై మిగుల వేగము గలదై, వాయువునకు సమానమైన, గుఱ్ఱము నెక్కి శక్తిని ధరించి వానరసేనయందు సముద్రములోఁ జేఁపజొచ్చినట్లు చొచ్చి పెద్దయీఁటెచేఁ నేడు నూర్లు వానరులను క్షణములోఁ జంపెను. ఎక్కడఁజూచిన తానేయై యిష్టము వచ్చినట్లు తిరుగుచు నారావణకుమారుఁడు త్రోవయంతయు నెత్తురు మాంసముతో బురద యగునట్లు వానరుల పీనుఁగులతో కప్పబడునట్లు చేసెను.

సీ. తలపడ నెవ్వండు • తలఁచెడు నంతలోఁ, దల పడు నేల న•బ్బలిముఖునకు
వృక్షంబు శైలంబు • నెత్తెడు నంతలోఁ, దరుచరుమే నిలఁ • బొరలు చుండు
లాఘవంబున మీఁద • లంఘించునంతలో, నూర్ధ్వకాయంబొండ•యొద్దఁబడును
దృష్టిని దనవంకఁ • ద్రిప్పెడునంతలోఁ, గాలునిదృష్టికిఁ • బాలుపడును
తే. మర్కటుం డెవ్వఁడే; నిట్లు•మాఱు లేక, ప్రాసకరుఁడయి శాత్రవ•త్రాసకరుఁడు
నగుచుశుష్కాటవిదహించు•హవ్యవాహు,భంగిఁ గ్రోఁతులసేనల•పటిమఁజెఱిచె.

అర్థములు. శుష్కాటవి = ఎండిన యడవి, హవ్యవాహు భంగిన్ =అగ్ని వలె, పటిమ=దార్ఢ్యము.

తాత్పర్యము

ఎవ్వఁడు వాని నెదిరింపఁదలఁచునో యా వానరుని తల యపుడే నేలఁబడి యుండును. చెట్టో గుట్టో తనమీఁద వేయుటకు నెత్తినంతలో వాని దేహము నేలఁ బొరలుచుండును. తనమీఁద నెవ్వఁడైన దుముక యత్నించెనా వాని దేహము యొక్క పైభాగముమాత్రమే వానియొద్దఁబడును. తన్నుఁజూచుటకై తలత్రిప్పినా యంతలో నతఁడు యముని చూడఁబోయి యుండును. ఈ విధముగ నెదురు లేక

నరాంతకుఁడు ఈఁటెచేత విరోధులకు భయంకరుఁడై మండిన యడవిని గాల్చు నగ్నివలె క్రోఁతుల సేనల బలము నాశము చేసెను.

తే. వానకారున నాలుగు♦వంకలందు, విసరి విసరియుఁ బెనుగాలి ♦ వీచునట్లు
దివిజశాత్రవపుత్రనయుం డు ♦ తిరిగి తిరిగి. నన్ని వంకలఁ గీశుల ♦ హతులఁ జేసె.

తాత్పర్యము స్పష్టము.

చ. నిలువఁగ లేరు, పర్విడఁగ ♦ నేరరు, నిట్టలు లైన భీతిచే
దలఁగఁగ లేరు, వానరులు ♦ తద్దురవస్థ నరాంతకుం డనిన్
నిలిచినవారలన్ నెగసి ♦ నింగిని బ్రాఁకెడువారిఁ జాలువా
రల బలదర్ప మేర్పడ న♦రాతులఁ ద్రుంచె నొకింతమాత్రలోన్. ౧౬౭

అర్థములు. నింగిని=ఆకాశమును, అరాతులన్=విరోధులను.

తాత్పర్యము స్పష్టము.

కం. పిడుగులు పడిరొండి వడువునఁ, బటు ప్రాసపు పేట్ల నోరు♦వం జాలక పె
ల్లడలున మల్లద్రిమ్మరు లఁ, య్యెడ నాక్రోశించి రొక్క♦యెలుఁగున భీతిన్.

అర్థములు. వడువునన్ = విధముగా, ప్రాసము+పేట్లు=ప్రాసపు+వేట్లు= ప్రాసపు పేట్లు, అడలున = భయముచే, మల్లద్రిమ్మరులు = కొండలందుఁ దిరుగువారు = వానరులు.

తాత్పర్యము

• పిడుగులు పడినట్లు పడు ప్రాసము దెబ్బలకు సహింపలేక భయపడి వానరులా సమయమం దొక్కసారిగ యొక్క గొంతుగ దుఃఖించిరి.

—♦ అంగద నరాంతకుల యుద్ధము ♦—

సీ. దంభోళిధారలఁ గుంభినీధరములు, ప్రీలు నవ్విడుపున ♦ వృక్షచరులు
గూలుట గనుఁగొని ♦ కుంభకర్ణునిచేతి, బళువు వీక్షించిన ♦ ప్లవగపతులు
సుగ్రీవు నొద్దన ♦ సుఖముగా నుండిరి, భానుజుండును హరి♦సేన చెదరి
పాఱుట సోఁకుడు ♦ మీఱుట గనుఁగొని, జంభవైరి సమాన♦శౌర్య ధీరు
తే. నంగదకుమారుఁ గనుఁగొని ♦ హాయమువీఁడ
నద్ధులే కరుదెంచు ద♦శాస్య తనయుఁ
జూపి యాతఁడు మనసేన ♦ చూఱ పుచ్చెఁ
దనయ! యాతని వధియింపు ♦ దర్ప మెసఁగ. ౧౬౮

అర్థములు. దంభోళిధారలన్ = వజ్రాయుధము వాదరలచేత, కుంభినీధరములు = కొండలు, ప్రీలు = పడు, బళువు = బలము, సోఁకుడు=రాక్షసుఁడు, మీఱుట=అతిశయించుట, జంభవైరి=ఇంద్రునితో, చూఱపుచ్చెన్=కొల్లపెట్టెను.

తాత్పర్యము

వజ్రాయుధము వాదరలచే కొండలు గూలినట్లు వానరులు పడుట చూచి

కుంభకర్ణుని చేతిబలము ననుభవించిన వానరు లింకను నొప్పులచే బాధపడుచున్న వారగుటచే సుగ్రీవునొద్దనే సుఖముగా నుండిరి. సుగ్రీవుఁడు వానరసేన చెదరుటయు రావణుని కొడు కతిక్రమించి వచ్చుటయుఁజూచి యింద్రునితో సమానమైన శౌర్య వంతుఁడగు నంగదుని చూచి గుఱ్ఱముమీఁద నడ్డము లేక తిరుగు నరాంతకుని జూచి వీఁడు మనసేన కొల్ల పెట్టుచున్నాఁడు. కుమారా! వానిఁ జంపుము.

ఉ. రా జిటు లాడఁగ నతఁడు • మబ్బులు వీల్చుచుఁ దోఁచు పద్మినీ
రాజువిధంబునం బ్లవగ•రాజులనుండి నిజాంగదద్యుతుల్
రాజిల ధాతుమండితధ•రాధరమో యన నేఁగుదెంచి యా
రాజకుమారుపైఁ జనె ని•రాయుధుఁ డై నఖమాత్రశస్త్రుఁ డై. ౧౬౮౭

అర్థములు. రాజు=ప్రభువు, అంగదుఁడును దక్కిన వానర శ్రేష్ఠులవలెఁ గుంభకర్ణునిచే దెబ్బలు తినినవాఁడై యలసి యుండినను రాజాజ్ఞ కావున నతిక్ర మింపరాదని పోయెనని భావము. పద్మినీరాజు=సూర్యుఁడు, ప్లవగరాజుల నుండి= వానరశ్రేష్ఠులలో నుండి నిజాంగదద్యుతుల్ = తన బాహుపురుల కాంతులు, రాజిలన్ = ప్రకాశించు చుండఁగా, ధాతుమండిత = బంగారులోనగు లోహము లచే, మండిత=అలంకరింపఁబడిన, ధరాధరమో = పర్వతమో, నిరాయుధుఁడై = ఆయుధము లేనివాఁడై, నఖమాత్రశస్త్రుఁడై =గోళ్ళు మాత్రమే యాయుధముగాఁ గలవాఁడై.

తా త్ప ర్య ము

రాజీప్రకార మాజ్ఞ నేయఁగా నతఁడు మబ్బులు చీలఁదీసికొని కానవచ్చు సూర్యునివలె వానరుల నడుమ నుండి తన భుజకీర్తుల కాంతులు ప్రకాశింపఁగా బంగారు మొదలగు లోహములచే నలంకరింపఁబడిన పర్వతమువలె నిరాయుధుఁడై గోళ్ళు మాత్రమే యాయుధముగాఁ గలవాఁడై రాక్షసరాజు కొడుకు మీఁదికిఁ బోయెను.

ఉ. వానికి ని ట్లనున్ దనుజ•వీర్యుఁడ! ప్రాకృతకీశపాళులన్
మానక తున్మినంత బల•మా యశమా ఫలమా యెదీ భవ
న్మానిత మైనప్రాసమును • నాదు నురంబున వైచుమీ యనన్
దానవుఁ డాతనిం గని ని•తాంతరుషాకరిదగ్ధచిత్తుఁ డై. ౧౬౮౮

అర్థములు. నితాంతరుషాకరిదగ్ధ చిత్తుఁడై =మిగులఁ గోపముచేఁ గాలిన మనస్సు గలవాఁడై.

తా త్ప ర్య ము

ఇట్లుపోయి వానితో నిట్లనియె. రాక్షసశ్రేష్ఠుఁడా! సామాన్యమైన క్రోఁతి గుంపు నేలరా చంపెదవు? దానివలన నీకు బలమొచ్చెనా? కీర్తి వచ్చెనా? ఫలమేదైన లభించెనా? ఏదీచూతము? నీవు గొప్పగాఁదలఁచి యుండు నీ యీఁటెను నాఱొమ్ము

మీఁద వేయుము. అని చెప్పఁగా రాక్షసుఁడు మిగుల కోపముచే మండుచున్న మనస్సు గలవాఁడై.

కం. రదములఁ బెదవులు గొఱుకుచు, మదమున రోఁజుచును క్రౌంచ • మాడ్కి-నితారా
మదవర్ధనువక్షంబున, నదటున నడరించెఁ బ్రాస • మతిదృఢశక్తిన్. ౧౬౮౭

అర్థములు. రదములన్ = పండ్లచే, క్రౌంచమాడ్కి-ని = క్రౌంచపాము వలె, తారామదవర్ధను = తారకు సంతోషము వృద్ధిచేయువానిని, గజదానం గర్వహర్ష రేతో మృగమదా మదాః ॥నానా॥ర. అదటున=మదముచే.

తాత్పర్యము

దంతములచేఁ బెదవులు గొఱుకుచు నాగుఁబామువలె బుసలు గొట్టుచు నంగదుని ఱొమ్మున వాఁడు తన బలము కొలఁది నీఁటెను ప్రయోగించెను.

చ. అదియును వాలిపుత్రకులి • శాభమహోరముఁ దాఁకి తున్క-లై
చెదరి ధరం బోరంగఁ, గపి • సింహము దానిని గాంచి మీఁదికిన్
గొదుకక దూఁకి గుద్దమును • గ్రుద్దిన నద్ది నిమగ్నతాలువై
చిదికిన గ్రుడ్లతోఁ దెగిన • జిహ్వకతోడ విశీర్ణమూర్ధమై. ౧౬౮౮

అర్థములు. కులిశాభ = వజ్రముతో సమానమైన, మహోరము=పెద్ద ఱొమ్ము, నిమగ్నతాలువై = లోపలి కీఁప్పుకొని పోయిన దవడలు గలదై, విశీర్ణమూర్ధమై=పిచ్చలైన తల కలదై.

తాత్పర్యము

ఆయీఁటె వజ్రాయుధమువలె గట్టియైన యంగదు ఱొమ్ముదాఁకి తునకలై చెదరి భూమిమీఁదఁ బడెను. అది చూచి వానరశ్రేష్ఠుఁడు సందేహింపక వాని మీఁద దూఁకి గుద్దమును నొక్క- గ్రుద్దును గ్రుద్దఁగా నది దవడలు లోపలి కీఁప్పు కొని పోయినదై గ్రుడ్లు చిదికినదై, నాలుక తెగినదై, తల పిచ్చలై.

కం. కొండవలెఁ గూలి తత్తడి, గండడఁగిన, జూచి క్రోధ • కలుషితమతి నా
ఖండలుమనుమనితల పోఁ, కుంకును బిడికింట నొక్క-• గ్రుద్దుం గ్రుద్దెన్. ౧౬౮౯

అర్థములు. తత్తడి=గుఱ్ఱము, క్రోధకలుషితమతిన్ = కోపముచేఁ గలఁక పాఱిన మనస్సుతో, ఆఖండల=ఇంద్రుని

తాత్పర్యము

కొండవలెఁబడి గుఱ్ఱము చావఁగాఁ జూచి కోపించి యా రాక్షసుఁడు వాలి కొడుకు తలమీఁద నొక్క- గ్రుద్దు గ్రుద్దెను.

ఉ. ముష్టివిభిన్న మూర్ధుఁడుగ • మున్మరమై బహుంళోష్ణరక్తముల్
దృష్టులు పాఱకుండ దొర • లెం, బెలుమూర్ఛ మునింగి కీశుఁడున్
గష్టముమీఁదఁ దెల్వి గొని • కార్కొ-ను కిన్క-ను మండుచుం బరో
త్కృష్టపరాక్రమంబునకు • డెందము విస్మిత మూచు నుండఁగన్. ౧౬౯౦

అర్థములు. ముష్టి=పిడికిటి దెబ్బచే, విభిన్న=పగిలిన, మూర్ధుఁడుగన్ = తలగలవాఁడుగ, ముమ్మరమై = అధికమై, బహుళ=విశేషముగ, ఉద్గార క్తముల్= వేఁడినెత్తురులు, శారోచ్ఛను = దట్టమైన-అధికమైన, పరోత్కృష్ట పరాక్రమంబు నకున్=పగవాని పరాక్రమమునకు బలమునకు, డెందము=మనస్సు.

తాత్పర్యము

పిడికిటి దెబ్బచేఁ దలపగిలి విశేషముగ వేఁడినెత్తురు గారఁగాఁ గన్నులు తెఱచి చూచుటకు లేక మూర్ఛపోయి వానరుఁడు నేలఁబడి కష్టముమీఁద స్మృతి తెచ్చుకొని బలమైన కోపముతో మండుచు పగవాని యధికపరాక్రమమునకు మనస్సు ఆశ్చర్యపడుచుండఁగా.

ఉ. చివ్వన లేచి భూమిధర • శృంగనిభం బగు ముష్టిఁబూని తా
నవ్విబుధారితొమ్ము నలి • యం బొడిచెన్ రుధిరంబు కండలున్
గ్రొవ్వును మేన నిండె ధరఁ • గూలె నతండును దూలి దవ్వుగా
నవ్విబుధేంద్రువజ్రహతి • నైె విధురం బగు క్ష్మాధరం బనన్. ౧౬౫౧

అర్థములు. భూమిధరశృంగనిభంబు=కొండశిఖరము వంటిది, నలియన్= నలుగునట్లు, విధురము=పగిలినది, క్ష్మాధరము=పర్వతము.

తాత్పర్యము

చివాలున లేచి కొండ శిఖరమువలె దృఢమైన పిడికిలిచే రాక్షసుని తొమ్ము నలిగిపోవునట్లు పొడువఁగా నెత్తురు కండలు క్రొవ్వు వాని దేహమంతయు నిండెను. వాఁడును ఆ దెబ్బకు దూరముగాఁ గొట్టుకొని పోయి ఇంద్రుని వజ్రము దెబ్బచేఁ బడు కొండవలెఁ బడెను.

కం. వానరపతితనయునిచే, దానవపతితనయుఁ డిట్లు • తనువు దొలంగన్
వానరులరవము దివి దివిజానీకరవంబు బెరసి•యవఘుళి మర్యెన్. ౧౬౫౨

అర్థములు. అవఘుళము=హెచ్చు, దివిజానీకరవంబు = దేవతాసమూహ ముల ధ్వని.

తాత్పర్యము స్పష్టము.

కం. దుష్కర మగు తత్కృతిఁ గని పుష్కరకేక్షణుఁడు రామ•భూవరుఁడును శో
చిష్కేశతేజు నంగదుఁ, బుష్కలహర్షమున మెచ్చి•పొరి మన్నించెన్. ౧౬౫౩

అర్థములు. దుష్కరము=చేయఁగష్టమైనది, పుష్కరకేక్షణుఁడు=కమల ములవంటి కన్నులు గలవాఁడు, శోచిష్కేశతేజున్=అగ్నివంటి తేజస్సుగలవానిని, పుష్కల హర్షమునన్ = నిండుసంతోషముతో, పొరిన్=మిక్కిలి, మన్నించెన్= గౌరవించెను.

తాత్పర్యము స్పష్టము.

**-॰ ౭౦-వ సర్గము. అంగదుఁడు దేవాంతకమహోదర త్రిశిరులతోఁ బోరుట ॰-**

సీ. త్రిశిరోమహోదరుల్ ॰ దేవాంతకుండును, వగచి నరాంతకు॰పాటు గాంచి
యభ్రసంకాశగ॰జాధిరూఢుం డయి, యుగ్రవుఁగినుక మ॰హోదరుండు
పరిఘహస్తుం డయి ॰ గురురథస్థితుఁ డయి, దేవాంతకుండును॰ద్రిశిరుఁ డొక్క
మొగి వాలితనయునిఁ॰దెగి తాఁకి నొప్పింప,నతఁడొక ద్రుమము దే॰వాంతకాఖ్యు

తే. మీఁద వైవ దాని ॰ మేలిశరంబుల, విశసనం బొనర్చెఁ ॰ ద్రిశిరుఁ డలుక
వెండి వృక్షశైల॰వృష్టిని గురియింప, వానిఁ ద్రుంచె నతఁ డ॰వార్యబలుఁడు.

అర్థములు. వగచి=వ్యసనపడి, అభ్రసంకాశ గజాధిరూఢుండయి=మేఘముతో సమానమైన యేనుఁగు నెక్కినవాఁడై, పరిఘహస్తుండయి=గుదియ చేత ధరించినవాఁడై, గురురథస్థితుఁడయి=పెద్ద తేరియందున్నవాఁడై, తెగి=సాహసించి, ఒకమొగిన్=ఏకముఖముగా, అందఱు కలసి యొక్కటిగ, విశసనంబు=ఖండితము, అవార్యబలుఁడు=వారింపరాని బలము గలవాఁడు.

నరాంతకు పాటుగాంచి వగచి, ఇది పూర్ణవాక్యము గాకున్నను వేఱువాక్యమునకు జనకస్థానం బగుచున్నది. వగచిరి, అందు నని యన్వయింపవలెను.

భూతార్థకాసమాపకక్రియ వలయుచో వాక్యాంతరజనిస్థానం బగు, అగుచోఁ గర్త తత్కర్త లందలిదియ యొద్దియే నొండగు ప్రౌ. వ్యా. వాక్య. ౧౬ "దేవలోకంబునకుఁ బోవువా రెదుర ద్వాపరంబుతో వచ్చు కలింగని శక్రుం డిది యేమి యెందులకుఁ బోయెద వని యడిగిన, న య్యింద్రునకుఁ గలి యిట్లనియె" భార. అరణ్య. ౨ ఆ.

తాత్పర్యము

నరాంతకుఁడు చచ్చుట చూచి త్రిశిరుఁడు మహోదరుఁడు దేవాంతకుఁడు వ్యసనపడి అందు మబ్బువంటి యేనుఁగు నెక్కినవాఁడై మహాకోపముతో మహోదరుండును, గుదియ చేతఁదీసికొని దేవాంతకుండును, పెద్దరథ మెక్కి త్రిశిరుండును, ఒక్కసారిగ సాహసించి యంగదుని దాఁకి బాధింపఁగా నతఁ డొక చెట్టును దేవాంతకునిమీఁద వేయఁగా దాని గొప్ప బాణములచే త్రిశిరుఁడు ఖండించెను. కోపించి యంగదుఁడు మరల చెట్లవాన గురియింపఁగా వాఁడు దానిని ద్రుంచెను.

ఉ. త్రుంచియు దృప్తి లేక రణ॰దోహలియై త్రిశిరుండు కీశుని
న్నుంచుచు ముల్కులం దఱుమ ॰ నూల్కొని యల్ల మహోదరుండు క్రో
ధాంచితవృత్తిఁ దోమరసు॰తాడితుఁ జేసెను, నున్నవాఁడు మ
ర్దించి దృఢంబుగాఁ గుదియఁ ॰ దెప్పున దవ్వుగ దాఁటి పోయినన్. ౧౬-౧౭

అర్థములు. రణదోహలి = యుద్ధకాంక్షగలవాఁడై, నూల్కొని = పురిగొని, తోమరసుతాడితున్ = చిల్లకోలతోఁ గొట్టఁబడిన వానిని, ఉన్నవాఁడు = తక్కినవాఁడు, దేవాంతకుఁడు.

తాత్పర్యము

ఇట్లు వానిని ఖండించియుఁ దృప్తి లేక యుద్ధకాంక్ష గలవాఁడై త్రిశిరుఁడు అంగదుని బాణములచే ముంచుచు తఱుమఁగా మహోదరుం డుత్సాహము గల వాఁడై కోపించి చిల్లకోలతోఁ గొట్టెను. తక్కిన దేవాంతకుఁడు గుడియతో గట్టిగాఁగొట్టి దూరముగ దాఁటిపోయెను.

ఉ. ముగ్గురు తన్ను నీగతిని • ముట్టిన వాలితనూజుఁ డేమియున్
బెగ్గిల కాత్మ నొవ్వ కతి • వేగయుతుండు మహాజవాఢ్యుఁ డై
యుగ్గజముం దలంబున శి•రోగ్రమునం బ్రహరింప నేలపై
వ్రెగ్గుచు ఘీంకరించెఁ గను•గ్రుడ్డులు రాలఁగ మిట్టిపాటునన్. ౧౬-౧౭

అర్థములు. ముట్టినన్ = చుట్టుముట్టుకొనఁగా, బెగ్గిలక = భయపడక, తలంబునన్ = అరచేత, శిరోగ్రమునన్ = నెత్తిమీఁదఁ, ప్రహరింపన్=కొట్టఁగా, అతివేగయుతుండు = స్వభావముగనే వేగముతోఁ గూడినవాఁడు, మహాజవాఢ్యుఁడు=ఇప్పుడు విశేష వేగము గలవాఁడు.

తాత్పర్యము

ఈ విధముగ ముగ్గురు తన్నుఁ జుట్టుకొనిన నంగదుఁడు భయపడక మన స్సులో నొప్పి చెందక, ఏనుఁగు తలమీఁద వఱచేతితోఁ గొట్టఁగా నది నేలపై మోకరించి కనుగ్రుడ్లు రాలిపోఁగా మిట్టిపడి ఘీంకారము చేసెను.

ఉ. దంతివిషాణముం బెఱికి • దానవ వాలిసుతుండు మోఁదె దే
వాంతకు, వాఁడు దద్ధతిని • నాశుగధూతకుజంబుమాడ్కి నా
ద్యంతము మే న్వణంక బహు•శ్రాంతము గ్రక్కుచు నేల వ్రాలి తా
నంతయు గాసిఁ దేఱి ప్లవ•గేంద్రసుతుం బరిఘాన వ్రేసినన్. ౧౮-౧౯

అర్థములు. దంతి విషాణమున్ = ఏనుఁగు కొమ్మును, తత్ + హతిని= ఆ దెబ్బచే, ఆశుగధూతకుజంబుమాడ్కిన్ = గాలిచే నూఁచఁబడినఁ జెట్టువలె, ఆద్యంతము = తల మొదలు కాలి వఱకు, బహుశ్రాంతము=విశేషముగ నెత్తురు, పరిఘానన్ = గుదియతో.

తాత్పర్యము

ఏనుఁగు దంతము పీకి దానితోనే దేవాంతకుని కొట్టెను. వాఁడా దెబ్బతిని గాలికి వణఁకు చెట్టువలె తల మొదలు కాళ్ళ వఱకు దేహమంతయు వణఁకఁగా విశేషముగ నెత్తురు గ్రక్కుచు నేలమీఁదఁ బడి మగులఁ గష్టము మీఁదఁ దెప్ప తేల్లుకొని యంగదుని గుదియతోఁ గొట్టెను.

కం. పటు వడి మోఁకతెల్లియుఁ, బాటవమున లేచు నతని•ఫాలమువంమన్
గాటముగ నాటఁగ నిరా ఘాటతఁ ద్రిశిరుండు నై చెఁ గాండచయంబున్.

అర్థములు. మోఁకతిల్లియు = మోఁకాళ్ళమీఁద ద్రొక్కి, పాటవమునన్ = నేర్పున, బలమున, నిరాఘాటతన్ = అడ్డములేక, కాండచయంబున్ = బాణ సమూహమును.

తా త్ప ర్య ము

దెబ్బదిని ముందటికి మోఁకాళ్ళపై ద్రొక్కి నేర్పున లేచు నతని నొసటి యందు గట్టిగ నాటుకొనునట్లు త్రిశిరుండు బాణముల వైచెను.

## —• హనుమంతునిచే దేవాంతకుఁడు నీలునిచే మహోదరుఁడు చచ్చుట •—

సీ. ముప్పురు రాక్షస•ముఖ్యు లిట్లు కుమారు, నంగదుఁ దాఁకిన•యనువు దెలిసి
హనుమంతుఁడును నీలుఁ•డచటికి నరుదెంచి, రందు నీలుండు శై•లాగ్ర మొకటి
త్రిశిరునిపై వైవ • దివ్యశరంబుల, ఛేదించె నతఁడు దృ•గ్భీకరముగ
హర్షించి రేఁగి దే•వాంతకుండును గేలఁ, బరిఘంబు గైకొని • పావమాని

ఆ. పైకడంగ రాఁగఁ • బవికల్ప ముష్టిని, బొడిచెఁ గీశవరుఁడు • నడిశిరమున
దానఁ గూఁతలిడుచు•దంతముల్ వెలిరాఁగ, జిహ్వ వ్రేల మెదడు•చెదరఁ జచ్చె.

అర్థములు. అనువు = విధము, దృక్ + భీకరముగన్ = చూచుటకు భయంకరముగ, హర్షించి = సంతోషించి, రేఁగి = విజృంభించి, పావమానిన్ = హనుమంతుని, పవికల్పముష్టిని = వజ్రాయుధముతో సమానమైన పిడికిట.

తా త్ప ర్య ము

ముగ్గురు రాక్షసులు బాలుఁడైన యంగదుని దాఁకిన విధము తెలిసికొని హనుమంతుఁడును నీలుఁడు నచ్చటికి వచ్చిరి. అందు నీలుఁడు కొండశిఖర మొకటి పెఱికి త్రిశిరునిమీఁద వేయుఁగా దానిని వాఁడు దివ్యబాణములచే ఛేదించెను. దానికి దేవాంతకుఁడు సంతోషించి చేత గుదియఁ దీసికొని హనుమంతునిమీఁదఁ బడరాఁగా వజ్రమువంటి పిడికిట నడినెత్తిమీఁద, హనుమంతుఁడు పొడిచెను. ఆ దెబ్బదిని వాఁడు కూఁతలు పెట్టుచు పండ్లు బయటికిరాఁగా నాలుక వ్రేలాడఁగా మెదడు చెదరఁగా జచ్చెను.

సీ. దేవాంతకుం డిటు • దేవలోకముఁ జేరఁ, ద్రిశిరుండు నీలుపై • నిశితబాణ
వర్షంబుఁ గురియింప•నడి మహోదరుఁడును, నుగ్రశరంబుల•నురముఁ గ్రుచ్చె
వారల శరవృష్టి • వదలఁగ సందులు, సోలి ససంజ్ఞుఁడై • లీల లేచి
కుజషండమండిత•కుధరంబుఁ గొని మహో,దరు వైవ నాతఁడు • ధరణిఁ గూలె

ఆ. వజ్రనిహతమైన • వసుమతీధర మనఁ, బిన్నతింత్రిణి యట్లు • ప్రేత మైన
నంజనాతనూజు • నిం జటులాస్త్రాళిఁ, గప్పెఁ ద్రిశిరుఁ డధిక • గర్వ మొప్పఁగ.

అర్థములు. సందులు = కీళ్ళు, సోలి = మూర్ఛపోయి, ససంజ్ఞుఁడై = స్మృతి గలవాఁడై, కుజషండమండిత = చెట్లసమూహముచే నలంకరింపఁబడిన, కుధరంబు = పర్వతము.

తా త్ప ర్య ము

దేవాంతకుఁడు చావఁగా త్రిశిరుఁడు నీలునిపై వాఁడి బాణముల వాన గురి యింపఁగా వేగముగ మహోదరుఁడు తీవ్రబాణముల నురమునందు నాటుకొన నైచెను. వారల బాణవర్షముచే శిథిలపడిపోయి నీలుఁడు స్మృతి తప్పి మరల దెలివి రాఁగా నవలీలగా లేచి చెట్లతోఁ గూడిన పర్వతము తీసికొని మహోదరుపై వైవఁగా దానిచే వాఁడు వజ్రము తాఁకిన పర్వత మన నేలఁబడెను. పిన్నతండ్రి యిట్లు చావఁగా త్రిశిరుఁడు గర్వించి హనుమంతుని తళతళ చలించుచున్న బాణములచేఁ గప్పెను.

—♦ హనుమంతునిచేఁ ద్రిశిరుండు చచ్చుట ♦—

చ. గిరిశిఖరంబు నొండు గొని ♦ కేసరిసూనుఁడు వానిపైవ నా
శరుఁడు సుతీక్ష్ణబాణముల ♦ సత్వరుఁడై పొడిచేసె దాని, నీ
కరణిని వ్యర్థ మైన గిరిఁ ♦ గాంచి ధరారుహవృష్టి కొండ్రద్రి
మ్మరిమొకిమీఁడు ముంచె నది♦మధ్యమునన్ హరియించె నాతఁడున్. ౧౬౬౧

అర్థములు. కొండ్రద్రిమ్మరిమొకిమీఁడు=వానర శ్రేష్ఠుఁడు.

తా త్ప ర్య ము

కొండ శిఖర మొక దానిని దీసికొని హనుమంతుఁడు వేయఁగా రాక్షసుఁడు దాని మిగుల వాఁడియగు బాణములచే వేగముగఁ బొడిచేసెను. ఈవిధముగ వ్యర్థమై పోయిన కొండను జూచి వానర శ్రేష్ఠుఁడు చెట్లు వాన గురియింపఁగా దానిని వాఁడు ఖండించెను.

సీ. చిదుపలుగాఁ జేసి సింహనాద మొనర్ప, నంజనాసంభవుం ♦ డాగ్రహమునఁ
దెప్పున లంఘించి ♦ దితిజారిహయములఁ, గేసరి కరి వ్రచ్చు ♦ క్రీడ నొఁడ
నఖములఁ జీల్చిన♦నక్తంచరుండును, గాలరాత్రిని గూల్చు♦కాలుమాడ్కి
శక్తిని మారుత ♦ సంభవు నైచిన, నతఁడు దానిని బట్టి ♦ హతముఁ జేసె
ఆ. ఘోరశక్తి నిట్లు ♦ గూల్చిన హనుమని, మే లటంచుఁ గపులు♦మెచ్చిపొగడఁ
ద్రిశిరుఁ డధికరోష ♦ దీప్తుఁడై ఖడ్గ మంకించి వైచెఁ దాఁకఁ♦గీశునురము.

అర్థములు. చిదుపలు=తునుకలు, ఇందు 'చి' గురువుకాదు. కేసరి=సింహము వ్రచ్చు=చీల్చు, కాలరాత్రి=భయంకరమైన యొకానొక యాయుధమును, నిగుడ్చు=ప్రయోగించు, కాలుమాడ్కిన్=మృత్యుదేవతవలె.

తా త్ప ర్య ము

తునుకలుగాఁ జీల్చి సింహనాదము చేయఁగా హనుమంతుఁడు కోపించి తటాలున దూఁకి యా రాక్షసుని గుఱ్ఱములను సింహ మేనుఁగును జీల్చినట్లు గోళ్ళచే జీల్చఁగా నా రాక్షసుఁడు కాలుఁడు ప్రయోగించు కాలరాత్రివలె శక్తి యను నాయుధమును వేయఁగా హనుమంతుఁడు దానిని బట్టుకొని విఱిచివేసెను. భయంకరమైన శక్తిని బడఁగొట్టిన హనుమంతుని మేలు మే లని కపులు మెచ్చుకొని పొగడు

చుండఁగా త్రిశిరుఁడు కోపముచే మండిపడుచు కత్తి తీసికొని హనుమంతు వక్షము దాఁకవైచెను,

కం. కశ నడచిన సింహం బన, దశరథతనయాగ్రగణ్యు•దాసుం డఱచేఁ
త్రిశిరునురంబునఁ దాఁప స్వ,వశత చెడి విసంజ్ఞుఁ డగుచు•వ్రాలె ధరిత్రిన్.

అర్థములు. కశన్=కొఱడాతో, అడచిన=కొట్టిన, తాఁపన్=కొట్టఁగా, స్వవశత=స్వాధీనము, విసంజ్ఞుఁడు=స్మృతి తప్పిన వాఁడు.

తాత్పర్యము

కొఱడాచేఁ గొట్టిన సింహమో యనునట్లు రామదాసుఁ డగు హనుమంతుఁడు అఱచేతఁ ద్రిశిరుని గొట్టఁగా వాఁడు స్వాధీనము తప్పి నేలఁబడెను.

ఉ. వ్రాలెడివానిఖడ్గమును • వాయుతనూజుఁడు గుంజి యార్చె దై
త్యాళి భయాతురత్వమునఁ • నారట మొందఁగఁ దన్నినాదముం
దాళక మిట్టిపాటున వ•నాటు నురంబునఁ దాఁప ముష్టిచేఁ
గేలను దత్కిరీటమును • గేలియుపోలె గ్రహించి క్రుద్ధుఁడై ౧౬౪

అర్థములు. భయాతురత్వమునన్ = భయము వలని బాధచే, గుంజి= లాగి, తాళక = సహింపలేక, మిట్టిపాటునన్=ఎగిరి పడుటచే.

తాత్పర్యము

నేలఁ బడఁబోవువాని చేతి కత్తిని లాగి హనుమంతుఁడు రాక్షసులు భయముచే బాధపడఁగా సింహనాదము చేసెను. దానిని సహింపలేక రాక్షసుఁ డెగిరిపడి హనుమంతు ఱొమ్మును ముష్టిచే గొట్టఁగాఁ జేతితో వాని కిరీటము నాటవలెఁ బట్టుకొని కోపించినవాఁడై.

చ. గురుమకుటాంచితంబును స•కుండల మైన శిరత్రయంబు భా
స్వరకరవాలధారను ప్ర•భంజనపుత్త్రుఁడు పాకదైత్యసం
హరణుఁడు విశ్వరూపుఁ దుతు•మాడినభంగిని ద్రుంచి వైచినన్
ధరణిఁ దొరంగె నవ్వి జ్వల•నప్రతిమాయతనేత్రపంక్తితోన్. ౧౬౫

అర్థములు. గురుమకుటాంచితము = పెద్ద కిరీటముచేఁ బ్రకాశించునది సకుండలము = చెవులపోగులతో గూడినది, శిరస్త్రయంబు = మూఁడు తలలు, భాస్వర కరవాల ధారను = ధగధగ మను కత్తివాదరచే, ప్రభంజనపుత్త్రుఁడు= హనుమంతుఁడు, పాకదైత్యసంహరుఁడు=పాకుఁడను రాక్షసునిజంపిన యింద్రుడు, విశ్వరూపున్ = విశ్వకర్మ కుమారుఁడైన మూఁడు తలల విశ్వరూపుని. అవ్వి=ఆ తలలు, జ్వలన ప్రతిమ = అగ్నితో సమానమైన, ఆయత=దీర్ఘములైన, నేత్ర పంక్తితోన్ = కన్నుల వరుసతో.

తాత్పర్యము

పెద్ద కిరీటముతోఁ బ్రకాశించునవియుఁ గుండలములతోఁ గూడినవియునగు

మూఁడుతలలను హనుమంతుఁ డింద్రుఁడు మూఁడుతలల విశ్వరూపుని సంహరించి నట్లు ప్రకాశించు కత్తిచే నఱికి వేయఁగా నవి నిప్పువంటివియు దీర్ఘములు నైన కన్నులుతోడ నేలఁబడెను.

తే. సుకృతఫలసంక్షయంబున♦సూర్యమార్గ, మునను ధర వ్రాలువానిని♦బోలియసుర
నేల వ్రాలిన శాఖామృ♦గాధిపెల్లఁ, బగఱు వఱు వెత్త నార్భటుల్♦పఱఁగఁజేసె.

అర్థములు. సుకృతఫలసంక్షయంబున=ఈ లోకమున చేసిన పుణ్యముల ఫలము స్వర్గలోకములో ననుభవించిన పిదప మరల భూమిమీఁదఁ బుట్టుటకై జీవుఁడు కొన్ని దినాలు సూర్యకిరణములలోనుండి తరువాత భూమిని జేరును, ఆ విధముగ; పగఱు=శత్రువులు, ఆర్భటుల్=పెద్దధ్వనులు.

తాత్పర్యము స్పష్టము.

## —♦ ఋషభునిచే మత్తుండు చచ్చుట ♦—

సీ. దేవాంతకుండును♦త్రిశిరసుండును నరాంతక మహోదరులు యు♦ద్ధప్రచండు
లరులచే హతులైన ♦ యుధిశాగ్రహంబున, మత్తుండు శాత్రవ ♦ మాంసరక్త
ఫేనిలంబును భృశ ♦ బీభత్సమును హేమ, పట్టాన్వితము మహా ♦ పద్మసార్వ
భౌమశక్రేభ భీ ♦ ప్రదము సురక్తమా, ల్యాలంకృతంబు దీ ♦ ప్తాగ్ర మైన
ఆ. గద ధరించి కల్ప ♦ కాలసప్తార్చిసాఁ, గపుల నెగచు చుండ♦గనలి ఋషభుఁ
డెగిరి ముందు నిలువ♦నిద్ధతేజుఁడు, నిశా, చారుఁ డతని మొత్తె ♦ భూరిగదను.

అర్థములు. మత్తుఁడు=వీఁడే మహాపార్శ్వుఁడు, శాత్రవమాంసరక్త ఫేనిలంబును = మాంసము నెత్తురు నురుగు గలది, భృశబీభత్సము = మిగుల భయంకరమైనది, హేమపట్టాన్వితము=బంగారు పట్టతోఁ గూడినది, మహాపద్మ=పుండరీక మను దిగ్గజమునకు నామాంతరము మహాపద్మము, సార్వభౌమము=ఒకానొక దిగ్గజము, శక్రేభ = ఇంద్రుని గజము ఐరావతము, వీనికిని, భీప్రదము=భయము గలిగించునది, సురక్త=మిగుల నెఱ్ఱ నగు, సుమాల్య=మంచి పూలహారములచే, అలంకృతము = అలంకరింపఁబడినది, దీప్తాగ్రము=జ్వలించు మొనగలది, కల్పకాల సప్తార్చి = ప్రళయకాలమందలి యగ్నిహోత్రుఁడు, ఎగచుచున్=పాఱఁదోలుచు, కనలి = కోపించి.

తాత్పర్యము

దేవాంతక నరాంతక మహోదర త్రిశిరసులు యుద్ధమున నసాధ్యులు, శత్రువులచేఁ జావఁగా మిగులఁ గోపంబున మహాపార్శ్వుండు శత్రువుల మాంసము రక్తపు నురుగు గలదియు మిగుల భయంకర మైనదియు, బంగారు పట్టెలతోఁ కట్టులతోఁ గూడినదియు, మహాపద్మము సార్వభౌమము ఐరావత మను దిగ్గజములకు భయంకరమైనదియు, ఎఱ్ఱని పూలదండలచే నలంకరింప బడినదియు, మండుచున్న కొన గల

దియు నగు గదను ధరించి ప్రళయ కాలాగ్ని వలె నై కపులను బాఱఁద్రోలుచుండ ఋషభుఁడు కోపించి యెగిరిపోయి వాని ముందు నిలువఁగా ప్రసిద్ధమైన తేజస్సు గల యారాక్షసుఁ డతని పెద్ద గదచే కొట్టెను.

చ. బలితపుఁదద్గదాహతిని • వానరనాథుఁడు భిన్నవక్షుఁడై
 చలివి దొఱంగి నేలపయిఁ • ద్రెళ్ళి స్రవింపఁగ నోటనెత్తురుల్
 బలియుఁడు మీఁద దూఁకి ప్రస•భంబునఁ జేతిగదన్ హరించి య
 చ్చలమునఁ ద్రిప్పిత్రిప్పి వడి • శాత్రవుమూర్ధముమీఁదఁ గొట్టినన్. ౧౬౮

అర్థములు. బలితపు = బలముగల, భిన్నవక్షుఁడై = పగిలిన ఱొమ్ముగల వాఁడై, ప్రసభంబునన్ = బలాత్కారముగ, మూర్ధము మీఁదన్ = తలమీఁద.

తాత్పర్యము

బలిష్ఠమైన యా గద దెబ్బచేత కపీశ్వరుఁడు ఱొమ్ము పగిలినవాఁడై స్మృతి తప్పి నేల వ్రాలి నోట నెత్తురు కాఱఁగా మరల లేచి బలవంతుఁడు రాక్షసు మీఁద దూఁకి బలవంతముగ వానిచేత గదను గుంజుకొని, కోపముతో గిరగిర త్రిప్పిత్రిప్పి వేగముగా విరోధి తలమీఁదఁ గొట్టఁగా.

కం. తనగదచేఁ దా హతుఁ డై, ఘనశైలము వజ్రహతిని • గండడఁగు క్రియన్
 దనుజుఁడు విశీర్ణరదలోచనుఁడై వీతాసు వగుచుఁ • జనె యమపురికిన్.

అర్థములు. విశీర్ణరదలోచనుఁడై = పండ్లు కన్నులు చెదరినవాఁడై, వీతాసువు = ప్రాణము పోయినవాఁడు.

తాత్పర్యము

తన గదచేతనే తాను జచ్చి, వజ్రము దెబ్బచే పెద్ద పర్వతము పడినట్లు, దనుజుఁడు పండ్లు కన్నులు చెదరినవాఁడై ప్రాణముపోయి చచ్చెను.

కం. ఆతండు పడినతోడనె, చేతోగతిఁ బల్లటిల్లి • చెల్లాచెదరై
 భీతిగొని యానిశాటుల వ్రాతంబు పలాయనాతి•పటుతం జూపెన్. ౧౭౦

అర్థములు. పల్లటిల్లి = దుఃఖముచేఁ దాఱుమాఱై, పలాయన = పరు వెత్తుటయందు, అతిపటుతన్ = విశేష సామర్థ్యమును.

తాత్పర్యము

వాఁడుపడిన వెంటనే రాక్షసులకు మనస్సులు దుఃఖభయములచే వ్యత్యస్తములుకాఁగా వారు చెదరి వానరులకు భయపడి తమ సామర్థ్య మంతయుఁ బరు వెత్తుటయందుఁ జూపిరి.

## —• ౭౧-వ సర్గము. అతికాయుఁడు కపులఁ బాఱఁద్రోలుట •—

సీ. తనతోడఁబుట్టువుఁ • బినతండ్రులును డెగ, బ్రహ్మదత్తవరుండు • పర్వతాభ
 కాయుండు దేవతా•కాండభయాపాది, యతికాయుఁ డర్క స•హస్రనిభము

రథ మధిరోహించి • రథసంబునను జాప,విస్ఫార మొప్పఁగఁ • బేరువాడి
గర్జల వానరో • త్కర మదలించుచుఁ, దఱుమఁ జొచ్చినఁ జూచి•తరుచరాళి
తే. యసురవీరుని దేహమా•హాత్మ్య మట్టి, చూచి మఱి కుంభకర్ణుఁడే•లేచి వచ్చె
నో త్రివిక్రముఁడే యగు•నో యటంచు, మూఁకలుగఁ దీరెఁబో రెడి•భీకదఱిఁగి.

అర్థములు. పర్వతాభ కాయుఁడు=కొండతో సమానమైన దేహము గల వాఁడు, బ్రహ్మదత్తవరుండు = బ్రహ్మచే వరము లీయఁబడినవాఁడు, దేవతా కాండ = దేవతా సమూహమునకు, భయావహ = భయము కలిగించువాఁడు, అర్కసహస్రసన్నిభము – వేయిసూర్యులతో సమానము, రభసంబునను=త్వరగా, చాపవిస్ఫారము = వింటిధ్వని, పేరువాడి=పేరుచెప్పి, వానరోత్కరము = వానర సమూహమును, ద్వితీయార్థంబునఁ బ్రథమ – మూఁకలుగ = గుంపులుగ.

తాత్పర్యము

తనతోఁడఁ బుట్టినవారు పినతండ్రులును జావఁగా బ్రహ్మచేత వరములఁ బొందిన వాఁడును, కొండతో సమానమైన దేహము గలవాఁడును, దేవతలకు భయము గలిగించు వాఁడును నగు నతికాయుఁడు వేయిసూర్యులతో సమానమైన తేరిని నెక్కినవాఁడై శీఘ్రముగ వింటి ధ్వని యతిశయింపఁ బేరుచెప్పి గర్జించుచు వానరుల నదలించుచుఁ దఱుమ నారంభింపఁగా వానరు లా వీరుని పెద్దదేహముఁ జూచి కుంభకర్ణుఁడు మరల వచ్చెనేమో, త్రివిక్రముఁడే వచ్చెనో యని యచ్చ టచ్చట గుంపులు గుంపులుగ నిలఁబడిరి. కాని పరాక్రమించిన వారుగారు.

చ. పరమగు సాధ్వసంబునను • బ్రజ్ఞ చెడం జని లక్ష్మణాగ్రజున్
శరణముఁ జొచ్చినన్ నృపతి•చంద్రముఁ డా రథికున్ ధరోపమున్
గురుతరచాపహస్తుఁ గని • కూరిమవిస్మయపాటుతో వనే
చరులభయంబు దీర్చి హిత•సత్తము నిట్లను నవ్విభీషణున్. ౧౬-౨౨

అర్థములు. పరము=గొప్పది, సాధ్వసంబునను=భయముచేత, ధర+ఉప మున్=పర్వతముతో సమానుని, లక్ష్మణాగ్రజున్=అనుటచే లక్ష్మణు పురుషకా రము సూచితము. శరణు చొచ్చినన్ అనుటచే శరణాగతికి నార్తి యొక్కటియే ముఖ్యముగాని తక్కిన దేశకాలాదివిచారములు లేవనియు, వారలభయంబు దీర్చి యనుటచే ఆర్తప్రపత్తికి వెంటనే ఫలము గలుగునవియు సూచితము. సాధ్వసము నను ప్రజ్ఞ చెడి ననునది స్వరక్షణోపాయ విచారహీనత, నిర్భరత్వమును తెలిపెడిని.

తాత్పర్యము

మిగుల భయముచే ప్రజ్ఞ చెడఁగాఁ బోయి లక్ష్మణు నన్నయగు శ్రీరామ చంద్రమూర్తిని శరణు చొరఁగా రామచంద్రమూర్తి పర్వతమువలెనుండి రథముపై గూర్చుండి పెద్ద విల్లు చేతఁ బట్టుకొని యున్న వానిని జూచి యాశ్చర్యపడి వానరు

లతో మీరు భయపడవల దని చెప్పి హితులందు శ్రేష్ఠుఁడగు విభీషణునితో నిట్లనియె.

**—◆ శ్రీరాముఁడు విభీషణు నతికాయుఁ గూర్చి యడుగుట ◆—**

సీ. వీఁడెవ్వ డయ్య పృ◆థ్వీధరకాయుండు, హరిలోచనుండు చా ◆ పాయుధుండు
హయసహస్రక మైన◆స్యందనంబునఁ బ్రాస, శూలతోమర సురో◆చులు రహింప
భూతవృతుండైన ◆ భూతేశ్వరునిఁ బోలి, శంపాసమంచిత ◆ జలద మనఁగఁ
గాలజిహ్వాభ మై ◆ గ్రాలు శక్తి ధరించి, వాఁడు కాంచనపృష్ఠ ◆ నవ్యచాప
ఆ. సమితి శక్రచాప ◆ సమ మయి తేరికి, శోభ గూర్చుచున్న ◆ సొబగు గంటె
రాహు టెక్కెయంబు◆రవిరశ్మినిభశర. పంక్తి దెసలకెల్లఁ ◆ బ్రభలు గూర్చె.

అర్థములు. పృథ్వీధరకాయుఁడు = పర్వతమువంటి దేహము గలవాఁడు, హరిలోచనుండు=సింహము కన్నులవంటి కన్నులు గలవాఁడు, చాపాయుధుండు= విల్లాయుధముగాఁ గలవాఁడు, హయసహస్రకము = వేయి గుఱ్ఱములు గట్టినది, స్యందనంబునన్=తేరియందు, ప్రాస=ఈఁటెలయు, తోమర=చిల్లకోలలయు,సురోచులు=గొప్ప కాంతులు, భూతవృతుండు=పిశాచములచే లేక ప్రమథ గణములచేఁ జుట్టఁబడిన, భూతేశ్వరుని=శివుని, 'భూతేశః ఖండపరశు ర్గిరీశో గిరిశో మృడ' యని యమరము, శంపాసమంచిత = మెఱుపులతో నొప్పుచున్న, జలదము = మేఘము. కాలజిహ్వాభమై = మృత్యుదేవత నాలుకతో సమానమై, కాంచన పృష్ఠ = బంగారుతేప పొదిగిన, చాపసమితి = విండ్లసమూహము, శక్రచాప సమము=ఇంద్రధనుస్సుతో సమానము, రవిరశ్మినిభ=సూర్యకిరణములతో సమానమైన, శరపంక్తి=బాణసమూహము, ప్రభలు=కాంతులు.

తాత్పర్యము

విభీషణా! వీఁడెవ్వఁడు! కొండంత దేహము గలవాఁడు. సింహము కన్నుల వంటి కన్నులు గలవాఁడు, విల్లు ఆయుధముగాఁ గలవాఁడు. (తక్కిన వారివలె గాడనుట) వేయి గుఱ్ఱములు కట్టిన తేరిమీఁద నీఁటెలు శూలములు చిల్లకోలలు ప్రకాశింప (తక్కిన వారివలె, దీనిచే నన్ని యాయుధముల ప్రయోగమందుఁ బ్రవీణుఁడని సూచితము) పిశాచములతోఁ గూడిన శివునిబోలి, మెఱుపులతోడి మేఘమనఁగ (దేహము మేఘము, ఆయుధకాంతి మెఱుపులు) యముని నాలుక వంటిదైన (సర్వమును సంహరించునది) శక్తిని ధరించినాఁడు. బంగారుతేప పొదిగినవిండ్లు ఇంద్రచాపమువలెఁ దేరికి కాంతి కలిగించుచున్నవి. ధ్వజముపై రాహువు లిఖింపఁబడియున్నది. (రాహువు సూర్య చంద్రుల మ్రింగునట్లు తాను శత్రువుల మ్రింగువాఁడని సూచన) బాణసమూహము సూర్యకిరణముల కాంతి గలదై దిక్కులకు కాంతి గలిగించుచున్నవి.

సీ. చాపంబు త్రిణతంబు • జలదనిర్హ్రాదంబు, కాంచనపృష్ఠంబు • ప్రాంచితంబు
రథము సధ్వజము సా • రథి చతుష్కము సప, తాకానుకర్షంబు • తతరవంబు
పదియు నెన్మిది యిరు • వది తూణులును భీమ, కార్ముకంబులు మఱి • కనకవర్ణ
గుణములు శోభిల్లెఁ • గొమరుగ నిరువంక, నాయతి పదిమూర • లగుచు నాల్గు
ఆ. మూరలైన పిడులు • మొనయు ఖడ్గంబులు, గ్రాలె ధీరవర్యుఁడు • రక్తపుష్ప
గళుఁడు కాలముఖుఁడు • కాలుండు మేఘస్థ, దినకరాభుఁ డెవఁడు • ధీరవర్య!

అర్థములు. త్రిణతంబు = మూఁడు వంపులుగలది. ఇట్టి విల్లు ధరించుట బలాతిశయము సూచించును. సామాన్యములైన విండ్లెక్కుపెట్టినపుడు చక్కఁగాఁ గట్టెలవలె నుండును. ఇవి మువ్వంపు గలవై యుండును. జలద నిర్హ్రాదంబు=మేఘ ధ్వనిగలది, సారథి చతుష్కము = నలువురు సారథులు గలది, సపతాక + అను కర్షంబు = ధ్వజముతోను కోడిపీఁటతోను గూడినది, తతరవంబు = విస్తారధ్వని గలది, తూణులు = అమ్ముల పొదులు, కార్ముకంబులు=విండ్లు, మునుపు చెప్పిన వానికంటె నివి వేఱు విధమైనవి, కనక వర్ణగుణములు=బంగారు వన్నెగల యల్లె త్రాడులు, ఆయతి = పొడవునందు పదిమూరలు రక్త పుష్పగళుఁడు = ఎఱ్ఱని పూవులదండ కంఠమున ధరించినవాఁడు, కాల ముఖుఁడు=యమునివంటి ముఖము గలవాఁడు, కాలుండు = నల్లనివాఁడు, మేఘస్థ = మేఘమునందుండు, దినకరాభుఁడు=సూర్యునితో సమానుఁడు, మబ్బులోని సూర్యుఁ డనుట కాలవశమున గలిగిన కాంతిహీనత సూచించుచున్నది.

తాత్పర్యము

విల్లు మూఁడువంపులుగలది. రథము మేఘధ్వనిగలదై, బంగారు రేకు పొదిగినదై ప్రకాశముగలదై ధ్వజములు పతాకములు కోడిపీఁట నలువురు సారథులు గలదై యున్నది. అంబులపొదులు పదునెనిమిది యిరువదియున్నవి. భయంకరములైన విండ్లు బంగారు అల్లెత్రాడులుగలవు. రెండు ప్రక్కల బది మూరల పొడుగు నాలుగు మూరల పిడులు గల కత్తులు గలవు. మహాధైర్యశాలి ఎఱ్ఱని పుష్పమాల కంఠమున ధరించినాఁడు యమునివలె భయంకరమైన ముఖముగలవాఁడు. నల్లనివాఁడు. మబ్బుమాటున నున్న సూర్యునివలె నున్నాఁడు.

తే. హాటకాంగదనద్ధభు • జాళి నితఁడు, తుంగశృంగోద్ధహిమవంతు • దోయివాఁడు
కుండలంబులచే నొప్పు • కొమరు మోము, రాజిలెఁ బునర్వసువునడి • రాజువోలె.

అర్థములు. హాటకాంగదనద్ధ=బంగారు భుజకీర్తులచేఁ గట్టఁబడిన భుజములతో నితఁడు, తుంగశృంగోద్ధ = ఎత్తైన శిఖరములచేఁ బ్రకాశించు, హిమవంతుదోయి వాఁడు=హిమవంతునకు సమానుఁడు, పునర్వసువు నడిరాజు=పునర్వసువు రెండు నక్షత్రములకు నడుమనున్న చంద్రునివలె.

బంగారు భుజకీర్తులుగల భుజములతో వీఁడు ఎత్తైన శిఖరములు గల హిమవంతునితో సముఁడై యున్నాఁడు. కుండలములచే సుందరమైన వీని ముఖము పునర్వసుపునడిమి చంద్రునివలె నున్నది. వీఁ డెవ్వఁడు ?

కం. ప్లవగులు వీనిం గని భీ,వివశత గొని పఱచి రిట్టి•వీరుఁ డెవఁడో
జవము బలం బేమాత్రము, వివరింపు మటన్న నా వి•భీషణుఁ డనియెన్.

అర్థములు. భీవశతన్ =భయముచేఁ బారవశ్యమున.

తాత్పర్యము స్పష్టము.

సీ. రాజేంద్ర యితఁడు • రావణాసురునకు, ధాన్యమాలినికిని • దనయుఁ డయ్యె
రావణప్రతిముండు • రణమున శూరుండు వృద్ధసేవియు నస్త్ర•విత్తముండు
దారుణకృతి మహో•త్సాహుండు శ్రుతిధరుం, డశ్వపృష్ఠమున శ•తాంగమందు
నేనుఁగుపై నుండి • యేపున వింటను, ఖడ్గంబులను బోరఁ • గడువలంతి
తే. నయమునందును సామదా•నంబులందు, భేదమున మంత్రములను బ్ర•వీణుఁ డితఁడు
వీనిభుజబలమున లంక•విగతభీతి, నతిశయిల్లెడి నతికాయుఁ•డండ్రు పేర.

అర్థములు. రావణప్రతిముండు=రావణుతో సమానుఁడు, వృద్ధసేవియు=పెద్దల సేవచేసినవాఁడు, అస్త్రవిత్తముండు=అస్త్రము లెఱిఁగినవారిలో శ్రేష్ఠుఁడు, దారుణకృతి=భయంకర కార్యములు చేయువాఁడు, శ్రుతిధరుండు = వేద మభ్యసించినవాఁడు, అశ్వపృష్ఠమున=గుఱ్ఱము వీఁపుమీఁద, శతాంగమందున్ = తేరి యందు, వలంతి=సమర్థుఁడు, నయమునందు=నీతివిద్యయందు.

తాత్పర్యము

రామచంద్రా! యితఁడు రావణునకు ధాన్యమాలినియందు జనించినవాఁడు. రావణుతో సమానుఁడు. యుద్ధమందు శూరుఁడు. నీతి ధర్మజ్ఞానాభివృద్ధికై పెద్దల సేవచేసినాఁడు. అస్త్రముల బాగుగ నెఱిఁగినవాఁడు. భయంకరములైన కార్యములు చేయువాఁడు. మిగుల నుత్సాహము గలవాఁడు. వేదాధ్యయనము చేసినవాఁడు. గుఱ్ఱము ఏనుఁగు రథము వీనిపైనుండి కాని విల్లు ఖడ్గము వీనితోఁగాని యుద్ధము చేయుటయందు మిగుల సమర్థుఁడు. నీతిశాస్త్రమందు సామదాన భేదోపాయములందు ఆలోచనలందు మిగుల నేర్పరి. వీని భుజబలముచేతనే లంక నిర్భయముగా నున్నది. వీనిపే రతికాయుఁడు.

సీ. తపమున బ్రహ్మకుఁ•దనివిఁగూర్చినవాఁడు, క్రూరాస్త్రములను గై•కొనినవాఁడు
నమరాదిచే నవ•ధ్యత్వ మందినవాఁడు, నీ దివ్యకవచంబు • నీ శతాంగ
మజునిచేఁ గొన్నాఁడు•యక్షదానవ నిర్జ,రులఁ దోలి యసురులఁ•బ్రోచినాఁడు
పటుశరంబులఁ బాశి•పాశంబుఁ బర్వత,భేదివజ్రంబు స్తం•భించినాఁడు

తే. రాక్షసులకెల్ల మేటిధీరతుఁడు బలియుఁ, బరుష పుంగవ వానిచే దురములోన
భూజచర సేన హతమయి పోకమున్న, యతనివధియింప సమకట్టుమనెదు లోన.

అర్థములు. అమరాదిచే = దేవతలు మొదలగువారిచే. అవధ్యత్వము = చావులేమి, అజునిచే=బ్రహ్మచే, పాశిపాశంబు=వరుణుని పాశంబు, పర్వతభేది = ఇంద్రుని, స్తంభించినాఁడు = కదలకుండ నిలిపినాఁడు, సమకట్టుము = ప్రయత్నింపుము.

తాత్పర్యము

తపముచే బ్రహ్మను సంతోషపఱిచి యాయనవలనఁ గ్రూరకార్యములు చేయఁగల యస్త్రములను దేవతలు లోనగువారిచేఁ జావులేని వరములను అభేద్య కవచము ఈ రథము సంపాదించినాఁడు యక్షులను దానవులను దేవతలను దఱుమఁ గొట్టి రాక్షసుల రక్షించినాఁడు. తన గట్టి బాణములచే వరుణుని పాశమును ఇంద్రుని వజ్రమును నిలిపినాఁడు. రాక్షసులలో మిగుల బుద్ధిమంతుఁడు. బలవంతుఁడు. వీనిచేవానరులు చావకముందే వీనిని జంప యత్నింపుము. వీఁడు వానరులచేఁ జచ్చువాఁడు కాఁడు. ఇట్లు చెప్పుచుండఁగా నింతలో.

శా. జ్యాఘోషం బతిభీషణంబుగ ధరా చక్రంబు కంపింప ని
ర్వ్యాఘాతాద్భుత వేగుఁడై ప్లవగ సై న్యాబ్ధిన్ రణక్రీడనో
ల్లాఘత్వంబునఁ జొచ్చి మందరము లీలన్ హల్లకల్లోల మై
మోఘప్రాణము నై కలంగఁ, దిరుగం బోయెన్ సురారాతియున్. ౧౬౭౯

అర్థములు. జ్యాఘోషంబు = అల్లెత్రాటి మ్రోఁత, నిర్వ్యాఘాత = అడ్డములేని, అద్భుతవేగుఁడై =ఆశ్చర్యకరమైన వేగముగలవాఁడై, రణక్రీడనోల్లాఘత్వంబునన్ = యుద్ధక్రీడయందలి పటుత్వముచేత, "ఉల్లాఘో నిర్గతోగదాత్" అమరము. హల్లకల్లోలము = అల్లకల్లోలము, మోఘప్రాణము = వ్యర్థమైన శక్తి గలదై.

తాత్పర్యము

మహాభయంకరముగా నల్లెత్రాడు మ్రోయఁగా భూచక్రము వణకఁగా నడ్డములేని వేగముగలవాఁడై వానరసేన యీాది సముద్రమును మందరమువలె ప్రవేశించి యుద్ధకేళీసామర్థ్యంబున నల్లకల్లోలముచేసి యది శక్తిహీనమై కలఁత చెంద రాక్షసుఁడు తిరుగఁబోయెను. "దేహాంతరానిలే ప్రాణో జీవాత్మ పరమాత్మనోః ఆయురింద్రియ సత్వేషు ప్రణవే కార్యమర్మణి" నానా. ర.

చ. వడిఁ గుముదుండు నీలశర భద్వివిదుల్ నహామైందు లాదుఁ జె
న్నిడుగులువోలె జాల నవ సిజములన్ గిరిశృంగకోటి దం
దడిఁ బయి వైవ బాణముల దానవనాథతనూజుఁ డన్నిటిన్
బొడి పొడి చేసి తక్కుపుల భూరిశరంబులఁ గ్రుచ్చి నొంచినన్. ౧౬౮౦

అర్థములు. అవనీజములన్ = చెట్లను, దండడిన్ = విస్తారముగ.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఓరువరానినొవ్వడర • నొం డెది సేయఁగ లేక విచ్చి యా
వీరులు పాసి పోవఁ గని • వింశతిబాహుసుతుండు వారిఁ గం
ఠీరవ మోలి జింకల వ•నిన్ బెదరించెడి మాడ్కిఁ దోలుచున్
జేరఁగ వచ్చి భానుకుల•శేఖరు ని ట్లను గర్వ మేర్పడన్. ౧౬౭౧

అర్థములు. విచ్చి=చెదరిపోయి, కంఠీరవము=సింహము, వనిన్=అడవియందు.

తాత్పర్యము

సహింపరాని బాధచే వా రెచ్చటి వా రచ్చటనే చెదరిపోఁగా నతికాయుఁడు సింహ మడవిలో జింకల బెదరించినట్లు తఱుముచు రామచంద్రునియొద్దకు వచ్చి గర్వముతో నిట్లనెను.

—• అతికాయుఁడు లక్ష్మణుఁ దూలనాడుట •—

ఉ. వచ్చినవాఁడఁ జాపశర•పాణి నై,బలవిక్రమంబులన్
హెచ్చినవాఁడఁ, బ్రాకృతుల • నేయనివాఁడ, రథస్థితుండ, నీ
యిచ్చటి సేనలోన పని•సేయ సమర్థుఁడు గల్గె నేని తా
వచ్చును గాక ముంగలికి • నైశ మ టన్న సుమిత్రపుత్రుఁడున్. ౧౬౭౨

అర్థములు. ప్రాకృతులన్=సామాన్యులను, పామరులను.

తాత్పర్యము

రామా! విల్లు బాణములు ధరించి వచ్చినాఁడను. బలపరాక్రమములచే నతిశయించిన వాఁడను. సామాన్యులపై బాణము ప్రయోగింపని వాఁడను. కావుననే వానరుల బాధింపక నీ మీఁదికి వచ్చితిని. రథమునందున్న వాఁడను. ఇచ్చట నుండు నీ సేనలో నెవఁడైన నాతో యుద్ధము సేయ సమర్థుఁడు గల్గెనేని ముందరికి రానిమ్ము అనిన లక్ష్మణుఁడు.

చ. చెంగున దాఁటి శాతశర•చాపములం గొని మున్ను నిల్చి మా
తంగకరాభ హస్తమున • ధారిణిశైల దిశాబ్ధిదేవతా
ధ్వాంగణ పూరణంబుగను • జ్యారవమున్ ఘటియింప భీతమై
పొం గణఁగన్ నిజానుచర•పూగము రావణనందనుండునున్. ౧౬౭౩

అర్థములు. మాతంగ కరాభహస్తమున = ఏనుఁగు తొండము వంటి చేతితో, ధారిణి = భూమి, శైల = పర్వతము, దిశా = దిక్కులు, అబ్ధి = సముద్రము, దేవతాధ్వాంగణ = ఆకాశ ప్రదేశము, పూరణంబుగన్ = నిండునట్లు, జ్యారవము=నారిధ్వని,నిజానుచరపూగము=తన వెంటవచ్చిన భటుల సమూహము.

తాత్పర్యము

ఆమాట వాఁడనఁగానే లక్ష్మణుఁడు చివాలున వాని ముందరకు దాఁటి నిలఁ

బడి వాడి బాణములను వింటిని దీసికొని యేనుఁగు తొండమువంటి చేతులతో భూమి కొండలు దిక్కులు సముద్రము ఆకాశము నిండునట్టు లల్లెత్రాడు మీటి ధ్వని కలిగింపఁగా భయపడి తనవెంట వచ్చిన భటుల గర్వమణఁగఁగా పతికాయుఁడు.

ఉ. దానికి విస్మయంబుపడి ♦ దర్పమదాంధుఁడు గాన నిట్లనున్
మానవ! బాలకుండవు సు♦మా రణమం దవిచక్షణుండవున్
మానుము పొమ్ము కాలనిభు ♦ నన్నెటు తాఁకెదివాఁడ వీవు సుం
తేని పరాత్మశౌర్యవిధ ♦ మెంచ వదెంతటి బాలిశుండవో. ౧౬-౨౨

అర్థములు. దర్పమదాంధుఁడు=బలమదముచేఁ గన్నులు తెలియనివాఁడు, అవిచక్షణుండవు = అసమర్థుఁడవు, మానవ = మనుష్యుఁడా! ఇది యసామర్థ్యమును దెలుపఁ జెప్పఁబడెను. సుంతేని=కొంచెమైన, పర + ఆత్మ శౌర్యవిధము= ఇతరుల యొక్కయుఁ దనయొక్కయు శౌర్యవిధము, బాలిశుండవో=మూఢుఁడవో.

తాత్పర్యము

ఆధ్వని విని యాశ్చర్యపడి బలమదముచేఁ గన్నులుగానక యిట్లనెను. ఓరి మనుష్యుఁడా! నీకు పుట్టువుచేతనే మనుష్యుల దిను మాతో యుద్ధముచేయు యోగ్యతలేదు. అందుఁ బిల్లవాఁడవు. అందు యుద్ధమునందు నేర్పుచాలనివాఁడవు. ఇట్టి నీవా నాతో యుద్ధముచేయ వచ్చితివి. పోపో మృత్యువువంటి నన్ను నీవా యెదిరించి నిల్చెడివాఁడవు. నీ వెంతటి మూఢుఁడవో యెదిరి బలము నీబలము నాలోచింప లేకున్నావే.

ఉ. మామక హస్తముక్త శిత♦మార్గణ పంక్తి వడిన్ సహింపఁగా
హైమమహీధరంబు గగ♦నావను లైనను నేర వన్న నీ
వేమిటి లెక్క, లేవు తలఁ♦పేటికి నిద్రితకాలవహ్నిఁ, బో
పో మహి విల్లువైచి చెడి♦పోవకు చావకు మద్గతుండవై. ౧౬-౨౩

అర్థములు. మామక=నాయొక్క, హస్త=చేతివలన, ముక్త = విడువఁబడిన శితమార్గణ పంక్తిన్ = పదునైన బాణముల వరుస, వడిన్ = వేగముగా, నిద్రిత=నిద్ర చెందిన, కాలవహ్నిన్=ప్రలయ కాలాగ్నిని, మద్గతుండవై = నన్నుఁ బొందిన వాఁడవై.

తాత్పర్యము

నా హస్తములచే విడువఁబడిన బాణముల వేగమును సహించుటకు మేరు పర్వతమైనను సమర్థముగాదు. ఆకాశము భూమియుఁ జాలవు అనిన నీవేమి లెక్క? చల్లారిన ప్రలయకాలవహ్నిని నేల మరలఁ బురికొల్పెదవు? విల్లు పాఱవైచి పో పొమ్ము. నాయెదుటఁబడి చావకుము.

ఉ. పో నని కండకావరము ♦ పొంగున నిల్చెద వేని యిప్పుడే
ప్రాణములు వ్యజించి యమ♦పట్టణముం జనువాఁడ వౌనరా!

యీ నిశితాశుగోత్కరము • హేమపరిష్కృత మా త్రిశూలముం
బోనిది ధ్వస్త శాత్రవస•మూహమదంబును లెన్న చూడుమీ. ౧౬౦౬

అర్థములు. నిశితాశుగోత్కరము=పదునుగల బాణసమూహము, హేమపరిష్కృతము = బంగారుచే నలంకరింపఁబడినది, ఆ త్రిశూలమున్=ఆ శివునిచేతి త్రిశూలమును. ధ్వస్త = నాశముచేయఁబడిన, శాత్రవసమూహ = విరోధుల గుంపుల, మదంబును=గర్వము గలది.

తాత్పర్యము

నేను బోవని కండపొగరుచే నిలిచితివా, యిప్పుడే ప్రాణముల వదలి యమపురికిఁ బోవుదువు. ఓ మనుష్యుఁడా! బంగారు రేకులచే నలంకరింపఁబడిన ఈవాఁడి బాణ సమూహము ప్రసిద్ధికెక్కిన శివుని త్రిశూలముతో సమానమైనది. శత్రువుల మదమును నాశము చేయునది. చక్కఁగా జూడుము.

కం. ఆశీవిషములఁ బోలు మ, దాశుగములు నీదు రక్త • మాస్వాదించున్
దాశరథి క్రుద్ధ కేసరి, యాశమెయిన్ నాగరాజు • నస్రము బోలెన్. ౧౬౦౭

అర్థములు. ఆశీవిషములన్=పాములను, ఆస్వాదించున్=త్రాగును, నాగరాజ నస్రము=ఏనుఁగు నెత్తురు.

తాత్పర్యము

సర్పముల వంటి నా బాణములు నీ రక్తమును ఏనుఁగు నెత్తురు సింహము త్రావినట్లు త్రావును.

—• లక్ష్మణుఁ డతికాయు ధిక్కరించి పలుకుట •—

మ. అని నారాచము వింటఁ గూర్చఁగ సగ•ర్వాత్యుగ్రరోషోక్తులన్
విని వహ్నిప్రపవేక్షణుం డయి మహా•వీర్యుండు సౌమిత్రి యి
ట్లను వాఙ్మాత్రమునం బ్రధానుఁడవు దై•త్యా! కావు, స్వశ్లాఘ స
జ్జనుఁ డన్ ఖ్యాతియు రా దిటేటికి వృథా•జల్పంబు లీ వాడఁగన్. ౧౬౦౮

అర్థములు. నారాచము=బాణము, వహ్నిప్రపవేక్షణుం డయి=నిప్పులు వెలువరించు కన్నులుగలవాఁడై, వాఙ్మాత్రమునన్=ఉత్తమాటలచేతనే, ప్రధానుఁడవు = గొప్పవాఁడవు, స్వశ్లాఘన్ = తన్నుఁ దాను బొగడుటచే, ఖ్యాతియు = కీర్తియు, వృథాజల్పంబులు=వ్యర్థపు మాటలు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి వాఁడు బాణమును వింట సంధింపఁగా, గర్వము రోషముతోఁ గూడిన యామాటలు విని కన్నుల నిప్పులు గ్రక్కుచు మహాబలశాలి లక్ష్మణుఁడు ఓరీ! రాక్షసుఁడా! మాటలు చెప్పుటచేతనే నీవు గొప్పవాడవు కాబోవు. తన్నుఁ దాను బొగడుటచేఁ గీర్తియు రాదు. ఏల వృథా వదరెదవు?

కం. శరములు శరాసనంబును, గరములఁ గొని నిల్చినాఁడఁ • గదనము సేయన్
బిరుదంబు లాడ నేటికి?, దురితాత్మా! చూపు నీదు • దోర్బల మెల్లన్.

అర్థములు. శరాసనము = విల్లు, కదనము = యుద్ధము, బిరుదంబులు = పౌరుషపు మాటలు, దోర్బలము=భుజబలము.

తాత్పర్యము స్పష్టము.

కం. ఊరక పొగడుకొనంగాఁ, గారియమే? చూపు నీకుఁ • గల శక్తిఁ గ్రియన్
బౌరుషయుక్తుం డగు నప్పూరుషుఁడే శూరుఁ డనఁగ • భువి నెన్నఁబడున్.

అర్థములు. కారియమే=కార్యమా, ప్రయోజనము గలదా?

తాత్పర్యము

ఊరక నిన్ను నీవు పొగడుకొనిన రాఁగల లాభమేమి? మాటలు కార్యములు చేయునా? నీకుఁగల శక్తి చూపుము. కార్యములు చేయుటయందుఁ బౌరుషము చూపువాఁడే పురుషుఁడనఁబడును.

ఉ. పోఁడిమి సర్వశస్త్రములు • పూనినవాఁడవు, తేరిమీఁద ను
న్నాఁడవు, కేలఁ జాపము ఘ•నంబుగఁ బట్టినవాఁడ, వింక నీ
వేఁడిమియుం బరాక్రమము • విశ్రుతభంగిని జూపరాదె క్రొ
వ్వాఁడిలకోర్ల నేని మఱి • వాలిన యస్త్రకులాళి నేనియున్. ౬౦-౬౧

అర్థములు. పోఁడిమిన్ = అందముగాఁ విశ్రుతభంగిని = ప్రసిద్ధమగు రీతిగా, క్రొవ్వాఁడి=క్రొత్త+వాఁడి=క్రొవ్వాఁడి, క్రొత్త పదునుగల, క్రొత్తగాఁ బదును పెట్టబడిన, లకోర్ల = బాణముల—'నచ దేశ్యపదే' దేశ్యపదముల దీర్ఘాంతములు హ్రస్వములు గావను సూత్రమునకు నవలా నేజా లకోరీలు దృష్టాంతములుగా నీయఁబడినవి కాని కొన్ని శబ్దములు దీర్ఘాంతములు గాను హ్రస్వములు గాను కవులు ప్రయోగించి యున్నారు. 'హెచ్చిన బొమ్మరిండ్లఁ గడియించిన చూపు లకోరి కోలలన్ – చంద్రా – ౧ ఆ. ఇట్లులే పల్లకి – పల్లకీలు–పల్లకులు. 'అన్నవలముద్దు మోమును' విక్ర – ౫ ఆ– అనుఁగుఁ జుట్టంబైన యలవసంతుని రాక విరజాజబలు నేజ విఱుగఁజూచి – చంద్ర – ౩ ఆ.

తాత్పర్యము

ఓరీ రాక్షసుఁడా! యలంకారముగ సర్వశస్త్రములు దేహమునిండ ధరించితివి. నాకొక్క విల్లు తప్ప వేఱాయుధము లేదు. నీవు తేరిమీఁద నున్నాఁడవు నేను నేలమీఁద రెండుకాళ్ళ నిలఁబడినాను. శస్త్రములే గాక చేత విల్లుకూడఁ బట్టినావు. నీ బాణములు క్రొత్తగా పదును పెట్టఁబడినవి. నావి ప్రాతవి. ఇంతయనుకూల్యము నీకుండియు నీ తీవ్రత యెంతో పరాక్రమ మెంతో నలుగురు మెచ్చునట్లు బాణములచే నైనను అస్త్రములచే నైనను జూపరాదా! వ్యర్థముగా నేల వదరెదవు?

కం. ఖండనమున నీకుంగల, గండెల్ల నెఱింగి పిదప ♦ గ్రామ్యాలైదరనీ
కాండంబుల నీశిరముం, బండిన పెనుఁదాటిపండుఁ♦బడనడఁచవోలెన్. ౧౬౯ ౨
అర్థములు. గండు = మగతనము.

తాత్పర్యము స్పష్టము.

యుద్ధమునందు నీ వెంత మగతనము గలవాఁడవో తెలిసికొని యీ పిదప గాలి తాటిపండును నేలఁ బడఁగొట్టినట్లు నా బాణములచే నీ తలఁ బడఁగొట్టెదను.

కం. కనియెదవు గాక మామక, సునిశితశరపాళి స్వర్ణ♦సుందరము భవ
త్తనుగతరుధిరము శరశ,ల్యనిచయకృత మార్గములన♦నాస్వాదింపన్. ౧౬౯ ౩
అర్థములు. మామక సునిశిత శరపాళి=నా పదునైన బాణసమూహము, స్వర్ణసుందరము=బంగారుచే నందమైనది, భవత్ = నీయొక్క, తనుగత = దేహమునం దుండు, రుధిరము = నెత్తురు, శరశల్య = బాణముల ములుకుల సమూహములచే, కృత = చేయఁబడిన, మార్గములను = త్రోవల, ఆస్వాదింపన్ = త్రావఁగా.

తాత్పర్యము

బంగారుచే నందమైన నా పదునుగల బాణములు ఇనుప కొనల ములుకులచేఁ జేయఁబడిన మార్గములలోఁ బోయి నీ దేహమందలి నెత్తురు త్రావఁగా నీవే చూడఁగలవు.

ఉ. బాలుఁడవంచు నన్నసుర♦వర్యుఁడ! హేళన మేల సేయు? నే
బాలుఁడనో జరుండనో ర్భుఁ♦నం బిది నమ్ముము నీకు మృత్యువన్
బాలుఁడు గాదె వామనుఁడు ♦ బాలిశ! మూఁడు జగంబు లోలిఁ దా
హేలిఁ ద్రివిక్రమక్రమత ♦ నాఁచి కొనండె జగం బెఱుంగఁగన్. ౧౬౯ ౪
అర్థములు. హేళనము = పరిహాసము, జరుండనో = ముసలివాఁడనో, త్రివిక్రమక్రమత=మూఁడడుగులుంచు క్రమముచేత, క్రమము = అడుగులు పెట్టు, "శక్తౌ చరణవిక్షేపే పరిపాట్యామపి క్రమమ్ ॥నానా॥ ర.

నేను బాలుఁడనని నన్నేల పరిహసించెదవు? నేను బాలుఁడనో వృద్ధుఁడనో యెవఁడనైన నగుదును గాక! నీకేమో మృత్యువనే. మూఢుఁడా! వామనుండు బాలుఁడు గాఁడా! ప్రపంచమునంతయు మూఁడడుగులకు లోపఱుచుకొనలేదా? వయసుగాదు ప్రధానము. కొండ యెంతది? పిడుగెంతది?

—♦ లక్ష్మణాతికాయుల యుద్ధము ♦—

సీ. అని పల్కి నతికాయుఁ♦డతిరోషనశుఁడయి, తీవ్రాశుగమును సం♦ధించె వింట
వారల యుద్ధంబుఁ ♦ బరికింప మింటను, ఖచరదేవర్షులు ♦ గములుగట్టి
రసురుండు లక్ష్మణు♦నాశీవిషోపమాం,బకమున దివి ద్రుంగు ♦ భంగిసైచెఁ
సౌమిత్రియును నర్ధ♦చంద్రశరంబుల, ఖండించి వైచెఁ ద♦త్కాండవరము

ఆ. కృత్తభోగఫణిసదృక్ష బాణముఁ గొంచి, పంచవిశిఖములను ♦ బరఁగఁ జేసె
వసురథ ర్తతనయుఁ ♦ దవియెల్ల రామాను,జుండు చేరకుండఁ ♦ జెండి వైచె.

అర్థములు. ఆశీవిషోపమానాంబకమునన్=పాముతో సమానమైన బాణముచే, కృత్తభోగ = నఱకఁబడిన దేహముగల, ఫణిసదృక్ష=పాముతో సమానమైన, బాణమున్=బాణమును.

తాత్పర్యము

లక్ష్మణుఁ డీ ప్రకారము చెప్పఁగా నతికాయుఁడు మిగులఁ గోపించి తీక్ష్ణ బాణమును వింట సంధించి వైచెను. వారి యుద్ధము చూచుటకు ఖచరులు దేవర్షులు మింట గుంపులు గట్టిరి. అతికాయుఁడు లక్ష్మణుని సర్పముతో సమానమైన బాణమును వైవఁగా నది యాకాశమును గ్రమ్ముగు విధమున రాఁగా దానిని లక్ష్మణుఁ డర్ధచంద్ర బాణమున ఖండించెను. దేహము పోయిన పామువంటి బాణమును జూచి మరల నైదు బాణములను బ్రయోగించెను. లక్ష్మణుఁడు వానినెల్ల ఖండించెను.

ఉ. అంతటఁ బోక హేతిసహి♦తానలతుల్యపృషత్క మొండు క
ర్ణాంతము సోఁక లాగి యమ♦రాహితుఫాలముఁ గాఁడ వైవఁగా
నెంతయు నెత్తుటం దడిసి ♦ యేర్పడి యా శర మొప్పె భూరిశై
లాంతగతోరగం బనఁగ ♦ నాతని మోమునఁ జిత్రభంగిగన్. ౧౬౬

అర్థములు. హేతిసహిత=జ్వాలతోఁ గూడిన, అనల=అగ్నితో, తుల్య=సమానమైన, పృషత్కము = బాణము, కర్ణాంతము = చెవికొన, అమరాహితుఫాలము = రాక్షసుని నొసలు, భూరిశైలాంత గతోరగంబు = పెద్ద పర్వతము కొనను (శిఖరమును) పొందిన పాము.

తాత్పర్యము

అతికాయుని బాణములు ఖండించుటయేగాక జ్వాలతోఁ గూడిన యగ్నివంటి బాణమొకటి చెవికొనవఱకు లాగి రాక్షసుని నొసట నాటునట్లు వేయఁగా నది పెద్ద కొండశిఖరమందున్న పామువలె నతని ముఖమునందు నొప్పెను.

కం. ఆ శరము తాఁకుపెట్టున, కాశరముఖ్యుండు సైఁప ♦ కాకంపించెన్
శ్రీశంకరశరహతకీ, నాశపురద్వార మనఁగ ♦ నాకులు పొంగన్. ౧౬౭

అర్థములు. ఆ శరము తాఁకుపెట్టునకు=ఆ బాణముతగిలిన దెబ్బకు, ఆశరముఖ్యుండు = రాక్షసశ్రేష్ఠుఁడు, ఆకంపించెన్=దేహమంతయు వణఁకెను, శ్రీశంకర శరహత=శ్రీ శివుని బాణముచేఁ గొట్టఁబడిన, కీనాశ పురద్వారము = రాక్షస పురములద్వారము, నాకులు = దేవతలు.

తాత్పర్యము

ఆ బాణము తగిలిన దెబ్బకు ఆ రాక్షసుఁడు సహింపలేక త్రిపురాసుర సంహార

సమయమున శివుని బాణము దెబ్బకు రాక్షసుల పురద్వారమువలె దేవతలు సంతో
షింపగా వగిలెను.

సీ. ఆ యేటు వడి యసు•రాధిపపుత్రుండు, చింతించి తన్నాశ్వ•సించి కొనుచుఁ
 గర్తవ్యము విమర్శ•గావించి లక్ష్మణుఁ, గాంచి యిట్లాను న•క్కడిమికాఁడు
 మేలు నా యరివైన • మెచ్చితి నీ బాణ,శక్తి లాఘవము రా•జన్యతిలక
 యని శిరంబును వంచి•హాస్తంబులను గ్రిందఁ, మోపి రథస్థుఁడై •యేపు మెఱసి
తే. యిచ్చకోలఁదిని సమరోర్వి • హెచ్చి తిరుగు
 చొకటి మూఁడైదు నేడును • నుగ్రశరము
 లెపఁగి గైకొని సంధించి • యిాడ్చి వైచెఁ
 బుంఖహాటకకాంతులు • పుడమి నిండ.

అర్థములు. కర్తవ్యము=చేయవలసిన కార్యము, విమర్శగావించి = ఆలో
చించి, కడిమికాఁడు = బలవంతుఁడు, అరివైనన్ = శత్రువైనను, పుంఖహాటక
కాంతులు = పింజల బంగారు కాంతులు.

తాత్పర్యము

ఆ దెబ్బదిని యతికాయుఁడు తనలో విచారపడి మరల సమాధాన పఱచి
కొని చేయవలసినపని యాలోచించి లక్ష్మణుఁజూచి యా బలశాలి యిట్లనియెను.
లక్ష్మణా ! నీవు నా పగవాఁడవైనను నీ బాణశక్తియు ప్రయోగించు వేగమును
మెచ్చుకొంటిని యని తలవంచి చేతులుమోపి మరల వానిని స్వాధీనముపఱఁ దెచ్చు
కొని రథము మిాఁదనుండి తన యిష్టము వచ్చినట్లు లొకచోట నిలువక తిరుగుచు
నొకటి-మూఁడు-నైదు-ఏడుగా బాణములను సంధించి యిాడ్చివేయఁగా వాని
పింజల బంగారుకాంతులు దెసల నిండెను.

ఉ. ఒక్కటి దక్కఁ గుండ నృకు•లోత్తముఁ డన్నిటిఁ జెండివైచెఁ దాఁ
 జెక్కుశరంబు లొక్కమొగిఁ • జే రలుక న్నిగిడించి యేమియున్
 స్రుక్కక సంభ్రమంపడక • సూరకులాగ్రణి యిట్లు నిగాటేనన్
 గ్రక్కుచు నిప్పు లయ్యసుర•కాండ మొకొండు స్తనాంతరంబునన్. ౮౬-౮౭

అర్థములు. ఒక్కటి తక్కఁగుండన్ = ఒక్కటి యైనను దప్పిపోకుండ,
సూరకులాగ్రణి = సూర్యవంశము వారిలో శ్రేష్ఠుఁడు, స్తనాంతరంబునన్ =
ఱొమ్మున.

తాత్పర్యము

వాఁడు వేసిన వారిలో నొక్కటి యైనను వదలిపెట్టక యా రాజశేఖరుఁ
డన్నిటిని ఖండించెను. తా ననేక బాణములు ప్రయోగించినను కొంచెమైన నొప్పి
చెందక తొట్రుపడక లక్ష్మణుఁడు విజృంభింపఁగా జూచి నిప్పులు గ్రక్కుచు
నా రాక్షసుఁ డొక్క బాణము ఱొమ్మున.

తే. కీలుకొల్పిన నెత్తురుల్•జాలువాఱె, మ త్తదంతావళీ విముక్త • మదజల మన
లక్ష్మణవిభుండు దద్వ్యధ•లక్ష్య మిడక, శాతనారాచ మొక్కటి•సంగ్రహించి.

అర్థములు. కీలుకొల్పినన్=నాటవేయఁగా, మ త్తదంతావళీ విముక్తమదజలమనన్=మదించిన యేనుఁగు విడిచిన మదపునీటివలె, శాతనారాచము = పదునైన బాణము, సంగ్రహించి=తీసికొని.

తాత్పర్యము

నాటవేయఁగా మదపుటేనుఁగు నుండి మదజలము కాఱునట్లు నెత్తురు కాలువఁగా బాఱెను. లక్ష్మణుఁడు దానిని లక్ష్యపెట్టక పదునైన బాణమొకటి తీసికొని.

సీ. పావకమంత్రానఁ•బ్రజ్వలింపఁగఁ జేసి, గుణమునఁ గూర్పఁగఁ•గుటిలచరితుఁ
డధిక వేగమున సౌ•రాస్త్రము సంధించె, నిరువురుఁ దెగఁదీసి•యేయుటయును
నవి దాఁకి యొండొంటి • నంబరంబునఁ గ్రుద్ధ, భూరిభోగులభంగిఁ•బోరి పోరి
యొక్కొటి నొక్కొటి • నురువు లేకుండఁగ, భస్మీకృతంబులై • పడియె నేలఁ

ఆ. దనమహాస్త్ర మిట్లు • దగ్ధమై పోవ నై, షీకమెత్తి యసుర • చిమ్ముటయును
నంబుజాక్షుపంక్తిఁ • నైంద్రబాణంబున, దాని హతముఁ జేసె•దర్ప మెసఁగ.

అర్థములు. గుణమునన్=అల్లెత్రాటియందు, కుటిలచరితుఁడు=మోసపు నడవడి గలవాఁడు, భూరిభోగులభంగిన్=పెద్ద పాములవలె, ఉరువు = రూపము, భస్మీకృతంబులై=భస్మము చేయఁబడినవై.

తాత్పర్యము

ఆగ్నేయమంత్రమున మంత్రించి యల్లెత్రాటఁ గూర్పఁగా మోసపు నడవడిగల రాక్షసుఁడు సౌరాస్త్రము సంధించెను. ఇద్దఱు నారిలాగి విడిచిరి. అవి యొకటొకటి యాకాశమునఁ బెనుబాములవలె కొట్లాడి కొట్లాడి తుదకు భస్మమై రూపుమాసిపోయెను. తన మహాస్త్ర మిట్లు దగ్ధమైపోవఁగా నతికాయుఁడు ఐషీక బాణమును వైచెను. దానిని లక్ష్మణుఁ డైంద్రాస్త్రమున ఖండించెను.

కం. ఐషీకం బీగతి, నిశ్శేషంబుగ, జెడిన దనుజ • శేఖరుఁడు మహా
రోషంబున యామ్యాస్త్రము, భీషణముగ వైచె నసుర•భీకరుమీఁదన్.

తాత్పర్యము

ఐషీకాస్త్రము నిశ్శేషముగఁ జెడిపోఁగా నతికాయుఁడు మిగుల రోషంబున యామ్యాస్త్రము ప్రయోగించెను.

కం ఆ యామ్యశరవిజృంభణ, వాయుశరంబున సుమిత్ర • పట్టియుఁ దఱుఁగన్
జేయుచు శరవర్షం బతి,కాయునిపైఁ గురిసెఁ దెఱపి•గానక యుండన్. ౧౭౦౩

తాత్పర్యము

ఆ యామ్యబాణము నుద్రేకమును లక్ష్మణుఁడు వాయవ్యబాణమునఁ జెఱచుచు బాణవర్షంబును దెఱపిలేకుండ నతికాయునిపైఁ గురిసెను.

ఉ. ఆమహితాశుగోత్కరము • లాతనిఁ దాఁకుచు మిట్టిపాటునన్
భూమిని వ్యర్థమై తొరఁగ • భూవరపుత్త్రకుఁ డుగ్రమూర్తియై
యేమియుఁ దీవ్రతన్ విడక • యేసె మహాంబకముల్ సహస్రముల్
భూమిదొరంగె నవ్వియును • బొల్పతిఁ ద్రుంప కవధ్యవర్మునిన్. ౧౭౨౪

అర్థములు. మహితాశుగోత్కరము = గొప్ప బాణముల సమూహము, మిట్టిపాటునన్ = ఎగసిపడుటచే, అవధ్యవర్మునిన్ = భేదింపరాని కవచము గల వానిని.

తాత్పర్యము

ఆయన వేసిన మహాబాణము లన్నియు నతికాయుని దాఁకి యెగిరి యావలఁ బడెనే కాని యొకటియైన దేహమున నాటలేదు. ఇట్లు తన బాణములు వ్యర్థమై నేలఁబడినను విడువక భయంకరాకారుఁడై వేగమును గొంచెమైనఁ దగ్గింపక వేల కొలఁది గొప్ప బాణములు వైచెను. అవి యభేద్యకవచము గల యతనిని చంపక వ్యర్థమై పడెను.

—• లక్ష్మణుచే అతికాయుండు చచ్చుట •—

సీ. బాణ మొక్కండైనఁ • బలలాశు బాధింపఁ జాలక, యున్న లక్ష్మణుఁ జేరి
పవనుఁ డిట్టను వీఁ డవధ్యతనుత్రాణుఁ, డజునివరం బది • యణఁపరాదు
బ్రహ్మాస్త్రమున వీఁడు • వధ్యుండు తక్కిన, యే విశిఖంబునఁ • జావఁ డాజి
వరలబ్ధకవచుండు • పరమాస్త్రసంవేది, బలియుఁ డీతం డిటు • లలఁతిఁ బోఁడ
ఆ. టన్న లక్ష్మణుండు • నసమానవీర్యుండు, శ్వసనుమాటఁ బట్టి • చాపమునను
బ్రహ్మశరముఁ గూర్చ • భాస్కరచంద్రగ్ర, హోర్వి దిఙ్నభంబు • లుదిలఁ గొనియె.

అర్థములు. పలలాశున్ = రాక్షసుని, పవనుఁడు = వాయుదేవుఁడు, అవధ్యతనుత్రాణుఁడు = భేదింపరాని కవచము గలవాఁడు, వధ్యుండు = చంపఁబడు వాఁడు, వరలబ్ధకవచుండు = వరముచే సంపాదించిన కవచము కలవాఁడు, పరమాస్త్రసంవేది = గొప్ప యస్త్రములన్నియుఁ దెలిసినవాఁడు, బలియుఁడు = బలవంతుఁడు, అలఁతిబోఁడు = కొంచెములోఁ బోవువాఁడు కాఁడు, శ్వసను = వాయువుయొక్క, భాస్కర = సూర్యుఁడు, చంద్ర = చంద్రుఁడు, ఉర్వి = భూమి, దిక్ = దిక్కులు, నభంబు = ఆకాశము, ఉదిలఁగొనియె = పరితపించెను.

తాత్పర్యము

ఒక్క బాణమైనను రాక్షసుని బాధింపలేకుంటఁ జూచి వాయుదేవుఁడు లక్ష్మణు సమీపించి యిట్లనియె. వీఁ డభేద్యకవచుఁడు, అది బ్రహ్మవరము తప్పదు. వీఁడు బ్రహ్మాస్త్రమునఁ జచ్చును. తక్కిన యే బాణము వీనిని జంపఁజాలదు. ఏలన వీని కవచము వరముచే సంపాదింపఁబడినది. అది బాణములచేఁ దెగదు. ఇఁక నస్త్రము లందమా? అన్ని మహాస్త్రములు వీఁ డెఱుఁగును. నీవే యస్త్రము వేసి

నను బదులస్త్రము వేయును. బలవంతుఁడు కావున నల్పప్రయత్నముతోఁ బోవు వాఁడు కాఁడు, అని చెప్పఁగా అసమానబలము గల లక్ష్మణుఁడు వాయుదేవుని మాట గ్రహించి వింట బ్రహ్మాస్త్రమును సంధింపఁగా సూర్యచంద్రగ్రహాభూములు దిక్కులు ఆకాశము పరితపించెను. 'వ్యాహో ప్రాస్వ'యని,'ఉర్వి' ప్రాస్వాంతముగాఁ బ్రయోగింపఁ బడెను.

కం. యమకింకరసన్నిభమై, యమలసుపుంఖంబు నై సాయక శరము సమో
 ఘమహావేగము నై చెను, విమతునిపై నదరు లుమియ ♦ వీరుం డలుకన్.

అర్థములు. యమకింకర సన్నిభము = ప్రాణము తీయుటయందు యమ కింకరులతో సమానము, అమల = నిర్మలమైన, సుపుంఖము = మంచి పింజగలది, అమోఘమై=వ్యర్థము గానిదియు, మహావేగము=మిగుల వేగముగలది, విశేషణో ణయపదము, విమతునిపై=విరోధిమీఁద, అదరులు=మిణుఁగురులు.

యమకింకరులవలెఁ బ్రాణము తీయునదియై నిర్మలమైన మంచిపింజ గలదై వ్యర్థము గానిదై, మిగుల వేగము గలదగు నా శరము నిప్పులు గ్రక్కుచుండఁగా శత్రువుమీఁద వీరుఁడగు లక్ష్మణుఁడు కోపముతో నైచెను.

సీ. దానివచ్చుటఁ గాంచి ♦ దారుణశరములఁ, బెక్కట నతికాయుఁ ♦ డుక్కు మిగిలి
 పరఁగింప వానిని ♦ భస్మీకరించుచుఁ, దనుఁజేరశక్తిగ ♦ దాకుఠార
 శూలహలాదుల ♦ శూరుండు వ్రేచిన, నడుగక యవ్వాని ♦ యుదుటు మాన్చి
 మణికిరీట ప్రభా ♦ మండిత శిరమును, సశిరస్త్రముగఁ గూల్చె ♦ క్ష్మాతలమున
ఆ. హిమధరాధరంబు ♦ శృంగంబువడువున, నతనిశిరము ధరణిఁ ♦ బతిత మైన
 నిహతశేషులైన ♦ నిశిచరుల్ దీనులై, యేమ్ప మోము లోప్ప ♦ నెల్లవారు. ౧౧౦

అర్థములు. దానివచ్చుట = అదివచ్చుట, "ధాతుజ విశేషణ భావార్థక పూర్వావ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱచుగ నొక్క షష్ఠియగు, ప్రౌ. వ్యా. కారక. సూ. ౧౫. భస్మీకరించుచున్ = బూడిదగాఁజేయుచు, హలా దులన్ = హలము = కొనలు తిరిగి రెండేసి కత్తులు కొనలందుఁ గల యాయుధ విశేషము; 'హలకం ద్విపల పత్రాగ్ర' మ్మని వైజయంతి, వ్రేచినన్=కొట్టినను, ఉదుటు=గర్వము, మణికిరీట ప్రభామండిత శిరమును = రత్నమును చెక్కిన కిరీట కాంతులచే నలంకరింపఁబడిన తలను, సశిరస్త్రముగన్=తలకుదెబ్బ తగులకుండ రక్షించుతలకవచము(టోపీవంటిది)హిమధరాధరంబు=హిమవత్పర్వతముయొక్క, శృంగంబు=శిఖరము, నిహతశేషులు=చావఁగా మిగిలినవారు.

తాత్పర్యము

అదివచ్చుట చూచి యతికాయుఁడు భయంకరములైన యనేక బాణములచే బలముకొలఁది ప్రయోగింపఁగా వానినెల్ల కాల్చివైచుచుఁ దనమీఁదికి రాఁగా శక్తి

గద, గొడ్డలి శూలము హలము మొదలగు నాయుధములచే నారూరుండు కొట్టి నను వది వాని శిరస్సును తల కవచముతోడ నేలఁగూల్చెను. హిమవత్పర్వత శిఖరము వలె నతని తల నేలఁబడఁగా ఛావఁగా మిగిలిన రాక్షసులెల్ల వారు దుఃఖితులై యేడ్పుముఖములతో.

కం. అమితప్రహారజనిత, శ్రములై వాపోవుచుం బుఁరంబు ముఖముగా
 సమరాభిలాష వీడి భ,యమునం బరువిడిరి క్రోఁతు • లతిమెడి ననుచున్.

అర్థములు. అమిత ప్రహార జనితశ్రములై = మితి మీరిన దెబ్బలవలన కలిగిన బడలిక గలవారై, వాపోవుచున్ = ఏడ్చుచు, సమరాభిలాష = యుద్ధమందలి కోరిక, అతిమెడిని=పైబడునని.

తాత్పర్యము

వానరులు కొట్టిన మితిలేని దెబ్బలచే గాసిపడి యేడ్చుచు యుద్ధమందలి కోరిక వదలి యిఁక నిందుండిన వానరులు పైబడి చంపుదు రని భయపడి యూరి ముఖముగాఁ బరువెత్తిరి.

కం. వికచాననులగుచుం ద్వర,నకలవనేచరులు వచ్చి•సౌమిత్రిని హ
 ర్షకలితహృదయంబులతోఁ, బ్రకటగతిం బూజ చేసి•ప్రణుతించి రటన్.

అర్థములు. వికచానను లగుచున్ = సంతోషముచే వికాసమొందిన ముఖములుగలవారై, ఇట్లు చెప్పుటచే నీ రాక్షసుఁ డసాధ్యుఁడుగా నున్నాఁడే యుద్ధ పర్యవసాన మెట్లగునో యని సందిగ్ధ మనస్కులై యుండిరని భావము. హర్ష కలిత హృదయంబులతోన్ = సంతోషముతోఁ గూడిన మనస్సులతోఁ, ప్రణుతించిరి = స్తోత్రము చేసిరి.

తాత్పర్యము

వానరు లందఱు వికసించిన మోములు గలవార లగుచు శీఘ్రముగ సంతోషము గల మనస్సులతో వచ్చి లక్ష్మణుని గౌరవించి స్తుతించిరి.

**—• ౭౨-వ సర్గము. అతికాయాదులమృతి విని రావణుఁడు దుఃఖించుట •—**

కం. అహితాంతకుఁ డగు లక్ష్మణు, మహితశరంబులను బేరు•మాయఁగ సంయ
 న్మహి నతికాయునిమృతి విని, బహుళవ్యథ రావణుండు • పనవుచు ననియెన్.

అర్థములు. అహితాంతకుఁడు = శత్రుసంహారము చేసినవాఁడు, మహిత శరంబుల = గొప్ప బాణములచే, సంయత్ + మహిన్ = యుద్ధభూమియందు, పనవుచున్ = ఏడ్చుచు.

తాత్పర్యము

శత్రుసంహారకుఁడగు లక్ష్మణుని గొప్ప బాణంబులచే నతికాయుఁడు యుద్ధ భూమియందుఁ జచ్చెనని రావణుఁడు విని మిగుల దుఃఖముచే నేడ్చుచు నిట్లనెను.

సీ. ధానుష్కరత్నంబు•దారుణకోపుండు, ధూమ్రమాత్యుఁ డకటా•కూలి పోయె
నిస్తులవీర్య ప్ర•శస్త ప్రహస్తుండు, కాలునివాకడి • కండయయ్యె
సముదీర్ణ భుజపరా • క్రమ సువిదీర్ణ ది,గ్గజకుంభుఁ డల కుంభ • కర్ణుఁ డేఁడి ?
హతుఁ డయ్యెనే దేవ•తాసుర సైన్యావి, కంపనుం డైన య • కంపనుఁడు
తే. వీరలెల్ల రసామాన్య•వీర్యయుతులు, దోర్బలాఢ్యులు నాహవ•దోహలులును
శత్రుసైన్యప్రధర్షణుల్•సాహసికులు, కటకటా కూలిరే రాము•కాండములను.

అర్థములు. ధానుష్కరత్నంబు = ధనుస్సు పట్టెడి వారిలో శ్రేష్ఠుఁడు, దారుణకోపుండు=శత్రువులయందు భయంకర కోపము గలవాఁడు, నిస్తులవీర్యప్రశస్త ప్రహస్తుండు = అసమానమైన బలముచేఁ బొగడ్త గనిన ప్రహస్తుఁడు, కాలుని=యముని, వా=నోటి, కడికండ=అన్నపుముద్ద, సముదీర్ణ = మిగుల నధికమైన, భుజపరాక్రమ = బాహుపరాక్రమముచే, సువిదీర్ణ=చక్కఁగాఁ జీల్చబడిన దిగ్గజ = దిక్కులయందలి యేనుఁగుల, కుంభుఁడు = కుంభస్థలములు గలవాఁడు, దేవతాసురసైన్య = దేవతలయు అసురులయు సైన్యములచే, అవికంపనుఁడు = కదలింపఁబడనివాఁడు, దోర్బలాఢ్యులు = భుజబలసంపత్తి గలవారు, ఆహవ దోహలులు=యుద్ధమనిన సంతోషపడువారు, శత్రుసైన్య ప్రధర్షణుల్= విరోధుల సేనల నణఁచువారు, రాము కాండములను = రాముని బాణములచే, ఇందుఁ జెప్పఁబడిన వారిలోఁ గుంభకర్ణుఁడు తప్పఁ దక్కినవారు రామునిచేఁ జచ్చినవారు కారు. కాకున్నను భటులు చేసిన కార్యము ప్రభువు చేసినట్లు చెప్పఁబడును గావున నిట్లు చెప్పఁబడెను రాజింటనుండి భటులు దూరదేశమున శత్రువుల జయించినను ప్రభువు జయించినట్లే చెప్పఁబడును. శరీరముచేయు కార్యములు ఆత్మ చేసినట్లు కదా చెప్పుదురు.

## తాత్పర్యము

విల్లుపట్టెడి వారిలో శ్రేష్ఠుఁడును తీవ్రకోపముగలవాఁడు నగు ధూమ్రమాత్యుఁడును, అసమాన బలముచే కీర్తి గన్న ప్రహస్తుఁడును, భుజబలముచే దిగ్గజముల కుంభస్థలములఁ బగులఁగొట్టు కుంభకర్ణుఁడును, దేవతలకు అసురులకు యుద్ధమునఁ గదలింపరాని యకంపనుఁడు వీరందఱు నత్యధిక శూరులు, భుజబలవంతులు, యుద్ధాసక్తి గలవారు, విరోధుల నణఁచువారు, తెంపుగలవారు, అయ్యో! యిట్టివారు రాము బాణములచేఁ జచ్చిరి కదా!

ఉ. వారును వీరటంచు నుడు•వం బని యేటికి నెల్ల వారలున్
ధీరులు భూరికాయులు సు•ధీయుతులుం బరమాస్త్రశస్త్ర వి
ద్యారతులున్ మహాత్ము లప•రాజితులుం బరచిత్త శల్యముల్
శూరులు దేవదానవని•షూదను లయ్యురయొ కూలిపోయిరే. ౧౭౧ ౨

అర్థములు. నుడువన్=చెప్పఁగా, ఎల్లవారలున్=యుద్ధమునకు పోయిన

వారందఱు, ధీరులు=ధైర్యవంతులు, భూరికాయులు = పెద్ద దేహము గలవారు, సుధీయుతులున్=మంచిబుద్ధి గలవారు, పరమాస్త్రశస్త్రవిద్యారతులున్=గొప్ప యస్త్రములు శస్త్రములు ప్రయోగించు విద్యయందు ప్రీతిగలవారు, మహాత్ములు= గొప్ప ప్రయత్నము గలవారు, అపరాజితులు = ఓడిపోవనివారు, పరచిత్తశల్య ముల్=శత్రువుల హృదయమున గాలమువంటివారు, దేవదానవ నిషూదనులు= దేవతల దానవులఁ జంపినవారు.

## తాత్పర్యము

పేఁడు గొప్ప. వాఁడు గొప్పయని చెప్పనేల? యుద్ధమునకుఁబోయిన వారం దఱు ధైర్యవంతులు. పిఱికులుగారు. అందఱు దేహపుష్టి గలవారు. బక్కవారు గారు. మంచిబుద్ధి, బలముగలవారు, గొప్ప యస్త్రశస్త్రములఁ బ్రయోగించు విధము దెలిసినవారు. గొప్ప ప్రయత్నములు చేయువారు. యుద్ధములం దెన్నఁడు నోడిపోయిన వారుగారు. శత్రువులకు గుండెగాలములైనవారు, శూరులు, దేవ దానవులఁ జంపినవారు. అయ్యో! యిట్టివారుకూడఁ జచ్చిరి కదా.

సీ. ప్రఖ్యాతవిక్రమ ♦ ప్రణుతుండు నాపట్టి, యింద్రజి ద్భండన ♦ పృథ్వియందు
పరలబ్ధశరముల ♦ భ్రాతల బంధించె, వానిని విడిపింప ♦ వశముగాదు
యక్షగంధర్వ దే♦వాదుల కేనియు, నట్టిచో రామరా♦మానుజాతు
లక్కటా విడివడి ♦ రదియేమి మాయయో, వారిప్రభావంబొ ♦ వంచనంబొ
ఆ. యెఱుఁగ రాదు నాకు ♦ నే మనవచ్చును, నేను బొమ్మటన్న ♦ నిశచరేంద్రు
లట్టె పోక కాని♦యుదు దేర రెవ్వరు, క్రమ్మఱంగఁ గపుల♦కడిమి జిక్కి.

అర్థములు. ప్రఖ్యాత విక్రమ ప్రణుతుండు=ప్రసిద్ధమైన పరాక్రమము చేత స్తోత్రము చేయఁబడిన వాఁడు, నాపట్టి=నాకుమారుఁడు, వరలబ్ధశరములన్ = వరముచే సంపాదింపఁబడిన బాణములచే, విడివడిరి=విడిపించి కొనిరి.

## తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన పరాక్రమవంతుఁడని స్తోత్రము చేయఁబడినవాఁడు నాకొడుకు ఇంద్రజిత్తు యుద్ధభూమియందు బ్రహ్మవరముచే లభించిన శరముల నన్నదమ్ములను గట్టివైచెను. దానిని విడిపింప యక్షులు గంధర్వులు దేవతలు మొదలగు వారికిని సాధ్యముగాదు. అట్టిచోట రాముఁడు ఆయన తమ్ముఁడు కూడ విడిపించు కొనిరి. ఇదియేమి మాయయో? వారిమహిమయో? లేక బ్రహ్మయే మోసగించెనా, లేక మాకుఁదెలియని మంత్రతంత్రములు వారికిఁ దెలిసి బంధింపఁ బడిన వారివలెఁ గొంచెము సేపుండి, వాఁడివల రాఁగానే వారు లేచి కూర్చుం డిరా? ఏదైనది తెలియలేదు. నే నేమనుకొందును? నేను బొమ్మని చెప్పిన రాక్ష సులు వానరులు బలమునకు లోబడి చచ్చుటయే కాని మరల వచ్చుటలేదు గదా!

కం. ఈవీట నింక నా సీ, తావిభునిన్ సానుజాతుఁ • దతసైన్యుని సు
  గ్రీవు విభీషణు గెలువం,గా వలఁతిన్ వెదకి చూచిన • గనలే నొకనిన్. ౧౭౧౪

అర్థములు. ఈ వీటన్ = ఈ పట్టణ మందు, సానుజాతున్=తమ్మునితోఁ గూడిన వానిని, తత సైన్యుని=మన సేనకంటె విస్తార సేన కలవానిని, వలఁతిన్= సమర్థుఁడగు వానిని.

తాత్పర్యము

తమ్ముని సాహాయ్యముగల రామచంద్రుని, విస్తార సేనగల సుగ్రీవుని తనకు వారు వారికిఁ దాను సహాయముగా నుండు విభీషణు గెలువ సమర్థుఁ డగు వాఁడు ఈ లంకాపట్టణమందు వెదకినను నొకఁడైన లేఁడే.

రామునకుఁ దమ్ముని తోడుపాటు గలదు. నా తమ్ములందరు చచ్చిరి. ఒకఁడైన లేఁడు. వానర సాహాయ్యము కొఱఁత లేక యున్నది. నాకు రాక్షస సాహాయ్యము చాల క్షీణించినది. మన మర్మము వారికిఁ జెప్పు విభీషణుఁ డా ప్రక్క నున్నాఁడు. వారి మర్మము చెప్పఁగలవాఁడు మన ప్రక్క లేఁడు. సందర్భము లిట్లుండఁగా వారిని గెలువఁగలవాఁ డెవ్వఁడు గలఁడు ?

ఇంద్రజిత్తుండఁగా రావణుఁ డిట్లు చెప్పఁ గారణ మేమి? ఇంద్రజిత్తు చేయఁగలిగిన గొప్ప కార్యము మాయచే నాగపాశబంధనము. అది వ్యర్థమై పోయెను. ఇఁక మాయ చాలించి యెదుటఁబడి యుద్ధము చేయఁబూనిన నెట్లగునో? ప్రత్యక్ష యుద్ధమునఁ జచ్చిన యతికాయుం డింద్రజిత్తు కన్న బలవంతుఁడే కదా. కావున నింద్రజిత్తు ఇందఱ జయింపఁ గలఁడనుట సందిగ్ధ కార్యమే యని వాని యభిప్రాయము. అదియును గాక యొక్కఁ డెందఱితో నెంతకాలమని పోరాడఁగలఁడు ?

కం. ఏమీ రాముపరాక్రమ, మేమీ యా యస్త్రబలము • హింసితులై నా
  నామర విరోధిముఖ్యులు, భూమిని బేరైన లేక • పొలిసిరికలనన్. ౧౭౧౫

అర్థములు. హింసితులై = చంపఁబడినవారై, నానా = అనేక, విరోధి ముఖ్యులు=రాక్షసశ్రేష్ఠులు, పొలిసిరి=చచ్చిరి, కలనన్=యుద్ధమందు.

తాత్పర్యము

ఆహా ! యేమి రాముని పరాక్రమము, ఏమి యా యస్త్రబలము, రాక్షస శ్రేష్ఠులందఱు నాయనచేఁ జంపఁబడి పేరైన లేక యుద్ధమందుఁ జచ్చిరి కదా.

తే. యోధవరులు నిశాటు లాఁ • యోధనమున, నెవని శక్తిని యమపురి • కేగి రట్టి
  వీరు రాము ననామయు • విష్ణుమూర్తి, నాదినారాయణుని గ • నే నాత్మఁదలఁతు.

అర్థములు. యోధవరులు=యుద్ధవీరులలో శ్రేష్ఠులు, ఇందు ప్రథమాక్షరము గాయత్రిలోనిది, నిశాటులు = రాక్షసులు, ఆయోధనమునన్ = యుద్ధమందు, అనామయున్=రోగరహితుని, రోగరహితుఁ డనఁగా నెట్టి క్లేశములు లేని వానిని, ఇందు 'అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో' ఇత్యాది శ్రుతి'స్మరించునది. విష్ణు

మూర్తి = (౧) సర్వత్ర వ్యాపించియుండువాఁడు. (౨) జీవప్రకృతులందన్నిట నను ప్రవేశము చేసియుండువాఁడు, కావున విష్ణు వనఁబడును. ఆదినారాయణు నిఁగ = ఎవ్వనిచే జనించు జగమన్నట్లు సర్వమునకు నాదియైన నారాయణుని, నాదినారాయణుని, ఆదిలేని నారాయణుని, (న+ఆది=నాది).

## తాత్పర్యము

యుద్ధవీరులలో శ్రేష్ఠులైన రాక్షసులు యుద్ధమునం దెవ్వనిశక్తిచే యమ పురికిఁ బోయిరో యట్టి వీరుని రాముని సర్వక్లేశరహితుని విష్ణుమూర్తియగు నాదినారాయణునిఁగ నేను దలంచెదను. ఆయనగాక మఱియొకఁడును అంతకుఁ దక్కువవాఁ డింతటి కార్యము చేయఁజాలఁడు.

దీనివలన వానికి రామసర్వత జ్ఞానముదయించెనా యని సందేహము. ఇది నిశ్చయ జ్ఞానముగాదు. ఊహమాత్రమే.

ఆ. అతనిభీతిఁ గాదె • యకట యంతర్బహి,ర్ద్వారతతులు మూయ•వలసి వచ్చె
 లంక నన్నిచోట్ల • హెచ్చరికను, గావవలయు మీరు • కడిమి మెఱసి.

అర్థములు. అంతర్బహిర్ద్వారతతులు=లోపలి వాకిండ్లు, బయటి వాకిండ్లు, ఇండ్ల వాకిండ్లు—కోటగవనుల వాకిండ్లు, కడిమి=బలము.

## తాత్పర్యము

అతనికి భయపడిగదా లంకాపురమున లోపలి ద్వారములు వెలుపలి ద్వారములు మూయవలసి వచ్చెను. లంకయం దన్నిచోట్ల నింక హెచ్చరికతో మీరు బలము ప్రకటిత మగునట్లు కావలయును.

### —• రావణుఁడు లంకయం దంతటఁ గాపుంచుట •—

కం. నా ముదల లేక కశోకా,రామమునకు నందు సీత•రహిఁ
 సీమకు నెవరేనియుఁ జనఁ,గా మఱి వెలిరాఁగఁ దగని కార్యము వినుఁడీ.

అర్థములు. నా ముదల=నాయాజ్ఞ.

నా యాజ్ఞ లేక యెవ్వరైనను అశోకవనమునకు నందు సీత యుండెడి చోటికిఁ బోను గూడదు. అందుండు వారు వెలికి రాను గూడదు.

సీత కీక్షోభ తెలియఁ గూడ దని రావణుని యభిప్రాయము.

సీ. సైన్యముల్ నిలిచిన•స్థలముల నెల్లను, బలములతోఁ గావ•వలయు మీరు
 కాఁదారి మాఁదారిఁ • గడనంజ నైనను, దెల్ల వారెడి వేళ•నెల్ల యపుడుఁ
 బ్లవగులత్రోవలు • పరికింపుఁడీ మీరు, కారా దలక్ష్యంబు•కపులబల్ల
 సహితు లుద్యుక్తులో•యరు దెంచుచున్నారో,యూరక నిలిచిరో•యున్నవారొ
ఆ. యనుచు నెఱుఁగ వలయు • ననవరతంబును, జనుఁ డటన్న రా•క్షసవ్రజంబు
 లేగి యక్లె చేసె•నిట్టులాజ్ఞాపించి, దైన్యతపుఁ దగుచు•దశముఖుండు. ౧౭౧౯

అర్థములు. కాఁదారి మాఁదారిన్=అర్ధరాత్రమందు, కడసంజ =సాయంసంధ్యాకాలము, అహితులు = విరోధులు, ఉద్యోగులో = ఏదైనఁ బ్రయత్నము చేయుచున్నారా? అనవరతంబును=ఎల్లవేళల, వ్రజంబు = సమూహము, దైన్యతప్తుఁడు=శోకముచేఁ దపించినవాఁడు.

### తాత్పర్యము

ఇంతవఱకు సైన్యములు విడిసియుండిన గుల్మములందు మీరు సేనలతోఁ గాచియుండవలయును. నడిరేయి కాని సాయమునందుఁ గాని. తెలవారి వేళఁ గాని తక్కిన కాలములందుఁ గాని మీరు ప్లవగుల మార్గములు పరీక్షించుచుండుఁడు. ఉపేక్ష సేయవలదు. ఏమి పరీక్షింపవలయు ననుదురా? వారేదైన యుద్ధప్రయత్నము చేయుచున్నారా? లేక లంకలోఁ దూఱవచ్చుచున్నారా? లేక యేమి చేయక యెవరైన వచ్చిన యుద్ధము చేయుదము లేకున్న నూరకుందమని నిలిచియున్నారా? ఇది మీరు సర్వదా కనిపెట్టి తెలిసికొని నాకుఁ జెప్పవలసిన విషయము పొండని చెప్పఁగా రాక్షస సమూహ మట్టులే చేసెను. ఇట్టు లాజ్ఞాపించి శోకముచేఁ దపించుచు రావణుఁడు.

కం. తనమందిరమునకుం జని, ఘనరోషానలము పేర్మి ♦ గ్రాగుచు నతికాయునిఁదలఁచి తలఁచి పొక్కుచు, మనమున చింతించి మాటిమాటికి నూర్పెన్.

అర్థములు. గ్రాగుచున్=కాలుచు, ఊర్పెన్=నిట్టూర్పు విడిచెను.

### తాత్పర్యము

సభవిడిచి తన యింటికిఁబోయి మిక్కుటమైన కోపాగ్నిచేఁ గాలుచు నతికాయుఁడు లోనగు కొడుకులఁ దలఁచి తలఁచి దుఃఖించుచు మనస్సులో నిఁక నేమి చేయుదమా యని యాలోచించుచు నేమియుఁ దోఁపమిని నిట్టూర్పులు విడుచుచుండెను.

## —♦ ౨౩-వ సర్గము. ఇంద్రజిత్తు రావణు నూరార్చుట ♦—

చం. తనయులుఁ దమ్ములుం దెగిన ♦ దారుణ శోక భరంబునన్ దశాననుఁడు విమోహితాత్ముఁ డయి♦నం గని యింద్రజి చేరి పల్కె నీ
తనయుఁడు శక్రజిత్తు సురదానవ దర్పనిహంత లెస్సరై
మని యిట నుండ నేమిటికి ♦ మన్కితమ్ముం గొన రాక్షసేశ్వరా? ౧౭-౨౧

అర్థములు. విమోహితాత్ముఁడయి = ఏమి చేయుటకుఁ దోఁపనివాఁడై, సురదానవదర్ప నిహంత = దేవదానవుల గర్వ మణఁచినవాఁడు, మని = జీవించి, మన్కితము=దుఃఖము, మనికితము.

### తాత్పర్యము

కొడుకులు తమ్ములుఁ జచ్చుటచే తీవ్రమైన శోకాతిశయంబున రావణుఁడు ఏమిచేయుటకుఁ దోఁపనివాఁడై పడియుండఁగాఁ జూచి యింద్రజిత్తు సమీపించి యిట్లు

నిమో. నీకొడుకు దేవదానవులగర్వ మణఁచిన యింద్రజిత్తు బ్రదికి యుండే యుండఁగా నేల దుఃఖ పడెదవు?

ఉ. ఇంద్రజిబాణపాతముల • నెవ్వఁ డోర్వ సయిరింపువాఁడు ని
  స్తంద్రత మేను గాచికొనఁ • జాలెడి వాఁ డది యేల యిప్డు మ
  త్సాంద్ర శరోగ్రవృష్టి సువి•దారితభిన్న శరీర భూమిభృ
  చ్చంద్రుల రామలక్ష్మణుల•క్ష్మాలుఠదంగులఁ జూచె దియ్యెడన్. ౧౭౨

అర్థములు. నిస్తంద్రతన్ = హెచ్చరికతో, మేను = దేహము, మత్ = నాయొక్క, సాంద్ర=దట్టమైన, శర=బాణముల యొక్క, వృష్టిన్ = వర్షముచే, సువిదారిత = చక్కఁగాఁ జీల్పఁబడిన, భిన్న=భేదింపఁబడిన, శరీర = దేహములు గల, భూమిభృచ్చంద్రులన్ = రాజశ్రేష్ఠులను, క్ష్మాలుఠదంగులన్ = భూమి యందుఁ బొరలుచున్న దేహములు గలవారిని, భిన్నభిన్న గాత్రులని వాని నోర వచ్చెనే కాని మృతయని వానినోర రాలేదు. తనబాణముచే వారు చావరని వానికిని దెలియును.

తాత్పర్యము

ఇంద్రజిత్తు వేయు బాణముల దెబ్బను సహింపఁ గలవాఁ డెవ్వఁడు గలఁడు? హెచ్చరికతోఁ దన దేహము రక్షించుకొనగలవాఁ డెవ్వఁడు కలఁడు? ఆపౌరుషోక్తు లిప్పుడేల కాని యిప్డు నా బాణముల వర్షముచే భిన్నము భిన్నమునైన దేహములు గల రాజులను రామలక్ష్మణులను నేలఁబడి పొరలుచుండఁ జూడఁగలవు.

మ. వినుమీ పౌరుషదైవ యుక్త మగు నీ•వృత్రాహితారిప్రతి
  జ్ఞను రక్షోధిప! రామలక్ష్మణులఁ జం•చద్భీషణామోఘకాం
  డనికాయంబుల సంగరక్షితిని సం•తర్పింతు; విష్ణ్వింద్రులున్
  దిననాథాశ్వికృశాను చంద్రయములున్•వీక్షించి నా యుద్ధతిన్. ౧౭౩

అర్థములు. పౌరుషదైవయుక్తము = పురుష ప్రయత్నము, దైవసాహాయ్యము, పురుష ప్రయత్నము యుద్ధముచేయుట, దైవయుక్తము యజ్ఞమున నగ్ని నారాధించి యాయన యనుగ్రహమున యుద్ధపరికరములు సంపాదించుకొనుట, ఇట్లు దైవము పౌరుషము రెండు కలియుటచే కార్యసిద్ధి నిశ్చయ మని భావము. ఇదివఱకు యుద్ధమునకుఁ బోయినవారు కేవల పౌరుషము నాశ్రయించిన వారు కావున వారోడిపోయిరని భావము. వృత్రాహిత + అరి = ఇంద్రవిరోధి, వృత్రాసురుని జయించినవాని జయించినవాఁడు కావునఁ దాను వృత్రునికంటెఁ బల వంతుఁడ నని భావము. ప్రతిజ్ఞను = ప్రమాణ వాక్యమును, చంచత్ = జలి పించుటచేఁ జలించు భీషణ=భయంకరమైన, అమోఘ = వ్యర్థముగాని, కాండ నికాయంబులన్ = బాణసమూహములచే, సంగరక్షితిని = యుద్ధభూమిని, రామ లక్ష్మణులను సంతర్పింతును = తృప్తిపడఁజేయుదును, రామలక్ష్మణులచే భూమి

తృప్తిపడఁ జేయుదుమని వాని భావము. యుద్ధభూమియందు రామలక్ష్మణులను దృప్తిపఱుతుననియు మఱియొక యర్థము, విష్ణువు=ఉపేంద్రుఁడు

తాత్పర్యము

రాక్షసేశ్వరా! దైవము పౌరుషముతోఁ గూడిన యీ యింద్రజిత్తు ప్రతిజ్ఞ వినుము. రామలక్ష్మణులను భయంకరములైన నా బాణసమూహములచే యుద్ధ భూమి తృప్తిపడఁజేసెదను. ఉపేంద్రుఁను-ఇంద్రుఁడు-రామలక్ష్మణులన్ - పంచ మ్యర్థమున ద్వితీయ-ఉపేంద్రుఁడు ఇంద్రుఁడు సూర్యుఁడు అశ్వులు అగ్ని చంద్రుఁడు యముఁడు వీరు నా బలోద్రేకమును జూచి.

చ. బలిసవనాలయంబునను • వర్ధిలు విష్ణువొకో యటంచు లోఁ
దలఁపఁగ జేయువాఁడ నని • తండ్రి యనుజ్ఞను గాంచి వాయువే
గలలితరాసభాన్విత సు•కాంతరథంబునఁ జాపపాణి యై
చెలువుగ నెక్కె తోడ హయ•సింధురరోహకు లార్భటింపఁగన్. ౧౭.౨౪

అర్థములు. బలిసవనాలయంబునను = బలియజ్ఞ ప్రదేశమందు, వర్ధిలు= పెరిఁగిన, వాయువేగలలిత=వాయువేగముచే మనోహరమైన, రాసభ+అన్విత = గాడిదలతోఁ గూడిన, సుకాంత=మిగుల మనోహరమైన,హయసింధురరోహకులు= గుఱ్ఱములను ఏనుఁగులను ఎక్కినవారు, ఆర్భటింపఁగన్ =ధ్వనులు చేయుచుండఁగా.

తాత్పర్యము

బలియజ్ఞవాటమునందుఁ బెరిగిన విష్ణువో వీఁడని తలఁచునట్లు చేయువాఁడ నని తండ్రి యనుజ్ఞ తీసికొని వాయువేగము గల గాడిదలఁ గట్టిన మనోహరమైన రథంబునందు విల్లు ధరించినవాఁడై యెక్కె, తనతోడ గుఱ్ఱముల నెక్కినవారు ఏనుఁగుల నెక్కినవారు గర్జింపఁగా.

**—• ఇంద్రజిత్తు మొదటిసారి యుద్ధమునకు వెడలుట •—**

శా. భేరీనిస్స్వనశంఖరావములు వి•న్వీథిం దలంబార, భా
పూరంబుల్ ప్రసవించు ముద్గరగదా•పూగంబులుం బ్రాసముల్
నారాచంబులు మండలాగ్రములు నా•నాశస్త్రముల్ దాల్చి పెం
పారన్ రాక్షసు లేగుదేర స్తుతివా•క్యావాలవక్తృల్ వెసన్. ౧౭.౨౫

అర్థములు. దలంబారన్ = దట్టము కాఁగా, భాపూరంబుల్ = కాంతి ప్రవాహములు, ప్రాసముల్ = ఈఁటెలు, మండలాగ్రములు = కత్తులు, స్తుతి వాక్య=పొగడ్తమాటలకు, ఆవాల=పాటైన, వక్తృల్=నోరుగలవారు.

తాత్పర్యము

నగారాల ధ్వనులు, శంఖనాదములు, ఆకాశమందు దట్టముగ వ్యాపింపఁగా కాంతి ప్రవాహముల వ్యాపింపఁజేయు ముద్గరములయు గదలయు సమూహములను

ఈటెలు బాణములు కత్తులు నానాశస్త్రములు ధరించినవారై స్తోత్రములు చేయుచు రాక్షసులు రాఁగా.

తే. శంఖశశివర్ణ రాజత • చ్ఛత్త్రకలన, నందగించెను రావణ • నందనుండు
శారదాపూర్ణ నీరేజ • వైరిచేత, భాసురం బయి యొప్పు న • భంబు వోలె.

అర్థములు. శంఖశశివర్ణ = శంఖము యొక్కయుఁ జంద్రుని యొక్కయు వన్నెగల, రాజతచ్ఛత్త్రకలన = వెండిగొడుగుతోఁ గూడి, శారద = శరత్కాలమందలి, ఆపూర్ణ = పరిపూర్ణుఁడైన, నీరేజవైరిచేత = చంద్రునిచే, భాసురంబయి = ప్రకాశించునదియై, నభంబు = ఆకాశము.

తాత్పర్యము

శంఖముయొక్కయు చంద్రునియొక్కయు తెల్లని కాంతిగల వెండి గొడుగులతోఁ గూడినవాఁడై యింద్రజిత్తు శరత్కాలమందు పూర్ణచంద్రునితోఁ గూడిన యాకాశమువలె నొప్పెను.

తే. విల్లు పట్టినవారల • కెల్ల మేటి, యైన మంకోదరీతన • యాగ్రణికిని
జాళువాపిడు లొప్పారు • చామరములు, వైచిరిరుగడ రాక్షస • వర్యులపుడు.

అర్థములు. జాళువా పిడులు = బంగారు పిడులు.

తాత్పర్యము స్పష్టము.

తే. ఖరమయూఖునిచేతఁ బు • ష్కరము వోలె, భానుసన్నిభ తేజుఁ డ • ప్రతిబలుండు
నైన దశకంఠ సుతునిచే • నల్లలంక, యధికశోభ వహించె న • త్యద్భుతముగ.

అర్థములు. ఖర మయూఖుని చేతన్ = సూర్యునిచే, పుష్కరము = కమలము, భానుసన్నిభ తేజుండు = సూర్యునితో సమానమైన తేజస్సు గలవాఁడు అప్రతిబలుండు = సమానము లేని బలము గలవాఁడు.

తాత్పర్యము

సూర్యునిచేఁ గమలము ప్రకాశించునట్లు సూర్యకాంతి గలిగి యెదురులేని బలముగల యింద్రజిత్తుచే లంక యాశ్చర్యకరముగ మిగుల కాంతి గలదయ్యెను.

కం. సమరాంగణమునకుం జని, యమరాహితుఁ డాల్మె రథము • నన్ని దెసల ద
ట్టముగఁ బలాశులఁ గాపుగ, నమరిచి వేల్వఁగఁ జొచ్చె • నగ్నులలోనన్.

అర్థములు. సమరాంగణమునకున్ = యుద్ధభూమికిని, అమరాహితుఁడు = దేవవిరోధి, పలాశులన్ = రాక్షసులను, వేల్వఁగన్ = హోమము చేయఁగ, చొచ్చెన్ = ప్రారంభించెను. మారణాత్మకమైన యాక్రూర యజ్ఞము నగరము నందుఁ జేయరాదు. యుద్ధభూమియందుఁ జేయవలయును. ఇది నిర్విఘ్నముగ నెఱవేఱెనా, వీనికి జయము. విఘ్నము కలిగెనా మరణము. మొదటిదివ యుద్ధమున నీ యజ్ఞము చేసియే రామలక్ష్మణుల నాగాస్త్రముల బంధించెను. అప్పు డెవరికి వీఁడేమి చేయునది తెలిసినది కాదు. ఇప్పుడును వీఁడంతవలె యుద్ధమునకై పోవువానివలెఁ బోలేదు.

రాక్షసులను ముందు సాధారణముగ నున్నట్లే గుంపుగ యుద్ధముచేయ నిలువఁబెట్టి దొంగతనముగా విభీషణాదులు లేని ప్రక్కగా నిది చేసెను. విభీషణుఁడు వీఁడు యుద్ధమునకు వచ్చుట యెఱుఁగఁడు. దానివలన వీని యజ్ఞము నిర్విఘ్నముగ నెఱవేఱెను.

సీ. లాజల గంధమా♦ల్యంబులచే నొప్ప, హవిచేత నర్చించె ♦ నగ్నిహోత్రు
శరపత్రములు గాఁగ♦శస్త్రముల్ ఘటియించి, శాంద్రశాఖల సమి♦ధలుగఁ జేసి
యెఱ్ఱవస్త్రము లూని ♦ యినుపస్రువముఁ బూని, శరపత్రమధ్యదే♦శంబునందుఁ
మిమ్మటంబుగ నల్ల♦మేఁకను బలి యీయఁ,బొగ లేనిమంటలఁ♦బొలుపుమీఱి
ఆ. విజయలక్షణముల ♦ వెలికి సూచించుచు, నప్రదక్షిణముగ♦జ్వాల లెగయఁ
బసిఁడినగలు దాల్చి♦ప్రత్యక్షముగ రోహి, తాశ్వుఁ డెగయు దెంచి♦హవి గ్రహించె.

అర్థములు. లాజలన్=పేలాల చేతను, హవిచేతను = హోమద్రవ్యముచే, శస్త్రములను = ఆయుధములను, శరపత్రములుగా = తెల్లు ఆస్తరణముగా, 'శరమయం బర్హిస్తృణాతి' యని శ్రుతివాక్య ప్రమాణము. అభిచారహోమమందు తెల్లు కసవుచే ఆస్తరణములు వేయవలయును. ఇందు తెల్లునకు బదులు శస్త్రములే ఆస్తరణములుగా నుంచెను. శరపత్రములు = తెల్లుపోఁచలు, సమిధలు = హోమమునకుఁ గావలసిన కట్టెపుల్లలు, స్రువము=నెయ్యి హోమముచేయు మిల్లి వంటిది, మిమ్మటంబుగన్ = అధికముగ, రోహితాశ్వుఁడు = అగ్నిహోత్రుఁడు, ఎగయుదెంచి=పైకి లేచివచ్చి.

తాత్పర్యము

పేలాలచేతను గంధము పూలదండలచేతను నొప్పు హవిస్సుచే నగ్నిని బూజించెను. శస్త్రములను తెల్లుపోఁచలకు బదులుగా పైచి శాంద్రకొమ్మలను సమిధలుచేసి యెఱ్ఱవస్త్రము కట్టుకొని యినుపమిల్లి తీసికొని తెల్లుపోఁచల మధ్యప్రదేశంబునందు నధికముగ నల్లమేఁకను బలి యీయఁగాఁ బొగలేని మంటలతో విజయచిహ్నములు వెలికిఁ గానవచ్చునట్లు సూచించుచు ప్రదక్షిణముగ జ్వాల లెగురఁగా బంగారునగలు ధరించి తన యాకారముతో నగ్నిహోత్రుఁడు పైకి లేచి వచ్చి హవిస్సు గ్రహించెను.

రామచంద్రమూర్తికి విరోధముగ అగ్నిహోత్రుఁడు ఇంద్రజిత్తునకు సహాయుఁడుగా వచ్చునా? 'మంత్రాధీనంతు దైవత'మ్మని శాస్త్రము. బ్రహ్మరుద్రాదులైనను మంత్రములకు లోఁబడవలసినవారే. ఆ ప్రకారము మంత్రవంతముగఁ బని చేయువారి కోరికలు దీర్పవలసినది వారికి విధి. మంత్రముచే నాహూతుఁడైన యే దేవతగాని నేను రాను, వరమీయనను స్వాతంత్ర్యము లేదు. మంత్రమేపోయి యాయా దేవతయెందున్నను గట్టియీడ్చుకొనివచ్చును. సర్పయాగమపుడు 'సేంద్రతక్షకాయ' యని చెప్పినప్పటికినింద్రుఁడు తక్షకుఁడుకూడ లేచి నిప్పులలోఁబడుటకు రాలేదా? కావున దేవతలు మంత్రాధీనులేకాని స్వతంత్రులుగారు. క్షుద్రమాంత్రికులకు క్షుద్రదేవ

తలు ప్రత్యక్షమై క్షుద్రఫలములే యిత్తురు. మహామంత్రములకు మహాదేవతలే ప్రత్యక్ష మగుదురు. కావుననే ముముక్షువులు భగవన్మంత్రముదప్పఁ దక్కిన దానిని స్మరింపరాదు, జపింపరాదు.

కం. తనరథమును దనచాపము, తన బ్రహ్మాస్త్రింబు మఱియ ♦ దార్థము లెల్లన్
దనుజుఁడు మంత్రయుతంబుగ, ననలునిలో వేల్చె నిశ్చ♦లాత్ముం డగుచున్.

తాత్పర్యము స్పష్టము.

కం. సేందుగ్రహనక్షత్రము, బృందారకపథము వణఁకె ♦ భీతి మయసుతా
నందనుఁ డిటు బ్రహ్మాస్త్రి ము,మందమతిన్ వేల్వ నగ్ని♦మధ్యమునందున్.

అర్థములు. సేందుగ్రహ నక్షత్రము = చంద్రునితోను గ్రహములతోను నక్షత్రములతోను గూడియున్నది. బృందారకపథము=దేవతల మార్గము. ఆకాశము, మయసుతానందనుఁడు = మండోదరీ కుమారుఁడు, ఇట్లు చెప్పుటచే నిది రాత్రి యుద్ధమని యేర్పడుచున్నది. చూ. ౧౭౫౮. ప.

తాత్పర్యము

చంద్రగ్రహ నక్షత్రములతోఁ గూడిన యాకాశమార్గము ఇంద్రజిత్తు అగ్నిమధ్యమునందు బ్రహ్మాస్త్రిమును హోమము చేయఁగా భయముచే వణకెను.

బృందారక పథము వణఁకవలె నన నందున్న చంద్రాదులు వణఁకిరని భావము. లక్షణ.

చ. పవనసఖాభ తేజుఁడగు ♦ పంక్తిముఖాత్మజుఁ డగ్నిదత్తసైం
ధవవరచాపమార్గణర♦థంబులు సూతుఁడు నై యదృశ్యుఁడై
దివికిని నుద్గమించి తన♦దిక్కు సురారుల నూలుకొల్పినన్
బవరము సెల్లె నా యుభయ♦పక్షము వారికి రోమహర్షమై. ౧౭౩౩

అర్థములు. పవనసఖాభ తేజుఁడు=వాయుమిత్రుఁడగు నగ్నితో సమానమైన తేజస్సుగలవాఁడు, అగ్నిదత్త=అగ్నిహోత్రుని చేసీయఁబడిన, సైంధవ=గుఱ్ఱములు, వరచాప=శ్రేష్ఠమైన విల్లు, మార్గణ=బాణములు, రథంబు = తేరు, సూతుఁడు= సారథి, ఐ=కలవాఁడై; అదృశ్యుఁడై=కానరానివాఁడై, దివికిని = ఆకాశమునకు, ఉద్గమించి=ఎగిరి, నూలుకొల్పినన్=పురికొల్పఁగా, బవరము = యుద్ధము, రోమహర్షమై=గగ్గురుపాటుగలదై.

తాత్పర్యము

అగ్ని తేజుఁడైన యింద్రజిత్తు అగ్నిదత్తమైన గుఱ్ఱములు, విల్లు, బాణములు సూతుఁడు గల రథమెక్కి కానరానివాఁడై యాకాశమున కెగసి యుద్ధము చేయుఁడని తనప్రక్క రాక్షసుల ప్రేరింపఁగా నుభయపక్షములవారికి గగ్గురుపాటు గలుగ యుద్ధము జరిగెను.

—• ఇంద్రజిత్తు మాయాబలంబునఁ గపిసేనల నుఱుమాడుట •—

చ. భరముగఁ బోరు చున్న తవ•వారిఁ గనుంగొని నేను గల్గఁ గా
తరపడ నేల మీకు నని • దానవులార! వధింపుఁ డీ వనే
చరులను నెల్లవారల ని•జం బగు మీకు జయంబు నా నిశా
చరులను గోరి కాఁకి యని • సల్పిరి పీఁక జయాభిలాషులై. ౧౭౩౪

అర్థములు. భరముగ=విశేష కష్టముతో, కాతరపడ నేల=భయపడ నేల, అనిన్=యుద్ధమందు.

ఇట్లు చెప్పి పురికొల్పినను వారతి కష్టమున యుద్ధము చేయుచుండుట చూచి రాక్షసులారా! నేనుండఁగా మీరేల భయపడెదరు? ఈ వానరుల నెల్లఁ జంపుఁడు. మీకు జయము నిజము. అని చెప్పఁగా వారును ధైర్యము తెచ్చుకొని జయముఁగోరి పరాక్రమించి యుద్ధము చేసిరి.

ఉ. మించి దశాస్యనందనుఁడు • మేలిశరంబులఁ గీశసేనల
న్ముంచి పరాక్రమించుచు న•నూనగదాముసలాయుధాళిచే,
జించుచు శత్రుదేహములఁ • జీల్చుచుఁ గూల్చు చొకొక్క ముల్కి చే
నంచుగఁ బంచస ప్తనవ•సంఖ్యలఁ గీశులఁ ద్రుంచె వ్రేల్మిడిన్. ౧౭౩౫

అర్థములు. ముల్కి చేన్ = బాణముచే, పంచస ప్త నవసంఖ్యలన్=ఐదు గురు, ఏడుగురు, తొమ్మండుగురు వానరులను, వ్రేల్మిడిన్=చిటికె వేయునంతలో.

తాత్పర్యము

ఇంద్రజిత్తు అందఱిమించి వానరులను శ్రేష్ఠములైన బాణముల ముంచి పరాక్రమించుచు దండిగ గదలయు,రోఁకండ్లయు,ఆయుధములయు పంక్తి చేఁజించుచు విరోధుల దేహములఁ జీల్చుచు, నేలఁబడఁద్రోయుచు, నొక్కొక్క బాణముచే నేవు రను, నేడ్వురను, తొమ్మండుగురను క్రోఁతులఁ జిటికె వేయునంత కాలములోఁ జంపెను.

ఉ. అతని పీఁకఁ గన్గొని య • గాయుధపాణులు కీశముఖ్యులన్
స్ఫీతజవంబునై నెదుర • సింగమువంగిని లొంగి గ్రీష్మ ఖ
ద్యోతునిఁబోలి తేజ కన • దుష్కరులై రవితుల్య మార్గణ
వ్రాత విభిన్న కాయులుఁగ • వారల నెల్ల నొనర్చె నీసునన్. ౧౭౩౬

అర్థములు. పీఁక = పరాక్రమము, అగాయుధ పాణులు=చెట్లు, పర్వత ములు, నను నాయుధములు చేతియందుఁ గలవారు, అగ=(౧)చెట్లు,(౨)కొండలు, అగో నగశ్చ భుజగే నాళో భూరుహాభూధరే, నానా, ర. గ్రీష్మఖద్యోతునిన్ = ఎండకాలపు సూర్యుని, రవితుల్య = సూర్యునితో సమానమైన, మార్గణవ్రాత = బాణసమూహములచే, విభిన్నకాయులన్=భేదింపఁబడిన దేహము గలవారినిఁగా, ఈసునన్ = కోపముచే.

తాత్పర్యము

వాని పరాక్రమముఁజూచి చెట్లు, కొండలు, ఆయుధములుగాఁ జేతఁ దీసికొని వానరులు మిగుల వేగముగా నెదిరింపఁగా సింహములవలెఁ బొంగి యెండకాలపు సూర్యునివలెఁ జేతి చూడరాక సూర్యసమానములైన బాణసమూహములచే వారల నెల్లఁ గోపముతోఁ జీల్చెను.

కం. అంగములు నలఁగినం బ్రథ,మాంగంబులు పగిలినన్ ద్రు•మాటులు ధృతిపై
సంగరము సలిపి రా నీ, తాంగనపతికొఱకునై చ్యు•తాయువులగుచున్.

అర్థములు. ప్రథమాంగంబులు = తలలు, ద్రుమాటులు = వానరులు, ధృతిపై = ధైర్యముచే, నీతాంగనపతి-ఇతితత్సమశబ్దముల సమాసము, చ్యుతాయువులు = ప్రాణముల మీఁది యాశ వదలిన వారై.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి నిమిత్తము ప్రాణముల మీఁది యాశ వదలి దేహములు నలిగినను తలలు పగిలినను వానరులు యుద్ధముచేసిరి. వానరు లిట్లు జటాయువువలె కైంకర్యము చేసిరి. కావుననే వీరందఱకు మోక్షము ప్రాప్తించెను. ఈవిధముగ భగవత్సేవ చేయువారి కిహపరములు రెండును ఫలించును.

ఉ. రావణిఁ జుట్టుముట్టి నగ•రాజచరుల్ జడివానవోలెఁ జెన్
గ్రావములున్ శిలాగిరి ని•కాయములుం గురిపింప వాఁడునున్
గేవలశౌర్యధైర్యపరి•కీర్తిత చాపకళావిలాసముల్
చేవగొనన్ని మేషమునఁ • జేసెను నన్నిటిఁ దుండెతుండెముల్. ౧౭౩౪

అర్థములు. గ్రావములున్ = పెద్దబండలు, శిలా = రాలు, గిరి నికాయములు=కొండల సమూహములు, కేవల = విశేషముగ, శౌర్యధైర్య పరికీర్తిత చాపకళా విలాసముల్=శౌర్యము చేతను, ధైర్యము చేతను పొగడఁబడిన విలువిద్యయొక్క నేర్పులు, చేవగొన్నన్=బలము గాఁగా.

తాత్పర్యము

ఇంద్రజిత్తుచుట్టు వానరులుచుట్టుకొని జడివానవలె బండలు, గుండ్రాలు, కొండలు కురియఁగా వాఁడును శౌర్యధైర్యములచేఁ బొగడ్తగన్న విలువిద్యా పాండితి దృఢపడఁగా నిమిషములో వానినన్నిటిని తుంటలు తుంటలుగాఁ జేసెను.

సీ. వెండియు నతఁడు దో•శ్చండిమ గంధమాఁదనుఁ బదునెనిమిది•ఘనశరముల
దూరస్థుఁ డౌ నలుఁ • దొమ్మిదిఖగముల, మైందుని నొక యేడు•మార్గణముల
గజు నైదుములుకుల • ఘను జాంబవంతునిఁ, బదిట నీలాఖ్యు ము•ప్పదిట నేసి
సుగ్రీవునిన్ వాలి•సూనుని ఋషభుని, ద్వివిదుని వరలబ్ధ•తీవ్రబాణ

తే. సంఘముల నేలఁబడఁగ ని•ష్ప్రాణు లగుచుఁ
గ్రూరుఁడై నొంచి తక్కు-స•క్రోతి గములఁ

గాలపావకుఁ డన బహు ♦ కాండ హేతి
మాలికల నిర్దహించెను ♦ మాఱు లేక ౧౭౩౯

అర్థములు. దోశ్చండిమ = భుజబలాతిశయముచే, నిష్ప్రాణులు = బల ముడిగినవారు, కాలపావకుఁడు = ప్రళయ కాలాగ్ని, బహు = అనేకములయిన, కాండ హేతి=బాణములను జ్వాలల, మాలికలచేఁ = వరుసలచేత, నిర్దహించెను= దగ్ధమైన దానివలెఁ జేసెను.

తాత్పర్యము

మఱియును వతఁడు భుజబల తీవ్రతచే గంధమాదను బదునెనిమిది బాణముల చేతను, దూరముగానున్న నలుని తొమ్మిది బాణముల చేతను, మైందు నేడు బాణముల చేతను, గజునైదు బాణముల చేతను, జాంబవంతుని బదింటను, నీలుని ముప్పదింటను సుగ్రీవుని నంగదుని ఋషభుని ద్వివిదుని వరముచే లభించిన తీవ్రబాణ సంఘములచే బలహీనులై నేలఁబడ నొప్పించి తక్కిన వానర సమూహముల కాలాగ్నివలె బహు బాణజ్వాలలచే నెదురులేక దహించెను.

కం. ఖరకరనిభ విశిఖపరంపరలన్, నిస్తులిత ఘన జ♦వంబుల భూభృ
చ్చరవాహిని వధియించె న,మరపతి విద్వేషి జాత♦మన్యుం డగుచున్.౧౭౪౦

అర్థములు. ఖరకరనిభ=సూర్యునితో సమానమైన, విశిఖపరంపరలన్= బాణసమూహములచే, నిస్తులిత=అసమానమైన, ఘనజవంబులన్=గొప్ప వేగము గలవానిచే, భూభృచ్చరవాహినిన్=వానరసేనను, అమరపతివిద్వేషి=ఇంద్రజిత్తు, జాతమన్యుఁడు=పుట్టిన క్రోధము గలవాఁడు.

తాత్పర్యము

అసమాన వేగము గల సూర్యునితో సమానములైన బాణపరంపరలచే, వానరసేనను కోపముగలవాఁడై యింద్రజిత్తు అల్లకల్లోల పఱిచెను.

ఉ. దారుణ బాణమోహిత ని♦శాంత సమాకులవైరి సేనలన్
పేరుఁడు గాంచి పొంగుచును ♦ వెండియు నింట నదృశ్యగాత్రుఁడై
ఘోరశరంబులం గురిసి♦క్రోఁతుల చేతులు మూఁతు లంగముల్
తీరు చెడంగఁ జేసె నవ♦ధీరితనిర్జరుఁ డుగ్రమూర్తియై. ౧౭౪౧

అర్థములు. దారుణబాణమోహిత = భయంకర బాణములచే మూర్ఛ పోయిన నితాంతసమాకుల = మిక్కిలి కలఁత చెందిన, వైరిసేనలన్ = విరోధి సైన్యములను, అవధీరిత నిర్జరుఁడు=అవమాన పెట్టఁబడిన దేవతలు గలవాఁడు.

తాత్పర్యము

భయంకర బాణములచే మూర్ఛపోయినట్టియు మిగులఁ గలఁత చెందినట్టియు విరోధి సేనలనుజూచి సంతోషపడుచు నంతలోఁ దృప్తిపడక యదృశ్యుఁడై యాకాశ మునుండి క్రూరములైన బాణములుగురిసి క్రోఁతులు చేతులుమూఁతులు అంగము

లున్న విధము మాఱిపోవునట్లు దేవతల జయించిన యింద్రజిత్తు భయంకరా
కారుఁడై చేసెను.

చ. పవిహతశైల రాజముల♦భంగిఁ బ్లవంగమ పుంగవుల్ ధరన్
జవమఱి కూలుటన్ నిశిత♦సాధనముల్ పరసేనమీఁద ను
ద్ధవిడిని జోరుసం బడుట ♦ తక్కఁ గనుంగొన నేర రైరి యా
జవరమునన్ క్షపాచరుల♦వర్గములున్ గపియోధవీరులున్. ౧౨౪౨

అర్థములు. పవిహత = వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన, శైలరాజముల భంగిన్ = పెద్ద కొండలవలె, జవమఱి = వేగముచెడి, ఉద్ధవిడిన్ = మిగుల వేగమున, జవరమునన్ = యుద్ధమునందు, క్షపాచరవర్గములున్ = రాక్షససమూహములును.

తాత్పర్యము

వజ్రాయుధముచేతఁ గొట్టఁబడిన పెద్ద కొండలవలె వేగము చెడి వానర శ్రేష్ఠులు నేలఁ బడుటయు మిగుల వేగముగ వాఁడి యాయుధములు శత్రుసేన మీఁద జడివానవలెఁ బడుటయుఁ దప్ప మఱి దేనిని గాని రాక్షసులు గాని వానరులు గాని చూడఁ జాలరైరి. వానరులు నేలఁబడుట బాణవర్షము పడుట యని చెప్పుటచే వానరులు నేలఁబడిన తరువాత బాణములు గానవచ్చుచుండెను గాని యవి తగులకముందు గాన రావయ్యెనని భావము.

కం. అని తనివి లేక రావణి, సునిశితనిస్త్రింశ పరిఘ♦శూలాదికముల్
ఘనవిస్ఫులింగసంజ్వల, దనలాభంబులను గురిసె♦నద్రిచరులపై. ౧౨౪౩

అర్థములు. అనితనివి = యుద్ధమందుఁ దృప్తి, సునిశిత = మిగులఁ బదునైన, నిస్త్రింశ = ఖడ్గములు, పరిఘ = గుదియలు, శూలాదికములు = శూలములు మొదలైనవి, ఘనవిస్ఫులింగ = పెద్దమిణుగురులుగల, జ్వలత్ = మండుచున్న, అనలాభంబులను = అగ్నిహోత్రములతో సమానములైన వానిని, అద్రిచరులపై = వానరుల మీఁద.

తాత్పర్యము

యుద్ధమందలి తృప్తిలేక యింద్రజిత్తు జ్వాలలతో మండుచున్న యగ్నితో సమానములైన వాఁడిగల కత్తులను గుదియలను శూలములను వానరులపైఁ గురియించెను.

కం. ఆయంపవెల్లి తాఁకున, నా యగచరవార మెల్ల ♦ నలరులతోఁ గెం
జాయ వహించిన మోదుగు, చాయలు గొని విస్వరముగ♦నలిపెను రొదలన్.

అర్థములు. ఆయంప వెల్లి = ఆ బాణప్రవాహము, అలరులతో = పూవులతో, విస్వరముగన్ = వికారధ్వనులతో, రొదలన్ = ధ్వనులను.

తాత్పర్యము

ఆ బాణప్రవాహము దెబ్బవలన నా వానరసమూహ మంతయు పూలతో నెఱ్ఱని కాంతిగల మోదుఁగుల వలెనై వికారస్వరములతో ధ్వనించెను.

సీ. కన్నెత్తి చూచినా ♦ కలికిబాణమ్ములు, రెండుకన్నులలోన ♦ నిండియుండుఁ
దల వంచి తిరిగినా ♦ తరమిఁడికోలల, నడినెత్తి బ్రద్దలై ♦ పుడమిఁ దొరఁగు
డాలు చేపూనినా ♦ కేలుదోయి విఖండితం బయి పోరాడు ♦ ధరణిమీఁద
ధరముఁ బైకెత్తినా ♦ దాని క్రిందనె వాఁడు, నజగుజలై పడి ♦ నలఁగిపోవు
తే. నార్భటింపఁగ వావిచ్చు ♦ నంతలోన, నోరునిండఁగ బాణముల్ ♦ కూరుకొనెడిఁ
గ్రోఁతియగు నాతఁ; డౌర యా ♦ క్రూరచరితు, చాపపాండితి నేమని ♦ సంస్తుతింప.

అర్థములు. తరమిఁడి=సమానము లేని, వావిచ్చు=నోరు తెఱచు.

తాత్పర్యము స్పష్టము.

సీ. హనుమంతు సుగ్రీవు ♦ నంగదు గంధమా, దను జాంబవంతు మైం ♦ దద్వివిదుల
హరిలోమ నీల గ ♦ వాక్ష గోముఖ వేగ, దర్శి సుషేణుల ♦ దధిముఖు గజు
జ్యోతిర్ముఖాఖ్యుని ♦ సూర్యాననుని వహ్ని, నయును నఁ గేసరి ♦ నలునిఁ గుముదు
మంత్రసహితతీవ్ర ♦ మార్గణ ప్రాసగ, దాశూలముఖ్య సా ♦ ధనవితాన
తే. ములను మర్దించి వారల ♦ బలిమి చెఱచి, తరణిరశ్మిసమేషు క ♦ దంబకముల
రామలక్ష్మణులను ముంచి ♦ రహి వహించి, విక్రమించెడి రావణి ♦ విధముఁ గాంచి.

అర్థములు. తరణి రశ్మిసమ = సూర్యకిరణములతో సమానమైన, ఇషు కదంబకములన్=బాణసమూహములచే, రహి=కాంతి.

తాత్పర్యము

హనుమంతుని సుగ్రీవుని అంగదుని గంధమాదనుని జాంబవంతుని మైంద ద్వివిదులను హరిలోమ నీలగవాక్ష గోముఖ వేగదర్శి సుషేణ దధిముఖగజులను, జ్యోతిర్ముఖుని, సూర్యాననుని, వహ్నినయునిఁ గేసరిని నలునిఁ గుముదుని మంత్రములచే మంత్రింపఁబడిన తీక్ష్ణములైన యీఁటెలు గదలు శూలములు మొదలగు ముఖ్యాయుధసమూహములచేఁ గొట్టి వారల బలము చెఱచి సూర్యకిరణ సమములైన బాణసమూహములచేఁ రామలక్ష్మణులను ముంచి కాంతి వహించి విక్రమించుచున్న యింద్రజిత్తు విధముఁ జూచి.

## శ్రీరాముఁడు లక్ష్మణునకు బ్రహ్మవరంబు మన్నించి యోర్చుకొనుమని చెప్పుట

కం. పరమాద్భుత ధైర్యశ్రీ, నిరతుఁడు రాముండు బాణ ♦ నికరాసారం
బరవాయి లేక బిందూ, త్కరమువలె సహించి పలుకు ♦ దమ్మునితోడన్.

అర్థములు. పరమాద్భుత=మిగుల నద్భుతమైన, ధైర్యశ్రీనిరతుఁడు=ధైర్యలక్ష్మియందు నాసక్తి గలవాఁడు, బాణనికరాసారంబు=బాణముల సమూహముల వాన, అరవాయిలేక=అధైర్యపడక, బిందూత్కరమువలె=జలబిందువులవలె.

తాత్పర్యము

మిగుల నాశ్చర్యకరమైన ధైర్యాతిశయమునఁ బ్రీతిగలవాఁడు గనుకనే రామ

చంద్రమూర్తి బాణసమూహముల వానకు సధైర్యుడకై దానిని జలబిందు వర్షము వలె సహించి తమ్మునితో నిట్లనియె.

సీ. అన్న లక్ష్మణ! దనుజాధినేత్రాత్మజుం, డతుల మా బ్రహ్మాస్త్ర • మాశ్రయించి
హరిసైన్యముల నెల్ల • నవనిపాలొనరించి, మనలఁ బీడించెడి • మాఱు లేక
బ్రహ్మదత్తవరంబు • బలమున నభమున, మఱఁగి యస్త్రంబుల • మాఱుకొనెడిఁ
గలన వీని వధింపఁ • గల మెట్లు? స్వభు వగు, భగవంతుఁ డగు నజు • బాణమిదియు

అ. నిది యచింత్య మహిమ • నెసఁగెడి బాణావ, పాత మీవు నాదు • భంగి ధైర్య
పరత నోర్చికొనుము • సురవైరి దిక్కుల, నెల్లఁ గప్పె నిశిత • భల్లములను. ౧౭౪౦

అర్థములు. బాణావపాతము = బాణములు పడుట.

తాత్పర్యము

అన్నా లక్ష్మణా! రావణుని కుమారుఁడు నసమానమైన బ్రహ్మాస్త్రము నాశ్రయించి వానరసేనల నెల్ల నేలపాలు చేసి మనల నెదురులేక బాధించు చున్నాఁడు. బ్రహ్మ యిచ్చిన వరము బలమున నాకాశమున దాఁగి యస్త్రంబుల చేతఁ గొట్టుచున్నాఁడు. వీనిని మన మెట్లు జయింపఁగలము. ఇది స్వయంభువు భగవంతుఁడగు బ్రహ్మదేవుని బాణము. ఇది చింతించి తెలిసికొనరాని మహిమ గలది. కావున నీవును నావలె బాణపాతమును ధైర్యముతో నోర్చికొనుము. రాక్షసుఁడు దిక్కులనెల్ల బాణములచేఁ గప్పెను.

కం. ఆవీరుని విక్రమమునఁ, జేవ చెడెం గీశసేన • స్మృతి చెడి యత్నా
భావము గల మనలం గని, పోవున్ జయలక్ష్మిఁ గొనుచుఁ • బురికసురుండున్

అర్థములు. చేవచెడెన్=నిస్సారమయ్యెను.

తాత్పర్యము

ఆ వీరుని పరాక్రమముచేఁ గపిసేన నిస్సారమయ్యెను. స్మృతితప్పి యత్నము చేయక యుండుటను జూచి జయలక్ష్మిని గ్రహించి తన నగరమునకుఁ బోవునుగాక.

కం. అనుచుండ బాణవర్షము, ఘనమై దుస్సహము నైనఁ • గాకుత్స్థులు మూ
ర్ఛను గూరిరి రావణియును, మనుజేంద్రులపాటు గాంచి • మది హర్షమునన్

తాత్పర్యము

ఇట్లు చెప్పుచుండు సమయమున బాణవర్ష మధికమై సహింపరానిదైన దగుటచే రామలక్ష్మణులు మూర్ఛపోయిరి, రావణి వారు మూర్ఛపోయి పడుటచూచి మనస్సు సంతోషముచే.

కం. పొంగఁగ హర్షారవము చెలంగఁగ నిటు కీశసేన • లన్ రఘువరులన్
జెంగించి భంగపఱిచి యభంగపరాక్రముఁడు తనదు • పత్తన మరిగెన్. ౧౭౬౧

అర్థములు. పొంగఁగన్ = ఉబ్బఁగా, హర్షారవము = సంతోషధ్వని,

భంగించి = ఓడించి, భంగపఱిచి = అవమానపఱిచి, అభంగపరాక్రముఁడు = చెడని పరాక్రమము గలవాఁడు.

తాత్పర్యము

సంతోషముచే మనస్సు పొంగఁగా సంతోషధ్వని చేయఁగా నీ ప్రకారము వానరసేనల రఘువరుల నోడించి యవమానించి పరాక్రమశాలి తన నగరమునకుఁ బోయెను.

—• ౭౫—వ సర్గము. విభీషణాంజనేయులు జాంబవంతుని వెదకుట •—

సీ. రావణి యేటుల • రహిఁ జెడి సుగ్రీవ, జాంబవదంగద•సైన్యనాథు
లేమియుఁ దోఁపక • యెదవడి యుండ వి,భీషణుం డడలు క•పిప్రముఖులఁ
గనుఁగొని కపులార ! కార్యమా దుఃఖింప, రాఘవు లవశులై • బ్రాలి రనుచుఁ
గాదిది దుఃఖింపఁ • గాలంబు నృపతులు, కంజజావాక్యంబు • గారవింప
ఆ. మదిఁ దలంచి యసురు•మార్గణములఁ జిక్కి, యున్నవారు వీర•జోదరాస్త్ర
మత్యమోఘవేగ•మగుటను దాని స,మ్మానదృష్టిఁ గనిరి•మాన్యులార ! ౧౭౫౧౨

అర్థములు. రహిఁచెడి = కాంతిచెడి, ఎదవడి = భయపడి, అడలు = దుఃఖించు, అవశులై = స్వాధీనముఁ దప్పినవారై.

తాత్పర్యము

ఇంద్రజిత్తు దెబ్బలచే కాంతిచెడి సుగ్రీవుఁడు జాంబవంతుఁడు అంగదుఁడు నీలుఁడు ఏమిచేయుటకుఁ దోఁపక భయపడియుండఁగా దుఃఖించుచున్న వానరవీరులఁ జూచి విభీషణుఁడు కపులారా ! రామలక్ష్మణులు పరవశులై పడి రని దుఃఖించిన లాభమేమి ? ఇది దుఃఖింపఁదగినకాలముకాదు, రాజకుమారులు బ్రహ్మవాక్యము గారవింపఁదలఁచి రాక్షసుని బాణములఁ జిక్కినారు గాని పరాక్రమహీనులై కాదు. బ్రహ్మాస్త్రము వ్యర్థముగాని వేగము గలదగుటచే దానిని సగౌరవదృష్టిఁజూచి.

కం. ఏలా వగచెద రని మృదు,లాలాపంబులను వారి • నాశ్వాసించెన్
జాలఁగ నయ్యస్త్రము వా,తూలసుతుఁడు గౌరవించి • తోరపుభక్తిన్. ౧౭౫౧౩

తాత్పర్యము స్పష్టము.

చ. అనియె విభీషణుం గని మ•హాత్మక యీ మనసేనలోని నిం
కను మనియున్న వారలను • గన్గొని యూఱడఁ బల్కఁ బోడి యా
వన వతి డల్ల యా నవఁగ • హ స్తములం గొఱవుల్ ధరించి చ
య్యన హతశేషవానరుల • నయ్యనఘాత్ములు రోసి రానిసిన్. ౧౭౫౧౪

తాత్పర్యము

విభీషణుని జూచి యిట్లనియె. మహాత్మా ! యీ మన సేనలో నింక నెవ్వ రెవ్వరు ప్రాణముతో నున్నారో వెదకి చూచి యూఱడించుట న్యాయ్యముగదా

యున నతఁ డవ్వన నిరువురు చేతులందుఁ గొఱవులు ధరించి యా పుణ్యాత్ములా రాత్రికాలమందు చావఁగా మిగిలిన వానరులను వెదకిరి.

సీ. భిన్నలాంగూలురు • భిన్న బాహూశయుల్, కృత్తాంగుళులు వి • కృత్త పదులు
ఖండిత శీర్షులై • క్షతజముల్ దొరఁగంగఁ, గొండలవలెఁ బడి • యుండు కపుల
శస్త్రముల్ ఛేదింప • నస్త్రముల్ బాధింప, నొడళులు ఛేదింపఁ • బడిన వారి
గంధమాదనుని నం • గదు నీలు సుగ్రీవు, ద్వివిద సుషేణుల • వేగదర్శి
తే. నలునిఁ బనసు జ్యోతిర్ముఖు • నాము మైందు
నాహుతు గవాక్షునిం దక్కఁ • నద్రిచరుల
వీతచేష్టుల నిహతుల • వీరవరులఁ
గాంచి రెంతయు మదిలోనఁ • గలఁక దొడర. ౧౭౫

అర్థములు. భిన్నలాంగూలురు = తునిఁగిన తోఁకలు గలవారు, భిన్న బాహూశయులు = తునిఁగిన చేతులు బాహువులు గలవారు, కృత్త = నఱకఁబడిన అంగుళులు = వ్రేళ్ళు గలవారు, నికృత్తపదులు = నఱకఁబడిన కాళ్ళు గలవారు, ఖండితశీర్షులై=నరకఁబడినతలలుగలవారై, క్షతజముల్=నెత్తురులు, తొరఁగంగన్= కాఱఁగా, ఒడళులు = దేహములు. వీతచేష్టులన్ = చేష్టలు విడిచినవారిని, నిహతులన్=చంపఁబడినవారిని.

## తాత్పర్యము

తోఁకను తెగినవారిని, బాహువులు తెగినవారిని, చేతులు తెగినవారిని, వ్రేళ్ళు నఱకఁబడినవారిని, కాళ్ళు నఱకఁబడిన వారిని, తలలు తెగి నెత్తురు గాఱఁ గొండలవలెఁ బడియుండు కపులను శస్త్రములు నఱకఁగా, అస్త్రములు బాధింపఁగా దేహములు చీల్పఁబడఁగా బడిన వారిని, గంధమాదనుని నంగదు నీలుని సుగ్రీవుని ద్వివిద సుషేణులను వేగదర్శిని నలుని పనసుని జ్యోతిర్ముఖుని మైందుని ఆహుతుని గవాక్షుని తక్కిన క్రోఁతులను కాలుసేతులు కదలింపలేని వారిని జచ్చినవారిని వీరులను మనస్సు కలఁతపడఁగాఁ జూచిరి.

చ. అఱువదియేడుకోటుల వ • నాటులు భీమతరస్వులిట్టు లు
క్కుఱి దినపంచమాంశమున • నబ్జజు బ్రీతికిఁ బాత్రుఁడైన యా
కఱకుసురారిచేఁ దెగిరి • కంధినిభంబగు కీశసేన యొ
క్కఱు విటు రూపు మాఱుమను • కేసరిపుత్రసురారిసత్తముల్. ౧౭౬

అర్థములు. భీమతరస్వులు = భయంకరమైన వేగముగలవారు, ఉక్కుఱి= బలము క్షీణించి, దినపంచమాంశమున = దినముయొక్క యైదవభాగమున, దీనికి సంస్కృతమున అహ్నః పంచమశేషేణ అని యున్నది. దీనికి పగటియందలియైదవ భాగ మనియు ప్రాతస్సంగవమధ్యాహ్నపరాహ్ణసాయాహ్నము లను నైదు పగటిభాగములలో నైదవది యగు సాయాహ్న మాఱుగడియ లిచ్చటఁ జెప్పఁ

బడెననియు పూర్వవ్యాఖ్యాతలు వ్రాసియున్నారు. విమర్శకులు దీని నాక్షేపింపక మానరు. "ఉల్కాహస్తాతదారాత్రౌ రణశీర్షేవిచేరతుః" "కొలువుల్ ధరించిరోసిరా నిశిన్" అని చెప్పఁబడెను. సూర్యాస్తమునకు ముందటి కాలమునకు నిశియని చెప్ప వచ్చునా? అప్పుడు కొలువులు తీసికొని తిరుగనేల? యనునది సందేహము. సమా ధానము; ఇచట సంస్కృత శబ్దమైన అహ్నమునకును తెనుఁగున వ్రాయఁబడిన దినశబ్దమునకు రాత్రిపగలు కలిసిన కాలమనియే గ్రహింపవలెను. అహస్సనుటకు రాత్రి పగలు కలసిన దినమను నర్థమున మనుస్మృతి ౫-౭౪ నందు 'నవర్ధయే దఘా హాని ప్రత్యూహే న్నాన్నిషు క్రియాః' యని ప్రయోగింపఁబడెను. "అర్ధమాసై ర్మాసాంత్సంపాద్యాహరుత్సృజంత్యర్ధమాసైర్హిమాసాంత్సంపశ్యంతి షడహైర్మాసాం త్సంపాద్యాహ రుత్సృజంతి షడహైర్హిమాసాం త్సంపశ్యఁతి"-శ్రుతి-ఇందు'షడహై' యనుటకు రాత్రి పగలు కలసిన దినమని యర్థమే కాని కేవలము పగలు రాత్రియే కాదు-షడహాత్మకోపి మాసో స్తి, త్రింశద్దినాత్మకో మాస ఏవాత్ర కథ్యతి ఇతి.

"దినేదినే సా పరివర్ధమానా"కుమార-౧-౨౫, "సవ్యతీయుస్త్రీయుగాని తస్య దినాని." రఘు. ౩-౨౫ ఉదయాదుదయము దినము. ముప్పది దినము లొకనెల. మున్నూటఱువది దినము లొక సంవత్సరము. "వాఁడు మూఁడు దినములుగా నుపవాసము" అను ప్రయోగమును బట్టియు అహశ్శబ్దము దిన శబ్దము రాత్రి పగలు కలసిన కాలమునకును నుపయోగించుట కలదు. ఇచ్చట నా యర్థమునే గ్రహించి దినపంచమభాగ మనఁగా దినమును ఎనిమిది జాములుగా లెక్కించి యందు నైదవ భాగము సూర్యాస్తమయ మైన తర్వాతి జామని చెప్పనగును. మఱియు రాత్రికి త్రియామ యనియే పేరు. అనఁగా మూఁడు జాములు గలది యని యర్థము కావున పగ లయిదుజాములు గలదని యెంచి యందలి కడభాగ మనియైనఁ జెప్ప వచ్చును. ఇట్లు చెప్పిన నిది మునిమాపున దెలుఘను కొలువులు పట్టుకొని వెదకి రనుట సమంజస మగును. అదియునుగాక ఇంద్రజిత్తు హోమవర్ణనమందు 'సేందుగ్రహనక్షత్రే' మని చెప్పఁ బడెను. ఇదియును రాత్రినే తెలుపుచున్నది. రాత్రికాలము గనుకనే యుద్ధరంగ మందు వాఁడు హోమము చేసినను చీఁకటివలన వానరులు తెలిసికొన లేకపోయిరి ఇది దశమినాఁటి రాత్రిచర్య. ఒక విధముగ సామరస్యము గుదుర్పవచ్చును, ఇంద్ర జిత్తు చేసిన కార్యము సూర్యాస్తమానముతో ముగిసిన దనియు సూర్యాస్తమానా నంతరము కొలువులు దీసికొని హనుమద్విభీషణులుతిరిగిరని చెప్పవచ్చును. ఇదియే సరియైన యర్థమని తోఁచెడిని, కంధినిభంబు=సముద్రముతో సమానమైన, విస్తీర్ణ మందు నని భావము. ఒక్కెఉన్=భయంకరముగ, ఉగ్రశబ్ద భవము.

## తాత్పర్యము

భయంకర వేగము, బలము గల అఱువది యేడువేల కోట్ల వానరులుపగటి

రైదవ భాగమున బ్రహ్మాస్త్రయుక్తుఁ డాత్రుఁడైన యింద్రజిత్తుచే పచ్చిరి. సము
ద్రమువలె విరివిగల వానరసేన యిట్లు భయంకరముగ పడియుండఁగా హనుమంతుఁడు
విభీషణుఁడును.

ఉ. ఎక్కడ నున్నవాఁడొకొ దె ♦ ఋక్షవిభుం డని రోయు చేగి యా
రొక్కెడ శాంతహవ్యవహుఁ ♦ డోయన మేన ననేకబాణముల్
చిక్కఁగ నాటినన్ మిగులఁ ♦ జేడ్పడి యున్న స్వభావవార్ధకు
న్మిక్కిలి వృద్ధు ధాత్రుసుతు ♦ నిం గని రావణుతమ్ముఁ డిట్లనున్. ౧౭ ౫౭

అర్థములు, ఋక్షవిభుండు = జాంబవంతుఁడు, రోయుచున్ = వెదకుచు, శాంతహవ్యవహుఁడో = చల్లారిన యగ్నిహోత్రుఁడా! స్వభావ వార్ధకున్=సహజముగ వచ్చిన ముసలితనముగలవానిని, ధాత్రుసుతుడిన్=బ్రహ్మకొడుకును, ఏఁబది రైదు సంవత్సరములు దాఁటినవాఁడు వృద్ధుఁడనియే పేరు. అటయిన చో ఏఁబది యాఱు సంవత్సరములవాఁడు వృద్ధుఁడు, తొంబది సంవత్సరములకుఁ బైనపడినవాఁడతివృద్ధుఁడేకదా.

—♦ జాంబవంతుఁడు హనుమంతు కుశలమును విభీషణు నడుగుట ♦—

ఉ. ఓయతులప్రభావ! విశి ♦ ఖోత్కరముల్ నినుఁ బ్రాణహీనుఁగాఁ
జేయఁగ లేదుగా? యనినఁ ♦ జేవ శ్రమంబునఁ దెచ్చుకొంచుఁ దా
వాఁ కొంకయింత విచ్చి యిటు ♦ పల్కు మహాబల! రాక్షసేంద్ర! నీ
చాయ స్వరంబుఁ బట్టి యని ♦ చక్క నెఱింగితిఁ జూడ లేకయున్. ౧౭ ౫౮

అర్థములు. అతుల ప్రభావ=అసమాన మహిమగలవాఁడా, విశిఖోత్కర ముల్ = బాణసమూహములు, ప్రాణహీనుఁగా = ప్రాణము లేనివానిఁగా, చేవ= సత్త్వ, శ్రమంబునన్=కష్టముమీఁద, వా=నోరు, ఒకయింత=కొంచెము,స్వరంబుఁ బట్టి=కంఠధ్వనిఁబట్టి, లేకయున్ = లేకపోయినను, అర్థవిశేషంబున సముచ్చయము. నీచాయ=నీవుండు ప్రదేశము. "ఒకచాయ వనపాయువిక గేయసముదాయ" మని రామరాజభూషణుఁడు.

తాత్పర్యము

ఓ గొప్ప మహిమగలవాఁడా! బాణసమూహములు నిన్నుఁ బ్రాణహీనుఁగాఁ జేయలేదు గదా యని యడుగఁగా కష్టముమీఁద మాటలాడుటకు సత్త్వ తెచ్చుకొని కొంచెముగా నోరు తెఱచి యిట్లనియె. మహాబలుఁడవైన రాక్షసరాజా! నీ వెందుండునది నేను జూడలేక పోయినను నీ మాట ధ్వనిఁ బట్టి తెలిసికొంటిని.

కం. సునిశితశరములు నాటుటఁ, గను లేమియుఁ గాన రావు ♦ గాడుపుసుతుఁ డం
జనగాదిలిబిడ్డం డా, హనుమంతుం డున్నవాఁడె ♦ ప్రాణముతోడన్? ౧౭ ౫౯

అర్థములు. సునిశిత శరములు=వాఁడి బాణములు, ఏమియున్=కొంచెమైనను

తాత్పర్యము

వాడి బాణములు నాటుటచే నాకుఁ గన్నులు బొత్తిగాఁ గానరాకున్నవి. అయ్యా! విభీషణా! అంజనాదేవి ముద్దుబిడ్డఁడు వాయుపుత్రుఁడు హనుమంతుఁడు ప్రాణముతో నున్నాఁడా!

చ. పలుకఁగదయ్య యన్న రఘు♦వర్యులనేమియు ప్రశ్న సేయ కో
యలఘుమతీ! మరుత్తనయు ♦ నాదటఁ బ్రశ్నము సేయ నేల? యా
బలియుని మీఁద ప్రేమ నృప♦వర్యుల మీఁదను వాలిపుత్రుపై
జలరుహమిత్రసూనుపయి ♦ సత్యము నీ వెదఁ బూన వేలొకో! ౧౭౬౦

తాత్పర్యము

అయ్యా! చెప్పుము అని యడుగఁగా విభీషణుఁ డిట్లనియె. గొప్ప మనస్సు గలవాఁడా! రామలక్ష్మణులు క్షేమముగా నున్నారా యని యడుగక హనుమంతుఁడు బాగున్నాఁడా యనెదవేల? వానవమున నీకు హనుమంతుని మీఁద నున్న ప్రేమ రాజకుమారు లందుఁగాని బాలుఁడగు నంగదు మీఁదఁ గాని ప్రభువగు సుగ్రీవుని మీఁదఁ గాని లేదు. ఏమి కారణము?

కం. అనుచు విభీషణుఁ డాడిన, విని భల్లూకేశ్వరుండు ♦ వినుమీ వినుతున్
దనుజేశ్వర! నే మారుత,తనయునిఁ బ్రశ్నించుటకు ని♦దానముఁ దెలియన్.

అర్థములు. నిదానము = మూలకారణము.

తాత్పర్యము స్పష్టము.

కం. హనుమంతుఁడు జీవించిన, మనసేనలు హతము లయ్యు ♦ మనియున్న వగున్
హనుమంతుండు లేకుండిన, మన మెల్లను బ్రతికియున్న ♦ ప్రమందిన యట్లౌ.

అర్థములు. మని యున్నవి=బ్రతికి యున్నవి, ప్రమందినయట్లు=చచ్చినట్లు.

తాత్పర్యము స్పష్టము.

కం. నుతమతి వాయుజుఁడు సదా,గతికిన్ సరి గమనమునను ♦ ఘనవీర్యమునన్
హుతవహతుల్యుఁడు గావునఁ, బ్రతుకుదుఁ గా కనుచు నాశ ♦ బాధించె ననున్.

అర్థములు. నుతమతి = స్తోత్రము చేయఁబడిన మనస్సు గలవాఁడు, సదాగతికిన్=వాయువునకు, హుతవహతుల్యుఁడు=అగ్నితో సమానుఁడు.

తాత్పర్యము

పొగడఁబడు మనస్సు గల హనుమంతుఁడు గమనమున వాయుదేవునితోడను, వీర్యాతిశయమున నగ్ని దేవుని తోడను సమానుఁడు. కావున నింకను బ్రదుకుదును గాక యను నాశ నన్ను బాధించెను. దీనివలన నెట్టికష్టదశయందైనను నెట్టివానికైనను ఇంకను జీవింపవలయు నను నాశ జీవునకు స్వభావ మని యేర్పడుచున్నది.

చ. అన హనుమంతుఁ డయ్యనఘు♦నంఘ్రుల వాలి మహాత్మ! యే మరు
త్తనయుఁడ వచ్చినాఁడ ననఁ ♦ దల్లి పితంబుల నాలకించియున్

మనమునఁ గుంది వెండి నిజ • మాతృదరంబునఁ బుట్టినట్టు ల
వ్వనజజసంభవుం డలరి • వాయుతనూజునితోడ నిట్లనున్.

అర్థములు. అంఘ్రులన్ = పాదములందు, మరుత్తనయుఁడన్ = వాయుపుత్రుఁడను, తల్లపితంబులు = ఆ మాటలు, మాతృ + ఉదరంబునన్ = తల్లిగర్భమున, వనజజ సంభవుండు=బ్రహ్మకొడుకు జాంబవంతుఁడు, అలరి=సంతోషించి.

తాత్పర్యము

అని చెప్పఁగా హనుమంతుఁడా పుణ్యాత్ముపాదముల వ్రాలి మరుత్తనయుఁడ వచ్చినాఁడ నని యభివాదనముచేసి చెప్పఁగా నా మాటలువినియునుబాణవేదనచే మనస్సున సంకటపడి మరలఁ దన తల్లికడుపునఁ దాను బుట్టినట్లుగా నెంచుకొని యా జాంబవంతుఁడు సంతోషించి హనుమంతునితో నిట్లనియె.

**—• జాంబవంతుఁడు హనుమంతుని సంజీవకరణిఁ దేర నియోగించుట •—**

కం. రమ్మా హరిశార్దూలా ! యిమ్మర్కటబలముఁ గావ • నీవే గతి శౌ
ర్యమ్మున నీసరు లే రీ, సమ్మతి మాకెల్లఁ బరమ • సఖుఁడవు గావే. ౧౭౬౫

తాత్పర్యము స్పష్టము

ఉ. అన్న ! భవత్సమానబలు • నన్యుని నారసి కాన నెందు లో
కోన్నత శౌర్యశాలివి త్వ • దుగ్రపరాక్రమ మెల్లఁ జూపఁగాఁ
జెన్నగు వేళ యియ్యదియ • చేకుఱెఁ గీశులు భల్లుకంబులున్
సన్నుతరామలక్ష్మణులు • సంతస మొంద నొనర్పుమీ వెసన్. ౧౭౬౬

తాత్పర్యము

అన్నా యాంజనేయా ! నీతో సమానుఁడగు బలవంతుని నేనెందు వెదకినను లేఁడు. నీవు లోకోన్నతశౌర్యశాలివి. లోకమున నందఱికంటె నీవు గొప్ప బలవంతుఁడవు. నీ యధికపరాక్రమ మంతయుఁ జూపఁదగిన సమయమిపుడేలభించినది. వానరులను, భల్లుకములను, రామలక్ష్మణులను వేగ సంతోషింపఁజేయుము.

సీ. అంజనాతనయ ! నీ • వంబుధిఁ ధరియించి, యెంతయు దూరంబు • నేగి శీత
శైలంబుఁ గని వెండి • స్వర్ణమయం బగు, ఋషభశైలాన మ • హీధరములఁ
గనుఁగొని తన్మధ్య • మున ఘనప్రభ మయి, సర్వౌషధులచే • జానుమీఱు
నోషధిగిరిఁ గాంచు • మూర్ధ్వధరాగ్రంబు, నం దమదీప్తి న • మందముగను
తే. దెసల వెలిఁగించునోషధుల్ • దోసఁగునాల్గు, వానికాంతులచే వాని • వలనెఱింగి
నీవు వే మృతసంజీవ • నిని విశల్య,కరణి సావర్ణ్యసంధాన • కరణు లనఁగ. ౧౭౬౭

అర్థములు. సర్వౌషధులచే = అన్ని విధములయిన మూలికలచే (౨) సర్వౌషధ మూలికలచే, జానుమీఱు=అందమైన, ఓషధిగిరి = మూలికలకొండ.

తాత్పర్యము

నీవు సముద్రముదాఁటి చాలదూరముపోయి హిమవత్పర్వతముఁజూచి అందు ఋషభశైలము కైలాసమను పర్వతములఁజూచి వాని నడుమ మిక్కిలి కాంతిగలదై సర్వౌషధులు గలిగి యందమైన మూలికలకొండఁజూచి యా పర్వతము కొన యందు నధికమైన తమ కాంతిచే దిక్కుల వెలిగించు మూలికల నాల్గింటిఁజూడుము వాని కాంతులచేతనే వానిని నీవు గుర్తింపఁ గలవు. అందు మృతసంజీవని (చచ్చిన వారిని బ్రదికించునది) విశల్యకరణి (దేహమున నాటిన యితర పదార్థములను బాణముల ములుకులు మొదలైన వానిని నూడఁదీయునది) సావర్ణ్యకరణి (గాయములచే వన్నె మాఱినచోట మరల వన్నె వచ్చునట్లు చేయునది) సంధానకరణి (విఱిగిన యెముకలను అవయవములను మరలఁ గలుసుకొనునట్లు చేయునది) ఇవి నాలుగు మూలికలు.

తే. పరఁగువానిని గొని జగ•త్ప్రాణతనయ, వచ్చి యాకీశసేనకుఁ • బ్రాణ మిమ్ము
పొమ్ము నీకు శుభం బగు • రమ్ము వేగ, అనిన నాతఁడు సంతోష•మతిశయిల్ల.

తాత్పర్యము స్పష్టము.

—• హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుటకై పోవుట •—

కం. అర్ణవము జలంబులచేఁ, బూర్ణం బగుభంగి దేహ•మును పెంచి బలో
దీర్ణుండై గిరిశిఖరముఁ, దూర్ణము తనపాదములను • దొడిఁబడఁ జేసెన్. ౧౯౬

అర్థములు. అర్ణవము=సముద్రము, బలోదీర్ణుండై = బలముచే గొప్పవాఁడై, గొప్ప బలముగలవాఁడై, గిరిశిఖరము=త్రికూటపర్వత శిఖరము, తొడిఁబడన్ = వణఁకునట్లు.

తాత్పర్యము స్పష్టము.

సీ. రెండవకొండనా • గంకు మీఱిన మారు, తాత్మజాతుని పాద•హతులకోర్వఁ
జాలక కంపించె • శైలంబు శృంగముల్, కుజములు ధరణిపైఁ • గూలఁబడియె
నా నగంబునఁ బ్లవ•గావళి లే, కడలున గడగడ • లాడె నపుడు
ఘూర్ణిత ద్వారమై • కుంఠితగేహమై, భగ్నగోపుర మయి•పట్టనంబు
తే. సాధ్వసాకుల మయి గొండ్లి•సలుపునట్లు, లయ్యె నారాత్రి నీ రీతి • హాటకాద్రి
మందరనగోపమాన మా • మలయగిరిని, నాకులప్రస్రవణము సు•రాన్వితంబు.

అర్థములు. పాదహతులకున్ =కాలిదెబ్బలకు, అడలున=భయముచే,ఘూర్ణిత ద్వారమై = శిథిలమైన వాకిండ్లు గలది, కుంఠితగేహము = విఱుగఁబడిన యిండ్లు గలది, భగ్నగోపురము = విఱిగిన గోపురములు గలదై, సాధ్వసాకులమయి = భయముచేఁ గలఁత నొందినదై, గొండ్లి = నర్తనము, హాటకాద్రి = బంగారు కొండ, మేరువు, మందరనగ = మందర పర్వతము, వీనితో — ఉపమాన=సమాన

మైన—మలయగిరిని = మలయపర్వతమును, ఇది లంకయందలి మలయము, ఆకుల = కలఁతపడిన ప్రస్రవణము = కొండవంకలు గలది, సురాన్వితంబు=దేవతలతోఁ గూడినది.

తాత్పర్యము

రెండవ కొండవలె నతిశయించిన హనుమంతుని కాలిదెబ్బలకు సహింపలేక పర్వతము శిఖరములు వణఁకెను. అందలి చెట్లు నేలఁబడెను. ఆ కొండమీఁద వానరులు నిలువలేక భయముచే గడగడ వణఁకిరి. ఆ రాత్రివేళ ద్వారములు శిథిలములయ్యెను. ఇండ్లు విఱుగఁబడెను. గోపురములు విఱిగెను. పట్టణము భయముచే నృత్యము సలిపినట్లు లయ్యెను. ఈ విధముగ మేరుమందర సమానమైన మలయపర్వతము, కలఁతపడిన సెలయేళ్ళు గలదానిని, దేవతలతోఁగూడినదానిని.

కం. నానాలతాద్రుకీర్ణము, నానావికసితకువాల • వళివచయంబున్
నానామృగసంకీర్ణము, నానాకందరము మౌని•నాథాంచితమున్. ౧౭౭౧

అర్థములు. నానాలతాద్రుకీర్ణము = అనేక విధములైన తీఁగలతోను చెట్లతోను వ్యాపింపఁబడినది, నానావికసిత కువాలవళీ చయమున్=అనేకవిధములైన వికసించిన కలువలు తామరలు గలది, నానామృగ=పెక్కు తెగల మృగములచే, సంకీర్ణము = వ్యాపించినది, నానాకందరము = అనేక గుహాలుకలది, మౌనినాథ + అంచితము = గొప్ప ఋషులచే నొప్పయినదానిని.

తాత్పర్యము

నానావిధములయిన తీఁగలతోను చెట్లతోను వ్యాపించినది, అనేక విధములైన వికసించిన కలువలను కమలములను గలది. అనేక మృగములచే నిండినది, అనేక గుహాలు కలది, ఋషీశ్వరులచే నొప్పునది.

తే. అంఘ్రులను ద్రొక్క బడబాము•లాభముఖము, విచ్చి గర్జించె భూతాళి•వీనులగల
నద్భుతారవమాలించి • యసురులెల్లఁ, గదలకిట్టటు లుండిరి • కమభయమున.

అర్థములు. అంఘ్రులను = కాళ్ళచే, బడబాముఖాభముఖము = బడబానలము నోటితో సమానమైన నోరు, విచ్చి = తెఱచి, అగలన్=పగులునట్లు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. భీమపరాక్రముండు హరి•వీరుఁడు భక్తిని రామచంద్రునిన్
దా మనసార మ్రొక్కి లిడి • దాశరథి ప్రియకార్యకర్మఠుం
డై ముఖ మొప్ప విచ్చి మహి•తాహినిభం బగు తోఁకనెత్తి సం
స్థామతి వీఁపు వంచి శ్రవ•ణంబులు గుంచి ప్రచండవేగుఁడై. ౧౭౭౩

అర్థములు. మనసారన్ = నిండుమనస్సుతో, దాశరథి ప్రియకార్య కర్మఠుండై = రామచంద్రమూర్తికిఁ బ్రియమైన కార్యమును జేయువాఁడై, దీనివలన నే కార్యము చేసినను ముందు భగవంతునికి నమస్కరించి భగవత్ప్రీతికరమైన

కార్యము చేయవలసినదని తెలియునది. ఇచ్చట భగవద్గీత ౧౨వ యధ్యాయమందలి ౧౦వ శ్లోకము.

> 'అభ్యాసే ప్యసమర్థోఽసి, మత్కర్మ పరమోభవ
> మదర్థమపి కర్మాణి, కుర్వన్ సిద్ధి మవాప్స్యసి'

అభ్యాసమందు నీవసమర్థుఁడ వైతివా నా కార్యములు చేయుము. నన్నుద్దేశించి నీవు కార్యములు చేసినను మోక్షము గందువు.

"జీవన్ముక్తః స్థితప్రజ్ఞో విమ్మథ క్తశ్చ కథ్యతే" విద్యారణ్యులు.

విమ్మథ క్తుఁడే జీవన్ముక్తుఁ డని స్థితప్రజ్ఞుఁ డని చెప్పఁబడు చున్నాఁడు.

మహిళాహినిభంబు=పెద్దపాముతో సమానమైనది, సంస్థామతి=చక్కఁగా నిలుపఁబడిన మనస్సు గలవాఁడై, ఏకాగ్రచిత్తుఁడై; ప్రచండ వేగుఁడై = తీవ్ర వేగము గలవాఁడై. ప్రముక్కులిడి యనుటచే ఒంటిదండము నిషిద్ధమని సూచన.

## తాత్పర్యము

భయంకరమైన పరాక్రమము గలవాఁడయ్యు నాంజనేయుఁడు తన స్వశక్తిపై నాధారపడక పూనిన కార్యము నిర్విఘ్నముగ నెఱవేఱుటకై భక్తితో రామచంద్ర మూర్తికి నిండు మనస్సుతో నమస్కారములు చేసి రామచంద్రమూర్తికిఁ బ్రియమైన కార్యము చేయు నిష్ఠగలవాఁడై యుత్సాహసూచకముగ ముఖము వికసింపఁ జేసి.తోఁకపై కెత్తి మనస్సు నేకాగ్రముగఁ జేసి నిట్ట నిలువున నెగురుటకు సాధ్య పడదు కావున పిఁఱువంచి బలము విజృంభించుటచే చెవులు గుంచి తీవ్ర వేగము గలవాఁడై.

సీ. కుప్పించి యెగిరినఁ గుధరస్థశిలలును, వృక్షషండంబులు • వెంటఁ జాతి
యావేగ మణఁగిన • నంబుధిలోఁ బడె, గరుడ వేగుం డయి • యురగయుగముఁ
బోలు చేతులు సాఁచి • పోరిఁబోరి దిక్కులు, కంపింపఁ విష్ణు•కరవిముక్త
చక్రం బనఁగ జాతె • సంఘూర్ణితతరంగ, జాలము భ్రామిత•సర్వసత్త్వ
తే. మైన వననిధిఁ గాంచుచు • నరిగి యరిగి, మార్గమందు నదీనద•మహిజషండ
హారిపురముఁ గనుచు నీ•హారనగముఁ, గాంచి విధిసుతునుడుల స్మ•రించి యేగి.

అర్థములు. కుధరస్థశిలలు = పర్వతమునందున్న ఱాలు, వృక్షషండంబు= చెట్లగుంపులు, ఉరగయుగము = పాములజత, విష్ణుకర విముక్త చక్రము = విష్ణు దేవునిచే విడువఁబడిన చక్రము, ఇది వేగమును అప్రతిహతత్వమును సూచించును, సంఘూర్ణిత తరంగజాలము = తిరుగుడు పడిన అలల సమూహముగలది, భ్రామిత= భ్రమచెందిన, సర్వసత్త్వము = సమస్త జంతువులు గలది, వననిధిన్ = సముద్రమును, నదీనద మహిజషండహారిపురములన్ =నదులను నదములను చెట్లతోఁపులను మనోహరములైన పురములను, నీహారనగము=హిమవంతము, విధిసుతు = జాంబవంతుని యొక్క, నుడులన్ = మాటలను, స్మరించి = జ్ఞప్తికిఁ దెచ్చుకొని.

### తాత్పర్యము

కుప్పించి యెగయఁగాఁ గొండయందున్న తాలు చెట్లసమూహములు వెంటఁ బరువెత్తి వేగము తగ్గఁగానే సముద్రములోఁబడెను. గరుడుని వేగము గలవాఁడై పాముల జంటవలెఁ జేతులుచాఁచి దిక్కులు వణకఁగా విష్ణువువిడిచిన చక్రమువలెఁ బయనంబోయెను. ఆ వేగమునకు సముద్రమున నలలు తిరుగుడు పడెను. సమస్త జంతువులు భ్రమగొనెను. ఇట్టి సముద్రమును జూచుచుఁబోయి పోయి త్రోవలో నదులను వనములను తోఁటలను తోఁపులను పురములను జూచుచు మంచుఁగొండ చేరి జాంబవంతుని మాటలు జ్ఞప్తికిఁ దెచ్చుకొని పోయి.

కం. బహుకందరనిర్ఝరమై బహుళప్రస్రవణయుక్తిఁ • బరఁగుచు నానా
మహిజగుహాన్వితంబై, మహితసితాభ్రాభశృంగ • మంజులమగుచున్. ౫౮

అర్థములు. బహుకందర నిర్ఝరమై = అనేక గుహలు సెలయేఁళ్ళు గలదై, బహుళ ప్రస్రవణ యుక్తిన్=అనేకజలపాతములతోఁగూడి (Water falls) నానా మహిజగుహాన్వితంబై = అనేకములయిన చెట్లు గుహలు గలదై. మహిత=గొప్పదగు, సితాభ్రాభ = తెల్ల మేఘము వంటి, శృంగయుు = శిఖరముగలదై, మంజులము = మనోహరము.

### తాత్పర్యము

అనేక గుహలలోనుండి వెడలు సెలయేళ్ళు గలదై అనేక జలపాతములు ఆకాశగంగవలె నీళ్ళు దూఁకుటలు గలదై అనేక చెట్లతో గుహలు గలదై తెల్లని పెద్ద మేఘముతో సమానమై మనోహరమై.

అహ మభ్యసించి దేహమునుండి జీవుని వెలికిదీయఁగలవారు నొక్కొక్క వేళ జీవుని గమనము వేగము స్మరించిరేని హనుమంతుని గమనవేగ మెట్టిదై నదికొంతకుఁ గొంత యూహింపఁగలరు. తక్కినవారి కిట్టి వేగము నూహింప నసాధ్యమనియే తోఁచును. ఎద్దు బండిలో ప్రయాణము చేయు గ్రామ్యుఁడు విస్యుచ్ఛకటము వేగమును నూహింపఁగలఁడా? చెప్పిన నమ్మునా? చెప్పుటెట్లు?

సీ. తనరారు హిమగిరిఁ • దటియఁగ నేగి ప్రవృద్ధఘోరోత్తమ • శృంగతలము
పుణ్యాశ్రమంబులు • మునిజనయుతములు, పరమమతిం గని • బ్రహ్మకోశ
మలరజతాద్రిని • హరిహయాలయమును, నుగ్రబాణప్రమో • క్షోరుతలము
హయముఖు సందీప్త • మగుబ్రహ్మశిరమును, యముని కింకరుల వ • జ్రాలయంబు
తే. నబ్జహితతేజ మగుధన • దాలయంబు, నర్కబంధనతలము బ్ర • హ్మాసనంబు
వసుమతీనాభిఁ గైలాస • పరిసరమున, నొప్పు హిమవచ్ఛిలను బుష • భోగ్రధరము

అర్థములు. తటియఁగనేగి = సమీపించి, ప్రవృద్ధ = ఎత్తుగాఁ బెరిఁగిన, ఘోర=భయంకరమైన, ఉత్తమ శృంగతలము=శ్రేష్ఠమైనశిఖర ప్రదేశము, బ్రహ్మకోశము=బ్రహ్మతపస్సు చేసిన స్థలము, ఇందుకోశమనఁగాగృహమనియర్థము. 'కోశో గృహే దేహే' యని నానా.ర. రజతాద్రిని=కైలాసమును, హరిహయాలయమున=

ఇంద్రుని వాసస్థానమును, ఉగ్ర = శివునియొక్క - బాణప్రమోక్షోరుతలము= బాణములు విడుచు గొప్పప్రదేశమును, హయముఖు = హయగ్రీవుని, వందీ_త్త ముగు = ఆరాధించిన స్థలము, బ్రహ్మశిరము = రుద్రుఁడు ఛేదించిన బ్రహ్మశిరః కపాలము బ్రహ్మహత్యయై ఆయన చేతిలో నంటుకొనియుండి యచ్చట లక్ష్మీదేవి కపాలమందు భిక్ష వేయఁగా నది దిగువఁబడి పోయినచోటు, వజ్రాలయము=బ్రహ్మ యింద్రునికి వజ్రమిచ్చిన స్థలము, అర్క-బంధనతలము = విశ్వకర్మ ఛాయాదేవి ప్రీత్యర్థమై సూర్యుని కాంతి తగ్గించుటకు సూర్యుని సానపెట్టిన స్థలము, బ్రహ్మ సనము = దేవతలకు దర్శన మిచ్చుటకై బ్రహ్మ కూర్చుండుస్థలము, వసుమతీ నాభి = పాతాళమునఁ బ్రవేశించుటకైన భూరంధ్రము, హిమవచ్ఛిలను = కైలాస సమీపమున హిమవచ్ఛిల యని యొకశిల గలదు. ఋషభ + ఉగ్రధరము=ఋషభ మను పేరు గల భయంకరపర్వతము. ఓషధులు దీని యందుండును.

తాత్పర్యము

ఒప్పుచున్న హిమవత్పర్వతము సమీపించి మిగులనున్నతమైన భయంకర మైన శ్రేష్ఠమైన శిఖర ప్రదేశము మునిజను లుండు పుణ్యాశ్రమములు మిగుల భక్తి శ్రద్ధలతో జూచి బ్రహ్మకోశము, కైలాసము, హరిహయగృహము, రుద్రుఁడు బాణ ములను వినోదమునకై వేయుస్థలము, హయగ్రీవునివర్షించిన బ్రహ్మశిరము, యమకింక రులను వజ్రము నాలయము, సూర్యకాంతిగల కుబేరు గృహము,సూర్యుని సానకుఁ గట్టిన స్థలము, బ్రహ్మాసనము, భూనాభి, కైలాస ప్రాంతమునసుండు హిమవచ్ఛిలను ఋషభపర్వతమును.

కం. సర్వౌషధి సందీప్తము, సర్వౌషధినగము సూర్య • సన్నిభమును మే
ఘూర్వనిమా తాత్మభవుఁ డ,ఖర్వాశ్చర్యైకమతిని•గనుఁగొనె నచటన్. ౧౭౭౭

సర్వౌషధి సందీప్తము=సర్వౌషధులచే బ్రకాశించునది, సూర్యసన్నిభము రాత్రివేళ నివి ప్రకాశించుటచే సూర్యుఁడు ప్రకాశించినట్లే యుండెనని భావము. మేఘూర్వని దూత = వాయువుయొక్క, ఇంద్రుఁడు మేఘవాహనుఁడు, మేఘము లను దోలువాఁడు వాయువు, కావున వాయువు ఇంద్రదూత యనఁబడెను. శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక కాలమున నింద్రప్రేరితుఁడై వాయువు శ్రీరామునకు హార మర్పించెను. అదియును వాయు వింద్రదూత యనుట బల పఱుచు చున్నది, అఖర్వ = విస్తారమైన, ఆశ్చర్యైకమతిని = ఆశ్చర్యము విశేష ముగఁ గల మనస్సుతో.

—• హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుట •—

చ. వనచరభర్త యోషధుల • వారక రోయుచు నొక్క వేయి యో
జనములు సంచరింప నిజ • సంగ్రహణార్థము వచ్చె నవ్వఁటో

యని తలపోసి యోషధిచ♦యంబులు వే మఱుఁగెం, గపీంద్రుఁడున్
గినుకను దామ్రచక్షుఁ డయి ♦ శేరి మహాపర్వతుఁ బల్కెఁ బర్గిరిన్. ౧౭౭౮

అర్థములు. నిజసంగ్రహణార్థము = తమ్ము హరించుకొని పోవుటచే, మఱుఁగెన్ = దాఁగుకొనెను, కానరాక పోయెను.

తా త్ప ర్య ము

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు మూలికలకై వేయి యోజనములస్థలము వెదకెను. ఆ మూలికలు తమ్మెవఁడో తీసికొని పోవుటకై వచ్చినాఁడని తెలిసికొని కానరాక పోయెను. అవి కానరాక పోఁగా హనుమంతుఁడు కన్ను లెఱ్ఱచేసి పెద్ద ధ్వనితో నా కొండతో నిట్లనియె.

ఉ. ఏమి నగోత్తమా ! కరుణ♦యింతయు లేదుగ రామచంద్రుపై ?
నేమని యోషధిప్రతతి ♦ నిట్టు లణంచితి లోనఁ? నిద్దియే
నీ మది నిశ్చితంబ యగు♦నేని మదీయభుజాభిఘాతమై
యే మయి పోదువో యెఱుఁగు♦దే? యిదిగో నినుఁ బిండిగొట్టెదన్. ౧౭౭౯

అర్థములు. మదీయభుజాభిఘాతమై = నా చేతులచే నవమానింపఁ బడినవాఁడవై.

తా త్ప ర్య ము

ఏమి పర్వతోత్తమా ! రామచంద్రమూర్తి మీఁద నీకుఁ గొంచెమైన దయ లేదా యేఁగదా, ఏమని నీవోషధుల దాఁచి పెట్టితివి ? రామచంద్రమూర్తికి సహాయము చేయఁగూడదనియా? నా యందు లక్ష్యభావము లేకయా? ఓషధులు నాకు లభింపనీయరాదనియే నీ నిశ్చయాభిప్రాయమేని నాచే నెట్లు పరాభవింపఁబడుదునో యది నీ వెఱుంగుదువా ? ఇదిగో నిన్నిప్పుడే పిండిగొట్టెదను.

చ. అనుచు సకాంచనంబును స♦నాగము ధాతుసహస్రజుష్టమున్
ఘనతరశృంగమున్ రవిని♦కాశము శైలముఁ దోడఁ బాఁతుతో
ననఘుఁడు పెల్లగించి జల♦దాధ్వము మీఁదికి నుద్గమించి చ
య్యనఁ జనుదెంచె ఖేచరు ల♦హో యనుచున్ స్తుతియించుచుండఁగన్. ౧౭౮౦

అర్థములు. సకాంచనము = బంగారు గనులతోఁ గూడినది, సనాగము = సర్పములతోఁ గూడినది, "నాగ స్సర్పే గజే మేఘే పున్నాగే నాగకేసరే" నానార్థ. ధాతుసహస్రజుష్టము=అనేక గైరిక ధాతువులతోఁ గూడినది, ఘనతర శృంగమున్= మిగుల గొప్పదగు శిఖరము గలది, రవినికాశము = సూర్యప్రకాశము గలది, పాఁతుతోన్ = అనుగుతో,. జలదాధ్వము మీఁదికిన్ = ఆకాశము మీఁదికి, ఉద్గమించి=ఎగిరి, ఖేచరులు=ఆకాశమున సంచరించు దేవతలు మొదలగువారు.

తా త్ప ర్య ము

అని చెప్పి బంగారుగనులతో సర్పములతో నానాధాతువులతో గూడినదియు, గొప్ప శిఖరము గలదియు, సూర్యునితోఁ సమానమైన కాంతిగలదియునగు

శైలమును పాతుతోఁ బెల్లగించి యాకాశమున కెగిరి దేవతలు మెచ్చుకొనుచుండ శీఘ్రముగా వచ్చెను.

కం. భాస్కరమార్గగుఁ డై యా,భాస్కర శిష్యుండు దాల్చి • భాస్కరనిభమున్
భాస్కరసమీపగునిఁ బ్రతి,భాస్కరునింబోలెఁ దీవ్ర•భాస్కరుఁ డగుచున్.

అర్థములు. భాస్కరమార్గగుఁడై = సూర్యుని మార్గము, ఆకాశమును బొందినవాఁడై, భాస్కర శిష్యుండు=హనుమంతుఁడు, భాస్కరనిభమున్=సూర్యునితో సమానమైన కాంతిగలదానిని, భాస్కర సమీపగుని = సూర్యుని సమీపమందుండువానిని, ప్రతిభాస్కరునిన్ = రెండవ సూర్యుని, తీవ్రభాస్ + కరుఁడు = అతిశయించిన కాంతి గలిగించువాఁడు.

తాత్పర్యము

సూర్యకాంతి గల యాపర్వతమును హనుమంతుఁడు చేత ధరించి యాకాశ మార్గముఁబట్టి మిగులఁ గాంతి గలిగించువాఁడగుచు సూర్యుని సమీపమున నున్న రెండవ సూర్యునివలె నుండెను. సూర్యునియొద్ద రెండవ సూర్యుఁ డనుటచే సూర్యోదయ మని చెప్పరాదు. ఏలన నీ రాత్రికాలమందే లంకాదహనము చెప్పఁబడఁ గలదు. ఓషధులచే వెలుగు పర్వత మొక సూర్యుడనియు సహజ కాంతిగల హనుమంతుఁడు రెండవ సూర్యుఁడనియు గ్రహింపవలెను. అప్పుడే సమీపముననున్న యను విశేషణము సార్థకమగును. ఆకాశమున నుండువానికి భూమిమీఁద నుండు వాఁడు సమీపస్థుఁ డెట్లు కాఁగలఁడు.

కం. శైలధరుఁడు పావని యు,త్తాలాభీలము సహస్ర•ధారము చక్రం
బోలి ధరించిన విష్ణువు, పోలెన్ రాజిల్లెఁ బగఱు • పారి భీతిల్లన్. ౧౮౭

అర్థములు. శైలధరుఁడు = పర్వతమును ధరించినవాఁడు, పావని = హనుమంతుఁడు, ఉత్తాలాభీలము = విశేష భయంకరమైనది, సహస్రధారము = వేయియంచులు గలది, చక్రము = సుదర్శన మను చక్రము, పగఱు=పగవారు, ఉత్తాలాభీలము, చక్రము ధరించిన విష్ణువనుటచే చక్రధరుఁడైన విష్ణు వెట్లు రాక్షసులకు భయంకరుఁడో, ఆశ్రితులకు నానందకరుఁడో యట్లు పర్వతధరుఁ డగు హనుమంతుఁడు రాక్షసులకు భయంకరుఁడు, వానరులకు నానందకరుఁ డని భావము.

తాత్పర్యము

శైలమును ధరించిన హనుమంతుఁడు మిగుల భయంకరమై వేయిధారలు గల సుదర్శన చక్రమును ధరించిన విష్ణువువలె పగవారు మిగుల భయపడునట్లు ప్రకాశించెను.

## —• సంజీవనిచే వానరాదులు జీవించుట •—

ఉ. వాయుసుతుండు దూరమున • వచ్చుచు నుండఁగ నోషధీలతా
వాయువు సోఁకి వానరులు • ప్రాణములం గని యొల్లవారు న

చ్ఛాయను జూచి కేక లిడ • సమ్మద మారఁగ బావమాని గ
ర్జాయతి మాఱటలుం గిడెను • నాశరులున్ వెఱ బొబ్బరింపఁగన్. ౧౭౦౩

అర్థములు. ఓషధీలతావాయువు = మూలికల తీఁగల మీఁదనుండివచ్చిన గాలి, అచ్ఛాయను = హనుమంతుఁడు వచ్చు దిక్కును, గర్జాయతి = పెద్దగర్జచే, వెఱన్=భయముచే, బొబ్బరింపఁగన్=బొబ్బలుపెట్టఁగా, పెద్దగాఁగూయఁగా.

తాత్పర్యము

హనుమంతుఁడు దూరమున వచ్చుచుండఁగనే మూలికలమీఁదనుండివచ్చిన గాలి సోఁకుటచేతనే వానరు లందఱుఁ బ్రాణములఁ గనిరి. ఇట్లు ప్రాణములు వచ్చినవారై హనుమంతుఁడు వచ్చు దిక్కునుజూచి నిండు సంతోషముతోఁ గేకలు వేసిరి. హనుమంతుఁడు రాక్షసులు భయముచే బా—బా యని యఱచుచుండఁగ పెద్ద ప్రతిధ్వని యిచ్చెను.

కం. ఈనెఱి దించి గిరిం ద,ద్వానరమధ్యమునఁ బెద్ద • వారికి మ్రొక్కున్
మానుగఁ గౌఁగిటఁ జేర్చెను, దానవవిభుగంధవాహ•తనయుఁడు ప్రీతిన్. ౧౭౦౪

తాత్పర్యము

ఈ విధముగఁ గొండను వానరుల నడుమ దించి పెద్దవారలగు జాంబవత్సుగ్రీవాదులకునమస్కరించెను. విభీషణుని ప్రేమతోఁ గౌఁగిలించెను. (సమానుఁడగుటచే)

చ. వలనుగ నమ్మహౌషధుల • వాసన మూర్కొని రామలక్ష్మణుల్
తెలివి వహించి లేచి కడు • దేఱిరి, చచ్చిన క్రోఁతిమూఁకలున్
బలితపునిద్ర నుండి తెల•వాఱిన మేల్కను భంగి లేచి క్రొం
జెలువు వహించె; రాక్షసుల • జీవితుఁ డొక్కఁడుగాఁడ డేలనన్. ౧౭౦౫

అర్థములు. వలనుగన్ = తక్కువవిధముగ, మూర్కొని = వాసనచూచి.

తాత్పర్యము

తగినవిధముగ నా మహామూలికల వాసన చూచి రామలక్ష్మణులు స్మృతి గలవారై లేచి మిగుల తెప్పతిల్లుకొనిరి. చచ్చిన వానరుల గుంపులుగాఢనిద్రనుండి మేలుకొనినవారివలె లేచి క్రొత్తకాంతి వహించెను. వానరు లందఱు బ్రదికిరిగాని రాక్షసులం దొకఁడైన బ్రదికినవాఁడు లేడు. ఏలన,

కం. పోరు మొదలాశరులు కపి,వీరులచేఁ జచ్చు నసుర•వీరుల నపుడే
నీరనిధిఁ ద్రోయుచుండిరి, గౌరవహేతువునఁ బంక్తి•కంఠునియాజ్ఞన్. ౧౭౦౬

తాత్పర్యము

యుద్ధము ప్రారంభమైనది మొదలు వానరులచేఁ జచ్చిన రాక్షసుల నప్పుడపుడే రావణుని యాజ్ఞప్రకారము చచ్చినను శత్రువులకుఁ జిక్కుట యగౌరవమను కారణమున బ్రదికినవారు సముద్రములోఁ బాఱవేయుచుండిరి.

కం. కార్యంబు దీర మహితా,హార్యంబును గొంచు మరల • నరిగి త్వర హతా
నార్యుం డెప్పటి స్థితి నిడి, యార్య రఘూత్తమునిఁ జేర • నరుదేరంగన్. ౧౭౪౭

అర్థములు. మహితాహార్యంబును=గొప్పకొండను, హత = చంపబడిన, అనార్యుండు = దుష్టులు గలవాఁడు.

తాత్పర్యము స్పష్టము

—• ౭౫-వ సర్గము. సుగ్రీవుఁడు లంకఁ గాల్పఁ గపుల నాజ్ఞాపించుట •—

ఉ. వానరవల్లభుండు హరి • వైరినికారసముద్భవాగ్రహా
నూనపరీతచిత్తుఁ డయి • యుక్తవిధంబునఁ బల్కె నా హనూ
మానునితోడఁ దమ్ములుఁ గు • మారులు చచ్చుట శోకతప్తుఁడై
దానవవల్లభుం డనికిఁ • దా నరుదేరఁడు కాన వీరలున్. ౧౭౪౮

అర్థములు. హరివైరి = ఇంద్రజిత్తుయొక్క, నికార = అపకారముచే, వంచనచే, సముద్భవ = పుట్టిన, ఆగ్రహా = కోపముచే, అనూన = పూర్ణముగా, పరీతచిత్తుఁడయి=చుట్టఁబడిన మనస్సుగలవాఁడై, యుక్తవిధంబునన్=తగినరీతిగా.

తాత్పర్యము

సుగ్రీవుఁ డింద్రజిత్తు మోసవిధముగఁ జేసిన యపకారమువలనఁ గోపించిన మనస్సు గలవాఁడై తగిన విధంబుగ హనుమంతుని తోడ నిట్లనియె. రావణుఁడు తన తమ్ములు కొడుకులు చచ్చుటచే శోకముచేఁ దపించినవాఁడై యుద్ధమునకు రాక యున్నాఁడు, వాడు రాకుండిన మన మేల యూరకుండవలె వీరు.

కం. నెఱసరులును లాఘవయుతు, లఱగొఱ లే కెల్లవార • లరిది జవమునన్
గొఱవులఁ గొని లంకాపురిఁ జుఱపుచ్చఁ డటన్న నెల్ల • శూరవరేణ్యుల్. ౧౭౪౯

అర్థములు. నెఱసరులు=శూరులు, అఱకొఱలేక = సంకోచింపక, కొఱత లేక - చుఱపుచ్చుఁడు=కొల్లగొట్టుఁడు.

తాత్పర్యము స్పష్టము.

శా. రౌద్రంబైన నిశాముఖంబున రుమా • రంభుల్ ప్లవంగేంద్రు లా
క్రమాసంభవు లట్టు లార్పుచును ను • ల్కాహస్తులై లంక న
త్యుద్రాటోపములోడఁ జొచ్చి పురర • క్షుల్ రాక్షసుల్ భీతిమైఁ
బ్రద్రావోన్ముఖు లైన సంతసమునం • బ్రాసాదగేహాళులన్. ౧౭౫౦

అర్థములు. రౌద్రంబైన = గాఢాంధకారముచే భయంకరమైన, నిశా ముఖంబునన్ = రాత్రి ప్రారంభవేళ, సూర్యాస్తమానమైన యరజామునకుఁగాని రాత్రి ప్రారంభముకాదు. అంతవఱకుసంధివేళయేప్రదోషవేళయే. సూర్యాస్తమా నానంతరము హనుమద్విభీషణులు జాంబవంతుని జూచుట హనుమంతుఁడు సంజీవని తెచ్చుట యంతయు నెనిమిది తొనిమిదిన్నర గంటల లోపల ముగిసెను. ఇప్పుడు తొమ్మిదిగంటలకాలము కావున నిది నిశకుఁ బ్రారంభకాలమే యగుచున్నది.

కావుననే రౌద్రము, రుషారంభుల్=కోపముయొక్క ఆరంభము గలవారు. కోపించినవారు, చేయఁదగిన కార్యము చేయఁబూనినవారు, క్రుద్ధాపంథవులు = సర్పములు, ఉల్కాహస్తులై = చేతులందుఁ గొఱవులు తీసికొనినవారలై, అత్యుగ్ర=కొంచెము గానట్టి, ఆటోపముతోడన్=వేగిరపాటులో, ప్రద్రావోన్ముఖులై పన్ = పరువెత్తిపోఁగా, ప్రాసాదగేహాళులన్ = మేడలను మిద్దెలను.

## తాత్పర్యము

గాఢాంధకారమగుటచే భయంకరమైన యారాత్రి ప్రారంభకాలమందు రోషారంభముగల వానరశ్రేష్ఠులు రోషముచే సర్పములవలె బుసలుగొట్టుచు చేతులలోఁ గొఱవులు దీసికొని మిక్కిలి వేగిరపాటుతో గవనుల కావలియున్న రాక్షసులు భయపడి పరువెత్తఁగా సంతోషించి లంకలోఁ బ్రవేశించి మేడలు మిద్దెలు.

తే. గోపురాట్టప్రతోళులఁ • గూటములను, నగ్నిసంతర్పణముఁ జేసి • రార్చు లెసఁగఁ
గొండలవనుండు ప్రాసాద • కాండములును, దబ్బుదబ్బున నులివుల • ధరణిఁ గూలె.

అర్థములు. గోపుర = గవనులు, అట్ట = బురుజులు, ప్రతోళులు=వీధికూటములు, కూటములు = చావళ్ళు, ప్రాసాద=మేడలయిండ్లు, కాండములు = సమూహములు (ధనికుల యిండ్లు). ఉలివులన్=ధ్వనులతో, కూలెన్=పడెను.

## —• కపులు లంకఁ గాల్చుట •—

సీ. అగరు చెక్కలు మేలి • హరిచందనంబులు, మందుచు మేల్ పరి • మళము లీను
మౌక్తికంబులు వజ్ర • మణులు ప్రవాళముల్, శంఖసంఘములు భ • స్మంబులయ్యెఁ
గౌశేయరాసులు • క్షౌమసంతానముల్, మడతలు మడతలు • మాయమయ్యెఁ
గంబళంబులు రమ్య • కాంచనభాండంబు, లాజభాండపరిచ్ఛ • దాళి చెడియెఁ
తే. గరులసొమ్ములు రథభాండ • పరికరములు, కవచములు గజరాజులఁ • గప్పుచేల
లతులఖడ్గధనుర్జ్యాస్వ • లాయుధములు, శూలములు శక్తులునుగాలి • చూర్ణమయ్యె

అర్థములు. అగరు = అగరు, మేలి = శ్రేష్ఠమైన వాసనగల హరిచందనంబులు=గంధపుఁ జెక్కలు, పరిమళములు=సువాసనలు, ప్రవాళములున్=పగడములు, కౌశేయరాసులు = పట్టువస్త్రములు, క్షౌమసంతానముల్ = తెల్లని పట్టువస్త్రములు—ఇది వేఱుగాఁ జెప్పుటచేఁ గౌశేయశబ్దమునకు నితర వర్ణముల పట్టువస్త్రములని యర్థము గ్రహింపవలెను. మడచిపెట్టఁబడినది. మడఁత, కాంచనభాండంబులు = బంగారు సొమ్ములు, పరిచ్ఛదాళి = పరికరముల సమూహములు, భాండంతు మార్జనే, వణిఙ్మూలధనే పాత్రే భూషణేచాశ్వభూషణే॥ నానా॥ర. అజభాండ=మేకలకు వేయు సొమ్ములు, పరిచ్ఛదము=కప్పెడు వస్త్రములు, ఆళి=పంక్తులు, భాండము లనుటచేతనే సర్వాభరణములు చెప్పఁబడినను మరల అజభాండము లను వాని వానికిఁ దగినసొమ్ములని తెలుపుటకై యని గ్రహింపవలయును.

తాత్పర్యము

అగరుచెక్కలు గంధపుఁ జెక్కలు గాలి మంచివాసనలు కలిగించుచుండెను. ముత్యములు వజ్రములు పగడములు శంఖములు గాలి భస్మములయ్యెను. రంగుల పట్టు వస్త్రములు తెల్లపట్టు వస్త్రములు మడఁతలు మడఁతలుగానే కాలిపోయెను. కంబళ్ళు మనోహరములైన బంగారు నగలు మేఁకలు బొమ్మలు కప్పు వస్త్రములు చెడిపోయెను. ఏనుఁగుల బొమ్మలు తేరి యలంకారములు పరికరములు కవచములు ఏనుఁగులకు గుఱ్ఱములకుఁ గప్పు వస్త్రములు ఖడ్గములు విండ్లు అస్త్రశస్త్రాదులు ఆయుధములు శూలములు శక్తులు కాలి చూర్ణమయ్యెను.

సీ. వాలజరోమజ ♦ వ్యాఘ్ర చర్మములు, బహుళాండజంబులు ♦ పాడు లయ్యె
 ముక్తామణివిచిత్ర ♦ ములు పెనుమేడలు, నస్త్రిమందిరములు ♦ నణఁగి పోయె
 వేనవే లసురుల ♦ వీడులు బూదయ్యె, రాజితవరతను ♦ త్రాణధరులు
 దామహారాంబర ♦ ధారులు మధుపాన, చంచలనేత్రులు ♦ జాతరుషులు
తే. వల్లభలతోడ నిద్రించు♦వారు త్రాగు.వారు తినువారు భీతిల్లు♦వారు పరుగు
 పాఱువారును నాయుధ♦పాణు లైన,వార లెల్లరుఁ బావకు♦వాతఁ బడిరి.

అర్థములు. వాలజ = తోఁకల వలనఁ గలిగిన చామరములు లోనైనవి, రోమజ = వెండ్రుకల వలనఁ గలిగిన కంబళ్ళు తివాచులు లోనైనవి, వ్యాఘ్ర చర్మములు = పులితోళ్ళతోఁ జేయఁబడినవి, బహుళ = అనేకములైన, అండజములు = గ్రుడ్లవలన నైనవి, రాజత్ = ప్రకాశించు, వర=శ్రేష్ఠములైన, తనుత్రాణధరులు = కవచముల ధరించినవారు, దామహారాంబరధారులు = సరములు ముత్యాలదండలు మంచివస్త్రములు ధరించినవారు, మధుపాన = సారాయము త్రాగుటచే, చంచల=కదలుచున్న, నేత్రులు=కన్నులు గలవారు, జాతరుషులు= పుట్టినకోపము గలవారు,వల్లభలతోడన్=భార్యలతో, పావకువాతన్=అగ్నినోట.

తాత్పర్యము

తోఁకలవలనఁగలిగిన చామరములు వెండ్రుకలవలనఁ గలిగిన కంబళ్లు తివాచులు, పులితోళ్ళవలనఁ గలిగినవి, గ్రుడ్లవలనఁ గలిగినవి, ముత్యములచే నలంకరింపఁబడినవి, పెద్దమేడలు, అస్త్రములుంచిన యిండ్లుఅన్నియు నాశనమయ్యెను. వేలకొలఁది రాక్షసుల యిండ్లుబూడిదయ్యెను.కవచములుధరించినవారు,మాల్యములు ముత్యాల సరములు మంచివస్త్రములు ధరించినవారు, సారాయముత్రాగి కన్నులు తిరుగువారు కోపించినవారు భార్యలతో నిద్రించువారు త్రాగువారు తినువారు భయపడువారు పరువెత్తువారు ఆయుధములు ధరించినవారు అందఱు కాలిపోయిరి.

సీ. భార్యలు తమకొంగు ♦ పట్టఁబాఱెడివారు, పొగ నేదితోఁపక ♦ పోగులువారు
 చంక బిడ్డలతోడ ♦ జలదరించెడివారు పరువిడుచో నేలఁ ♦ బడెడివారు

తమవారికై యేగి ♦ తామఁ గాలెడివారు, తొలఁగినవారిని ♦ బిలుచువారు
= కొడుకా! యటంచును♦గోడలా! యంచును, కూఁతురా! యని బిగ్గ♦కూయువారు
తే. స్వర్ణచంద్రార్ధచంద్రరూ♦పములుగలుగు, చంద్రశాలలుమణిగవా♦క్షములురత్న
విద్రుమాంచితములు చారు♦వివిధపక్షి, మందిరంబులు వగ్నుల♦మాఁడుటయ్యె.

అర్థములు. జలదరించెడివారు=వణఁకువారు, స్వర్ణ=బంగారు మయములై, చంద్ర=పూర్ణచంద్రునియొక్కయు, అర్ధచంద్ర=అర్ధచంద్రునియొక్కయు, రూపములు=ఆకారములు, చంద్రశాలలు = పై మేడలు, రత్నవిద్రుమాంచితములు = రత్నముల చేతను, పగడముల చేతను, అంచితములు=ప్రకాశించునవి.

తాత్పర్యము స్పష్టము.

చ. జ్వలనపరీతగేహములు ♦ వార్షికవేళలఁ జంచలాలతా
కలితపయోదసంఘముల♦కైవడి నొప్పఁగఁ గాలి కూలుశా
లలు కులిశాహతిం బడు ని♦లాధరశృంగము లట్లు దోఁచె త
త్కలితమహానినాదములు ♦ గ్రమ్మి చెవుడ్పడఁ జేయఁ బౌరులన్. ౧౭౯ ౫

అర్థములు. జ్వలనపరీత గేహములు=అగ్నిచేత చుట్టుకొనఁబడినయిండ్లు, వార్షికవేళల = వానల కాలమున, చంచలాలతా = మెఱపుఁ దీఁగలతో, కలిత= కూడిన, పయోద సంఘముల కైవడిన్=మేఘముల గుంపులవలె, శాలలు=ఇండ్లు, కులిశాహతిన్=వజ్రాయుధము దెబ్బచే, ఇలాధరశృంగములు=పర్వతశిఖరములు, తత్కలిత=దానివలనఁ గలిగిన, మహానినాదములు=గొప్పధ్వనులు, చెవుడ్పడన్ = చెవుడు వచ్చిన వారినిఁగా.

తాత్పర్యము

పలువైపుల మంటలు క్రమ్ముకొన్న యిండ్లు వానకాలమందు మెఱుపులతోఁ గూడిన మేఘములవలె నుండఁగాఁ గాలి నేలఁబడు నిండ్లు వజ్రము దాఁకున నేలఁబడు పర్వతశిఖరములవలెఁ గానవచ్చెను. అవి పడు చప్పుడులు పౌరులను చెవిటివాండ్రఁ జేసెను.

కం. మిద్దెల మేడల మీఁదను, నిద్దుర గొను ముద్దరాండ్రు♦నెగయఁగ మంటల్
గ్రద్దన యూడిచి భూషలు, హద్దఱి పలవించి రపుడు ♦ హాహా యనుచున్.

అర్థములు. హద్దఱి = మేరలేక, విస్తారముగ, ముద్ద+ఆలు=ముద్దరాలు, ముగ్ధయైన స్త్రీ యని యర్థము. కర్మధారయమున రేఫాగమము, ఆలు శబ్దము స్త్రీ మాత్ర పరము.

తాత్పర్యము స్పష్టము.

కం. జ్వాలాపంక్తులతో హర్మ్యాళి రహిన్ మీఱె దీపి♦తౌషధివనికా
జాలాంచిత మగు మిహికా, శైలశిఖర మనఁగ దూర♦జనదృష్టులకున్. ౧౭౯ ౭

అర్థములు. జ్వాలాపంక్తులతోన్=అగ్నిజ్వాలల వరుసలతో, హర్మ్యాళి=

మేడలవరుసలు, రహిన్ మీఱెె=కాంతిచేఁ బ్రకాశించెను, దీపిత = వెలుఁగుచున్న, ఓషధి=మూలికలుగల, వనికాజాల = అడవుల సమూహములతో, అంచితము = ఒప్పినది, మిహికాశైలశిఖరము=మంచుగొండ శృంగము, దూరజనదృష్టులకున్= దూరమున నుండి చూచువారి కన్నులకు.

తాత్పర్యము

దూరమునుండి చూచువారికి మంటలతోడి మేడలు ఓషధులచేఁ బ్రకాశించు నడవులు గల హిమవత్పర్వత శిఖరమువలె నుండెను.

తే. జ్వాలికాపంక్తు లెగురంగ • సౌధశిఖర, తలములందు నిశావేళఁ • దత్పురంబు
నిండఁ బూచిన మోదుగు • పిండువోలె, దవ్వుచూడ్కికిఁ దోఁచెఁ ద • త్సమయమునను

అర్థములు. జ్వాలికాపంక్తులు = మంటల వరుసలు, సౌధశిఖరములందు= మేడల పై భాగములందు.

తాత్పర్యము

మేడలపై కొనలందు మంటలా రాత్రివేళ యెగురుట దూరమున నుండి చూచువారికి ఆ పురము నిండఁ బూచిన మోదుగుచెట్ల సమూహమువలె నుండెను.

తే. కట్లు విడిచినఁ జరియించు • కరులతతులు, వారువంబులు నై • లంక పరఁగె నపుడు
విలయసమయసముద్రాభ్రాంత • వివిధనక్ర, యుక్తఘనరసనిధికిఁ బెం • న్నుద్దియగుచు.

అర్థములు. కట్లు=కట్టియుండిన త్రాళ్ళు, గొలుసులు; ఐ=కలిగి, విలయ సమయ = ప్రళయకాలమందు, సముద్భ్రాంత=అల్లకల్లోలపడిన, వివిధ = అనేక విధములయిన, నక్రయుక్త= మొసళ్ళతోఁగూడిన, ఘనరసనిధికి=జలనిధికి, సముద్రమునకు, పెన్నుద్ది=సమానము.

తాత్పర్యము

కట్టిన పగ్గములు గొలుసులు విడుచుటచేత నేనుఁగులు గుఱ్ఱములు తిరుగుచుండు లంక ప్రళయకాలమందు నల్లకల్లోలమై నానావిధములైన మొసళ్ళుగల జలచరములు గల సముద్రమువలె నుండెను.

తే. బెదరిపరుగెత్తుగుఱ్ఱంబు • విధముఁ గాంచి, తొలఁగిపోయెనొకో కళ్ళ-చో • దొడ్డగజము
భీతిఁ బఱచెడి యేనుఁగు • రీతిఁ గాంచి, యొండుగడ సైంధవంబు దా • నొదిగిచనియె.

తాత్పర్యము స్పష్టము.

తే. అసురనగరంబు దహియించు • హవ్యవాహు, మించు కాంతులతో నీరు • మిశ్రమగుచు
నంబునిధి యప్డు చూపట్టె • నద్భుతముగ, లోహితోదంబునాఁగ స • మూహ సేయ.

తాత్పర్యము

రాక్షసనగరమును గాల్చుచున్న యగ్నికాంతులు సముద్రజలమునందుఁ బతిఫలింపఁగా నప్పుడు సముద్రము రక్తసముద్రమువలె నూహింపఁదగి యుండెను.

తే. చెట్లు ద్రిమ్మరు లెల్లెడఁ • జిమ్మునిడఁగ, నొప్పెఁ దత్పత్తనంబు ము • హూర్తమునను
నర్వలో కాంతకర మైన • సమయమునను, మండుచుండెను ధాత్రికి • మాద్రియగుచు.

అర్థములు. సర్వలోకాంతకరము = సర్వప్రపంచమును నాశముచేయు, మాద్రి=మాదిరి, సమానము.

తాత్పర్యము స్పష్టము.

కం. ధూమము కన్నులఁ దట్టఁగ, నేమియుఁ దోఁపకయు మేన • నెగయఁగ మంటల్
భీమముగఁ గూఁక లిడిరొడి, భామలరావము లెసంగెఁ • బదియోజనముల్.

అర్థములు. మేన=దేహములందు, భామలరావము=స్త్రీలయేడుపుధ్వని.

తాత్పర్యము స్పష్టము.

కం. తనువులుఁ గాలఁగ వెలుపలికిని వచ్చెడివారితోడఁ • గీశులు పెనఁగన్
దనుజుల క్రోఁతుల భీకర,నినదంబులు దివియు భువియు • నిండెం బెలుచన్.

తాత్పర్యము

ఇండ్లలో నుండఁగా మంటలచే దేహములు గాలఁగా దప్పించుకొన బయటికి వచ్చువారితో వానరులు యుద్ధము చేయఁగా రాక్షసులయు వానరులయు భయంకర ధ్వనులు భూమి యాకాశము నిండెను.

సీ. తొలఁగ వేదనమహో • త్కృష్టులు రామలక్ష్మణుల్, సంభ్రాంతరహితులై • చాపములను
గైకొని మౌర్వీటం • కారంబుఁ గావింపఁ, గలగుండు కొనిరి రా • క్షసులు భీతి
వేదమయం బైన • విశ్రుత మౌర్విని, మీటెడి నాకాశ • జూటుభంగి
శ్రీరామవిభుఁడు సా • రించుచు గుణమును, నాశబ్ద మొకకోటి • యగచరులయు
ఆ. రాక్షసులయు నులివు • గ్రక్కున గ్రమింగెను, గీశయూథశతుల • క్ష్వేళ లసుర
సంఘరవము రామ • చంద్రుని జ్యాలతా,నిస్స్వనంబు దెసల • నిండె బెరసి.౧౮౦౫

అర్థములు. కలగుండుగొనిరి = కలఁకపడిరి, వేదమయంబు = వేదమున చెప్పఁబడిన విశ్రుతమౌర్విని= ప్రసిద్ధికెక్కిన యల్లెత్రాటిని, ‘కృత్తివాసాః పినాకీ’ యని వేదప్రసిద్ధమైన మహత్త్వముగల యల్లెత్రాటిని, మీటెడి = లాగి విడుచుటచే ధ్వనింపఁజేసెడి, ఆకాశజూటుభంగి=శివునివలె, శివుఁడు వ్యోమకేశుఁడుగదా, సారించుచున్ = లాగివిడువఁగా, ఉలివు = ధ్వని, క్ష్వేళలు = సింహనాదములు, జ్యాలతానిస్స్వనంబు=అల్లెత్రాటిధ్వని, బెరసి=కలసి.

తాత్పర్యము

బాణములబాధ తొలఁగఁగానే మహాప్రభావము గల రామలక్ష్మణులు మనసునఁ గలఁక లేక విండ్లను దీసికొని యల్లెత్రాడు మీటి టంటమ్మను ధ్వని కలిగింపఁగా రాక్షసులు భయమున కలఁక చెందిరి వేదమునఁ జెప్పఁబడిన గుణము గల ప్రసిద్ధమైన యల్లెత్రాటిని శివుఁడు మీటినట్లు శ్రీరామచంద్రమూర్తి యల్లెత్రాడు సారింపఁగా నాశబ్ద మొకకోటియే రాక్షసుల వానరుల ధ్వనిని క్రమింగి వేసెను. దిక్కులందు వానరుల సింహనాదములు రాక్షసుల యఱపులు రామచంద్రమూర్తి యల్లెత్రాటి మ్రోఁత కలసి వ్యాపించెను.

ఉ. రామధనుర్విముక్తశర•రాజి నిశాటపురాట్టగోపుర
స్తోమములం బడ ల్పడఁగఁ • ద్రోచె నిళాస్థలి దాని నుల్కి ప్రో
ద్దామజవంబునన్ సురల•దాయలు సంకులయుద్ధయత్నులై
ధీమస మారఁ వెల్వడిరి • దిక్కులు వికృటిలన్ రవంబులన్. ౧౪౦౬

అర్థములు. రామ ధనుర్విముక్త శరరాజి=రాముని వింటిచే విడువఁబడిన బాణసమూహము, నిశాటపుర=రాక్షసనగరముయొక్క, అట్ట = బురుజులయు, గోపుర = గోపురములయు, స్తోమములను = సమూహములను, బడల్పడఁగన్= శిథిలమగునట్లు, ఇలాస్థలిన్=భూమియందు, ఉల్కి=భయపడి ఉద్దామ జవంబునన్= మిగుల వేగముతో, సురలదాయలు=దేవవిరోధులు = రాక్షసులు, సంకుల యుద్ధయత్నులై=ఒకఁడొకఁడేపోయి యుద్ధము చేయువాఁడు లేకుండుటచే, దొమ్మి యుద్ధముచేయ యత్నించినవారై, ధీమసము అరన్ = ధైర్య మతిశయింపఁగా, వికృటిలన్=క్రిక్కిఱియునట్లు నిండఁగా.

తాత్పర్యము

రామచంద్రమూర్తి వింటినుండి వెలువడిన బాణముల పరంపరలు లంక యందలి యెత్తైన బురుజులను గోపురములను శిథిలములై పడునట్లు నేలఁ ద్రోచెను. దానికి భయపడి రాక్షసులు మిగుల వేగముతో దొమ్మి యుద్ధముచేయ యత్నించి తమధ్వనులు దిక్కులందు నిండఁగా ధైర్యముతో వెల్వడిరి. రాజాజ్ఞలేక యున్నను రాక్షసులు తమ ప్రాణసంరక్షణార్థము తాముయుద్ధము చేయవలసినంత స్థితివచ్చెను.

తే. యుద్ధసన్నాహమున రాక్ష•సోత్కరములు,సింహనాదంబులొక్కటఁ•జెలఁగ వనికి
బయలువెడలఁగ నపుడు క్ష•పాసమయము, రౌద్రమయ్యెను భాస్కర
• ప్రభవుఁడపుడు.

అర్థములు. యుద్ధ సన్నాహమునన్ = యుద్ధ ప్రయత్నముచే, రాక్షసోత్కరములు = రాక్షస సమూహములు, క్షపాసమయము=రాత్రివేళ, రౌద్రము= మిగుల భయంకరము, భాస్కర ప్రభవుండు=సుగ్రీవుఁడు

తాత్పర్యము స్పష్టము.

కం. ఆసన్న ద్వారంబును, డాసి కపుల్ ముట్టడింపుఁ•డా సోమరులై
యోసరిలునట్టి భూమిప, శాసనదూషకునిఁ బట్టి • శాసింతుఁ జుఁడీ. ౧౪౦౮

అర్థములు. ఆసన్న ద్వారంబును = సమీపమందుండు ద్వారము, వీరికి సమీపమున నుండునది యెదురుగ రావణుఁడుండు నుత్తర ద్వారమే. ఓసరిలు = తొలఁగిపోవునట్టి, భూపశాసన దూషకుని=రాజాజ్ఞ నతిక్రమించిన వానిని, శాసింతున్=దండింతును, కపుల్=కపులారా, రెండవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

సమీపమందున్న ద్వారంబును కపులారా! ముట్టడింపుఁడు. సోమరి తనమున నెవ్వఁడేని తొలఁగిపోయెనా పట్టి రాజాజ్ఞనుల్లంఘించిన వానిని దండింతును.

సీ. అనవుడు వానరుల్ • హస్తతలంబుల, మండెడుకొఱవులు • మెండుకొనఁగ
నికటంబునం దున్న • నిశిచరనాథుని, ద్వారంబు నాఁకట్ట • దశగళుండు
నాగ్రహోదగ్రన • మ్యగ్రూక్షనేత్రుఁడై, రూపంబుఁ గైకొన్న • రుద్రకోప
మనఁగ మండుచుఁ దన • యభితమున్న సురారు, లాకులపాటొంద • నట్టె లేచి

తే. కుంభకర్ణునిసుతుల ని • కుంభకుంభు, లనెడివారల మఱియు యూ • పాక్షశోణి
తాక్షకంపనులను బ్రజం • ఘాఖ్యుఁ బనిచెఁ,జటుల సేనాచయంబుతో • జన్యమునకు.

అర్థములు. నికటంబునందున్న = సమీపమందున్న, నిశిచరనాథుని = రాక్షస రాజగు రావణుని, ఆఁకట్టన్ = అడ్డగింపఁగా, దశగళుండు=పది మెడలు గల రావణుఁడు, ఉగ్రహోదగ్ర = కోపముచే నతిశయించిన (ఉత్ + అగ్ర = కొనపైకి వచ్చిన) నమ్యక్ + రూక్ష, నేత్రుఁడై=మిక్కిలి రొజ్జుని కన్నులు గల వాఁడై, అభితన్ = సమీపమందు, ఆకులపాటు = కలఁత, జన్యమునకున్ = యుద్ధమునకు.

తాత్పర్యము

అని యాజ్ఞాపింపఁగా వానరులు చేతులందు మండుచున్న కొఱవులు దండిగాఁ దీసికొని సమీపమందున్న రావణుఁడు గాచు ద్వారంబును నడ్డగించిరి. దానికి రావణుఁడు మిగులఁ గోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి ఆకారము గొన్న రుద్రకోపము వలె మండుచుఁ దనకు సమీపమందున్న వారు కలఁత చెందఁగా చివాలున లేచి కుంభకర్ణుని కొడుకులను కుంభుఁడు నికుంభుఁ డనెడి వారిని మఱియు యూపాక్ష, శోణితాక్ష, కంపను లనియెడి వారిని బ్రజంఘుఁ డనియెడి వానిని సేనతోడ యుద్ధమునకుఁ బంపెను.

—• కుంభనికుంభులు యుద్ధమునకు వెడలుట •—

చ. వెడలిరి కౌంభకర్ణు లతి • వేగమునన్ సహసైన్యులై భయం
బడర నరాతిసేనకు జ • యధ్వను లొక్కటఁ బర్వ జాభవా
రొయుకముల కాంతిపూరములు • నుగ్రతరోజ్జ్వలసాధన ప్రభల్
కడుకొని చంద్రకాంతు లధి • కంబుగఁ బర్వె నభస్స్థలంబునన్. ౧౮౧

అర్థములు. కౌంభకర్ణులు = కుంభకర్ణునికొడుకులు, అపత్యార్థకతద్ధితము, జాభవా రొయుకముల = బంగారు సొమ్ముల, చంద్రోదయ మిప్పుడు చెప్పఁబడెను. నేఁడు దశమి కావున నిరువది గడియలకు చంద్రోదయము, రెండు గంటలప్పుడు.

తాత్పర్యము

కుంభకర్ణుని కొడుకులు సేనతోడ మిగులవేగముగ శత్రుసేనకు భయపడక జయజయధ్వనులు వ్యాపింపఁగా వెడలిరి. అప్పుడువారుధరించినసొమ్ముల కాంతులు ఆయుధముల కాంతులు, చంద్రకాంతులు ఆకాశమునందు నధికముగ వ్యాపించెను.

కం. వానరులు రగులఁ జేయు కృ,శానునిరోచులును రాక్ష • సప్లవగతతుల్
మేన ధరించిన భూషానూనద్యుతు లాకసమున•కొకరుచిఁ గూర్చెన్. ॥౧౧॥

అర్థములు. కృశానుని రోచులును=అగ్ని కాంతులును, మేనన్=దేహము నందు, భూషానూనద్యుతులు = సొమ్ముల యధిక కాంతులు, ఒకరుచి=ఒకవిధమైన కాంతి.

తాత్పర్యము

వానరులు మంటఁజేయు నగ్నిహోత్రుని కాంతులు రాక్షసులు దేహమునందు ధరించిన సొమ్ముల కాంతులు కలసి యాకాశమున నొక విధమైన కాంతి కలిగించెను.

కం. శీతకరకిరణకాంతి ప్ర,భూతాలంకారశోభి • పురగృహహుతభు
గ్హేతిద్యుతి యుభయధ్వజి,నీతతి వెలుగంగఁ జేసె • నెఱి నవ్వేళన్. ॥౧౨॥

అర్థములు. శీతకర = చంద్రునియొక్క, కిరణకాంతి=కిరణములకాంతి, ప్రభూత = విస్తారమైన, అలంకారశోభ = భూషణముల కాంతిగల, పురగృహ= పట్టణముల యిండ్లయందలి, హుతభుక్ = అగ్నియొక్క, హేతిద్యుతి = జ్వాలల కాంతి, ఉభయధ్వజినీతతిన్=రెండు సేనాసమూహములను.

తాత్పర్యము

చంద్రకిరణముల కాంతియు మిగుల నలంకరింపఁబడిన లంకయందలి గృహములనుఁ గాల్చుచున్న యగ్నికాంతియు రెండుసేనల వారికి చక్కఁగా వెలుతురు కలుగఁజేసెను.

కం. ఇండులపై భాగంబుల, మండెడిమంటలు సముద్ర • మధ్యములోనన్
నిండారఁగఁ జలమూర్మ్ముల, కాండంబులు వింతకాంతిఁ • గైకొని వెలిఁగెన్.

తాత్పర్యము

ఇండ్లపై భాగంబుల మండెడి మంటలు సముద్రమధ్యమున ప్రతిఫలింపఁగా నా నీటి యలలు క్రొత్తకాంతి కలవై ప్రకాశించెను.

సీ. అశ్వమాతంగ శ • తాంగసంయుతమును, భటనికురంబసం • బాధితంబు
ప్రజ్వలత్తోమర • ప్రాసకార్ముకగదా, శూలఖడ్గాది సం • శోభితంబు
జ్వలితవర్మము హేమ • జాలాంచితభుజంబు, కింకిణీశతరవ • సంకులంబు
బాణసంసక్త చా • పంబు వ్యాఘూర్ణిత, బంధురశస్త్రంబు • గంధమాల్య
తే. మధుసముత్సేకి మోదిత • మారుతంబు, జలధరరవంబు శూరసం • చయగతంబు
నగుచు వచ్చెడి యసురసై • న్యంబుఁ గాంచి, యార్భటులనించి శాఖామృ • గాళి సేన.

అర్థములు. అశ్వ = గుఱ్ఱములతోను, మాతంగ = ఏనుఁగులతోను శతాంగ = రథములతోను, సంయుతంబును = కూడినది, భటనికురంబ = భట సమూహముతో, సంబాధితంబు=నిండినది, ప్రజ్వలత్ =ప్రకాశించుచున్న, తోమర= చిల్లకోలలు, ప్రాస = ఈఁటెలు, కార్ముక = విండ్లు, వీనిచే సంశోభితంబు =

ప్రకాశించునది, జ్వలితవర్మము = వెలుఁగుచున్న కవచముగలది, హేమజాల = బంగారుసొమ్ములచే, అంచిత = ప్రకాశించుచున్న, భుజంబు = భుజములు గలది, కింకిణీశతరవ సంకులంబు=పెక్కు మువ్వలచే నిండినది, బాణసంసక్త చాపంబు = బాణములతోఁగూడిన విల్లుగలది, వ్యాఘూర్ణిత = క్రిందుమీఁదయిన, బంధుర = అనేకములైన, శస్త్రంబు = ఆయుధము గలది, గంధమాల్య = గంధము చేతను పూలదండలచేతను, మధు=సారాయముచేతను, సముత్సేక=మిక్కిలి, మోదిత = వాసన గలదిగాఁ జేయఁబడిన, మారుతంబు=గాలిగలది, జలధరరవము = మేఘ ధ్వని గలది, శూరసంచయ గతంబు = శూరుల మొత్తమును పొంది యుండునది, ఆర్భటులు = పెద్ద ధ్వనులు.

### తాత్పర్యము

గుఱ్ఱములతోను ఏనుఁగులతోను రథములతోను గూడినదియు, భటసమూహములతో నిండినదియు తళతళలాడుచున్న చిల్ల కోలలు ఈఁటెలు విండ్లు గదలు శూలములు కత్తులు మొదలగు వానిచే బ్రకాశించునదియు మండుచున్నట్లుండు కవచములు గలదియు బంగారు సొమ్ముల సమూహముచే నొప్పు భుజములు గలదియు, పెక్కులగు చిన్న గజ్జెలధ్వని నిండినదియు బాణము సంధింపఁ బడిన విండ్లు గలదియు వ్యాఘూర్ణిత బంధుర శస్త్రంబులు = తాఱుమాఱయిన విశేష శస్త్రములు గలదియు గంధములయు పూలదండలయు సారాయము యొక్కయు నతిశయ్యముచే వాసనగలదిగాఁ జేయఁబడిన గాలికలదియు మేఘధ్వని గలదియు శూరులు గుంపులుగాఁ గలదియు నయి వచ్చుచున్న రాక్షససేనను గాంచి వానర సేన సింహనాదములు చేసెను.

కం. మిక్కుతలు పావకకీలలఁ, బడు తెఱఁగునఁ దరులు గిరులు ♦ బలువడిఁ గొని పై
పడి పోరొనరించిన వా, రసిదంబుల నఱికి వైచి ♦ రగచరులతలల్. ౧౨౧౫

అర్థములు. పావకకీలలన్ = అగ్నిజ్వాలలయందు, తరులు = చెట్లు, అసిదంబులన్=కత్తులచే, అగచరుల=వానరుల.

### తాత్పర్యము

మిడుతలు నిప్పుమంటలలోఁబడు విధమున చెట్లు కొండలు తీసికొని వచ్చి పైపడి యుద్ధముచేయఁగా రాక్షసులు వానరుల తలలను కత్తులతో నఱికిరి.

ఉ. మాదము పేర్మి వేఁదుఱుల ♦ మాడ్కి వెసం బఱతెంచి పంపులన్
ఛేద మొనర్చి కర్ణములఁ ♦ జేకొలదిం బిడికిళ్ళ శీర్షముల్
భేదిలఁ గొట్టి పెన్ సెలల ♦ వ్రేటుల నంగము ముద్దఁ జేసి సొం
పేదఁగ శత్రుసైన్యముల ♦ నేడ్తెఱఁ జేసిరి కీశవల్లభుల్. ౧౨౧౬

అర్థములు. మాదము = మదముయొక్క, 'మాదోమదే' యని యమరము - పేర్మి = అతిశయముచే, వేఁదుఱుల మాడ్కిన్ = వెఱ్ఱివాండ్రవలె, ఏడ్తెఱన్=విజృంభణముచే, కీశవల్లభుల్=వానర నాయకులు.

తాత్పర్యము

అతిశయించిన మదముచే వెఱ్ఱివాండ్రవలె దేహములు తెలియక త్వరగాఁ బరువెత్తివచ్చి వానరులు రాక్షసులను దంతములచే చెవులుచీల్చి చేతికోలఁది పిడికిళ్ళచేతఁ దలలు పగులఁగొట్టి పెద్ద శిలల దెబ్బలచే దేహములు ముద్దచేసి శత్రుసేనలు సొంపు చెడునట్లు విజృంభించిరి.

కం. ఇరువాఁగున మిక్కిలి, చేయంగలవారు శత్రు•సేనా భటులన్
జేయని యాఁప్పచుఁ గూల్చిర, మేయపరాక్రములు నుదురు•మిడుకులు పోరన్.

అర్థములు. మిక్కిలి చేయంగలవారు=విశేష సమర్థులు, ఇరువాఁగున = రెండుపక్షముల, ఉదురుమిడుకులు= గర్విష్ఠులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. కొట్టఁబోయెడువానిఁ•గొట్టిపోయె నొకండు, త్రోయువానిని బడఁ•ద్రోసె నొకఁడు
చంపఁ బూనెడువానిఁ • జంపె వేరొకరుండు, కొఱికెడువానిని•గొఱికె నొరుఁడు
తిట్టెడువానినిఁ • దిట్టె వే ఱొక్కండు, గ్రుద్దెడువానినిఁ • గ్రుద్దె నొకఁడు
నీచేతిబలువును • జూచెద రార నా, నిదిగో వచ్చితి నంచు • నెదురు నొకఁడు

ఆ. ఒక్కవానిమీఁదఁ•బౌరుషమూ నిలు, మిటులు రమ్మటంచు • నిట్లు లొకరి
నొకరు గదిరి పలికి • యుద్ధభూమిని దను, భుజబలంబుకొలఁది • బోరుచుండ.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఒల్లియ జాఱ సాధనము • లూడఁ దనుత్రము లుర్విపాలుగా
నొళ్ళు నెఱుంగ కయ్యసుర • యూధము లుద్యతశూలయష్టులన్
బెల్లుగ మోఁది కీశులను • బెలుకుఱఁ జేయఁగ వారు నీరసం
బుల్లము నిండఁ బోరఁగ మ•హోగ్రగతిన్ దుర మొప్పె నయ్యెడన్. ౧౮౧౯

అర్థములు. ఒల్లియ = వస్త్రము, తనుత్రములు = కవచములు, ఒళ్ళు = దేహములు, ఏ - ఒడలు, ఉద్యత = ఎత్తఁబడిన, శూలయష్టులన్ = శూలముల చేతను కట్టెలచేతను, పెలుకుఱన్=కలవరపడునట్లు, ఈరసంబు= ఈర్ష్య, ఉల్లము= హృదయము, దురము=యుద్ధము.

తాత్పర్యము

వస్త్రము జారిపోవుచుండ ఆయుధములు పడిపోవుచుండ, కవచములు నేలపాలుగాఁగా దేహములు తెలియక రాక్షససేనలు శూలములు కట్టెలు ఎత్తి వానరులను గొట్టి వ్యాకులపడఁ జేయఁగా వారు నీర్ష్యచే నిండినవారై యుద్ధము చేయఁగా నా యుద్ధము మిగుల భయంకరమయ్యెను.

కం. పదునుగల నేర్పుగలఁ గపులను, విదళింపఁగ నసురవరులు • వివిధాస్త్రములన్
బదునేర్పురుగాఁ జంపిరి, వదలక వానరులు దైత్య • వర్యుల నపుడే. ౧౮౨౦

తాత్పర్యము

రాక్షసులు పదుగుర నొకసారి యేడ్వుర నొకసారిగా వానరులను జంపఁగా వానరులు పదునేడుగురు రాక్షసుల నొక్కసారిగఁ జంపిరి.

కం. విరితలలు జాఱుచేలలు, చిరిగిన టెక్కెములు మేలి•జీరాలును నై
పరుగిడు రక్కసులను దరు,చరు లుద్ధతిఁ జుట్టుముట్టి•చంపుచు నుండన్. ౧౮౨౧

అర్థములు. విరితలలు = వెండ్రుకలు విరియఁబోసికొనిన తలలు, జీరాలు= కవచములు.

తాత్పర్యము

తలలు విరియఁబోసికొని గుడ్డలు జాఱిపోవుచుండ టెక్కెములు కవచములు చినిఁగిపోఁగా బరువెత్తుచున్న రాక్షసులను వానరులు చుట్టుముట్టుకొని పోనీక చంపుచుండిరి.

— • ౭౬-వ సర్గము. అంగదుఁడు కంపనుని వధించుట •—

ఉ. వీరజనక్షయంబుగఁ బ్ర•వృత్తము నా తుములాహవంబునన్
ధీరవరేణ్యుఁ డంగదుఁడు • తెంపరి యై సమరోత్సుకత్వ మే
పారఁగఁ గంపనుం డెదిర • నాతఁడు రా యిటు రమ్మటంచుఁ గ్రో
ధారుణితాక్షుఁడై యడిచె • హస్తగతం బగు పెన్గదన్ వడిన్. ౧౮౨౨

అర్థములు. వీరజనక్షయంబుగన్=వీరులగువారికి వినాశకరముగ, ప్రవృత్తము=జరగునది, తుములాహవంబునన్=దొమ్మియుద్ధమునందు, ఎదిరన్=ఎదిరింపఁగా.

తాత్పర్యము

వీరులగువారు నశించునట్లు జరుగుచున్న యా దొమ్మియుద్ధమందు వీరులందు శ్రేష్ఠుఁడైన యంగదుఁడు సాహసించి యుద్ధకాంక్ష యతిశయింపఁగా కంపనుఁ డనువాని నెదిరింపఁగా నతఁడు రారా యిటు రమ్మని క్రోధముచేఁ గన్నులెఱ్ఱచేసి చేతనున్న గదతోఁ గొట్టెను.

ఉ. అంగదుఁ డా గదం బెఱికి • యాతని దానన కొట్టెఁ గొట్ట స
ర్వాంగములుం జలింప జను•నట్లయి తెప్పిలి మాఱుతాఁచినన్
శృంగ మొకండు నయ్యసుర•శీర్షమునం బడ నేయ దానితో
సంగరభూమిఁ ద్రెళ్ళె హత•సత్త్వుఁడు ప్రాణము లెడ్డ పాయఁగన్. ౧౮౨౩

తాత్పర్యము

అంగదుఁ డా గదనే లాగుకొని దానిచేతనే వానిని గొట్టఁగా వాఁడు దేహమంతయు వణఁక యచేతనమునట్లయి తెప్పతిల్లుకొని బదులు కొట్టెను. అంగదుఁడు పర్వతశిఖరము నొకదానిని వాని తలపైఁ బడవేయఁగా వాఁడు దానితో బలము పోయినవాఁడై ప్రాణము లెప్పుడో వెడలిపోఁగా యుద్ధభూమియందుఁ బడెను.

ఉ. గండఱి పీనుఁగై పడిన • కంపనుఁ గన్గొని వేగ శోణితా
క్షుండు శరంబులం గురియుచు • న్హరిమన్మని నొంప వాఁడు ను
ద్దండతఁ జాపసైంధవర • థంబుల నుగ్గొనరింప ఖేటముం
జండతరాసిఁ గొంచు రభ • సంబున మింటికి నుద్గమించినన్. ౧౮ ౩౮

అర్థములు. గండఱి = బలముచెడి, హరిమన్మని = ఇంద్రుని మనుమని, నుగ్గు = చూర్ణము, ఖేటము = డాలు, చండతరాసిన్ = తీక్ష్ణమైన కత్తి, రభసంబునన్ = వేగముగ, ఉద్గమించినన్ = ఎగురఁగా.

తాత్పర్యము

బలముచెడి పీనుఁగై పడిన కంపనుఁజూచి శోణితాక్షుఁడు బాణముల గురియించుచు నంగదుని నొప్పింపఁగా, ఉద్దండతన్ = బలాధిక్యముచే, చాపసైంధవ రథంబులన్=విల్లు గుఱ్ఱములు రథములను చూర్ణము చేయఁగా డాలు తరవారి తీసికొని వాఁడు ఆకాశమున కెగసెను.

తే. తోడనే వాలిసూనుఁడు • కూడ నెగిరి, కరమునందున్న యసిబలా • త్కారముగను
గుంజుకొని యంసఫలకంబు • నంజిరాన, నఱకెఁ జందెము వెంట మై • నెఱలియ వాయ.

అర్థములు. అంసఫలకంబు=బల్లవలె విశాలమైన భుజమును, మైనెఱలియ వాయన్=చీలునట్లుగా.

తాత్పర్యము

వానితోడ నంగదుఁడు నెగిరి వాని చేతి కత్తిని బలవంతముగా గుంజుకొని విశాలమైన భుజమున (కవచము మీఁదనే) దేహమున జందెము వేసికొన్న విధముగ కవచమును నఱికెను.

సీ. ఆ ఖడ్గమును గొని • యరుల నొంపఁగ శోణి, తాక్షుండు నాయసం • బైన గదను
గైకొని తాఁకెనొ • క్కెడఁ బ్రజంఘుండు యూ, పాక్షుండుగలసిరా • యంగదరేంద్రు,
డిరుకెంక రక్కసు • లెసఁగ విశాఖ న, డిమి పూర్ణచంద్రు చం • దము వహించె
నాతని రక్షింప • నరిగి మైందద్వివి, దులు సరభసముగఁ • దోడుపడిన

ఆ. ముగురు రాక్షసులకు • ముగురువానరులకుఁ, బోరు ఘోర మయ్యె • భూజచరులు
వైచు వృక్షములను • వారక ఖండించె, నసిఁ బ్రజంఘుఁ డనెడి • యసురవరుఁడు.

అర్థములు. ఆయసము = ఇనుముతోఁ జేయఁబడినది, సరభసముగన్= వేగముగ.

తాత్పర్యము

అంగదుఁ డా ఖడ్గమును గొని వైరుల నొప్పింపఁగా శోణితాక్షుండు ఇనుప గదను గైకొని తాఁకెను. ప్రజంఘుఁడు యూపాక్షుఁడనువా రా శోణితాక్షుఁ గలిసికొనిరి. అప్పు డంగదుఁడు తనకు రెండుప్రక్కల రాక్షసు లుండఁగా విశాఖ నడిమి పూర్ణ చంద్రునివలె నుండెను. అతని రక్షణమునకై మైంద ద్వివిదులు త్వరగాఁ

బోయిరి. అప్పుడు ముగ్గురు రాక్షసులకు ముగ్గురు వానరులకు యుద్ధము ఘోరముగ జరిగెను. వానరులు చెట్లు వేయఁగా కత్తిచే వానిని ప్రజంఘుఁడను రాక్షసుఁడు నఱకెను.

కం. శరముల యూపాక్షుఁడు త, త్తరువుల ఖండించె ద్వివిదు•తరువుల ధరణిం
దోరఁగించె శోణితాక్షుఁడు గురుగదచే నంత మిగులఁ • గుపితుం డగుచున్.

అర్థములు. తత్తరువులన్ = ఆ చెట్లను, కుపితుండు=కోపించినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. పరమర్మనికృంతనమును, గరము భయంకరము నైన•ఖడ్గో త్తంసం
బిరుగేలఁ గొని ప్రజంఘుఁడు సరభసముగఁ గవిసె వాలి•సంభవుమీఁదన్.

అర్థములు. పరమర్మ నికృంతమును=శత్రువుల నాయువుపట్టుల ఛేదించునది, ఖడ్గోత్తంసంబు = శ్రేష్ఠమైన ఖడ్గమును.

తాత్పర్యము

పరుల యాయువు పట్టులను ఛేదించు మిగుల భయంకరమైన ఖడ్గమును రెండుచేతులఁ దీసికొని ప్రజంఘుఁడు శీఘ్రముగ వాలికొడుకు నెదిరించెను.

—• అంగదుఁడు ప్రజంఘుఁ జంపుట •—

సీ. అభ్యాసగతుఁడైన•యసురఁ దారాసుతుం, డశ్వకర్ణద్రుమా•హతునిఁ జేయ
నాయేటువడికిఁ జే•యడిదంబు జాఱినఁ, బిడికిట నొసటను • బొడిచెఁ గపిని
నంగదుండును మూర్త • మాత్రంత కంపించి, తేఱి కరాచూరిఁ•దెగఁగ వ్రేసె
నా ప్రజంఘునితల • హతుఁడైన పినతండ్రిఁ,గనుసీరు గాఱఁగ•గాంచి బాణ
తే. హీనుఁడౌటను దరవారి • నెత్తికొంచుఁ
బఱచె యూపాక్షుఁ డంగదు • పైకి నంత
లోన ద్వివిదుండు దొడరి య•వ్వానిఱొమ్ము
పగుల వెస గ్రుద్ది బంధించె • బాహుయుగళి ౧౨ ౩౯

అర్థములు. అభ్యాసగతుఁడు=సమీపమందున్నవాఁడు, అశ్వకర్ణద్రుమాహతుని = ఇనుమద్ది మ్రానిచే గొట్టఁబడిన వానిని, చేయడిదంబు = చేతికత్తి, కరాచూరిన్=కత్తిచే, తరవారిన్=కత్తిని, తొడరి=ఎదిరించి.

తాత్పర్యము

సమీపమందున్న రాక్షసుని నంగదుఁ డినుమద్దిచెట్టుచేఁ గొట్టఁగా నాదెబ్బకు చేతికత్తి జాఱిపోవ నా రాక్షసుఁ డంగదుని ముష్టిచే నొసటఁ బొడిచెను. అంగదుఁ డా దెబ్బకుఁ గొంచెము వణఁకి తెప్పఱిల్లి కత్తితో నా ప్రజంఘుని తలనఱకెను. చచ్చిన పిన్నతండ్రిని కన్నీరుగార్చుచుఁ జూచి బాణములులేనివాఁ డౌటచేఁ గత్తితీసికొని యూపాక్షుఁ డంగదుని మీఁదికి బఱచెత్తగా నింతలో ద్వివిదుండువచ్చి యెదిరించి యా యూపాక్షుని ఱొమ్ము పగుల గ్రుద్ది రెండుచేతుల గట్టిగ బంధించెను.

తే. చిక్కువడి యున్న సోదరుఁ • జేర నరిగి, శోణితాక్షుండు ద్వివిదుండు • సొక్కఁ గదను
నురముపై మోఁద నాతండు • త్వరగ లేచి, యసురవీరుని చేగద • నపహరించె.

తాత్పర్యము

తన సోదరుఁడగు యూపాక్షుఁడు చిక్కువడి యుండుటచూచి శోణితాక్షుఁడు గదచే ద్వివిదుఁడు సుక్కువట్లు ఱొమ్ముపైఁ గ్రుద్దఁగా నతఁడు త్వరగాలేచి రాక్షసుని చేతిగద నపహరించెను.

కం. రాక్షబలుఁడు మైందుఁడు యూ, పాక్షునురముఁ గేల నడిచె • నటు క్రోఁతులకున్
రాక్షసులకుఁ బోరయ్యెను, జక్షూరమ్యంబు హృదయ • సంభ్రమ కరమై.

అర్థములు. చక్షూరమ్యంబు=చూచువారి కన్నులకు మనోహరమై.

తాత్పర్యము స్పష్టము.

చ. ద్వివిదుఁడు శోణితాక్షుఁ బృథి • విం బడఁ ద్రోచి యురంబు ద్రొక్కి రో
షవివశుఁడై నఖాళి సుర • శాత్రవు నాస్యముఁ బీఁకి కుత్తుకం
దవులఁగ నొత్తి నుల్మి నిధ • నం బొనగూరిచె నంతలోనఁ గీ
శవిభుఁడు మైందుఁడున్ గెడపె • నత్వరుఁ డౌచును యూపనేత్రునిన్. ౧౨౩౨

అర్థములు. రోషవివశుఁడై=కోపముచే దేహము తెలియనివాఁడై, నఖాళిన్ = గోళ్ళవరుసలచే, ఆస్యము = ముఖము, నుల్మి = నలిపి, నిధనంబు=మృతి, కెడపెన్ = చంపెను.

తాత్పర్యము

ద్వివిదుఁడు శోణితాక్షుని నేలఁ బడఁద్రోచి ఱొమ్ముపై గాలూఁది త్రొక్కి కోపముచేఁ బరవశుఁడై గోళ్ళచే రాక్షసుని ముఖము పీఁకి గొంతు గట్టిగా బిగఁబట్టి నలిపి చంపెను. ఇంతలో మైందుఁడు యూపాక్షునిఁ జంపెను.

—• కుంభుఁడు వానరవీరుల నొప్పించుట •—

సీ. హతవీర మైనసై • న్యంబు నెల్వలఁ బోయి, కుంభుఁ జేరఁగఁ బోవఁ • గ్రోధమూర్తి
యయి యాతఁ డుగ్రత • జ్యాలతానాదంబు, దిక్కులఁ బర్వఁగ • నుక్కుమిగిలి
హ్రాదినీసంయు తై • రావతాఖ్యనగారి, చాపంబుఁ దలఁపింపఁ • జాపమూని
యాశీవిషోపమా • నాశుగంబులఁ గపి, ప్రాణాశుగంబుల • నాహరింప

తే. ద్వివిదు నాక్రీవణాకృష్ట • విశిఖములను, వేయ నాతండు తద్గతి • విహ్వలించి
కొండయుఁ గూలె నిట్లుత • మ్ముండు పడినఁ, బెద్దశిలఁ గుంభు మైందుండు • విసరివైచె.

అర్థములు. జ్యాలతానాదంబు = తీఁగవంటి యల్లెత్రాటిధ్వని, హ్రాదినీసంయుత=మెఱుపుతోఁ గూడిన, ఐరావతాఖ్య=ఐరావత మను పేరుగల ఐరావతో భ్రమాతంగేలికుచేనాగరంగకే, బుజుదీర్ఘేంద్రచాపేతు"నానా.ర. బుజువుదీర్ఘము నైన యింద్రధనుస్సునకు నైరావతమని పేరు, నగారిచాపంబు=ఇంద్రధనుస్సును, తలఁపింపన్=తలంపునకుఁ దేఁగా, ఆశీవిషోపమాన=పాములవంటి, ఆశుగంబులన్=

బాణములచే, ప్రాణానుగంబులన్ = ప్రాణవాయువులను, సర్పములకు వాయు వాహారము, ఆహరింపన్ = హరించుటకై, ఆశ్రవణాకృష్ట విశిఖములను=చెవిదాఁక వఱకు లాగఁబడిన బాణములను, తద్ధతిన్=ఆ దెబ్బచే, విహ్వలించి=విలవిలఁబోయి.

తాత్పర్యము

వీరులు చావఁగా మిగిలిన సైన్యము వెలవెలఁబోయి కుంభునొద్దకుఁ బోఁగా వాఁడు కోపించి భయంకరముగా నల్లెత్రాటిని మీటుచు నాధ్వని దిక్కులవ్యాపింపఁజేసి మెఱుపులతోడి యైరావతమును నింద్రధనుస్సువంటి చాపము దీసికొని పాములవంటి బాణములను కపిప్రాణవాయువుల నపహరించుటకై యాకర్ణాంతము లాగి విడువఁగా వాని దెబ్బకు ద్వివిదుఁడు వెలవెలఁబోయి కొండవలెఁ బడెను. తమ్ముఁ డిట్లు పడఁగా మైందుఁడు కుంభునిపై పెద్ద బండ నొకదాని విసరివైచెను.

ఉ. పైఁ బడవచ్చు తచ్ఛిలను • బాణము లేనిటఁ దున్ని దందశూ
కోపమ బాణమేయఁ బడె • నుర్విని మైందుఁడు సైఁపలేక తా
నేపఱి, మేనమామ లిటు • పృథ్విఁ బడం గని యంగదుండు సా
టోపుఁడు కుంభుఁ దాఁకెను బ•లుప్రతిహీనబలైకధుర్యుఁడై. ౧౦౩౪

అర్థములు. దందశూక+ఉపమ=పాముతో సమానమైన, ఏపఱి=బలము చెడి, సాటోపుఁడు = వేగిరపాటుతోఁ గూడినవాఁడు, పటు = సామర్థ్యముతోఁ గూడిన, ప్రతిహీన=ఎదురులేని, బలైకధుర్యుఁడై = విశేష బలమే ప్రధానముగాఁ గలవాఁడై.

తాత్పర్యము

పైఁబడ వచ్చుచున్న యా రాతిని నైదు బాణములచే ఖండించి పామువంటి బాణమేయఁగా మైందుఁడు బాణవేదన సహింపలేక నేలఁ బడెను. మేనమామ లిరువు రిటు నేలఁబడుట చూచి యంగదుఁడు వేగిరపాటు గలవాఁడై యసమాన బలాతిశయమున కుంభుని నెదిరించెను.

—• అంగదుఁడు కుంభుచే నొచ్చి పడుట •—

ఉ. వచ్చెడు వాలిపుత్రుపై శర•పంచకమున్ మఱిమూఁటి బెక్కుటిన్
జిచ్చులఁబోనివాని వెసఁ • జిమ్మె నమోఘములైన ముల్కులన్
హెచ్చిన తెంపునం గపియు • నేమియు స్రుక్కక యోర్చి నిల్చి పై
పెచ్చుగ వాలవాన యొస•వించెను గుంభునిపై రణోద్ధతిన్. ౧౦౩౫

అర్థములు. చిచ్చులు = నిప్పులతో, పోనివాని = సమానమైనవాని అమోఘములు = వ్యర్థము కానివి.

తాత్పర్యము

తనమీఁదికి వచ్చుచున్న యంగదునిమీఁదఁ గుంభుండు నిప్పులవంటివానిని, వ్యర్థముపోనివాని నైదింటిని, మఱి మూఁడింటిని అనేకములను బాణములను వేసెను

అతి సాహసముచే నంగదుఁడు వానికిఁ గొంచెమైనను స్రుక్కక యోర్చి నిల్చి యంతతో నుండక కుంభునిమీఁద తాలవాన నతివేగముగఁ గురియించెను.

ఉ. ఆతఁడు దానినెల్లఁ దుము • రై పడఁ జేసియు మీఁదవచ్చు తా
 రాతనయున్ భ్రువుల్ దగుల • రాజితపుంఖశరాళి నుల్కసం
 ఘాతముచేఁ గరింబలె ది • గాల్పడఁ గొట్టిన నెత్రు గాఱఁగా
 జేతను మూసి నేత్రములు • చేయలఁతిం గల భూరివృక్షమున్. ౧౮౩౬

అర్థములు. తుమురు = చూర్ణము, భ్రువుల్ = కనుబొమ్మలు, రాజితపుంఖశరాళిన్=బంగారు పింజలుగల బాణముల గుంపుచే, ఉల్కసంఘాతంబు = కొఱవుల సమూహ మని సాదృశ్యసమాసము చేసియైనఁ జెప్పవచ్చును. (౨) ఉల్కయొక్క గట్టిదెబ్బయనియైనఁ జెప్పవచ్చును. దిగాల్పడన్=దిగులుపడునట్లు, నెత్రు=నెత్తురు, సంయుక్తమగునపుడు ద్విత్వమునకు లోపము, చేయలఁతిన్=సమీపమందు.

తాత్పర్యము

కుంభుఁడా తాలవానను జూర్ణమై పడఁగొట్టి తన మీఁదికి వచ్చుచున్న యంగదుని కనుబొమ్మలు తగులునట్లు బంగారు పింజలుగల బాణములచే కొఱవులచే నేనుఁగు దిగులుపడఁగొట్టునట్లు కొట్టఁగా నెత్తురు గాఱఁగా గన్నులు చేత మూసికొని సమీపమందుఁగల పెద్దచెట్టును.

కం. రెండవకరమున దా నొక్కండు వెసం బట్టి బోరఁ • గదలిచి మొదలున్
 గండున గజ మనఁ బెకలిచి, చండోద్ధతి వైచె నసుర•సత్తముమీఁదన్.

అర్థములు. ఒక్కండు=బలిష్ఠుఁడు, బోరన్=రొమ్ముచే.

తాత్పర్యము

ఒకచేతఁ గన్నులు మూసికొని రెండవచేత చెట్టును రొమ్మున కానించుకొని పీకిఁ మిగుల వేగముతో రాక్షసోత్తముమీఁద వైచెను.

ఉ. మందరసన్నిభంబు శత • మన్యు ధను, ప్రతిమంబు వృక్షమున్
 జిందఱ చేసి యుద్ధనుజ • శేఖరుఁ డంగవిభేదనంబు ల
 స్యందజవంబులైన దృఢ శాతశరంబుల మేను వ్రచ్చినన్
 గొందలపాటుతోడ ధరఁ • గూలె సహింపఁగ రానివేదనన్. ౧౮౩౮

అర్థములు. మందరసన్నిభంబున్ = మందర పర్వతముతో సమానమైనదియు, శతమన్యు ధనుః ప్రతిమంబు = ఇంద్రుని వింటితో సమానమైనదియు, చిందఱ = తునియలుగా, అంగవిభేదనంబులు = అవయవముల చీల్చునట్టివి, అస్యందజవంబులు = తక్కువగాని వేగము గలవి, దృఢ = అనేకములైన, శాతశరంబులన్=వాఁడి బాణములచే, మేను=దేహము, వ్రచ్చినన్=చీల్పగా, కొందలపాటుతోడ = క్షోభముతో.

తాత్పర్యము

మందరపర్వతముతోను ఇంద్రధనుస్సుతోను సమానమైన యా చెట్టును తునుకలుగాఁజేసి యా రాక్షసుఁడు అవయవములఁ జీల్చునట్టివియు,మిగుల వేగము గలవియునగు పెక్కులు గట్టి వాఁడిబాణములచే దేహముఁ జీల్పఁగా కలఁతచెంది యంగదుఁడు బాధసహింపలేక నేలఁబడెను.

తే. అంచి వేదన మూర్ఛపా♦లై సముద్ర, తీరమునఁ గూలియున్న యా♦ధీరవరుని
పాటు కొందఱుకీశులు♦ పలుక రామ, చంద్రుఁ డనిచెను దోర్బల♦జాంబవంతు

తాత్పర్యము స్పష్టము.

కం. తక్కిన వీరులఁ గొందఱ, నెక్కుడు కోపమున వారు♦ వృక్షశిలాదుల్
మిక్కిలిగఁ గొనుచుఁ గుంభుని గ్రక్కునఁ దాఁకిరి కుమార♦రక్షణపరులై.

అర్థములు. కుమారరక్షణపరులై = బాలుఁడగు నంగదుని రక్షించు నాసక్తితో.

తాత్పర్యము స్పష్టము.

సీ. వేగదర్శి సుషేణ♦విధిసుతుల్ క్రుద్ధులై, తనమీఁద వచ్చు చం♦దంబుఁ గాంచి
స్రోతస్సు వేగంబు♦ద్రుమ నగాదులచేత, నరికట్టుగతి మార్గ♦ణౌఘములను
వారి నాఁకట్టెఁ ద♦ద్బాణ పరంపరఁ. గంధి వేలనుబోలెఁ♦ గడవలేక
చిక్కువడం గని♦ యెక్కుడుకోపాన, భాస్కరపుత్రుండు♦ భ్రాతృతనయు

ఆ. వెనుక వేసికొనుచు♦వనగజంబును వెలి, బొబ్బ మెకము తఱుము♦పోల్కిఁదఱిమి,
యశ్వకర్ణ ధవ ము♦ఖావనీరుహముల, చాలు గురియఁ జేసెఁ♦జదలు నిండ.

అర్థములు. విధిసుతుఁడు = జాంబవంతుఁడు, క్రుద్ధులై=కోపించినవారై, స్రోతస్సు = ప్రవాహముయొక్క, ద్రుమనగాదులచేత = చెట్లచేఁ గొండలచే, అరికట్టు=అడ్డగించు, గతిన్=విధముగ, మార్గణౌఘములను = బాణసమూహములచే, ఆఁకట్టెన్=అడ్డగించెను, కంధిన్=సముద్రమును, వేలనుబోలెన్ = చెలియలికట్టవలె, కడవలేక=మీఱిపోలేక, భ్రాతృతనయు వెనుక వేసికొనుచు-ఇట్లు చెప్పుటచే నంగదుఁడు మరల యుద్ధమునకు సిద్ధపడెఁగాని వానిని వారించి సుగ్రీవుఁడు ముందు దుమికెనని భావము. వెలిబొబ్బ మెకము=తెల్లని సింహము, వనగజంబున్= అడవి యేనుఁగు, ఊరి యేనుఁగులకన్న నడవియేనుఁగులు బలిష్ఠములు. 'గిరిచర ఇవనాగః ప్రాణసారం బిభర్తి' అని కాళిదాసుఁడు అశ్వకర్ణము=ఇనుమద్ది, ధవ= చంద్ర, ముఖ=మొదలైన,అవనీరుహములచాలు=చెట్లవరుసలు,చదలు=ఆకాశము.

తాత్పర్యము

వేగదర్శి, సుషేణుఁడు, జాంబవంతుఁడు కోపించినవారై తన మీఁద వచ్చు విధముఁ జూచి ప్రవాహ వేగమును ఆలచేఁ జెట్లచే నడ్డగించునట్లు బాణపరంపరచే వారి నడ్డగించెను. సముద్రము చెలియలికట్టను దాటిపోవలేనట్లు వారా బాణపరంప

రను మీఱిపోలేక చిక్కువడిరి. అదిచూచి మిగులఁ గోపించి సుగ్రీవుఁడు అంగదుని వెనుక వేసికొని యడవి గజంబును సింహము తఱుముపట్లు కుంభుని దఱిమి ఇనుమద్ది చంద్ర మొదలగు చెట్లను వారిమీఁద వర్షమువలెఁ గురియించెను.

—• సుగ్రీవుఁడు కుంభు నుపాలంభించుట •—

ఉ. ఈసునఁ గాంభకర్ణియు న•నేకశరంబుల వానినెల్లఁ బోఁ
  ద్రోసిన నవ్వి శంకుచిత•యూక్షశతఘ్నులుపోలె నొప్పఁగా
  భాసుర తేజుఁ డర్కజుఁడు • పైపయిఁ రాలెడి బాణజాలము
  న్వీనరపోని ధీరత గ•ణింపక పైపడి దూకి చాపమున్. ౧౮౭౨

అర్థములు. ఈసునన్=కోపముతో, కాంభకర్ణి=కుంభకర్ణుని కుమారుఁడు, కుంభుఁడు, శంకుచితయూక్షశతఘ్నులఁ బోలెన్=మేకులతోఁ గూడిన కఠినములైన శతఘ్నులవలె, వీనరపోని=జలితిపడని, ధీరతన్=ధైర్యముతో.

తాత్పర్యము

కోపముచే గుంభుఁడు పెక్కుబాణంబుల వానినెల్ల బోవఁ గొట్టఁగా నవి మేకులతోఁగూడిన కఠినములైన శతఘ్నులవలె నొప్పెను. సుగ్రీవుఁడును మీఁద మీఁద విరామములేక వచ్చి తనపైఁబడుచున్న బాణసమూహమును నిండుధైర్యముతో లక్ష్యపెట్టక వానిమీఁద దూఁకి వాని వింటిని.

చ. విఱిచి సుదుష్కరంపుఁగృతి•చే ఘటియించియుఁ గివ్వ దంతముల్
  విఱిగిన మత్తకుంజరము•లీల వహించిన కుంభు నిట్లనున్
  వెఱఁ గొనరించె నీ విశిఖ•వేగము కుంభుఁడ! నీదుశౌర్య మ
  ట్లుఱవగు సన్నతిన్ బలిమి•నుద్దివి నీ పెదతండ్రి కెంతయున్. ౧౮౭౩

అర్థములు. సుదుష్కరంపుఁగృతి = మిక్కిలి కష్టసాధ్యమైన కార్యము వెఱఁగు=ఆశ్చర్యము, ఉఱవగు, సన్నతిన్ = (౧) అధికమగు వినయము చేతను, (౨) రాక్షసులం దధిక ప్రేమచేతను, కంపనాదుల వధించిన యంగదాదుల నిరసించి రాక్షసులందుఁ దనకుఁగల ప్రేమను గనఁబఱచెఁగదా, ఉద్దివి=సమానుఁడవు, పెదతండ్రికిన్=రావణునకు.

తాత్పర్యము

విఱిచి మిగులఁ గష్టసాధ్యమైన పనిచేసియు, గోపముచే దంతములు విఱిఁగిన యేనుఁగువలె నున్న కుంభునితో నిట్లనియె. కుంభుఁడా! నీ బాణవేగము ఆశ్చర్యకరము, నీ శౌర్యమో రాక్షసులం దధిక ప్రేమ గలది. బలమునందు నీ పెద్ద తండ్రికి సముఁడవు.

సుగ్రీవుని వాక్యములు గౌరవరూపక హేళనము లని ౧౮౭౭వ పద్యంబున నుండుటచే దీనికి రెండవ యర్థము గ్రహింపవలసి యున్నది. వెఱఁగొనరించె

నీ విశిఖవేగము—మరియొకని నెవనినైన నెట్టివానినైనను సమీపమునకు రానిచ్చునట్లు బాణములు వేయువాఁడవు నీవేమి విలుకాఁడవు.

ఉటవగు సన్నతిన్ = సాధువుల నమస్కారముచే గొప్పది. నీ శౌర్యము సాధువులు మెచ్చఁదగినదిగాని శూరులు మెచ్చఁ దగినదిగాదు.

బలిమి నీ పెద్దతండ్రి కుద్దివి, యుద్ధమున విల్లు తానై పాఱవైచి ప్రాణభయమునఁ దల విరియఁబోసికొని శత్రువులకు వెన్నిచ్చి పరుగెత్తిన నీ పెద్ద తండ్రికి సముఁడవు.

సీ. బలపర ప్రహ్లాద • బలినికషాత్మజ, వైశ్రవణుల కెత్తు•వత్తు వీవు
నీతండ్రిసముఁడవు • నీ వొక్కఁడవె సుమ్ము, నైజదేహబలంబు•తేజమునను
నిను మీఱ నేరరు • నిర్జరు లైనను, విజితేంద్రియుని నాధి•బృంద మనఁగఁ
బ్రాజ్ఞుఁడా! నీయెల్ల•బలము నేఁ జూడఁగఁ, గోరెదఁ జూపుమీ • కొంకు లేక
ఆ. నీదు పెద్దతండ్రి • నిరుపమవరశక్తి, సహజశక్తి నీదు•జనకుఁ డమర
చయము నేఁచి రీవు•చాపంబునను శక్ర, వైరి బలిమిఁ బంక్తి•వదనుమాద్రి.
చ. బలమునఁ బేర్కొనం దగిన•వాఁడవు పీ వొకరుండు రాక్షసా
వళులను నాదు నీ పెనకు•వన్ హరిశంబరజన్యభంగి నీ
కలిగినభూతిసంతతులు • కాంచెడిఁ గాక, దృఢాస్త్రచాపకౌ
శలమున నీశవీరులను • జంపితి వెంతటి శౌర్యశాలివో. ౧౮౮౫

అర్థములు. బలపర = బలుఁడగు వానికి శత్రువు, ఇంద్రుఁడు, నికషాత్మజుఁడు = నైరృతి, వైశ్రవణుఁడు = కుబేరునకు (౨) బలపరుఁడు = బలవిరోధి, అనఁగా బలహీనుఁడు ప్రహ్లాదుఁడు ఎప్పుడు సంతోషములో నుండువాఁడేకాని రోషము లేనివాఁడు, బలి=వటుఁడు, నెత్తిపైఁ గాలు పెట్టి త్రొక్కఁగా పాతాళము నకుఁ బోయినవాఁడు, నికషాత్మజ = మూలలోనుండువాఁడు, వైశ్రవణుండు = విశ్రవుఁడు, చెవులులేనివాఁడు. వాని కొడుకు వైశ్రవుఁడు. ఒక కన్ను లొట్ట, ఇటువంటివారికి నీవు సమానుఁడవు, ప్రాజ్ఞుఁడా=బుద్ధిమంతుఁడా, (౨) ప్ర+అజ్ఞుఁడా= బుద్ధిలేని వారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

నీవు బలవైరికి ప్రహ్లాదునికి నైరృతికి కుబేరునకు సమానుఁడవు. స్వాభావమగు దేహమున తేజమునను నీ తండ్రికి సముఁడవు నీవే. నిజముగా నీ యబ్బకు నీవు పుట్టిన వాఁడవే. ఇంద్రియములు గెలిచిన వానిని మనోవేదనల సమూహమువలె నిన్ను దేవతలైనను మీఱనేరరు. నిర్జరులు=నిర్గతమైన జర గలవారు. జర (ముసలితనము)కు ఆవలి యవస్థ మరణమే. చచ్చువారుకూడ నిన్ను మీరలే అనిన అంతకంటెఁ జచ్చుపీనుఁగ వని భావము. ప్రాజ్ఞుఁడా! నీ బల మెంత మాత్రమో యంత బలముఁ జూపుము. భయపడకుము. నీ పెద్దతండ్రి వరబలముచేతను, నీ తండ్రి కండ